Estd. 1938

ఆంధ్రప్రభ

www.prabhanews.com
Journalism first!

లలితా జ్యువెల్లరి
మార్ట్ ప్రై. లిమిటెడ్

సంపుటి:57 • సంచిక:269 • ఆదివారం 13 జనవరి 2019 • హైదరాబాద్ * పేజీలు:12+4 • వెల:6.00 • Published from:Hyderabad | Karimnagar | Nizamabad | Suryapet | Vijayawada | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Kurnool | Anantapur | Nellore

క్రీడాప్రభ



తొలి వన్డేలో ఆస్ట్రేలియాదే పైచేయి అయింది. ఆసీస్ బ్యాటింగ్‌లోను, బౌలింగ్‌లోను రాణించి మ్యాచ్‌ను 34 పరుగుల తేడాతో గెలుచుకుని మూడు వన్డేల సిరీస్‌లో 1-0 ఆధిక్యాన్ని పొందింది. ఆస్ట్రేలియా వ్యూహం ప్రకారం ఆడి విజయం సాధించింది. భారత టాప్ ఆర్డర్‌ను కూల్చి ఒత్తిడి పెంచితే.. మిగతా బ్యాట్స్‌మెన్‌ను ఔట్ చేయడం తేలికే అంటూ.. ఆసీస్ కెప్టెన్ ఫించ్ పక్కా వ్యూహంతో తన జట్టును ముందుకు నడిపించి గెలుపును అందించాడు. ఒకవైపు తన సహచర బ్యాట్స్‌మెన్ అవుటవుతున్నా రోహిత్ శర్మ అసమాన పోరాటంతో 133, ధోని 51 పరుగులు చేసినప్పటికి మిగతా బ్యాట్స్‌మెన్ నుంచి సహకారం కొరవడటంతో భారత్ చేతులెత్తేసింది.



రోహిత్ 133

ధోని 51

తొలి వన్డే కంగారూలదే

4 పరుగులకే 3వికెట్లు పోగొట్టుకున్న భారత్

- హిట్ మ్యాన్ రోహిత్ సెంచరీ వృథా
- 34 పరుగుల తేడాతో భారత్ ఓటమి
- మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో ఆసీస్ 1-0 ఆధిక్యం

సిడ్నీ: తొలి వన్డేలో కంగారూల వ్యూహం ఫలించింది. భారత్ టాప్ ఆర్డర్‌ను నిలువరిస్తే విజయం వైపు పయనించవచ్చన్న ఆస్ట్రేలియా జట్టు కెప్టెన్ ఆరోన్ ఫించ్ అన్న మాటలు నిజమయ్యాయి. మూడు మ్యాచుల సిరీస్‌లో భాగంగా శనివారం జరిగిన తొలి వన్డేలో ఆసీస్ 34 పరుగుల తేడాతో కోహ్లీ సేనపై విజయం సాధించింది. టాప్ ఆర్డర్‌లో హిట్‌మ్యాన్‌గా పేరుపొందిన రోహిత్ మినహా మిగతావారెవరూ రాణించలేకపోయారు. రోహిత్ వీరోచిత సెంచర్ ప్లస్(133) పరుగులు వృథా అయింది. ఈ గెలుపుతో ఆతిథ్య జట్టు సిరీస్‌లో 1-0 ఆధిక్యాన్ని మూటగట్టుకుంది. ఆతిథ్య జట్టు నిర్దేశించిన 288 పరుగుల లక్ష్యాన్ని ఛేదించడంలో భారత్ బ్యాట్స్‌మెన్ విఫలమయ్యారు. టాప్ ఆర్డర్‌లో రోహిత్ శర్మ ఒక్కడే ఒంటరి పోరాటం చేయగా మిడిల్ ఆర్డర్‌లో ధోనీ అతనితో కలసి ఆసీస్ బౌలర్లపై ఎదురు దాడి చేశారు. భారత్ టాప్ బ్యాట్స్‌మెన్ నలుగురిలో ముగ్గురు సింగిల్ డిజిట్ స్కోరును అధిగమించలేకపోయారు. చివర్లో భువనేశ్వర్ కుమార్ ఫోర్లతో మెరుపులు మెరిపించినప్పటికి భారత్‌ను గెలుపు తీరానికి చేయడంలో విఫలమయ్యాడు. భారత బ్యాట్స్‌మెన్‌లో రోహిత్ ఒక్కడే 133 పరుగులు చేయగా, మిగతా 9 మంది బ్యాట్స్‌మెన్‌లు 106 పరుగులు మాత్రమే చేయగలిగారు.

తక్కువ పరుగుల వద్ద 3వికెట్లు కోల్పోవడం నాలుగోసారి

తక్కువ పరుగులకే మూడు వికెట్లు కోల్పోవడం భారత్‌కిది నాలుగోసారి. ఈ వన్డేలో 11 బంతుల్లో భారత్ మూడు వికెట్లు పోగొట్టుకుంది. గతంలో 1983లో టర్న్ బ్రిడ్జ్ వెల్స్‌లో జింబాబ్వేతో ఆడుతూ 6 పరుగుల వద్ద మూడు వికెట్లు కోల్పోగా రెండోసారి 2004లో అడిలైడ్‌లో జింబాబ్వేతో ఆడుతూ 4 పరుగుల వద్ద ఇదే సీన్ రిపీటయ్యింది. మూడో సారి 2005లో హైదరాబాద్‌లో దక్షిణాఫ్రికాపై ఆడుతూ 5 పరుగుల వద్ద మూడు వికెట్లను పోగొట్టుకుంది. నాలుగో సారి 2019లో సిడ్నీలో ఆస్ట్రేలియాపై ఆడుతూ 4 పరుగుల వద్ద మూడు వికెట్లు కోల్పోయింది.

నాలుగో వికెట్ భాగస్వామ్యం 137 పరుగులు

రోహిత్, ధోనీలిద్దరూ ఆసీస్ బౌలర్లను జాగ్రత్తగా ఎదుర్కొంటూ సింగిల్స్ తీస్తూ.. అడపాదడపా బంతిని బౌండరీ లైన్ దాటిస్తూ స్కోరును ముందుకు పోనిచ్చారు. భారత్‌పై ఒత్తిడి తగ్గించేందుకు రోహిత్ ఐదో ఓవర్లో బెహ్రెండార్ఫ్ వేసిన బంతిని సిక్సర్‌గా మలిచాడు. ధోని ఒక పరుగు చేయడంతో వన్డేల్లో 10వేల పరుగుల మార్క్‌ను దాటిన ఐదో భారతీయుడిగా రికార్డు సృష్టించాడు. గతంలో సచిన్ టెండూల్కర్, సౌరభ్ గంగూలీ, రాహుల్ ద్రవిడ్, విరాట్ కోహ్లీ ఈ మార్క్‌ను చేరిన వారిలో ఉన్నారు. ప్రారంభంలో ధోని సహజ సిద్ధమైన ఆటకు బదులు నెమ్మదిగా ఆడాడు. ఐదు పరుగులు చేయడానికి 28 బంతులను ఎదుర్కొన్నాడు. ధోనీ బ్యాటింగ్‌లో నాథన్ లియాన్ మెయిడెన్ ఓవర్ సాధించాడు. లియాన్ వేసిన తర్వాతి ఓవర్లో ధోనీ సిక్సర్ కొట్టి తన దూకుడును మరిచిపోలేదని చాటాడు. అంతకుముందు ఓవర్లో రోహిత్ కూడా తన రెండో సిక్సర్ బాదాడు. అనంతరం సిడిల్ బౌలింగ్‌లో ధోని భారత్ ఇన్నింగ్స్‌లో తొలి బౌండరీ కొట్టాడు. రోహిత్ వన్డేల్లో 38వ అర్ధ సెంచరీని పూర్తి చేసుకున్నాడు. ఇందుకు 63 బంతులు ఎదుర్కొన్నాడు. భారత్ స్కోరు 26 ఓవర్లు ముగిసే సరికి 101/3. ధోని 51(96బంతులు, ఫోర్లు-3 సిక్స్1) వన్డేల్లో తన 68వ అర్ధ సెంచరీని పూర్తి చేసుకున్న కొద్ది సేపటికే..బెహ్రెన్‌డార్ఫ్ బౌలింగ్‌లో బంతిని డ్రైవ్ చేయబోగా బంతి లైన్ మిస్సయి ఎల్బీడబ్ల్యుగా ఔటయ్యాడు. దినేష్ కార్తిక్ క్రీజులోకి వచ్చాడు. 38 ఓవర్లు ముగిసే సరికి భారత్ స్కోరు 163/4. భారత్ 72 బంతుల్లో 126 పరుగులు చేయాల్సి ఉంది. 40వ ఓవర్లో దినేష్ కార్తిక్ 12(21బంతులు) రిచర్డ్‌సన్ బౌలింగ్‌లో క్లీన్ బౌల్డ్‌గా వెనుదిరగగా, రవీంద్ర జడేజా వచ్చి రోహిత్‌తో జత కలిశాడు. రోహిత్ వన్డేల్లో తన 22వ సెంచరీని సాధించాడు. 43 ఓవర్లు ముగిసే సరికి భారత్ ఐదు వికెట్ల నష్టానికి 201 పరుగులు చేసింది. మిగతా 42 బంతుల్లో 88 పరుగుల లక్ష్యం మిగిలివుంది. ఇది సాధ్యమయ్యే లక్ష్యమే.. కాని వికెట్లు పడిపోవడంతో రన్‌రేట్ మరింత మందగించింది. ఈ దశలో జడేజా 8(13బంతులు) రిచర్డ్సన్ బౌలింగ్‌లో షువాన్ మార్ష్‌కు క్యాచిచ్చి ఔట్‌కావడంతో భువనేశ్వర్ కుమార్ వచ్చాడు. జట్టు స్కోరు 221 వద్ద రోహిత్ 133(129 బంతులు, ఫోర్లు-10, సిక్స్-6) పరుగుల వద్ద స్టొయినెస్ బౌలింగ్‌లో షాట్ కొట్టబోగా బంతి బ్యాట్ అంచుకు తగిలి గాల్లోకి లేచింది. మాక్స్‌వెల్ ముందుకు పరుగెడుతూ అద్భుతంగా క్యాచ్‌పట్టడంతో రోహిత్ ఇన్నింగ్స్ ముగిసింది. కుల్దీప్ క్రీజులోకి వచ్చాడు. 18 బంతుల్లో 68 పరుగుల లక్ష్యం. రోహిత్ ఉంటే ఇదే సాధ్యమయ్యేది.. భువనేశ్వర్ మూడు ఫోర్లు కొట్టి భారత అభిమానుల్లో ఆశలు రేకెత్తిస్తున్న దశలో కుల్దీప్ 3(6బంతులు) సిడిల్ బౌలింగ్‌లో ఖవాజాకు క్యాచిచ్చి ఔట్ కావడంతో షమీ వచ్చాడు. ఇన్నింగ్స్ చివరి బంతికి షమీ 1(2బంతులు) కూడా స్టొయినిస్ బౌలింగ్‌లో మాక్స్‌వెల్‌కు క్యాచిచ్చి ఔట్ కావడంతో భారత్ పోరు 254-9 వద్ద ముగిసింది. ఆసీస్ బౌలర్లలో బెహ్రెన్‌డార్ఫ్ 2 వికెట్లు తీయగా, జె రిచర్డ్‌సన్ 4 వికెట్లు, స్టొయినిస్ 2, సిడిల్ ఒక వికెట్‌ను దక్కించుకున్నాడు. అంతుకు టాస్ గెలిచిన ఆసీస్ బ్యాటింగ్ చేపట్టింది. నిర్ణీత 50 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 255 పరుగులు చేసింది. పీటర్ హాండ్స్‌కోంబ్ అత్యధికంగా 73(61బంతులు, ఫోర్లు-6, సిక్స్ -2) పరుగులు చేయగా, ఖవాజా 59(81బంతులు, ఫోర్లు-6), షువాన్ మార్ష్ 54(70బంతులు, ఫోర్లు-4), స్టొయినిస్ 47(43బంతులు, ఫోర్లు-2 సిక్స్2) చేసి తమ జట్టు స్కోరుకు తోడ్పడ్డారు. భారత బౌలర్లలో భువనేశ్వర్ కుమార్, కుల్దీప్ యాదవ్ తలా రెండు వికెట్లు తీయగా, రవీంద్ర జడేజా ఒక వికెట్ పడగొట్టాడు. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డ్ జె రిచర్డ్‌సన్‌కు దక్కింది.

భారత్ తొలి వికెట్ తొలి ఓవర్లోనే పడింది. తన కెరియర్లో తొలి వన్డేను ఆడుతున్న ఆసీస్ బౌలర్ బెహ్రెన్‌డార్ఫ్ తన తొలి ఓవర్లోనే వికెట్ దక్కించుకున్నాడు. శిఖర్ ధావన్ (డకౌట్) ఎల్బీడబ్ల్యుగా బెహ్రెన్‌డార్ఫ్‌కు వికెట్లు ముందు దొరికిపోయాడు. అనంతరం మూడో వికెట్‌గా కోహ్లీ క్రీజులోకి వచ్చాడు. కోహ్లీ 8 బంతులు ఎదుర్కొని 3 పరుగులు చేసి జె రిచర్డ్‌సన్ బౌలింగ్‌లో బంతిని నేరుగా బౌలర్‌వైపు ఆడబోగా షార్ట్ స్క్వేర్ లెగ్‌లో స్టొయినిస్ క్యాచిచ్చి వెనుదిరిగాడు. అంబటి రాయుడు నాలుగో వికెట్‌గా రావడం పెవిలియన్ చేరడం వెంటదివెంట జరిగిపోయింది. రాయుడు (డకౌట్) వికెట్ కూడా రిచర్డ్‌సన్‌కే దక్కింది. మిడిల్ అండ్ లెగ్ స్టంప్స్ మధ్య పిచ్ అయిన బంతి వికెట్లు ముందు రాయుడు ప్యాడ్లకు తగలడంతో పెవిలియన్ చేరాడు. జట్టు స్కోరు 4 వద్ద ఉన్నప్పుడే.. భారత్ మూడు వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ సమయంలో క్రీజులోకి వచ్చిన ధోని ఆపద్బాంధవుడయ్యాడు. రోహిత్‌తో జతకలిసి మరో వికెట్ పడ కుండా జాగ్రత్తగా బంతులు ఎదుర్కొంటూ ఇన్నింగ్స్‌ను ముందుకు పోనిచ్చాడు.

భారత్-ఆస్ట్రేలియా వన్డేల్లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాళ్లు

సచిన్ టెండూల్కర్	3077
రికీ పాంటింగ్	2164
రోహిత్ శర్మ	1630
ఆడం గిల్‌క్రిస్ట్	1622
ఎం హేడన్	1450

ఆస్ట్రేలియాపై అత్యధిక సెంచరీల నమోదు చేసిన ఆటగాళ్లు

సచిన్	9
రోహిత్ శర్మ	7
డి హేన్స్	6
కోహ్లీ	5
గ్రాహం గూచ్/ వీవీఎస్ లక్ష్మణ్/ఎఫ్ డుప్లెస్సిస్	4



స్కోరు బోర్డు

ఆస్ట్రేలియా: అలెక్స్ కేరీ (సి) రోహిత్ (బి) కుల్దీప్ యాదవ్ 24, ఆరోన్ ఫించ్ (బి) భువనేశ్వర్ 6, ఉస్మాన్ ఖవాజా ఎల్బీడబ్ల్యు (బి) రవీంద్ర జడేజా 59, షువాన్ మార్ష్ (సి) షమీ (బి) కుల్దీప్ యాదవ్, 54, పీటర్ హాండ్స్‌కోంబ్ (సి)ధావన్ (బి) భువనేశ్వర్ 73, మార్కస్ స్టొయినిస్ నాటౌట్ 47, గ్లెన్ మాక్స్‌వెల్ నాటౌట్ 11, ఎక్స్ట్రాలు 14, మొత్తం : 288/5 (50 ఓవర్లు)

బౌలింగ్: భువనేశ్వర్ కుమార్ 10-0-66-2, ఖలీల్ అహ్మద్ 8-0-55-0, షమీ 10-0-46-0, కుల్దీప్ యాదవ్ 10-0-54-2, రవీంద్ర జడేజా 10-0-48-1, అంబటి రాయుడు 2-0-13-0

భారత్: రోహిత్ శర్మ (సి) మాక్స్‌వెల్ (బి) స్టొయినిస్ 133, శిఖర్ ధావన్ ఎల్బీడబ్ల్యు (బి) బెహ్రెన్‌డార్ఫ్ 0, విరాట్ కోహ్లీ (సి)స్టొయినిస్ (బి) రిచర్డ్‌సన్ 3, అంబటి రాయుడు ఎల్బీడబ్ల్యు రిచర్డ్‌సన్ 0, ధోని ఎల్బీడబ్ల్యు (బి) బెహ్రెన్‌డార్ఫ్ 51, దినేష్ కార్తిక్ (బి) రిచర్డ్‌సన్ 12, జడేజా (సి) షువాన్ మార్ష్(బి) రిచర్డ్‌సన్ 8, భువనేశ్వర్ కుమార్ నాటౌట్ 29, కుల్దీప్ యాదవ్ (సి) ఖవాజా (బి) సిడిల్ 3, షమీ (సి) మాక్స్‌వెల్ (బి) స్టొయినిస్ 1,

ఎక్స్ట్రాలు: 254/9(50ఓవర్లు)

బౌలింగ్ : జాసన్ బెహ్రెండార్ఫ్ 10-2-39-2, జే రిచర్డ్‌సన్ 10-2-26-4, పీటర్ సిడిల్ 8-0-48-1, నాథన్ లియాన్ 10-1-50-0, మార్కస్ స్టొయినిస్ 10-0-66-2, గ్లెన్ మాక్స్‌వెల్ 2-0-18-0.

- ఆస్ట్రేలియా గడ్డపై ఆస్ట్రేలియాతో ఆడుతూ సెంచరీలు చేసిన వారిలో రోహిత్ రెండో వాడు. కుమర సంగకర, రోహిత్ లు చెరో ఐదు సెంచరీలు చేసి సమానంగా ఉన్నారు.

ధోని@ 10000



సిడ్నీ: వన్డేల్లో ధోని 10000 వేల పరుగుల మైలురాయిని అధిగమించిన ఐదో భారత ఆటగాడికి రికార్డుల్లోకి ఎక్కాడు. శనివారం ఆస్ట్రేలియాతో జరిగిన వన్డేలో 9999 పరుగులతో బ్యాటింగ్ చేస్తూ.. తొలి పరుగు చేయడంతో ఈ మార్క్‌ను సాధించాడు. ఈ మ్యాచ్‌లో ధోని 51 పరుగులు చేశాడు. అయితే నిజానికి ధోని 10వేల మార్క్‌ను వన్డేల్లో 2017-18 ఇంగ్లండ్ పర్యటనలో పూర్తి చేసుకున్నాడు. ఆసియా ఎలవన్ జట్టు తరఫున బ్యాటింగ్ చేస్తూ.. 10174 పరుగులు చేశాడు. ఇందులో 175 పరుగులు దేశం తరపున బ్యాటింగ్ చేస్తూ చేసినవి కాకపోవడంతో అవి భారత్ తరఫున ఆడుతూ సాధించిన రికార్డుగా నమోదు కాలేదు. తాజాగా ఆస్ట్రేలియాతో భారత్ తరఫున ఆడుతూ ఈ మార్క్‌ను అధిగమించాడు. ఈ లెక్క ప్రకారం ధోని 330 వన్డేల్లో సాధించిన పరుగులు 10,050. అతని బ్యాటింగ్ సగటు 49.75. ఇందులో తొమ్మిది సెంచరీలు, 67 అర్ధ సెంచరీలున్నాయి. ప్రపంచ దేశాల ఆటగాళ్లతో పోల్చితే ధోని ఈ మార్క్‌ను అధిగమించిన 13వ ఆటగాడు. భారత ఆటగాళ్లలో ఈ మార్క్ చేరిన భారతీయుల్లో సచిన్ టెండూల్కర్, సౌరభ్ గంగూలీ, రాహుల్ ద్రవిడ్, విరాట్ కోహ్లీ ఉన్నారు.

ఆసియా కప్ ఫుట్‌బాల్
నాకౌట్లో... ఇరాన్, ఇరాక్

అబుదాబి: ఆసియా కప్ ఫుట్‌బాల్ టోర్నీలో శనివారం జరిగిన గ్రూప్ డి మ్యాచ్‌ల్లో ఇరాన్, ఇరాక్‌లు తమ ప్రత్యర్థి జట్లపై విజయం సాధించి నాకౌట్ దశకు చేరుకున్నాయి. ఇరాన్ 2-0గోల్స్ తేడాతో వియత్నాంపై గెలిచింది. సర్దార్ ఆజమోన్ ఆట 38, 69వ నిమిషాల్లో గోల్స్ చేసి తన జట్టుకు గెలుపును అందించాడడు. ఇరాక్ 3-0గోల్స్ తేడాతో యెమెన్‌పై విజయం సాధించింది. అట 11వ నిమిషంలో ఇరాక్ స్ట్రైకర్ మోహనాద్ అలీ ఖాదిమ్ తొలి గోల్ చేయగా, 19వ నిమిషంలో బషర్ రేసన్ బొన్యన్ మరో గోల్ చేసి ఇరాక్ లీడ్‌ను 2-0కు పెంచాడు. 91 నిమిషంలో అహ్మద్ యాసిన్ గిని అందించిన పాస్‌ను అలా అబ్బాస్ అందుకుని గోల్ చేయడంతో ఇరాక్ 3-0తో గెలుపొందింది.



18నుంచి నేషనల్ కరాటే చాంపియన్‌షిప్ పోటీలు

హైదరాబాద్: ఇండియా నేషనల్ కరాటే చాంపియన్‌షిప్ -2019 పోటీలకు స్థానిక గచ్చిబౌలిలోని ఇండోర్ స్టేడియం వేదిక కానుంది. ఈ పోటీలు 18 నుంచి 21వరకు జరుగనున్నాయి. ఈ పోటీల్లో 25 రాష్ట్రాలకు చెందిన 1300 యువతీయువకులు, చిన్నారులు పాల్గొంటున్నారు. ఈమేరకు వివరాలను పోటీలను నిర్వహిస్తున్న జపాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా మీడియాకు శనివారం తెలిపింది.



సెమీ ఫైనల్లో హంటర్స్ ఓటమి

- సింధు గెలిచినా... జట్టు ఆటగాళ్లు ఓడారు
- ఫైనల్లో బెంగళూరుతో ముంబై ఢీ

బెంగళూరు: ప్రీమియర్ లీగ్ బ్యాడ్మింటన్ సీజన్ 4లో ఫైనల్ బెర్త్‌లు ఖరారయ్యాయి. నేడు జరిగే ఫైనల్లో బెంగళూరు రాప్టర్స్‌తో ముంబై రాకెట్స్ తలపడనుంది. శనివారం జరిగిన సెమీఫైనల్-2లో (ముంబై రాకెట్స్ 4-2 తేడాతో హైదరాబాద్ హంటర్స్‌పై విజయం సాధించి ఫైనల్‌కు చేరింది. మహిళల సింగిల్స్‌లో పీవీ సింధు(హైదరాబాద్) ట్రంప్ మ్యాచ్‌గా ఆడి విజయం సాధించినప్పటికి.. హంటర్స్ జట్టులోని మిగతా ఆటగాళ్లు ఆడిన మ్యాచులు ఓడిపోవడంతో హంటర్స్ ఫైనల్ ఆశలు గల్లంతయ్యాయి. సింధు 15-6, 15-5 తేడాతో ఎస్ పర్‌దేసిని ఓడించింది. పురుషుల డబుల్స్‌లో కెజిజాంగ్- ఎల్ వైడే జోడీ(ముంబై రాకెట్స్) 15-14, 15-12 తేడాతో బి ఇసరా- కెఎస్ రాంగ్ (హైదరాబాద్) జోడీపై విజయం సాధించగా, పురుషుల సింగిల్స్‌లో ఎస్ వర్మ(ముంబై) ట్రంప్ మ్యాచ్‌గా ఆడి ఎం కాలిజో(హైదరాబాద్)పై 15-8, 15-7 తేడాతో ఓడించింది. రెండో పురుషుల సింగిల్స్‌లో కూడా ముంబైదే పైచేయి అయింది. ఎ అటోన్‌సెన్(ముంబై) 15-13, 15-6 తేడాతో ఎల్ హ్యాన్ (హైదరాబాద్)పై గెలుపొంది గేమ్‌ను మ్యాచ్‌ను సొంతం చేసుకుంది. ఫలితం తేలడంతో చివరిదైన మిక్స్‌డ్ డబుల్స్ మ్యాచ్‌ను ఆటగాళ్లు ఆడలేదు.



ముహూర్తం

శ్రీ విళంబినామ సంవత్సరం, దక్షిణాయణం, హేమంత ఋతువు, పుష్యమాసం; తిథి: శుద్ధ సప్తమి సా.6.40 వరకు అనంతరం అష్టమి; నక్షత్రం: ఉత్తరాభాద్ర ఉ.7.13 వరకు అనంతరం రేవతి; అమృతకాలం: శే.ఉ.6.15 వరకు; వర్జ్యం: రా.7.57 నుండి 9.38 వరకు; దుర్ముహూర్తం: సా.4.24 నుండి 5.12 వరకు; రాహుకాలం: సా.4.30 నుండి 6.00 వరకు; యమగండం: ఉ.12.00 నుండి 1.30 వరకు

Estd. 1938

ఆంధ్రప్రభ

www.prabhanews.com

Journalism first!

సంపుటి:57 • సంచిక:269 • ఆదివారం 13 జనవరి 2019 • హైదరాబాద్ * పేజీలు:12+4 • వెల: 6.00 • Published from: Hyderabad | Karimnagar | Nizamabad | Suryapet | Vijayawada | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Kurnool | Anantapur | Nellore

అనుబంధాల వైపు పరుగులు!




పంతంగి టోల్‌గేట్ దగ్గర కిలోమీటర్ల మేర బారులుదీరిన వాహనాలు

పండుగలు పబ్బాలలో బంధువర్గాలను కలిసేందుకు ఉత్సుకత

- చిన్న కుటుంబాలను వేధిస్తున్న ఒంటరితనం
- ఉమ్మడి వేడుకలకు ప్రాధాన్యమిస్తున్న నవతరం
- అందుకే పల్లెబాట.. అందరి నోట అమ్మానాన్నల పాట

ప్రత్యేక కథనం 9లో...

పేదల బిల్లుకు ప్రెసిడెంట్ ముద్ర



అమల్లోకి వచ్చిన అగ్రవర్ణ పేదలకు 10% రిజర్వేషన్లు

న్యూఢిల్లీ: ఈబీసీ బిల్లుకు రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆమోదముద్ర వేశారు. ఈమేరకు రాష్ట్రపతి కార్యాలయం గెజిట్ విడుదల చేసింది. ఆర్థికంగా వెనకబడిన వర్గాల వారికి 10 శాతం రిజర్వేషన్లు కల్పించే ఉద్దేశంతో ప్రభుత్వం ఈబీసీ బిల్లును రూపొందించగా..లోక్‌సభలో సునాయాసంగా ఆమోదం పొందిన ఈ బిల్లు.. రాజ్యసభలో విపక్షాల అభ్యంతరాల మధ్య పాసైంది. రాష్టపతి ఆమోద ముద్రతో ఆర్థికంగా వెనకబడిన వర్గాల వారికి విద్య, ఉద్యోగ అవకాశాల్లో10 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు మార్గం సుగమమైంది. ప్రస్తుతం బీసీ, ఎస్సీ, ఎస్టీలకు 49.5 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తుండగా... తాజాగా అమలు కాబోతున్నఈ 10 శాతం రిజర్వేషన్లు వాటికి అదనమని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇకనుంచి దేశంలో మొత్తం రిజర్వేషన్లు 59.5 శాతం కానున్నాయి.

ఈబీసీలుగా ఎవరెవరిని పరిగణిస్తారనే విషయం పై ప్రభుత్వం బిల్లులో స్పష్టంగా కొన్ని అంశాలను పేర్కొంది.

- వ్యవసాయం, ఇతర వృత్తుల చేసే వారి వార్షికాదాయం రూ.8 లక్షలకు మించకూడదు.
- 5 ఎకరాలకంటే తక్కువ వ్యవసాయ భూమి కలిగిఉన్నవారు.
- 1000 చ. అడుగుల కంటే 10వ పేజీలో...

కేంద్రమా... మూస పద్ధతి మానుకో



రాష్ట్రాలను కించపర్చొద్దు

- నిబంధనల సాకుతో నిరుత్సాహ పర్చొద్దు
- కాంగ్రెస్–బీజేపీ ప్రభుత్వాల వల్లే ఈ దుస్థితి
- 15వ ఫైనాన్స్ కమిషన్ పర్యటన నేపథ్యంలో బడ్జెట్‌పైనా సీఎం కేసీఆర్ సమీక్ష

హైదరాబాద్, ఆంధ్రప్రభ: భారత ఆర్థిక వ్యవస్థను గుణాత్మక దిశగా నడిపించేందుకు ఆర్థిక సంఘం నడుం బిగించాల్సి ఉందని ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు అభిప్రాయపడ్డారు. మూస పద్ధతిలో కాకుండా తన పాత్రను వినూత్నంగా తీర్చిదిద్దుకోవాల్సిన అవసరం వున్నదని పేర్కొన్నారు. కొద్దిరోజుల్లో 15వ ఫైనాన్స్ కమిషన్ బృందం రాష్ట్ర పర్యటనకు రానున్న నేపథ్యంలో ఆర్థిక శాఖ, ఇతర సీనియర్ అధికారులతో హైదరాబాద్‌లోని ప్రగతి భవన్‌లో ముఖ్యమంత్రి కీలక సమీక్ష నిర్వహించారు. స్వాతంత్ర్యకాలం నుంచి రాష్ట్ర, జాతీయ స్థాయిలో వచ్చిన అనేక పార్టీల ప్రభుత్వాలు ఎటువంటి గుణాత్మక మార్పును తీసుకురాలేకపోయాయని సీఎం కేసీఆర్ చేప్పారు. ఈ నేపథ్యంలో తిరిగి లోతయిన విశ్లేషణ, ఆత్మావలోకనం చేసుకోవాల్సిన అవసరం ఉన్నదన్నారు. ప్రభుత్వ విధానాల పట్ల ప్రజలు తీవ్ర అసంతృప్తితో నిరసన వ్యక్తం చేస్తుండడం విచారకరమన్నారు. దీనికి కాంగ్రెస్, బీజేపీ అనే రెండు రాజకీయ వ్యవస్థలే మూలకారణమని సీఎం స్పష్టం చేశారు.

''దేశానికి మౌలికమైన విత్త విధానం వున్నది. వికేంద్రీకరణ చేయాల్సిన అధికారాలను అందుకు విరుద్ధంగా కేంద్రీకరించారు. పురోగతి సాధిస్తున్న రాష్ట్రాల విధానాల్లో జోక్యం చేసుకోవద్దని నేను నీతి ఆయోగ్ సమావేశాల్లో పాల్గొన్నప్పుడు స్పష్టం చేశాను. రాష్ట్ర ప్రగతిని దేశ ప్రగతిగా పరిగణించాలి. పురోగతి సాధిస్తున్న రాష్ట్రాలను నిరుత్సాహపరచొద్దు. చిన్న చిన్న నిధులను విడుదల చేయడానికి కూడా అనేక నిబంధనలను విధిస్తున్నారు. రాష్ట్రానికి, కేంద్రానికి నడుమ ఉండాల్సిన రాజ్యాంగ సంబంధం రోజురోజుకూ కనుమరుగవుతున్నది. రాష్ట్రాల అధికారాలు, హక్కుల పంపిణీ విషయంలో కేంద్రం అనుసరిస్తున్న వైఖరి రాష్ట్రాలను కించపరిచే విధంగా వుండడం అత్యంత విచారకరం'' అని సీఎం కేసీఆర్ అన్నారు. ఫైనాన్స్ కమిషన్ పాత్రను ప్రస్తావిస్తూ.. ''రాష్ట్రాలలో 5వ పేజీలో...

మాయా – అఖిలేష్ కొత్త పొత్తు



ఫెడరల్ ఫ్రంట్‌కు ఊపు!

కేసీఆర్‌కు బాసటగా మాయావతి, అఖిలేష్? 10

చెరొక 38 స్థానాల్లో పోటీ

- అమేథీ, రాయ్‌బరేలీ సీట్లు కాంగ్రెస్‌కు
- యూపీలో కాంగ్రెస్‌కు ప్రజాదరణ లేదని.. ఓట్ల బదలీ జరగదని మాయావతి వ్యాఖ్య
- పొత్తును స్వాగతించిన మమతా బెనర్జీ

10లో

నేటి నుంచి 16 దాకా టోల్‌గేట్ ఫీజు రద్దు

- రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం

9లో

10



ప్రపంచ బ్యాంకు చీఫ్ రేసులో ఇవాంక ట్రంప్?

ఒడిశాలో రైతుబంధు



- కాలియా పేరుతో గణతంత్ర దినోత్సవాన శ్రీకారం
- తెలంగాణ బాట పట్టిన నవీన్ పట్నాయక్
- ఆరు నెలల అధ్యయనం తర్వాత నిర్ణయం
- త్వరలో అదేబాటలో కేంద్ర ప్రభుత్వం
- ఎకరాకు విడతకు 5వేలు.. ఏడాదిలో 10వేలు సాయం
- వ్యవసాయంపై ఆధారపడిన భూమిలేని రైతులకూ సహాయం
- వారికి అనుబంధ రంగాల్లో ఉపాధికి రూ. 12,500
- 92% రైతులకు లబ్ధి : సీఎం నవీన్ పట్నాయక్

4లో



భూపతిరెడ్డి



యాదవరెడ్డి



రాములు నాయక్

ఇక వేటే!

- కాంగ్రెస్‌లో చేరిన ముగ్గురు ఎమ్మెల్సీలపై విచారణ పూర్తి.. ఏ క్షణమైనా నిర్ణయం
- నామినేటెడ్ ఎమ్మెల్సీ తక్షణ నియామకం?
- శేరి సుభాష్‌రెడ్డి లేదా కేఆర్ సురేష్‌రెడ్డికి చాన్స్

4లో





10

ఇంటికో ఉద్యోగం

సిక్కిం సీఎం చామ్లింగ్ సంచలన నిర్ణయం

ఉద్యోగ మేళాలో తాత్కాలిక నియామక పత్రాలు అందజేత

ఎవర్నీ వదలా!

- అవినీతిని కడిగేస్తా..
- యూపీఏ అవినీతిమయం
- మరకలు అంటని ప్రభుత్వం మాది
- మహాకూటమి విఫల ప్రయోగం
- ఈబీసీ రిజర్వేషన్లతో ఇతరులకు నష్టం లేదు
- బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశంలో ప్రధాని మోదీ


10లో

మోదీ మారారా?!

అద్వానీ చేయి పట్టి..!



చమక్కులు




రావాలి మళ్ళీమళ్ళీ

ఎన్నికల హామీలు చిత్రవిచిత్రంగా గమ్మత్తుగా ఉంటాయ్. గెలుపుకోసం నాయకులు ఎలాంటి కుప్పిగంతులైనా వేస్తారు.. ఎలాంటి సమ్మోహనాస్త్రాలైనా సంధిస్తారు. సాధారణ ఎన్నికలతో పోల్చితే పల్లె రాజకీయం వేరు. పంచాయతీ ఎన్నికల్లో ఒకటి, రెండు ఓట్లతోనే సీట్లు మారిపోతుంటాయి. పదవులు దక్కుతుంటాయ్. అందుకే ఎవరి ఎత్తులు వారు వేస్తుంటారు. ఓ పల్లెటూళ్ళో ఓ నాయకుడు తన పల్లె ప్రజలందరినీ రిలీజ్ సినిమా టికెట్లు పట్టుకొచ్చి సినిమాకు తీసుకెళ్ళాడట. మధ్యలో కూల్‌డ్రింక్‌లు, కారపోక వాహనాలు.. ఇలా మర్యాదలు చూశాక ఆ పల్లెజనం ఉప్పొంగిపోయారట. ఇక సూర్యాపేట జిల్లాలోని ఓ పంచాయతీలో ప్రతిఓటరుకు తన స్వంతభూమిలో ఇల్లునిర్మాణానికి కుంట స్థలం ఫ్రీగా ఇస్తానని ప్రకటించాడట. ఇక చీరెలు, సారెలు, పైసలు, కోటర్ సీసాలు, క్రికెట్ కిట్లు ఇలాంటియన్నీ అదనమట. ఓనేత హామీ ప్రకటించగానే అర్రాస్ పాట అందుకున్నట్లు అతనికా.. స్థోమతలేకున్నా రేసులో ఎక్కడ వెనుకబడుతానోనని నేను డబుల్ ఇస్తా అని చెప్పేస్తున్నారట. నాయకుల పోటీని చూసి పల్లెజనం మురిసిపోతున్నారట. ఇలాంటి ఎన్నికలు రావాలి మళ్ళీమళ్ళీ అని కోరుకుంటున్నారట.

గుర్తుంచుకోవడం కష్టమప్పా

అగ్గిపుల్ల.. కుక్కపిల్ల.. సబ్బుబిల్ల కాదేదీ కవితకు అనర్హం అన్నట్లు ఇపుడు ఉంగరం, బొంగరం, కత్తెర, విమానం, కప్పు, డప్పు ఇలాంటివే నేతల తలరాత రాస్తున్నాయి. మొన్నటి ఎన్నికల్లో ఓ పల్లెప్రజలు అంతా ఒకే మీరు చెప్పినట్లే నొక్కేశాం మనగుర్తు పగిలిపోయిందంతే అన్నారట. తీరాచూస్తే ఆళ్ళు చెపిన కారుగుర్తు కాకుండా దానిని పోలిన ట్రక్కుకు రికార్డు ఓట్లు వచ్చాయట. ఒకదానికి వేయబోయే మరోదానికి వేస్తే అబ్బో నా జాతకమే మారిపోద్ది అని ఓ అభ్యర్థి తన ప్రచారానికి వెళ్ళినపుడల్లా నా గుర్తేంటి? అని క్విజ్‌మాస్టారులా పోటీ పెట్టి ప్రైజ్‌లు ఇస్తున్నాడట. దీనివల్ల ప్రైజ్‌ల కోసమైనా గుర్తుంచుకుంటారని కొత్తప్లాన్‌లు వేస్తున్నారట. ఇక కొందరు గుర్తు.. గుర్తుంచుకో అంటూ ఒకటికి పదిసార్లు ఇళ్ళచుట్టూ తిరుగుతున్నారట. జనం నమ్మకం సంపాదించడం ఒక ఎత్తయితే ఈ గుర్తును గుర్తుండేలా చేయడం మహా కష్టపనప్పా అని నేతలు వాపోతున్నారట. ప్రజలకు చెపిచెప్పి ఒక్కోసారి నేతలు తమ గుర్తువిషయంలోనూ తడబడుతున్నారట.



నేను ఎవరికి చెప్పుకోవాల్రా



అన్నా.. గవర్నమెంట్ వచ్చి చాలా రోజులైతంది. మీరు మంత్రిపదవి లేకుండా ఖాళీగా ఉండుడు చూసి.. ఆ దర్పం లేకుండా, హంగులేకుండా ఇట్ల సూస్తుంటే చాలా బాధైతందే అని అని అనుచరులు వాపోతున్నారట. ప్రభుత్వం ఏర్పడ్డా అధినేత కేసీఆర్ ఇంకా మంత్రివర్గ విస్తరణ చేపట్టకపోవడంతో కొందరు మాజీమంత్రులు ఇటీవల తెలంగాణభవన్‌కు హంగూ,ఆర్భాటాలు లేకుండా సింపుల్‌గా, ఒంటరిగా వస్తున్నారు. ఓ మాజీమంత్రి సింపుల్‌గా తెలంగాణభవన్‌కు రావడం చూసి ఆయన అనుచరుడు కన్నీటిపర్యంతమైనంత పనిచేశాడట. ఒరే పిచ్చోడ.. ఏడ్వకురా. పదవులేముందిరా.. వస్తయ్ తియ్. ఏడ్వకు. నేనేవరికి చెప్పుకోనురా నా బాధ అంటూ సముదాయించాడట. ఓవైపు మనసులో బాధ చెప్పు కోలేక, కార్యకర్తను సముదాయించలేక ఆ మాజీ పడ్డ బాధ చూసి చూసిన వారి గుండె తరుక్కు పోయినంత పనయిందట. ఉందిలే మంచికాలం ముందు ముందునా అంటూ టైముకు గుర్తొచ్చిన ఓ పాట పల్లవితో పక్కపక్కన ఊరడించారట.

- కంది.రామచంద్రారెడ్డి



18 నుంచి అంతర్జాతీయ యువజన సదస్సు

- గవర్నర్‌ను ఆహ్వానించిన ఎంపీ కవిత
- 103దేశాల నుండి 550మంది ప్రతినిధులు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో ఈనెల 18నుండి 20వరకు అంతర్జాతీయ యువజన నాయకత్వ సదస్సును నిర్వహిస్తున్నది. హైదరాబాద్ నోవాటెల్ హోటల్‌లో ఈసదస్సు జరగనుంది. 19వతేదీన ప్రారంభ సమావేశానికి అన్నా హజారే ముఖ్యఅతిధిగా హాజరుకానున్నారు. నిజామాబాద్ ఎంపీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కీనోట్ అడ్రస్ చేస్తారు. 20వ తేదీ సాయంత్రం జరిగే సమావేశానికి గవర్నర్ నరసింహన్ ముఖ్య అతిధిగా హాజరుకానున్నారు. శనివారం ఎంపీ కల్వకుంట్ల కవిత రాజ్‌భవన్‌కు వెళ్ళి గవర్నర్‌ను స్వయంగా ఆహ్వానించారు. ఇక తొలిరోజు యువత అభివృద్ధిపై ప్రముఖ జర్నలిస్ట్ శేఖర్ గుప్తా చర్చాగోష్ఠిని నిర్వహిస్తారు. పది వేర్వేరు హాళ్ళలో వేర్వేరు చర్చాగోష్ఠిలు జరుగుతాయి. ప్రపంచప్రగతిలో యువత పాత్రపై యువనాయకులు మాట్లాడుతారు. రెండోరోజు నైపుణ్యశిక్షణ, సమతుల్యాభివృద్ధిలో యువత , మహిళల పాత్ర, కార్పొరేట్ భాగస్వామ్యంపై చర్చిస్తారు. వీటిని అంతర్జాతీయంగా ఆయారంగాల్లో నిష్ణాతులు నిర్వహిస్తారు. గాంధేయ మార్గంలో సుస్థిరఅభివృద్ధి నూతన ఆవిష్కరణలు అంశంపై సదస్సులో చర్చిస్తామని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తెలిపారు. 2030వరకు భవిష్యత్ మానవాళి మనుగడకు అవసరమైన ప్రాథమిక లక్ష్యాలను సాధించేందుకు ఐక్యరాజ్యసమితివిడుదల చేసిన 17అంశాల లక్ష్యాల సాధనలో భాగంగా తెలంగాణ జాగృతి ఈ అంతర్జాతీయ సదస్సును నిర్వహిస్తున్నదని ఆమె వివరించారు. 103దేశాల నుండి 550మంది ప్రతినిధులు సదస్సుకు హాజరవుతున్నారని, 16దేశాల నుండి 70మంది వక్తలు, 40మంది ప్రత్యేక ఆహ్వానితులు హాజరవుతారని ఎంపీ కవిత చెప్పారు.

త్వరలో.. ఎన్ఆర్ఐ పాలసీ



హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్రసమితి పార్టీజెండా ఇప్పటికే 33దేశాల్లో రెపరెపలాడుతోందని, టీఆర్ఎస్ ఎన్ఆర్ఐ శాఖతో కలిసి త్వరలో ఎన్ఆర్ఐ పాలసీ తీసుకొస్తామని నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత అన్నారు. శనివారం తెలంగాణభవన్‌లో జరిగిన టీఆర్ఎస్ యుకె సెల్ 8వ వార్షికోత్సవ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్ని ఇబ్బందులున్నా టీఆర్ఎస్ ఎన్ఆర్ఐ శాఖను ముందుకు తీసుకువెళతామన్నారు. విదేశాలలో ఉన్న తెలంగాణ బిడ్డలు గర్వించేలా టీఆర్ఎస్ ప్రభుత్వం పనిచేస్తుందని వ్యాఖ్యానించారు. ప్రస్తుతం ఉన్న 33శాఖలను రానున్న రోజుల్లో 100శాఖలకు విస్తరిస్తామన్నారు. ఈ పనుల్లో ఎన్ఆర్ఐ టీఆర్ఎస్ కో-ఆర్డినేటర్ మహేష్ బిగాలతో పాటు ఇతర దేశాల్లో ఉన్న టీఆర్ఎస్ కార్యకర్తలు ఉన్నారన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో పనిచేస్తూ తెలంగాణ ఖ్యాతిని ఇనుమడింపజేయాలన్నారు. ఉద్యమ సమయంలో ప్రొఫెసర్ జయశంకర్ సర్ విదేశాల్లో ఉండే తెలంగాణ బిడ్డలు వివిధపేర్లతో సంఘాలు పెట్టుకుని పనిచేసిన విషయం తెలంగాణ సమాజం మరువదన్నారు. శాఖలు ఏర్పాటుచేసే సమయంలో రకరకాలుగా అవమానాలు, అవహేళనలు ఎదుర్కొన్న విషయం అందరికీ తెలుసునని, కొందరు ఎన్ఆర్ఐలు కంటతడి కూడా పెట్టారన్నారు. నవ్వినా నాపచేనే పండిందన్న చందంగా తెలంగాణ సాధించుకుని టీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసుకున్నామన్నారు. మళ్ళీ కేసీఆర్ నాయకత్వంలో రెండోసారి కూడా అధికారంలోకి వచ్చామని కవిత తెలిపారు. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ అభివృద్ధి పథంలో దూసుకుపోతున్నదన్నారు. మన ఇండస్ట్రియల్ పాలసీని చూసి అమెరికా వాసులు తమ వద్ద ఇలాంటి పాలసీ లేదని చెబుతున్న విషయం గర్వకారణమన్నారు.

త్వరలో కేటీఆర్ ప్రకటిస్తారు

ఎన్ఆర్ఐల సంక్షేమం కోసం రూ.100కోట్లు ఇప్పటికే మంజూరయ్యాయని, త్వరలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎన్ఆర్ఐ పాలసీని ప్రకటిస్తారని కవిత తెలిపారు. అభివృద్ధి చెందిన అమెరికాలో ఒకరకంగా, గల్ఫ్‌లాంటి దేశాల్లో మరో రకమైన సమస్యలు ఉన్నాయన్నారు. అక్కడి వారికి, ఇక్కడి వారికి సారధులుగా ఎన్ఆర్ఐ సెల్స్ పనిచేయాలన్నారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ ఎమ్మెల్సీ శ్రీనివాసరెడ్డి, బేవరేజెస్ కార్పొరేషన్ ఛైర్మన్ దేవీప్రసాద్, ఎన్ఆర్ఐ సెల్ వ్యవస్థాకులు అనిల్ కూర్మాచలం , యుకె అధ్యక్షుడు అశోక్ దూసరి, న్యూజిలాండ్ కోశాధికారి అభిలాష్ రంగినేని, యుఎస్ ప్రతినిధులు సుధీర్, సురేష్‌చ రమేష్, ఖతార్ ప్రతినిధి అభిలాష్ బండి , రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఒడిశాలో రైతుబంధు

- కాలియా పేరుతో అమలు • గణతంత్ర దినోత్సవాన శ్రీకారం
- ఆరునెలల అధ్యయనం తరువాత నిర్ణయం • ఎకరాకు విడతకు 5వేలు.. ఏడాదిలో 10 వేలు సాయం • వ్యవసాయంపై ఆధారపడిన భూమిలేని రైతులకూ సహాయం • వారికి అనుబంధ రంగాల్లో ఉపాధికి రూ.12,500 ప్రకటన • 92శాతం రైతులకు లబ్ధి: సీఎం నవీన్ పట్నాయక్

తెలంగాణ బాటపట్టిన ఒడిశా సీఎం నవీన్ పట్నాయక్...



ఒడిశా /హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న రైతుబంధు పంట పెట్టుబడి పథకం మరో రాష్ట్రానికి ఆదర్శంగా నిలిచింది. ఈ నెల 26 నుంచి ''కాలియా'' పేరుతో రైతు పంట పెట్టుబడి సాయం పథకాన్ని అమల్లోకి తీసుకువస్తున్నట్లు ఒడిశా ప్రభుత్వం ప్రకటించింది. ఆరు నెలల క్రితమే ఈ పథకంపై అధ్యయనం చేసిన ఆ రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది డిసెంబర్ 31న అధికారికంగా ప్రకటించింది. ఒక్కో పంటకు ఎకరాకు రూ.5వేల చొప్పున రెండు పంటలకు కలిపి ప్రతియేటా రూ.10వేలు ఇవ్వాలని నిర్ణయించినట్లు ఒడిషా ముఖ్యమంత్రి నవీన్‌పట్నాయక్ తాజాగా శనివారం ప్రకటించారు. రాష్ట్రంలో మొత్తం 12.4లక్షల మంది (92శాతం) చిన్న, సన్నకారు రైతు కుటుంబాలకు లబ్ది చేకూరుతుందని పేర్కొన్నారు. ఈ నెల 15వరకు మొదటి దశ దరఖాస్తులు, 25 వరకు రెండో విడతగా ధరఖాస్తులు స్వీకరిస్తున్నారు. గణతంత్ర దినోత్సవం మొదలుకుని మొదటి విడత పెట్టుబడి మొత్తాన్ని అర్హులైన రైతులకు అందించే ప్రక్రియను ప్రారంభిస్తారు. దేశంలోనే ప్రప్రథమంగా తెలంగాణ ప్రభుత్వం ప్రారంభించిన ఈ పథకం ద్వారా వ్యవసాయ రంగంలో సాధిస్తున్న ఫలితాలను గుర్తించి ఒడిశా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. అయితే, ఆ రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకానికి అనుబంధంగా మరో కీలక నిర్ణయం తీసుకుంది. వ్యవసాయంపై ఆధారపడిన భూమిలేని రైతు కుటుంబాలకు అనుబంధ రంగాల్లో ఉపాధి పొందేందుకు ప్రతియేటా రూ.12,500 ఇస్తున్నట్లు ప్రకటించారు.

తెలంగాణ రోల్ మోడల్

ప్రత్యేక రాష్ట్రంగా ఆవిర్భవించిన అనతికాలంలోనే తెలంగాణ ప్రభుత్వం సరికొత్త పథకాలు, సంచలనాత్మక నిర్ణయాలతో దేశానికే రోల్‌మాడల్‌గా నిలిచింది. పరిపాలనా వికేంద్రీకరణ, పౌర సేవల విస్తరణతో పాటు రైతు సంక్షేమ రంగంలో తీసుకున్న ప్రతిష్ఠాత్మక నిర్ణయాలతో సీఎం కేసీఆర్ పరిణతి చెందిన పరిపాలనాధిపతిగా పేరుతెచ్చుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని అన్ని వర్గాల సంక్షేమానికి దోహదపడే విధంగా స్థానిక వనరులను సద్వినియోగం చేసుకునే చర్యల్లో తొంభైశాతం సఫలీకృతులయ్యారు. అందులో భాగంగా ప్రారంభించిన రైతుబంధు పంట పెట్టుబడి, జీవిత బీమా పథకాలు పలు రాష్ట్రాలకు, కేంద్ర ప్రభుత్వానికి ఆదర్శంగా నిలిచాయి. వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాలను మరింతగా బలోపేతం చేయడంతో సంపద సృష్టించవచ్చునన్న సరికొత్త ఆలోచనతో కేసీఆర్ అమలు చేస్తున్న ఈ రెండు పథకాలు ఒడిశా, జార్ఖండ్, పశ్చిమబెంగాల్ రాష్ట్రాల్లో అక్కడి ప్రభుత్వాలు స్వల్ప మార్పులతో కార్యరూపంలోకి తీసుకువచ్చాయి. సంక్షోభంలో చిక్కుకున్న వ్యవసాయ రంగాన్ని గట్టెక్కించేందుకు సీఎం కేసీఆర్ ప్రకటించిన ఎకరాకు రూ.8వేల ''పెట్టుబడి'' పథకం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమవుతోంది. ఇలాంటి పరిస్థితులనే ఎదుర్కొంటున్న పొరుగు రాష్ట్రాలు ఈ చారిత్రాత్మక పథకంపై దృష్టి కేంద్రీకరించాయి.

గుజరాత్‌సహా పలు రాష్ట్రాల ఆసక్తి

సాంకేతికంగా, వ్యాపార పరంగా అభివృద్ధిలో అగ్రస్థానంలో ఉన్న గుజరాత్ రాష్ట్రం సైతం ఇక్కడ ప్రకటించిన పెట్టుబడి పథకంపై అధికార వర్గాలతో వాకబు చేసింది. అలాగే ఉత్తర్‌ప్రదేశ్, కర్నాటక, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన వ్యవసాయశాఖ ఉన్నతాధికారులు ఇప్పటికే పెట్టుబడి పథకం ఉద్దేశాలు, లక్ష్యాలు, ఫలితాలపై సమాచారం తెప్పించుకున్నారు.

తెలంగాణాలో ఉన్న వ్యవసాయ పరిస్థితులు, రైతుల ఆర్థిక స్థితిగతులు, అమలవుతున్న సంక్షేమ పథకాలు, వాటి ద్వారా సాధిస్తున్న ఫలితాలు, రైతుల్లో ఉన్న అభిప్రాయాలపై కేంద్ర ప్రభుత్వం ఆరు నెలల నుంచే దృష్టి సారించింది. ప్రధాని మోడీ ఆదేశాల మేరకు ఇటీవల రాష్ట్రానికి వచ్చిన కేంద్ర వ్యవసాయ మంత్రిత్వశాఖ అదనపు కార్యదర్శి ద్వారా ఇక్కడి పరిస్థితులపై పూర్తిస్థాయి నివేదికను తీసుకువెళ్ళారు.

అదే బాటలో మమతాబెనర్జీ?

మరణించిన రైతు కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున నష్టపరిహారంతో పాటు ఎకరాకు రూ.5వేల చొప్పున ఏడాదిపాటు పంట పెట్టుబడి మద్దతు ఇవ్వాలని పశ్చిమ బంగ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఇటీవలే నిర్ణయం తీసుకున్నారు. అధికారికంగా ప్రకటించకపోయినప్పటికీ కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే రుణమాఫీతో పాటు పంట పెట్టుబడి, రైతు జీవిత బీమా పథకాలను అమలు చేసేందుకు సూచనప్రాయ నిర్ణయం తీసుకుంది. వ్యవసాయమే ప్రధాన జీవనాధారంగా ఉన్న రాష్ట్రాలను ఆలోచింపజేసే విధంగా తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం రాష్ట్ర ప్రజల్లో చెరగని ముద్ర వేసుకుంటోంది.

కేసీఆర్ పథకాలకు జాతీయ ప్రాధాన్యం

ఉమ్మడి రాష్ట్రంలో అనేక ఒడిదుడుకులు, నిరాదరణ, కష్టనష్టాల మధ్య కొనసాగిన వ్యవసాయ రంగాన్ని తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఆవిర్భవించాక గట్టెక్కించేందుకు కేసీఆర్ చేస్తున్న ప్రయత్నాలు ఒక్కొక్కటి జాతీయస్థాయిలో వెలుగులోకి వస్తున్నాయి. తెలంగాణ సాధన ఉద్యమ నేపథ్యంలో ఆయన మదిలో ఉన్న ఆలోచనలు పరిస్థితులకు అనుగుణంగా అమలుకు నోచుకుంటున్నాయి. వ్యవసాయం ఇక గిట్టుబాటు కాదేమోనన్న భయాందోళన పెరుగుతున్న అన్నదాతల్లో భవిష్యత్తుపై భరోసా కల్పిస్తూ తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపట్ల రాజకీయాలకు అతీతంగా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. పెట్టుబడి ముడి సరుకులో ప్రధానమైన ఎరువులు, విత్తనాల కొనుగోలు కోసం ఎకరాకు రూ.4వేల చొప్పున ప్రతియేటా రెండు పంటలకు ఇస్తుండడంతో ఈ రంగంపై ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆధారపడి ఉన్న లక్షలాది కుటుంబాల్లో ఆనందోత్సాహాలు వ్యక్తమవుతున్నాయి. బంగారు తెలంగాణ నిర్మాణంలో పెద్ద సంఖ్యలో ఉన్న రైతు కుటుంబాలదే కీలక భాగస్వామ్యమైనందున వారి ఆర్థిక స్వావలంబన ద్వారానే ముందడుగు వేయాలని కేసీఆర్ ఈ నిర్ణయం తీసుకున్నారు. సుమారు 40 లక్షల రైతు కుటుంబాలకు ఆర్థిక వెసులుబాటు కల్పించే విధంగా రూ.17వేల కోట్లతో పంట రుణాలను మాఫీ చేశారు. అయినప్పటికీ క్షేత్రస్థాయిలో పరిస్థితులు మెరుగుపడినట్లు కనిపించకపోవడంతో పెట్టుబడి వ్యయాన్ని తగ్గించే కార్యాచరణకు శ్రీకారం చుట్టారు. ముడి సరుకుపై ఇప్పటి వరకున్న రాయితీని అమలు చేస్తూనే పంటల సాగులో ప్రధానమైన పెట్టుబడి ఏటా ఎకరాకు రూ.8వేల చొప్పున పారదర్శకంగా పంపిణీ చేస్తూ తెలంగాణ ముఖ్యమంత్రి పొరుగు రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచారు.

ఇక వేటే!

- కాంగ్రెస్‌లో చేరిన ముగ్గురు ఎమ్మెల్సీలపై విచారణ పూర్తి.. ఏ క్షణమైనా నిర్ణయం • నామినేటెడ్ ఎమ్మెల్సీని తక్షణమే నియమించేలా ప్రభుత్వ యోచన
- శేరిసుభాష్ రెడ్డి లేదా కేఆర్ సురేష్‌రెడ్డికి ఛాన్స్



హైదరాబాద్, ఆంధ్రప్రభ: కాంగ్రెస్ పార్టీలో చేరిన ముగ్గురు ఎమ్మెల్సీలపై అనర్హత వేటువేయాలన్న తెలంగాణ రాష్ట్రసమితి అభ్యర్థనపై శనివారం వాదనలు ముగిసిన నేపథ్యంలో ఇక ఏ క్షణమైనా వేటువేస్తూ నిర్ణయం వెలువడవచ్చని రాజకీయవర్గాలు అంచనావేస్తున్నాయి. రెండుపక్షాల వాదనలు విన్న మండలి ఛైర్మన్ స్వామిగౌడ్ తీర్పును రిజర్వ్‌చేయగా, భూపతిరెడ్డి, యాదవరెడ్డితో పాటు రాములు నాయక్‌పై కూడా వేటు ఖాయమని టీఆర్ఎస్ వర్గాలు అంచనావేస్తున్నాయి. మెరుపునిర్ణయం తీసుకుని నామినేటెడ్ ఎమ్మెల్సీ నియామకాన్ని అనూహ్యంగా ఒకేసెలవురోజులో పూర్తిచేసే అవకాశం కూడా ఉందని భావిస్తున్నారు.

ఈ ముగ్గురు ఎమ్మెల్సీలలో రాములునాయక్ గవర్నర్ కోటాలో నామినేట్ చేయబడ్డ యాదవరెడ్డి ఎమ్మెల్యే కోటా నుండి, భూపతిరెడ్డి నిజామాబాద్ స్థానిక సంస్థల నుండి ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. గవర్నర్ కోటాలో ఎన్నికయ్యాను కాబట్టి తాను పార్టీ, విప్ పరిధిలోకి రానని రాములు నాయక్ వాదనలు వినిపించినా కాంగ్రెస్ పార్టీలో చేరిక, తర్వాత చేసిన రాజకీయ ప్రకటనలకు సంబంధించిన క్లిప్పింగ్‌లను జతచేసి టీఆర్ఎస్ తరుపున ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వరరెడ్డి ఫిర్యాదు చేయడం, చట్టప్రకారం న్యాయవాదులు కూడా వాదనలు వినిపించడంతో అనర్హతకు సంబంధించి నిర్ణయాన్ని చట్టప్రకారం తీసుకొవొచ్చని వారు నిర్ణయానికొచ్చినట్లు తెలుస్తోంది. మిగతా ఇద్దరికి సంబందించి కూడా ఆధారాలు సమర్పించగా, నామినేటెడ్ ఎమ్మెల్సీకి సంబంధించి ఖాళీలు సూచిస్తూ గెజిట్ విడుదల కాగానే, గవర్నర్‌కు మరో అభ్యర్థిని ప్రభుత్వం తరుపున ప్రతిపాదించవచ్చని నిపుణులు చెబుతున్నారు. ఈ అవకాశం వినియోగించుకుని వేటు, నియామకం ఒకేరోజు జరిగేలా వ్యూహం రూపొందించినట్లు సమాచారం.

అది ఆదివారం లేదా సంక్రాంతిరోజు జరిగే అవకాశం ఉందని, ఈదఫా మండలిసమావేశాల్లో వారు పాల్గొనే అవకాశం లేకుండా చేయాలన్న నిర్ణయానికి టీఆర్ఎస్ పెద్దలు వచ్చినట్లు చెబుతున్నారు. ఈనేపథ్యంలో ముగ్గురిపై వేటు, అదే వేగంతో నియామకాలు కూడా జరగవచ్చని చెబుతున్నారు. నామినేటెడ్ ఎమ్మెల్సీ మినహా మరో రెండు ఎమ్మెల్సీ ఖాళీల భర్తీపై ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని, నామినేటెడ్ ఎమ్మెల్సీపై మాత్రం భర్తీ తర్వాత ఎన్నికల సంఘానికి సమాచారం వెళ్తుందని రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ నిబంధనలు వినియోగించుకుని ప్రభుత్వం తాజా పరిణామాలపై నిర్ణయం తీసుకుంటుందని విశ్లేషణలు సాగుతున్నాయి. తీర్పు ను రిజర్వ్ చేసిన మండలి ఛైర్మన్ ఆదివారం నిర్ణయం ప్రకటిస్తారా లేదా అన్నదానిపై ఆసక్తి నెలకొంది. శనివారం విచారణకు భూపతిరెడ్డి, యాదవరెడ్డి తరుపు న్యాయవాదులు హాజరయ్యారు.

సుభాష్‌రెడ్డి లేదా సురేష్‌రెడ్డికి ఛాన్స్

నామినేటెడ్ ఎమ్మెల్సీ ఖాళీ అయితే వెంటనే భర్తీచేసేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ ఇప్పటికే వ్యూహం రూపొందించినట్లు తెలుస్తోంది. ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన సీఎం పొలిటికల్ సెక్రటరీ శేరిసుభాష్‌రెడ్డి లేదా నిజామాబాద్ జిల్లాకు చెందిన మాజీ స్పీకర్ కేఆర్ సురేష్‌రెడ్డికి ఈ అవకాశం లభించవచ్చని పార్టీవర్గాలలో ప్రచారం జరుగుతోంది.

చట్టప్రకారం చర్యలు: పల్లా రాజేశ్వరరెడ్డి

కాంగ్రెస్‌లో చేరిన నలుగురు ఎమ్మెల్సీలపై అనర్హత వేటువేయాలని నెల రోజుల క్రితం కౌన్సిల్ ఛైర్మన్‌కు ఫిర్యాదు చేశామని, నెలరోజులుగా దీనిపై విచారణ జరుగుతోందని మండలి విప్ పల్లా రాజేశ్వరరెడ్డి తెలిపారు. శనివారం మండలి కార్యాలయం వద్ద ఎమ్మెల్సీ బోడకుంటి వెంకటేశ్వర్లుతో కలిసి ఆయన మీడియా తో మాట్లాడుతూ ఇప్పటికే నోటీసుకు స్పందించి న వారి అడ్వకేట్‌లు వాదనలు వినిపించారన్నారు. తమ అడ్వకేట్ కూడా వాదనలు వినిపించారని, విచారణ పూర్తయినందున తీర్పు రిజర్వ్ చేసినట్లు మండలి ఛైర్మన్ తెలిపారన్నారు. కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు కాబట్టి వారు పదవులకు అనర్హులని, చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరామన్నారు.

45 ఏళ్లలో 20 దేశాలు...

యువతరానికి స్ఫూర్తిగా నిలిచిన పేద దంపతులు

కొచ్చి: విజయన్.. మోహన.. కేరళకు చెందిన సాధారణ పేద దంపతులు. టీ దుకాణం నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. ప్రపంచాన్ని చుట్టేయాలన్నది వీరి సంకల్పం. ఇందుకోసం పైసా పైసా కూడబెట్టారు. 45 ఏళ్ల దాంపత్య జీవితంలో 20 దేశాలు పర్యటించారు. ప్రతియేటా పెళ్లిరోజును ఓ కొత్త దేశంలో జరుపుకుంటూ వచ్చారు. మరికొన్ని దేశాలు తిరిగిరావాలన్నది ఆశయం. ఇప్పటికీ టీ అమ్ముతూనే జీవనం సాగిస్తున్నారు. వీరి గురించి తెలుసుకున్న మహింద్ర గ్రూప్ అధినేత ఆనంద్ మహింద్ర ప్రశంసలు కురిపించాడు. వీరి అన్యోన్యానికి, సంకల్పానికి ముగ్ధుడయ్యారు. సంపన్నుల జాబితా వెల్లడించే ఫోర్బ్ పత్రికలో వీరికి చోటు లేకపోవచ్చు. కానీ నా దృష్టిలో వీరే ప్రపంచ కుబేరులు. వారి ఆరోగ్యం.. ఆలోచనా విధానం.. జీవన శైలిని గమనిస్తే దేశంలో వారిని మించిన సంపన్నులు ఎవరుంటారు? అంటూ ఆనంద్ మహింద్ర ట్వీట్ చేశారు. ఈసారి కేరళ వెళ్లినప్పుడు తప్పకుండా వారిని కలుస్తాను. వారి ఆతిథ్యం స్వీకరిస్తా అని ట్వీట్ చేశారు. వృద్ధ దంపతుల ఫొటోలను ట్విట్టర్‌లో పోస్టు చేయడం తో సామాజిక మాధ్యంలో వైరల్ అయింది. చాలా మంది స్పందించారు. ఈసారి వారి వివాహ వసంతానికి ఫలానా దేశం పంపిస్తాం. అందుకయ్యే ఖర్చంతా తామే చెల్లిస్తామంటూ నెటిజన్లు ముందుకొస్తున్నారు.



ఆమె ఆహారం టీ మాత్రమే..!

30 ఏళ్లుగా ఇదే జీవనశైలి .. చత్తీస్‌గఢ్ చాయ్ వాలీ చాచీ

కొరియా: చలచల్లని శీతాకాలంలో.. పొగలు కక్కుతున్న వేడివేడి చాయ్ తాగడం సర్వసాధారణం. కానీ కేవలం చాయ్‌తోనే జీవితం వెళ్లదీయమంటే.. ఎవరికీ సాధ్యంకాదు. చత్తీస్‌గఢ్‌కి చెందిన ఓ మహిళ గత 33 ఏళ్లుగా చాయ్ మాత్రమే తాగి బతుకుతోంది. అందరిలాగే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంది. కొరియా జిల్లా బరాదియా గ్రామంలో పిల్లి దేవి అనే వృద్ధురాలు తన 11వ ఏట ఆహారానికిస్వస్తి చెప్పింది. అప్పటి నుంచి కేవలం చాయ్ తాగి జీవిస్తూ వస్తోంది.ఇప్పుడామెను గ్రామస్థులంతా ముద్దుగా చాయ్ వాలీ చాచీగా పిలుస్తున్నారు. ఆరవ తరగతిలో ఉన్నప్పుడు జనక్‌పూర్‌లో పాఠశాల స్థాయి టోర్నీలో పాల్గొనేందుకు వెళ్లింది. అప్పటి నుంచి అన్నపానీయాలు మానేసిందని ఆమె తండ్రి హతీరామ్ వెల్లడించారు. ప్రత్యామ్నాయంగా పాలు, టీతో బ్రెడ్, బిస్కెట్ తీసుకునేది... రాన్రాను బ్లాక్ టీ (డికాషన్)కే పరిమితం అయింది. అది కూడా సూర్యాస్తమయం తర్వాత ఒకసారేనని వివరించారు. ఆమె వాలకంపై ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు వైద్యులకు చూపించారు. ఆమెను పరీక్షించిన వైద్యులు నివ్వెరపోయారు. ఆహారం లేకుండా ఇంత ఆరోగ్యంగా ఎలా ఉండగలిగిందని నోరెళ్లబెట్టారు. చివరకు ఆమెకు ఎలాంటి వ్యాధి లేదని డాక్టర్లు తేల్చారు.



బాబు చాణక్యం!

- ఒక నిర్ణయం.. రెండు ప్రయోజనాలు
- నిరుపేదలకు భరోసా రెట్టింపు
- విపక్షాల వ్యూహానికి దీటైన జవాబు
- 50 శాతం అంగవైకల్యం ఉంటే రూ.10 వేలిస్తే మరింత మేలు
- నగదు బదిలీ, ఉచిత గ్యాస్‌పై కూడా దృష్టిపెట్టాలి
- పథకాలు నేరుగా చేరితేనే సం'క్షేమం'
- సామాజిక నిపుణుల సూచనలు



అమరావతి, ఆంధ్రప్రభ ప్రత్యేక ప్రతినిధి : పింఛన్ల పెంపు మొత్తంతో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు తన సుదీర్ఘ రాజకీయానుభవాన్ని మరోసారి ప్రదర్శించారు. ఈ చర్య ఆర్థిక, సామాజిక నిపుణుల అభినందనలు అందుకుంటోంది. రాష్ట్రానికి సుమారు 14 ఏళ్ళు ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఉన్నారు. మూడు దశాబ్దాల పాటు ఆయన రాష్ట్ర రాజకీయాల్లో చక్రం తిప్పారు. నాలుగు దశాబ్దాలుగా రాజకీయ జీవితంలో ఉన్నారు. అలాంటి వ్యక్తి తాజాగా తీసుకున్న నిర్ణయం విపక్షాల్ని విభ్రాంతికి గురిచేసింది. తామధి కారంలోకొస్తే వృద్ధులకు ఇస్తున్న పింఛన్‌ను వెయ్యి నుంచి 2 వేలకు, వికలాంగుల పింఛన్‌లను 1500 నుంచి 5 వేలకు పెంచుతామంటూ జనసేన, వైకాపాలు ఇప్పటికే పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్నారు. రానున్న ఎన్నికల్లో ఆ పార్టీలు ఈ అంశాన్ని తమ మేనిఫెస్టోలో పెట్టేందుకు కూడా సిద్ధమౌతున్నాయి. వీటిని చూపి ఓటర్లను ఆకర్షించేందుకు వ్యూహాలు సిద్ధం చేస్తున్నాయి. ఇలాంటి సమయంలో ఎవరో అధికారంలోకొచ్చిన తర్వాత ఇవ్వాల్సిన పనిలేకుండా ఇప్పుడు అధికారంలో ఉన్న చంద్రబాబు వెనువెంటనే శ్రీకారం చుట్టేశారు. ప్రకటించిందే తడవుగా జనవరి నుంచే చెల్లింపులు వర్తిస్తాయని హామీనిచ్చారు. ఫిబ్రవరి పింఛన్‌తో జనవరి బకాయిని కూడా కలిపి చెల్లిస్తామని స్పష్టం చేసారు. విపక్షాల హామీని మించి చంద్రబాబు పింఛన్ల మొత్తాన్ని పెంచేశారు. వృద్ధులకు వెయ్యి నుంచి రెండు వేలు చేశారు.

వికలాంగుల్లో రెండు చేతులు పని చేయనివారికి నెలవారి రూ.10 వేల పింఛన్ ప్రకటించారు. ఈ చర్యలతో విపక్షాలు విస్మయానికి గురైతే సామాజిక నిపుణులు మాత్రం హర్షం వ్యక్తంచేస్తున్నారు. పెరిగిన సంపద క్రిందిస్థాయి వర్గాలకు నేరుగా చేరాల్సిన అవసరముంది. గతంతో పోలిస్తే ప్రభుత్వ ప్రాధాన్యతలు మారాయి. మౌలిక సదుపాయాలు, నిర్మాణ రంగం పూర్తిగా ప్రైవేటు పరిధిలోకెళ్ళింది. ఈ భారం ప్రభుత్వానికి తప్పింది. ఏటేటా స్థూల జాతీయవృద్ధి జరుగుతోంది. అదే స్థాయిలో పేదరిక నిర్మూలన పథ కాలకు మరిం తగా కేటాయిం పులు పెంచాల్సిన ఆవశ్యకత ఉందని ఇదే సందర్భంలో నిపుణులు సూచిస్తున్నారు. చంద్రబాబు పెంచిన మొత్తం హర్షణీయమే అయినా వికలాం గుల్లో కేవలం చేతుల్లేని వారికి మాత్రమే పదివేలు ఇవ్వడం, ఇతర వికలాంగు లకు 5 వేలు మాత్రమే ప్రకటించ డాన్ని సరిదిద్దుకోవాలని వీరు సూచిస్తున్నారు. చేతుల్లేని వ్యక్తులు ఉపాధి పొందలేరు. అలాగే కాళ్ళు, కళ్లు, ఇతర అవయవాలు సక్రమంగా పని చేయని వారు కూడా ఉపాధికి దూరంగా ఉన్నారు. 50శాతం అంగవైకల్యం దాటిన ప్రతి ఒక్కరికి నెలవారీ 10వేలు పింఛన్ చెల్లించడం ద్వారా వారికి సామాజిక భద్రత ఏర్పడుతుందని, సమాజంలో వారికి గౌరవ ప్రదమైన జీవితం లభిస్తుందని వీరు సూచిస్తున్నారు. ఈ దిశగా కూడా చంద్రబాబు దృష్టిపెట్టాలని కోరుతున్నారు.

జనసేన అధికారంలొకొస్తే ఇంటింటికి రేషన్‌కార్డులపై ఇప్పుడిస్తున్న బియ్యం, పప్పులు, ఉప్పులకు బదులుగా నేరుగా కుటుంబ ఖాతాలో రూ.3500 వరకు జమ చేస్తామని హామీనిచ్చారు. మహిళలకు ఉచితంగా వంటగ్యాస్ సిలెండర్లు పంపిణీ చేస్తామన్నారు. ఈ రెండు అంశాల్ని జనసేన తన విజన్ డాక్యుమెంట్‌లో కూడా పొందుపర్చింది. వీటికి ఆ పార్టీ విశేష ప్రచారం చేస్తోంది. సాధారణ ప్రజలు, ముఖ్యంగా గృహిణులు ఈ అంశాలకు ఆకర్షితులౌతున్నారు. వీటిపై కూడా చంద్రబాబు దృష్టిపెట్టాల్సిన అవసరముందని నిపుణులు సూచిస్తున్నారు. ప్రస్తుతం ఎన్ని ఇబ్బందులున్నా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ ముందంజలో ఉంది. విపక్షాలు విమర్శిస్తున్నట్లుగా చౌకదుకాణాల ద్వారా పంపిణీ చేస్తున్న బియ్యం, ఇతర వినిమయ వస్తువుల నాణ్యత సరిగా ఉండడం లేదు. వీటిని వినియోగదార్లు ఉపయోగించడం లేదు. పైగా ఇవన్నీ బ్లాక్‌మార్కెట్‌కు చేరుతున్నాయి. ప్రభుత్వ సబ్సిడీ పక్కదారి పడుతోంది. వీటిని దృష్టిలో పెట్టుకుని రేషన్ కార్డులో కుటుంబ సభ్యుల సంఖ్య కనుగుణంగా మనిషికి వెయ్యి రూపాయల చొప్పున నేరుగా బ్యాంకులో జమ చేయాలని ఆర్థిక నిపుణులు చంద్రబాబుకు సూచిస్తున్నారు. దీన్ని కూడా జనవరి నుంచే ప్రారంభించాలి. తద్వారా ప్రభుత్వ సబ్సిడీ సొమ్ము దుర్వినియోగం అరికట్టే వీలుంటుంది. అక్రమ బియ్యం వ్యాపారులకు చెక్ పడుతుంది. ప్రభుత్వ సంక్షేమ నిధులు నేరుగా లబ్ధిదార్లకు చేరతాయి. ప్రజలు తమ అవసరాలకు అనుగుణంగా ఈ మొత్తాన్ని వ్యయం చేసుకునే వీలుంటుందని సూచిస్తున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర సహకారం లేకుండానే అమరావతి, పోలవరం, స్మార్ట్‌సిటీలు వంటి భారీ ప్రాజెక్టుల్ని సొంతంగా నిర్మిస్తోంది. వీటికి ఏటా వేల కోట్లు వ్యయం చేస్తోంది. నేరుగా ప్రతి కుటుంబానికి గరిష్టంగా నాలుగు వేల వరకు జమ చేసే పథకం ప్రభుత్వానికి పెద్దగా ఆర్థికభారం కాబోదు. కొద్దిగా భారమనిపిస్తే ఈ భారీ ప్రాజెక్టులకు కేటాయింపులు కొద్దిగా తగ్గుతాయి. నిర్మాణం కాస్త జాప్యమౌతుంది. అంతకుమించిన నష్టంలేదు. కానీ ఇలాంటి పథకాలతోనే విపక్షాలు ప్రజల్ని ఆకర్షిస్తున్నాయి. వీటినిప్పుడే చంద్రబాబు అమల్లోకి తెస్తే సుదీర్ఘకాలం ఆయన అధికారం కొనసాగించగలిగే వీలుంటుందని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.



భేష్.. భేష్

- తెలంగాణ ప్రజాపంపిణీ వ్యవస్థ దేశానికే ఆదర్శం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా పంపిణీ వ్యవస్థ దేశానికే ఆదర్శమని కేంద్ర ఆహార, పౌర సరఫరాల మంత్రిత్వశాఖ కార్యదర్శి రవికాంత్ ప్రశంసించారు. అన్ని పంటలకు కనీస మద్దతు ధరలు అమలు చేసేలా చర్యలు తీసుకుంటూనే, చౌక ధరల దుకాణాల ద్వారా పేద కుటుంబాలకు నిత్యావసర వస్తువులు అందించడంలో సీఎం కేసీఆర్ అనుసరిస్తున్న విధానాలు ఎంతో మేలైనవని కొనియాడారు. శనివారం హైదరాబాద్ పర్యటనలో భాగంగా ధాన్యం సేకరణ విధానంపై రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో సమావేశమయ్యారు. ఖమ్మం, కొత్తగూడెం, సిద్ధిపేట, మంచిర్యాల, భూపాలపల్లి తదితర జిల్లాల్లోని రైతులతో వీడియో కాల్ ద్వారా మాట్లాడి వారి అనుభవాలను తెలుసుకున్నారు. ఐరిస్ టెక్నాలజీ ద్వారా రేషన్ సరుకులు తీసుకుంటున్న విధానాన్ని ప్రత్యక్షంగా పరిశీలిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి ఐదు కిలోమీటర్లకు ఒక కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసి రైతులకు నష్టాన్ని దూరం చేయడం ఎంతో గొప్ప విషయమన్నారు. పంట పెట్టుబడి ప్రోత్సాహం, ధాన్య దిగుబడికి చర్యలు, కనీస మద్ధతు ధరలు, కొనుగోలు కేంద్రాలు, ఆన్‌లైన్‌లో చెల్లింపులు ఇలా అనేక అంశాల్లో వ్యవసాయ రంగానికీ, రైతు కుటుంబాలకు తెలంగాణ ప్రభుత్వం ఎంతో మేలు చేస్తున్నదని కొనియాడారు. ఇవన్నీ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా మారుతున్నాయని రవికాంత్ స్పష్టం చేశారు. ఆధునీకరించిన పౌర సరఫరాల వ్యవస్థను గురించి కమిషనర్ అకున్ సభర్వాల్ ఆయనకు వివరించారు.

త్వరలో ఉచితంగా వినికిడి యంత్రాలు

- ఫిబ్రవరి మొదటి వారంలో వైద్యపరీక్షలు..

హైదరాబాద్,ఆంధ్రప్రభ: వినికిడి సమస్యల తో బాధపడుతున్న వారికి తెలంగాణ ప్రభుత్వం శుభవార్త తెలిపింది. త్వరలోనే ప్రత్యేక క్యాంపుల ద్వారా వారందరినీ గుర్తించి శస్త్ర చికిత్సలు చేయడంతో పాటు వినికిడి యంత్రాలను ఉచితం గానే ఇవ్వనుంది. ఫిబ్రవరి మొదటి వారంలో రాష్ట్ర వ్యాప్తంగా చెవి, ముక్కు, గొంతు పరీక్షలు నిర్వహిం చనున్నారు. కంటి వెలుగు పథకంలో భాగంగా ఏ విధంగా కళ్ల జోడులను పంపిణి చేశారో అదే తరహాలో వినికిడి యంత్రాలను కూడా పంపిణీ చేయాల్సిందిగా సీఎం కేసీఆర్ అధికారులను ఆదేశించారు.

కేంద్రమా... మూస పద్ధతి మానుకో



(మొదటిపేజీ తరువాయి)

పర్యటించే క్రమంలో ఫైనాన్స్ కమిషన్ సభ్యులు ముందే ఒక అభిప్రాయాన్ని కలిగి వుండడం సరికాదు. రాష్ట్రాన్ని పర్యటించి రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి వారి అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోకుండా క్షేత్ర స్థాయి పర్యటనకు ముందే ఒక అవగాహనతో టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్ చేయడం సరికాదు. ఒక్కో రాష్ట్రానికి ఒక్కో సాంస్కృతిక, ఆర్థిక జీవిక వుంటుంది. ఆయా రాష్ట్రాల అవసరాల రీత్యా డివల్యూషన్ అంశం రాష్ట్రాల హక్కుగా పరిగణించి.. కేవలం విధానాల రూపకల్పనకు మాత్రమే ఫైనాన్స్ కమిషన్ పరిమితమైతే మంచిది" అన్నారు. చర్చించిన ఈ అంశాలన్నీ పరిశీలించి, తెలంగాణ రాష్ట్ర ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని నివేదికను రూపొం దించాలని ఆర్థిక శాఖ అధికారులకు సీఎం కేసీఆర్ సూచించారు.

బడ్జెట్‌పై ముందస్తు కసరత్తు..

బడ్జెట్ రూపకల్పనకు సంబంధించి ఏర్పాట్లు, అందుకు అవసరమైన చర్యల మీద ముఖ్యమంత్రి కేసీఆర్ సమీక్షించారు. రాష్ట్ర ప్రజల జీవికను నిర్వచించుకున్న అనంతరమే.. ప్రజల అవసరాలను అన్నిరంగాల్లో పరిశీలించిన మీదటనే తుది బడ్జెట్‌కు రూపకల్పన చేయాలని సీఎం స్పష్టం చేశారు. కేవలం ఒక్క ఏడాదికా లేక ఐదేండ్ల పూర్తి కాలానికా అనే అవగాహనతో మనం రూపొందిస్తున్న బడ్జెట్ విధి విధానాలు ఉండాలన్నారు. తెలంగాణ నేడు ఎక్కడ వున్నది.. రానున్న ఐదేండ్ల తర్వాత ఎక్కడ ఉండబోతున్నది అనే అవగాహనతో, అంచనాతో బడ్జెట్‌ను రూపొందించాలన్నారు.

ప్రభుత్వం కేవలం చట్టాలను అమలు పరచడమే కాకుండా రాష్ట్రాభివృద్ధిని సులభతరం చేస్తూ ఒక ఉత్ప్రేరకంగా, ఉద్దీపనకారిగా తన పాత్రను నిర్వహిస్తుందని సీఎం కేసీఆర్ అన్నారు. బడ్జెట్ రూపకల్పనకు ముందు ఒకసమగ్ర విధా నాన్ని రూపొందించాలన్నారు. ఒక్కొక్క అంశాన్ని తీసుకుని పనిని విభజించి సమస్యను ఛేదించే వ్యవస్థలను ఏర్పాటు చేయాలన్నారు.

భక్తి, పర్యాటక కేంద్రంగా కాళేశ్వరం

కాళేశ్వరం ప్రాజెక్టును మార్కెట్ అవసరాలకు అనుగుణంగా ఆకర్షనీయ పర్యాటక కేంద్రంగా, భక్తి కేంద్రంగా తీర్చి దిద్దేందుకు ఎటువంటి విధానాలను అనుసరించాలో బడ్జెట్ రూపొందించే క్రమంలో సూత్రప్రాయంగా తగు సూచనలు చేస్తే బాగుంటుందని సీఎం కేసీఆర్ అన్నారు. అక్కడి త్రివేణి సంగమం అద్భుతమైన పర్యాటక కేంద్రంగా మారబోతోం దన్నారు. పర్యాటక ప్రయోజనాల మీద బడ్జెట్ దృష్టి కేంద్రీకరించాలన్నారు.యూనివర్సిటీ పరిశోధనలతో పాటుగా వ్యవసాయాన్ని ఆధునీకరించే అంశాలపై అధికారులు విధి విధానాలను రూపొందించాలన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ఏ విధంగా ముందుకు తీసుకుపోవాలో ఆ అంశాలను పరిగణ లోకి తీసుకోవా లన్నారు. వైద్య, విద్యా రంగాలను ప్రస్తావిం చిన ముఖ్య మంత్రి.. ప్రైవేటు యూనివర్సిటీల వల్ల కలిగే ప్రయోజనాలను పరిశీలించాలన్నారు.

ఇతర రాష్ట్రాలకు వలస పోకుండా రాష్ట్రంలో విద్యా వ్యవస్థను ఆకర్షణీయంగా రూ పొందించే దిశగా, అంతర్జాతీయ విద్యార్థులను ఆకర్షించే దిశ గా విధి విధానాలను రూపొందించాలన్నారు. ఆరోగ్య తెలం గాణ దిశగా మానవీయ కోణంలో బడ్జెట్ విధానాలను రూపొం దించాలని సీఎం అధికారులకు పలు సూచనలు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా శుద్ధిచేసిన పరిశుభ్రమైన తాగునీరు లభిస్తున్నదని, అది రాష్ట్రాభివృద్ధి సూచికగా సీఎం కేసీఆర్ పేర్కొన్నారు. పారి శ్రామిక అవసరాలను, మౌలిక సదు పాయాల అవస రాలను దృష్టిలో ఉంచుకుని బడ్జెట్ అంచనాలను రూపొందించాలన్నారు.

తెలంగాణ రాష్ట్ర ఆర్థికాభివృద్ధిని మరింత బలోపేతం చేసే దిశగా బడ్జెట్ వుండాలన్నారు. తెలంగాణ ఒక రాష్ట్రంగా తన అభివృద్ధిని పెంచుకోవడానికి ప్రగతి మార్గంలో పయనించడానికి, అవలంబించాల్సిన మార్గదర్శకాలేమిటి? తెలంగాణ రాష్ట్రంగా మన ఆర్థిక ప్రగతికి దోహద పడుతున్న అంశాలేమిటి? అనే అంశాలను పరిగణలోకి తీసుకుని బడ్జెట్ ను రూపొందించాలన్నారు.

"ముఖ్యమంత్రిగా నన్ను ప్రజలు ఎన్నుకున్నప్పుడు నేను వారికి ఎంత గొప్పగా సేవలందించగలనో ఆలోచన చేయాలె. ఆదరాబాదరాగా కాకుండా ముందుగా ఒక సమగ్ర అవగాహనకు వచ్చిన తర్వాతనే బడ్జెట్ ను రూపొందిం చడానికి పూనుకోవాలి. అటువంటి కీలక బడ్జెట్ ను రూపొందిం చడానికి పూనుకున్న వ్యక్తులు, అధికారులు ఆ దిశగా తమ దృక్పథాన్ని ఏర్పరుచుకోవాలి. మనకున్న బలాలేమిటి, బలహీనతలేమిటి, మంచి చెడులను బేరీజు వేసుకున్న అనంతరమే పని ప్రారంభించాలి. రాబోయే ఐదేండ్ల కాలంలో రాష్ట్రానికి ఎంత డబ్బు వస్తున్నది, ఎంత డబ్బు ఖర్చు కాబోతున్నదో ఒకసమగ్ర అంచనా వుండాలి." అని ముఖ్య మంత్రి అధికారులను ఆదేశించారు.

రాష్ట్రంలో నడుస్తున్న సాగునీటి ప్రాజెక్టులతో సహా ఇతర శాఖలను సోదాహరణలుగా తీసుకున్న సీఎం కేసీఆర్, ఆ దిశగా బడ్జెట్ ప్రపోజల్స్‌ను రూపొందించాలని సూచించారు. సాగునీటి ప్రాజెక్టుల కోసం బడ్జెట్ ను రూపొందించే క్రమంలో ముందుగా గత నాలుగు సంవత్సరాల కాలంలో ఎంత ఖర్చు చేసింది, రాబోయే ఐదేండ్ల కాలంలో ఎంత ఖర్చు చేయ నున్నది.. అనే అంశాన్ని పరిగణలోకి తీసుకోవాలని చెప్పారు. నడుస్తున్న ఆర్థిక సంవత్సరం సహా రానున్న ఐదేండ్లకాలానికి మొత్తం కలిపి ఇరిగేషన్ శాఖ కోసం రెండు లక్షల కోట్ల రూపాయలు ఖర్చుకానున్నట్టు సీఎం తెలిపారు. కేంద్రం నుంచి అన్ని సాగునీటి ప్రాజెక్టులకు అన్నిరకాల అనుమతుల ను సాధించడం గొప్పకార్యమని, అది బడ్జెట్‌లో ప్రతిఫలించాలన్నారు.

"హైదరాబాద్ గ్లోబల్ సిటీ. దేశంలోని ఏడు పెద్ద నగరాల్లో హైదరాబాద్ ఒకటి. కనీసం 100 పార్కుల అవసరం వున్నది. హైదరాబాద్ ను రక్షించడానికి రేపటి భవిష్యత్తు తరాలను దృష్టిలో ఉంచుకుని మాస్టర్ ప్లాన్ తయారు చేయాలి. అందులో ఒక్క పేరాను మార్చాలంటే

హైదరాబాద్ సిటీ గురించి..

కేబినెట్ నిర్ణయం తీసుకునేంత స్థిరంగా నియమావళి రూపొందిం చాలి. రాబోయే ఐదేండ్ల కాలంలో హైదరాబాద్‌ను అద్భుతమైన గ్లోబల్ సిటీగా రూపొందించే దిశగా ఎంతఖర్చు చేయాల్సి వున్నదో బడ్జెట్ ప్రతిపాదనలు ప్రతిఫలించాలి. తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు హైదరాబాద్ వెన్నెముక లాంటిది" అని సీఎం తెలిపారు.

గొర్రెల పంపిణీకి సంబంధించి ప్రస్తావించిన సీఎం కేసీఆర్.. అది ఎంతగొప్పగా ప్రజాదరణ పొందిందో తెలిపారు. దాంతో పాటు చేపల పెంపకం, చేనేత రంగం, రాష్ట్రంలో పురోగతిని సాధిస్తున్నట్టుగా చెప్పారు. అంతర్జాతీయ స్థాయిలో రాష్ట్ర చేనేత ఉత్పత్తులకు ఆదరణ లభిస్తున్న నేపథ్యంలో చేనేత కార్మికుల కళను పూర్తిస్థాయిలో వినియో గించుకోవాలన్నారు. దాంతో పాటు విద్యుత్ సగటు వినియో గంలో దేశంలోనే తెలంగాణ నెంబర్ వన్‌గా నిలిచిందని పేర్కొన్నారు. బడ్జెట్ ప్రతిపాదనల రూపకల్పనకు ముందు ఈ అంశాలన్నిటినీ పరిగణలోకి తీసుకోవాలన్నారు.

మంత్రులకు, సెక్రటరీలకు శిక్షణపై..

కేబినెట్ రూపొందిన వెంటనే మొత్తం మంత్రులకు ఆయా శాఖల కార్యదర్శులకు వారి విధులు, బాధ్యతల మీద అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజీ ఆధ్వర్యంలో సునిశిత శిక్షణా కార్యక్రమాలు చేపట్టాలని సీఎం కేసీఆర్ సూచించారు. రాష్ట్రంతో సహా దేశ ఆర్థిక వ్యవహారాలను, సచివాలయ విధి విధానాలు, బడ్జెట్ రూపకల్పన నిబంధనలు, ప్రాధాన్య తలకు అనుగుణంగా ఆయా మంత్రిత్వ శాఖల్లో చేపట్టే కార్యక్ర మాలు అన్నీ సంబంధిత మంత్రులకు తెలిసేలా శిక్షణ వుండాలన్నారు.ఈ సమావేశంలో ప్రధాన సలహాదారు రాజీవ్ శర్మ, సీఎస్ ఎస్ కే జోషి, ఆర్థికశాఖ సలహాదారు జీ ఆర్ రెడ్డి, సీఎంవో అధికారులు నర్సింగ్ రావు, స్మితా సబర్వాల్, సందీప్ సుల్తాని యా, మానిక్ రాజ్, స్పెషల్ సీఎస్ రాజేశ్వర్ తివారి, ఫైనాన్స్ సెక్రటరీ రామకృష్ణారావు, పంచాయతీ రాజ్ సెక్రటరీ వికాస్ రాజ్, కమిషనర్ నీతూ ప్రసాద్, ఐటి సెక్రటరీ జీటీవీ రావు పాల్గొన్నారు.

క్రాప్ కాలనీలతో రెట్టింపు ఉత్పాదకత

- ఉద్యాన పంటల్లో సూక్ష్మ సేద్యంతో ఎంతో మేలు
- వ్యవసాయశాఖ కార్యదర్శి పార్థసారథి



హైదరాబాద్, ఆంధ్రప్రభ : వచ్చే ఖరీఫ్ నుంచి ప్రారంభించాలని తలపెట్టిన పంట కాలనీల ద్వారా పంటల ఉత్పాదకత దాదాపు రెండింతలు పెరుగుతుందని వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి సి.పార్థసారధి తెలిపారు. రైతులు అధునిక సాగు, విధానాలు నూతన పద్ధతులను అవలంబించేలా అధికార యంత్రాంగం వారిలో చైతన్యం తీసుకురావాలని సూచించారు. శనివారం జీడిమెట్లలోని సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వ్యవసాయ పంటల తర్వాత అత్యంత ప్రధానమైన ఉద్యాన పంటల్లో క్రాప్ కాలనీలు మెరుగైన ఫలితాలు ఇస్తాయన్నారు. అదే సమయంలో సూక్ష్మసేద్యం ద్వారా తక్కువ నీటితో, తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు సాధించవచ్చునని స్పష్టం చేశాను. అనేక పరిశోధనలు, ప్రత్యక్ష సాగు పద్ధతులు నిరూపించాయని తెలిపారు.

యూపీలో ఐసిస్ ఉగ్రవాది అరెస్ట్

న్యూఢిల్లీ: ఐసిస్ ఉగ్రసంస్థతో సంబంధం ఉన్న వ్యక్తిని ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్‌లో అరెస్టు చేశామని జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) అధికారులు శనివారం తెలిపారు. దేశరాజధాని ఢిల్లీతోపాటు ఉత్తర భారతంలోని పలు ప్రాంతాల్లో ఆత్మాహుతి దాడులు, వరుస బాంబు పేలుళ్లు, ప్రభుత్వంసంస్థలు, రాజకీయ వేత్తలను లక్ష్యంగా చేసుకుని దాడి చేసేందుకు ప్రణాళిక వేసినట్టు ఆరోపణలపై విచారణ చేస్తున్నామన్నారు. తాజా అరెస్టు అనంతరం ఎన్ఐఏ అధికారులు శనివారం మీరట్, హాపూర్, ఘజియాబాద్ ఈ మూడు ప్రాంతాల్లో సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఐఏ అధికార ప్రతినిధి మాట్లాడుతూ ముహమ్మద్ అబ్సార్ (24) అనే వ్యక్తిని ఎన్ఐఏ అధికారులు శుక్రవారం రాత్రి హాపూర్‌లో అదుపులోకి తీసుకున్నారని తెలిపారు.


వర్మపై చర్యలెందుకు తీసుకోలేదు?


- బీజేపీని ప్రశ్నించిన శివసేన

ముంబై: సీబీఐ డైరెక్టర్‌గా అలోక్ వర్మ తొలగింపు, అనంతర పరిణామాలపై స్పందించిన శివసేన పార్టీ ప్రధాని నరేంద్రమోదీ, కేంద్రప్రభుత్వంపై ప్రశ్నల బాణాలు ఎక్కుపెట్టింది. ఒత్తిడి మేరకు సెలవుపై వెళ్లిన అలోక్ వర్మను సుప్రీంకోర్టు పునఃనియమించిన తర్వాత సీఐబీ డైరెక్టర్‌గా తొలగించి అగ్నిమాపక, పౌర రక్షణ, హోంగార్డు డైరెక్టర్ జనరల్‌గా నియమించడాన్ని ఆ పార్టీ తప్పుబట్టింది. రాఫెల్ ఒప్పందంలో అవినీతి ఆరోపణల నేపథ్యంలో ప్రధాని మోదీ తనను తాను రక్షించుకునేందుకే ఈ నిర్ణయం తీసుకున్నారని పార్టీ పత్రిక సామ్నాలో ఓ ఎడిటోరియల్‌ను ప్రచురించింది. రాఫెల్ ఒప్పందంలో అవినీతి ఆరోపణలు రావడంతో తనను రక్షించుకునేందుకు ప్రధాని మోదీ అన్నీ వేదికలను ఉపయోగించుకుంటున్నారని, అలాంటప్పుడు అలోక్ వర్మకు ఎందుకు అవకాశం ఇవ్వలేదని శివసేన ప్రశ్నించింది. అలోక్ వర్మ ఉంటే రహస్యాలు బయట పడతాయని భావించడంతోనే ఆయనను తొలగించారా అని విమర్శలు గుప్పించింది. ప్రధాని నరేంద్ర మోదీ మద్ధతుతో రాకేష్ ఆస్థానా సీబీఐని ప్రభుత్వానికి బానిసగా మార్చాల నుకున్నారని పార్టీ దుయ్యబట్టింది. సీవీసీ నివేదిక ఆధారంగా అలోక్ వర్మను తొలగించడం కుదరదని బీజేపీ ఎంపీ సుబ్రమణియన్ అన్నారని ఉటంకించింది. అలోక్ వర్మ అవినీతికి పాల్పడితే ఎందుకు కేసులు పెట్టలేదని, ఎందుకు చర్యలు తీసుకోలేదని, మరో బాధ్యతను ఎందుకు కట్టబెట్టా రని, అవినీతికి సీవీసీ అతీతం కాదని పార్టీ వ్యాఖ్యానించింది. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ లేవనెత్తిన ప్రశ్నలకు మోదీ న్యాయవాదుల వద్ద సమాధానాలు లేవని బీజేపీపై శివసేన ఆగ్రహం వ్యక్తం చేసింది.

ఆస్తానాకు సీవీసీ దన్ను..?

- సీబీఐ మాజీ చీఫ్ అలోక్ వర్మ తొలగింపులో కొత్తకోణం
- వర్మ తొలగింపులో సీవీసీ పాత్ర
- ఆస్తానాకు సీవీసీకి లింకేంటి..?
- వర్మను సీవీసీ చౌదరి వ్యక్తిగతంగా కలిశారా?
- ఆస్తానాపై అభియోగాలను ఎందుకు వెనక్కితీసుకోవాలన్నారు..
- వర్మ కేసు విచారణలో పరిశీలకుడు పట్నాయక్ మాటల్లో నిజమెంత..?







న్యూఢిల్లీ: సీబీఐ మాజీ డైరెక్టర్ అలోక్ వర్మ రాజీనామా తర్వాత ఆసక్తికరమైన విషయాలు వెలుగుచూస్తున్నాయి. అలోక్ వర్మ సీబీఐ చీఫ్‌గా ఉన్నప్పుడు తయారుచేసిన సీబీఐ వార్షిక రహస్య నివేదిక(యాన్యువల్ కాన్ఫిడెన్షియల్ రిపోర్ట్ - ఏసీఆర్)లోని కొన్ని అంశాలే ఆయన పదవికి ఎసరు పెట్టాయన్న వాదన తెరపైకి వచ్చింది. సీబీఐ ఏసీఆర్‌లో ప్రత్యేక డైరెక్టర్ రాకేష్ ఆస్థానాపై డైరెక్టర్ వర్మ కొన్ని ప్రతికూల అంశాలను నమోదు చేశారని.. అందుకే ఆస్థానా మద్దతుదారులు వర్మను టార్గెట్ చేశారని వార్తలు వస్తున్నాయి. సీబీఐ టాప్ బాస్‌లు అలోక్ వర్మ, రాకేష్ ఆస్తానాలు పరస్పరం అవినీతి ఆరోపణలు చేసుకోవడంతో మొదలైన వివాదం సీవీసీ విచారణ పూర్తయిన తర్వాత క్లైమాక్స్‌కు వచ్చినట్లు తెలు స్తోంది. అలోక్ వర్మపై ఆస్థానా చేసిన అవినీతి అభియోగాలపై కేంద్ర నిఘా కమిషన్ (సీవీసీ) విచారణ జరిపింది. ఈ విచారణ కమిటీలో సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జి ఏకే పట్నాయక్ పరిశీలకుడిగా వ్యవహరించారు. విచారణ సందర్భంగా వర్మ చెప్పిన విషయాలు.. సేకరించిన పత్రాలను పరిశీలిస్తే ఆయన తప్పు చేశారని నిరూపించేందుకు ఎలాంటి ఆధారాలు లేవని పట్నాయక్ పేర్కొన్నారు. అయితే రాకేష్ ఆస్థానాకు ప్రభుత్వ పెద్దలు వెన్నుదన్నుగా నిలవడంతో తెరవెనుక అసలు రాజకీయం నడిచిందని పట్నాయక్ వెల్లడించారు.

వర్మను చౌదరి ఎందుకు కలిశారు..?

రాకేష్ ఆస్థానాపై వర్మ రూపొందించిన యాన్యువల్ కాన్ఫిడెన్షియల్ రిపోర్ట్‌లో పేర్కొన్న ప్రతికూల ఆరోపణలను ఉపసంహరించుకోవాలని కేంద్ర విజిలెన్స్ కమిషనర్ కె.వి చౌదరి ఢిల్లీ జనపథ్‌లోని అలోక్ వర్మ ఇంటికి వెళ్లారని తెలిపారు. ఆస్తానా విషయంలో చూసీచూడనట్లుగా వ్యవహరిస్తే అంతా ఓకే అవుతుం దని చౌదరి..వర్మకు హామీ ఇచ్చారని పేర్కొన్నారు. అయితే చౌదరి అభ్యర్థనను అలోక్ వర్మ లెక్కచేయలేదు. యాన్యువల్ కాన్ఫిడెన్షియల్ రిపోర్ట్‌లోని ప్రతికూల అంశాలను మార్చేందుకు ససేమిరా అన్నారు. ఈ నేపథ్యంలో అలోక్ వర్మపై సీవీసీ కక్ష సాధింపు చర్యలకు దిగిందనట్లు తెలుస్తోంది. ఆస్తానా విషయంలో వెనక్కి తగ్గకపోవడం వల్లే సుప్రీంకోర్టు తీర్పును సైతం లెక్కచేయ కుండా ప్రధాని ఆధ్వర్యంలోని ఉన్నతస్థాయి కమిటీ ఏకపక్షంగా సీవీసీ వాదనలు విని తనను సీబీఐ చీఫ్ పదవి నుంచి తప్పించారని వర్మ పట్నాయక్‌కు రాసిన లేఖలో పేర్కొన్నారు. తనతో చౌదరి ఆస్తానా గురించి మాట్లా డిన విషయాలను కూడా పూసగుచ్చినట్లు లేఖలో పేర్కొన్నట్లు పట్నాయక్ తన సన్నిహితులతో పేర్కొన్నట్లు తెలుస్తోంది.

పట్నాయక్ ఏమంటున్నారు..?

అలోక్ వర్మపై అవినీతి ఆరోపణల కేసు విచారణ శనివారం పట్నాయక్ మీడియాతో మాట్లాడుతూ వర్మ అవినీతికి పాల్పడ్డారనడానికి సాక్షాలేవీ లేవని పేర్కొన్నారు. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆస్తానాకు సీవీసీ మద్దతివ్వాలని సీవీసీని ఆదేశించడంలో ఏ ఉన్నతాధికారి జోక్యం చేసుకున్నారనది తెలియరాలేదు. ప్రధానమంత్రి కార్యాలయంలోని ఉన్నతాధికారులు ఎవరిపై ఎలా కత్తిగడు తున్నారన్నది తెలియడం లేదని సీబీఐ అధికారులు ఆవేదనవ్యక్తం చేస్తున్నారు. అయితే అలోక్ వర్మ ఇంటికి చౌదరి వెళ్లడం ఇదేమీ తొలిసారి కాదన్న వాదన వినిపిస్తోంది. ఆస్తానాను సీబీఐ ప్రత్యేక డైరెక్టర్‌గా నియమించడంపై అలోక్ వర్మ అభ్యంతరం వ్యక్తం చేసిన నాటి నుంచే సీవీసీ ఆస్తానాకు మద్దతు పలుకుతున్నట్లు సమాచారం. ప్రధానమంత్రి కార్యాలయంలోని ఉన్నతాధికారి పీకే మిశ్రా గతంలోని సీవీసీ చౌదరికి సమన్లు జారీ చేశారని.. ఆస్థానా నియమకాన్ని నిర్ధారించే విషయంలోనూ సూచనలిచ్చినట్లు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

ఆస్తానా కేసులో సీవీసీ జోక్యం

2018 అక్టోబర్ చివరలో రాకేష్ ఆస్తానాపై సీబీఐ కేసులు నమోదు చేసినప్పుడు.. సీవీసీ అభ్యంతరాలు వ్యక్తం చేసింది. అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 17 ఏ ప్రకారం ముందస్తు అనుమతులు ఇచ్చే అధికారం కలిగిన వారి అనుమతి తీసుకున్న తర్వాతే దర్యాప్తు సంస్థ విచారణ ఆస్తానాపై విచారణ ప్రారంభించాలని వాదించింది. అయితే ఇప్పటికీ దర్యాప్తు సంస్థ ముందస్తు అనుమతులు తీసుకోలేదు.. కానీ అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్13(1)(డి) ప్రకారం ఆస్తానాపై కేసులు నమోదు చేశారు. సీవీసీ నివేదిక ప్రకారం అలోక్ వర్మను సీబీఐ చీఫ్ పదవి నుంచి తొలగించడంపై పట్నాయక్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రధాని నేతృత్వంలోని ఉన్నతస్థాయి కమిటీ సభ్యుల్లో ఒకరు సుప్రీంకోర్టు న్యాయమూర్తి సిక్రి కాగా మరొకరు ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గే అని.. ఖర్గే అభ్యంతరాలను పరిశీలించకుండా హడావుడిగా వర్మను తొలగించాలని ఎలా నిర్ణయిస్తారని ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో మనస్థాపానికి గురైన అలోక్ వర్మ ఈనెల 11న రాజీనామా చేశారు. తన వాదనను వినిపించేందుకు కూడా ఉన్నతస్థాయి కమిటీ సమయమివ్వకుండా నిర్ణయం తీసుకోవడం తనను బాధించిందని వర్మ పేర్కొన్నారు. ఆస్తానా తనపై ఫిర్యాదు చేస్తూ సంతకం చేసిన స్టేట్‌మెంట్‌నే సీవీసీ ఉన్నతస్థాయి కమిటీ ముందుంచిందని.. ఇరు పక్షాల వాదనలు వినకుండా ఎలా ఏకపక్ష నిర్ణయం తీసుకుంటారని వ్యాఖ్యానించారు. అయితే సీవీసీ వివాదాల్లో ఉండటం ఇదేం తొలిసారి కాదు. సీబీఐ మాజీ డైరెక్టర్ రంజిత్ సిన్హా విజిటర్స్ డైరీ కుంభకోణంలోనూ చౌదరి పేరు వినిపించింది. సీవీసీగా చౌదరి నియామకమైన తర్వాత ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి సన్నిహితుడిగా పేరున్న వ్యాపారి నిఖిల్ మర్చంట్ ఆఫీస్ వ్యవహారంలోనూ చౌదరి ప్రస్తావన వచ్చింది.

మోడీ.. మోనార్క్ మార్కు!

సింహం జూలు విదిల్చింది. పంజా విసురుతోంది. కాలాతీతం కాకముందే అది మేల్కొంది. ప్రజాస్వామ్యపు జనారణ్యమిది. ఎన్నికల ప్రస్థానం అనివార్యమైన ప్రక్రియ. ఓట్ల వేటలో ముందుంటేనే అధికారం. ఆ సింహానికి ఈ గణతంత్రపు గణితశాస్త్రం కొట్టిన పిండి. అందుకే ఎన్నికల గోదాలోకి ముందుగానే దూకేసింది. యుద్ధానికి కావాల్సిన సకల అస్త్ర శస్త్రాలను సమకూర్చుకుంటున్నది. అవును. మనమిప్పుడు మాట్లాడుకుంటున్నది ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గురించే. యుద్ధం మొదలైందని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ శుక్రవారం దుబాయ్‌లో అన్నారు గాని మోడీ మాత్రం చాలా రోజుల క్రితమే యుద్ధం మొదలు పెట్టారు. అది రాహుల్‌కి ఆలస్యంగా కనెక్ట్ అయినట్టు అనిపిస్తున్నది. ప్రధాని మోడీ ఇంకా మరిన్ని అస్త్రాలను సమకూర్చుకునే కసరత్తులో ఉన్నారని దేశమంతా కోడై కూస్తున్నది. దానికితోడు దేశవ్యాప్తంగా జరుగుతున్న వివిధ రాజకీయ పరిణామాలు తనకే అనుకూలంగా మారుతున్నట్టు మోడీ లోలోన సంబరపడుతున్న సంకేతాలు ఆయన మాటల్లో, ఆయన హావభావాల్లో వ్యక్తమవుతున్నాయి. ప్రజాస్వామ్యంలో ఉన్న మజా అదే. అయిదేళ్లలో పదవీకాలంలో మొదటి నాలుగున్నరేళ్లు ఏమి చేశారు.. ఎలా ఉన్నారు.. అనేదానికన్నా చివరి ఆరు నెలల్లో ఏమి చేశారు.. ఎలా ఉన్నారన్నదే ప్రధాన పాత్ర వహిస్తున్నది. దీనికి చరిత్రలో బోలెడన్ని ఆనవాళ్లు పెద్దగా వెదక్కుండానే దొరుకుతాయి. ఇప్పుడు మోడీ కూడా ఇదే సిద్ధాంతాన్ని నమ్ముకుని ముందడుగేస్తున్నారు. నాలుగున్నరేళ్ల కాలం గతం గతః. ఇప్పుడేమి చేస్తే జనారణ్యంలో మరో అయిదేళ్లు మనగలుగుతాం? ఆయన ఆలోచించింది అదే. అందుకే నాలుగున్నరేళ్ల కాలంలో చేయని ఆలోచనలు ఇప్పుడు చేశారు.. చేస్తున్నారు. ఆ నాలుగున్నరేళ్ల కాలంలో వేయని అడుగులు ఇప్పుడు వేస్తున్నారు. ఈ స్వల్పకాలమే ఆయనకు అనల్ప ఫలితాలనిచ్చే కాలమైంది.



ప్రధాని మోడీ ఎవ్వరూ చేయని సాహసం చేశారు. అది సాహసమని కమలనాథులు అంటుంటే దుస్సాహసమని మరికొందరు అంటున్నారు. అదేమైనా గాని.. ఒక రాజ్యాంగ సవరణ చేశారు. రాజ్యాంగానికి 124వ సవరణ. అదేదో అషామాషీ సవరణ కాదు. ఇప్పటికే అమల్లో ఉన్న ఏదోఒక చట్టానికి సవరణలాంటిది కాదు. సువిశాల భారతదేశ సకల జనావళికి నిర్దేశించిన సమున్నత భారత రాజ్యాంగానికి సవరణ. అంతమాత్రాన అదేదో చేయరాని నేరం.. ఘోరం లాంటిది కూడా కాదు. రాజ్యాంగానికి ఇప్పటిదాకా చాలానే సవరణలు చేశాం. ఇది 124వ సవరణ అంటే ఇంకా చెప్పాల్సింది ఏముంటుంది! అగ్రవర్ణాల్లో పేదలకు విద్య, ఉద్యోగాల్లో పది శాతం రిజర్వేషన్లకు వీలుకల్పిస్తూ చేసిన సవరణ అది. రిజర్వేషన్ల అంశం మనదేశంలో భావోద్వేగాలతో ముడిపడిన అంశంగా చిక్కుముళ్లు పడిఉంది. అందులో ఏ ఒక్క వర్గాన్ని ప్రస్తావించినా దేశంలోని ఇతరత్రా అన్ని వర్గాలు స్పందించేంతటి అవినాభావ సంబంధం ఉన్న అంశమది. అలాంటి అంశం మీద మామూలు చట్టానికి గాని లేక ఇప్పుడున్న చట్టాలకు సవరణలకు గాని అస్కారం లేని దశలో రాజ్యాంగాన్నే సవరించాల్సిన పరిస్థితి ఉందంటే ఈ రాజ్యాంగ సవరణకు ఎంతటి ప్రాముఖ్యత ఉందో వేరే చెప్పాల్సిన పనిలేదు. ఈ నిర్ణయంలోని ఉచితానుచితాల గురించి కాదు ఇక్కడ ప్రస్తావన. ఒక రాజ్యాంగ సవరణ ఎలా ఏ స్థాయిలో జరిగిందన్నదే ఇక్కడ చర్చ. మొత్తం మూడే మూడు రోజులు. ఒకరోజు కేబినెట్లో ఆమోదం. కేబినెట్ ముందుకు చర్చకు వచ్చేదాకా తోటి మంత్రులకే తెలీని పరిస్థితి. మర్నాడు లోక్‌సభలో ప్రవేశం.. చర్చ.. ఆమోదం. ఆ మర్నాడు రాజ్యసభకు.. మళ్లీ అదేరీతిలో చర్చ. ఆమోదం. ఏదైనా ఒక బిల్లో.. లేక బిల్లుకి సవరణో చేయాల్సి వచ్చినా.. ఒకటి రెండు రోజుల పాటు చర్చ.. లేదంటే కనీసం ఉదయం నుంచి సాయంత్రం దాకా చర్చ.. పొద్దుపోయేదాకా వాదోపవాదాలు.. ప్రతిపక్షాల సందేహాలు.. అధికారపక్షం సమాధానాలు.. బుజ్జగింపులు..

ఆనక మూజువాణి ఓటింగు.. దానికి తృప్తిచెందని ప్రతిపక్షాలు డివిజన్ కోసం పట్టు... ఎలక్ట్రానిక్ ఓటింగు.. డిస్‌ప్లేబోర్డులో ఓటింగు వివరాలు.. ఇదీ సాధారణంగా సాగే పద్ధతి. కాని 124వ రాజ్యాంగ సవరణ బిల్లు మాత్రం ముందస్తుగా చర్చోపచర్చలే లేవు. కేవలం కొద్ది గంటల ముందు తప్ప ప్రతిపక్షరాజకీయ నాయకులకు కూడా దాని ఆనుపానులు తెలీలేదు. లోక్‌సభలో కేవలం నాలుగైదు గంటలకు మించి చర్చ జరగలేదు. రాజ్యసభలోనూ దాదాపు అదే పరిస్థితి. అదలా ఉంచితే మొదటిరోజు లోక్‌సభలో ప్రధాని మోడీ ఆ చర్చ సందర్భంగా సభలోనే ఉన్నారు. ఏదశలోనూ ఆయన దానిమీద స్పందించే ప్రయత్నం చేయలేదు. అంతటి ప్రధానమైన అంశం మీద దేశ ప్రజలను సభాముఖంగా మెప్పించి ఒప్పించాలన్న ఆలోచన ఆయనకు రాలేదు. ఇక రెండోరోజు రాజ్యసభలో ఇదే బిల్లు మీద చర్చ సమయంలో ప్రధాని మోడీ అస్సలు సభకే రాలేదు. ఆ సమయంలో ఆయన వేరే రాష్ట్రంలో ఎన్నికల సభల్లో తలమునకలై ఉన్నారు. నిజానికి రాజ్యసభలో ప్రభుత్వానికి ఏమైనా ఇబ్బందికరమైన పరిస్థితి ఎదురవుతుందా అన్న భయాందోళనలు ఒక దశలో వ్యక్తమయ్యాయి. కాని స్ఫురద్రూపి అయిన మోడీ దీన్ని పెద్దగా పట్టించుకోలేదు. రాజ్యసభలో అంకెలవారీ బలాబలాల్లో తేడాలున్నా.. ఈ బిల్లుకి ఎలాంటి ఢోకా ఉండదని ఆయన తనకు తాను భరోసా ఇచ్చుకున్నారు. అందుకే అస్సలు ఢిల్లీలోనే లేకుండా వెళ్లగలిగారు. కులాలు, జాతులు, వర్గాలు, మతాల సమాహారమైన భారతదేశంలో ఎన్నికల రాజకీయాల మతలబులేంటో మోడీ గ్రహించగలిగారు కాబట్టే ఆయనంత ధీమాగా సభకు దూరంగా ఉండగలిగారు. ఒకవంక తన మీద అసంతృప్తి పవనాలు వీస్తున్నాయన్న ప్రచారం ఊపందుకుంటున్నా.. తన వ్యవహారశైలిని ఏమాత్రమైనా మార్చుకోవడానికి సుతరామూ సిద్ధపడని మోడీ ఇదే దుందుడుకు రాజకీయాలతో వచ్చే లోక్‌సభ ఎన్నికలకు సమాయత్తమయ్యారు. తన పాలన గురించి ప్రజలు రకరకాలుగా అభిప్రాయపడటం వేరు.. చివరిగా ఎన్నికల్లో అదే ప్రజలు తమ నిర్ణయాత్మక ఓటుని వినియోగించడం వేరు అని మోడీ భావన. ఆ భావనే మోడీని మరింతగా ఉక్కుమనిషిగా మారుస్తున్నది. పేదల బిల్లుకి ప్రతిపక్షాలు ఏ రీతిలో స్పందిస్తాయో మోడీ ముందుగానే అంచనాకు వచ్చినట్టు ఆయన వ్యవహారశైలి స్పష్టం చేసింది. ప్రతిపక్షాలు ఆరోజు రాజ్యసభలో ఎంతసేపటికీ.. ఇంత హడావుడిగా బిల్లు తేవాల్సిన అవసరమేమిటి.. సెలెక్టు కమిటీకి పంపాలి.. అని మాత్రమే ప్రస్తావించాయి గాని అందులోని చీకటి వెలుగుల కోణాల్ని ఏమాత్రం స్పృశించే ప్రయత్నం చేయలేదు. భావోద్వేగాల పరంగా సున్నితమైన అంశమైనందున.. లోలోన కాదనుకున్నా.. పైకిమాత్రం మమ అని అనక తప్పదని అవి ముందుగానే నిర్ణయించుకున్నాయి. ఇది రాజకీయ పార్టీల బలహీనత. ఈ బలహీనతే మోడీకి బలంగా మారింది. పెద్దల సభ కూడా దీన్ని ఆమోదించిన తీరు చూస్తే.. మనదేశంలో రాజకీయ పార్టీలు కేవలం ఎన్నికల రాజకీయాలు మాత్రమే చేస్తాయని భావించక తప్పని పరిస్థితి కనిపిస్తున్నది. అటు లోక్‌సభలో చూసినా.. ఇటు రాజ్యసభలో చూసినా.. ఓటింగు.. డివిజన్లు.. యథాప్రకారం కోరారు. అవన్నీ సభానియమాలు.. సంప్రదాయాల ప్రకారం తాము నడుచుకున్నామని పాలకపక్షం చెప్పుకోవడానికి.. తాము చేయవల్సిందల్లా శాయశక్తులా చేశామని ప్రతిపక్షాలు చెప్పుకోవడానికి మాత్రమే. కాని ఇక్కడ ఉభయపక్షాలు నిందితులే. ఆ బిల్లు భారత సమాజానికి ఎందుకు.. ఎంతవరకు శ్రేయస్కరం.. ఉపయుక్తం.. అన్నదానికి ఇప్పటిదాకా సకల భారతావనికి సమంజసమైన సామరస్యమైన వివరణ వచ్చింది లేదు. దేశంలోని వివిధ వర్గాల జనజీవితాల మీద ప్రభావం చూపే ఇలాంటి ముఖ్యమైన అంశాల మీద.. అందునా రాజ్యాంగసవరణలు చేసేటప్పుడు.. తగిన సమయం తీసుకుని.. విస్తృతస్థాయిలో చర్చలకు ఆస్కారమిచ్చి చేస్తే.. అది అందరి ఆమోదం పొందినట్టవుతుంది. మనదేశంలో రాజ్యాంగ సవరణలు అంటే ఆషామాషీ అంశం కాదన్న అభిప్రాయం బలంగా నాటుకుపోయింది. గతంలోని అనుభవాలూ ఇదే సూచిస్తున్నాయి. రాజ్యాంగ సవరణలు చేయాల్సి వచ్చినప్పుడు చేయడానికి మన రాజ్యాంగం ఎంత వెసులుబాటు కల్పించిందో.. అది ఆషామాషీ వ్యవహారంగా కాకుండా అత్యవసరమైతేనే చేయాలన్న వాతావరణాన్నీ కల్పించింది. ఆ ప్రకారం ఏ రాజ్యాంగ సవరణ బిల్లునైనా ఉభయసభల్లో దేనిలోనైనా ప్రవేశపెట్టొచ్చు. చర్చల తర్వాత రెండు సభలు మూడింట రెండు వంతుల మెజారిటీ ఓటింగుతో దాన్ని ఆమోదించాల్సి ఉంటుంది. ఉభయ సభలు ఆమోదించాక, రాష్ట్రపతి ఆమోదముద్ర పడిన వెంటనే అది చట్టమై అమల్లోకి వస్తుంది. గతంలో జరిగిన కొన్ని రాజ్యాంగ సవరణలను గమనిస్తే.. ఈ ప్రక్రియ ఎంతటి ప్రాధాన్యమైనదో.. పాలక ప్రతిపక్షాలు దీనికి ఎంతటి విలువనిస్తాయో అర్థమవుతుంది. కొన్ని బిల్లులైతే నెలల వ్యవధి తీసుకున్న సందర్భాలున్నాయి. రాజ్యాంగంలోని ఆర్టికిల్ 334కి సవరణ చేయాల్సివచ్చింది. లోక్‌సభ, అసెంబ్లీల్లో ఎస్సీ ఎస్టీలకు రిజర్వేషన్లు, ఆంగ్లో ఇండియన్ల ప్రాతినిధ్యానికి సంబంధించింది. పదేళ్ల కాలవ్యవధి ముగిసిపోతుండటంతో మళ్లీ రాజ్యాంగ సవరణ ద్వారా దాన్ని పొడిగించాలి. 1959 నవంబరు 16న రాజ్యాంగ సవరణ బిల్లుని అప్పటి హోంమంత్రి పండిట్ గోవింద్ వల్లభ్‌పంత్ లోక్‌సభలో ప్రవేశపెట్టారు. అది రాజ్యాంగానికి ఎనిమిదో సవరణ. మరో పదేళ్లు పొడిగించేందుకు ఉద్దేశించిన బిల్లు అది. దాన్ని డిసెంబరు ఒకటిన లోక్‌సభ ఆమోదించింది. వారం తర్వాత అంటే డిసెంబరు ఏడున రాజ్యసభలో అది ఆమోదం పొందింది. చివరిగా అప్పటి రాష్ట్రపతి రాజేంద్రప్రసాద్ 1960 జనవరి అయిదున దానికి ఆమోదముద్ర వేశారు.

ఇక 42వ రాజ్యాంగ సవరణ బిల్లు చూద్దాం. ఇందిరాగాంధీ హయాంలో ఇది అత్యంత వివాదాస్పదమైన బిల్లుగా చరిత్రలో నిలిచిపోయింది. పీఠికతో సహా రాజ్యాంగంలోని ప్రతిఒక్క భాగానికీ భారీ మార్పులు తలపెట్టిన బిల్లు ఇది. సుప్రీంకోర్టు అధికారాల్లో చాలావాటికి కత్తెర వేయడం.. దేశ ఫెడరల్ వ్యవస్థని కుళ్లబొడిచేలా రాష్ట్రాల అనేక అధికారాలను కేంద్రానికి బదలీ చేయడం వంటి భారీ మార్పులకు దాన్ని ఉద్దేశించారు. అప్పటి న్యాయశాఖ, కంపెనీ వ్యవహారాల మంత్రి హెచ్ ఆర్ గోఖలే ఆ బిల్లుని 1976 సెప్టెంబరు ఒకటిన లోక్‌సభలో ప్రవేశపెట్టారు. విస్తృతస్థాయిలో చర్చలు.. అంతకన్నా తీవ్రస్థాయిలో వాదోపవాదాలు జరిగాయి. రెండు నెలల తర్వాత.. అంటే నవంబరు రెండున లోక్‌సభ ఆమోదించింది. ఆ తర్వాత వారం పైచిలుకు దాకా రాజ్యసభలో చర్చ జరిగింది. చివరకు నవంబరు పదకొండున పెద్దల సభ ఆమోదించింది. అప్పటి రాష్ట్రపతి ఫక్రుద్దీన్ ఆలీ అహ్మద్ అదే ఏడాది డిసెంబరు 18న ముద్రేశారు. అందులోని అనేక సవరణలు 1977 ఫిబ్రవరి ఒకటిన కార్యరూపంలోకి వచ్చాయి. ఎమర్జెన్సీ చీకటి రోజులకు అది చేదు గుర్తుగా మిగిలింది. అయితే అదే ఏడాది ఎన్నికలు జరిగాయి. జనతా ప్రభుత్వం వచ్చింది. 42వ రాజ్యాంగ సవరణను రద్దు చేయాలని ప్రయత్నించినా సక్సెస్ కాలేదు. 1979లో వచ్చిన ప్రభుత్వం ఎమర్జెన్సీకి పూర్వస్థితిని పునరుద్ధరించేప్రయత్నంలో భాగంగా 43, 44 రాజ్యాంగ సవరణలు తెచ్చింది. అయితే అది పూర్తిగా విజయవంతం కాలేదు. ఓటింగు అర్హత వయస్సుని 21 ఏళ్ల నుంచి 18 ఏళ్లకు తగ్గించే బిల్లుని కాస్తంత వేగంగా ఆమోదించారనే చెప్పొచ్చు. రాష్ట్రపతి దగ్గర మాత్రం జాప్యమైంది. రాజ్యాంగంలోని 326వ ఆర్టికిల్‌కి సవరణ ప్రతిపాదిస్తూ 1988, డిసెంబరు 13న లోక్‌సభలో బిల్లు పెట్టారు. రెండు రోజుల్లోనే అంటే డిసెంబరు 15న లోక్‌సభ ఓకే చేసింది. రాజ్యసభ అయిదు రోజుల తర్వాత.. అంటే డిసెంబరు 20న ఆమోదించింది. అప్పటి రాష్ట్రపతి ఆర్ వెంకట్రామన్ 1989, మార్చి 28న దాన్ని ఆమోదించారు. అతిపెద్ద పన్నుల సంస్కరణ ప్రక్రియకు మారుపేరుగా నిలిచిన జీఎస్టీ చట్టం కోసం రాజ్యాంగానికి 101వ సవరణ చేశారు. నిజానికి దీనిమీద 2000 సంవత్సరం నుంచే చర్చోపచర్చలు సాగాయి. 2014 డిసెంబరు 19న అప్పటి ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ లోక్‌సభలో ప్రవేశపెట్టారు. అయిదు నెలల తర్వాత.. అంటే 2015, మే 5న అది ఆమోదం పొందింది. రాజ్యసభలో అది 2016 ఆగస్టు 8 దాకా ఆగాల్సి వచ్చింది. దాన్ని సెలెక్టు కమిటీకి పంపించడం.. అది నివేదిక ఇచ్చేదాకా ఆగాల్సిరావడంతో ఇంత కాలవ్యవధి పట్టింది. అప్పుడు రాష్ట్రపతిగా ఉన్న ప్రణబ్ ముఖర్జీ అదే ఏడాది సెప్టెంబరు 8న ఆమోదిస్తే.. 2017 జులై ఒకటి నుంచి అమల్లోకి వచ్చింది. 124వ రాజ్యాంగ సవరణ బిల్లు వీటితో పోలిస్తే జెట్ వేగంతో ఆమోదం పొందినట్టే భావించాలి. దీనికి కారణం ఏమిటి? పాలకపక్షం ఎన్నికల అవసరంగా ఆగమేఘాలమీద దీన్ని తీసుకొచ్చినట్టు స్పష్టమవుతున్నది. దురదృష్టవశాత్తూ ప్రతిపక్షం కూడా అదే సమీకరణాల మీద తలూపింది.

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఎన్నికల కోణంలో ఓట్ల వేటలో భాగంగా వేసిన తొలి అస్త్రం ఇది. అలాగే చిన్న వ్యాపారుల కోసం జీఎస్టీ వెసులుబాటు కల్పించారు. ఇంకొన్ని తన అమ్ములపొదిలో ఉన్నట్టు సంకేతాలు వదుల్తున్నారు. ఎన్నికల తేదీల ప్రకటన వచ్చేలోగా మోడీ తన మదిలోని ఆలోచనలను కార్యరూపంలోకి తేవచ్చు. అవన్నీ నిస్సందేహంగా జనాకర్షక మంత్రాలే అవుతాయి. అందరి దృష్టీ వాటిమీదే ఉంటుంది. అయిదేళ్ల వ్యవధిలో ఈ చిట్టచివరి త్రైమాసికంలోనే వీటిని ఎందుకు ప్రకటించాల్సివచ్చిందో అందరికీ తెల్సినా ఎవ్వరూ అడగరు. అదే మోడీ ధీమా. ఇంతకాలం ఇవ్వకపోయినా.. ఇప్పుడిస్తే తప్పా అన్న లాజిక్కు తెరమీదికొస్తుంది. దాన్ని వాదించి గెలవడం కష్టం. అందుకే ఆ తర్కవితర్కాల జోలికి ఎవ్వరూ వెళ్లరు. అవతల రాహుల్‌గాంధీ చేతిలోని అస్త్రాలు ఇప్పటికే నిర్వీర్యం అయిపోయాయని మోడీ భావిస్తున్నారు. రాహుల్ ఒక ప్రధాన యుద్ధాస్త్రంగా ప్రయోగిస్తున్న రాఫెల్ తన మాయాజాలంతో తేలిపోతుందని మోడీ నమ్ముతున్నారు. తానేమో ప్రజలకు ఉపయుక్తమయ్యే ప్రతిపాదనలతో ముందుకెళ్తుంటే.. ప్రతిపక్షనాయకుడు రాహుల్‌గాంధీ కేవలం తననే లక్ష్యంగా ఆరోపణాస్త్రాలతో దాడి చేస్తున్నారన్న అభిప్రాయం కలిగించే ప్రయత్నంలో మోడీ-షా ద్వయం ఉన్నారు. ఇప్పటికే ఈ దిశగా బీజేపీ ప్రచారాన్ని ముమ్మరం చేసింది. నాయకుడే లేని కొన్ని పక్షాల సమూహం పటిష్టమైన నాయకుడున్న బీజేపీతో యుద్ధానికి తలపడతానని ప్రగల్భాలు పలుకుతున్నదంటూ బీజేపీ జాతీయ మండలి సమావేశాల్లో హుంకరించిన కమలనాథులు మోడీ నాయకత్వాన్నే మళ్లీ ఆశ్రయించినట్టు స్పష్టమవుతున్నది. తమని వదిలివెళ్లిన పూర్వపు భాగస్వాముల్ని మళ్లీ అక్కున చేర్చుకునే ప్రయత్నాలకు బీజేపీ శ్రీకారం చుట్టింది. ప్రాంతీయ పార్టీలు ఈసారి బలంగా సర్వస్వతంత్రంగా బరిలో నిలవాలని తలపోస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో బీజేపీ వ్యూహం ఏమేరకు సఫలీకృతం అవుతుందో చూడాల్సిందే. ఉత్తరప్రదేశ్‌లో అఖిలేష్ - మాయావతి కూటమి జాతీయ స్థాయిలో కొత్త సమీకరణాలకు తెరలేచే అవకాశాలున్నాయి. కాంగ్రెస్ పార్టీని ఈ కూటమి దూరంగా పెట్టడానికి వాళ్లు చెబుతున్న కారణంలో సహేతుకత ఉన్నా జాతీయ కూటమి ప్రయత్నాలకు ఇది విఘాతంగా మారే ప్రమాదం లేకపోలేదు. మోడీకి ఇది నిస్సందేహంగా ఒక సానుకూల సంకేతమే!

-వయ్యెస్సారెస్

మహాభారతంలో ... ఉలూచీ చిత్రాంగదలు


శ్రీకృష్ణుడి సూచన మేరకు నారదుడి మాట ప్రకారం తామేర్పరచుకున్న నియమానికి భంగం కలిగించిన అర్జునుడు బ్రహ్మచర్యాన్ని పాటిస్తూ ఒక సంవత్సరం తీర్థయాత్రలు చేయడానికి బయలు దేరాడు. అదృష్టవంతుడు నగరంలో ఉన్న వనంలో ఉన్నా ఒక్కటే. అభ్యుదయపరంపరలు వెంట బడతాయి. ఈ యాత్రా కాలంలో అర్జునుడికి ముగ్గురు మగువలు భార్యలయ్యారు. ఒకరు వ్రతం పూర్తి కాకముందే. మరి యిద్దరు వ్రతం పూర్తిఅయ్యాక.

అర్జునుడు వేదవిదులైన బ్రాహ్మణులతో కలిసి ఆయా తీర్థాలలో ఉచితకర్మలాచరిస్తూ గంగాతీరంలో కొద్దికాలం ఉన్నాడు. ఒకనాడు ఉదయకాలంలో అగ్నికార్యం నిర్వహిస్తుండగా శ్యామవర్ణుడైన అర్జునుణ్ణి ఒక నాగకన్యక మదనపరవశయై ఆతణ్ణి పట్టుకుని లాగుకొని నాగపురానికి తీసుకుపోయింది. హోమాన్ని పూర్తిచేసిన ఆతడు నవ్వుతూ ఆమెను ఇలా ప్రశ్నించాడు. ఓ పద్మాక్షి! నీ పేరు ఏమిటి? ఎవ్వరి పుత్రికవు? ఈ విధంగా మహామోహాన్ని ఎందుకు పొందుతున్నావు అని. నా పేరు ఉలూచి. నాగకన్యకను. ఐరావత వంశసంభవుడు కౌరవ్యుడు నాతండ్రి. పూర్వమే నిన్ను విని ఇపుడునిన్ను చూసి మనోజబాణ బాధిత నయ్యాను. నా మనోరథం తీర్చమన్నది. అపుడు అర్జునుడు బ్రహ్మచర్యవ్రతంలో తీర్థసేవలో ఉన్నాను. నీ కోరిక ఎలా తీర్చగలను. వ్రతభంగం తప్పుగదా అన్నాడు. అప్పుడామె నాకంతా తెలుసు. అయితే సర్వతీర్థ సేవనం, సర్వవ్రతాచరణం సమస్త దానధర్మాలు ప్రాణదానంతో సమానం కావు. ఇపుడు నాకోరిక తీరకపోతే మన్మథతాపం నన్ను దహిస్తుంది. నాకు మరణం తప్పదు. కావున నన్ను రక్షించు. నీకు వ్రతభంగం కాదని ప్రాధేయపడింది. అర్జునుడు మెత్తబడ్డాడు. ఆమె ఇష్టాన్ని తీర్చాడు. ఆ రాత్రి నాగభువనంలో ఆమెతో గడిపి సద్యోగర్భంతో ఇరావంతుడనే పుత్రుణ్ణి పొందాడు. ప్రాతఃకాలానికి తిరిగి వచ్చాడు.

సహచరవిప్రులకు యావద్వృత్తాంతం విన్నవించాడు. వాళ్లూ సంతోషించారు.

తర్వాత ఆయా పుణ్యతీర్థ పుణ్యస్థలాన్ని దర్శిస్తూ, సేవిస్తూ, దానధర్మాలు చేస్తూ పూర్వసముద్ర తీరానికి చేరాడు. దక్షిణ గంగగా ప్రసిద్ధి పొందిన గోదావరిలో స్నానమాడినాడు. భీమేశ్వరుణ్ణి దర్శించాడు. శ్రీశైలాన్ని చేరాడు. భూమిలో అనఘమైనది, శిష్టాగ్రహార భూయిష్టమైనది, విప్రోత్తమా ధ్వరవిధాన పుణ్యసమృద్ధమై ఒప్పే వేంగీ దేశవైభవాన్ని కన్నులార చూసి ఆనందించాడు. నన్నయ భట్టారకులు రాజ రాజనరేంద్రుడి ఆస్థానకవి, పురోహితుడు కావున అప్పటి తమ వేంగీరాజ్య విభవాన్ని అర్జునుడు అప్పుడు చూసినట్లు చెప్పి తన ప్రాంతీయాభిమాన్ని ప్రకటించుకున్నాడు.

తర్వాత అర్జునుడు దక్షిణ సముద్రాన్ని చేరి కావేరీ నదీ మహాసంగమాన్ని దర్శించి



భూసురుల పూజించాడు. అప్పటికి సంవత్సర కాలం పూర్తి అయ్యింది. వ్రతం, బ్రహ్మచర్యం సమాప్తమయ్యాయి. మణిపురం చేరాడు. చిత్రవాహన మహారాజు అర్జునుణ్ణి ఆహ్వానించి పూజించాడు. ఆతడి కుమార్తె చిత్రాంగదను అర్జునుడు అభిలషించాడు. ఆ విషయం తెలిసిన చిత్రవాహనుడు అర్జునుడితో ఇలా పలికాడు. నీకు నా కుమార్తె నిచ్చుట నాధన్యత. అయితే ఇందో విధి విధానమున్నది. దాన్ని ఏకాగ్రచిత్తంతో విను. మావంశంలో ప్రభాకరుడు అనపత్యుడై ఈశ్వరుణ్ణి గూర్చి తపస్సు చేశాడు. పరమేశ్వరుడు ఆతణ్ణి కరుణించి ఒక పుత్రుడు నీకు కలుగుతాడు. ఇట్లే ఇక మీదట మీ వంశంలో ఒక కుమారుడు పుడతాడని వరదానం చేశాడు. ఇప్పటివరకూ అట్లే జరిగింది. కాని నాకు పుత్రిక పుట్టింది. అయినా పుత్రికను పుత్రుడుగా పెంచాను. ఈమెకు పుట్టిన కొడుకు మాకులవిస్తారకుడు కావాలి.

ఇది ఈమెకు నీవిచ్చే శుల్కం అన్నాడు. అర్జునుడు సంతోషంగా అంగీకరించి ఆమెను వివాహమాడాడు. చిత్రాంగదకు బభ్రువాహనుడనే పుత్రుడు జన్మించాడు. ఆతణ్ణి చిత్రవాహనుడికి వంశకరుడుగా ఇచ్చి అచ్చటి నుంచి గోకర్ణాన్ని చూస్తూ పశ్చిమ సముద్ర తీరాన్ని చేరాడు.

లోకంలో ప్రమీలార్జునీయం కూడా ప్రసిద్ధి చెందింది. అది భారతంలో కన్పించదు. అది కూడా శ్రీకృష్ణార్జునయుద్ధం (గయోపాఖ్యానం) వంటిదై ఉంటుంది. అయితే రసవత్తరమైన కథ.

ఉలూచి నాగకన్యక. కామమోహిత. అయితే ప్రగల్భ. తన వాక్చాతుర్యంతో అర్జునుణ్ణి ఒప్పించి పొందింది. ఒక విధంగా అర్జునుడికి వ్రతభంగం అయినట్లే. వ్రతసమాప్తి అయిన తర్వాత వివాహమాడవచ్చు. కాముడు బలవంతుడై బాధిస్తున్నాడు. తక్షణమే పొందుకావాల్సి వచ్చింది. తన పుత్రుడు ఇరావంతుణ్ణి కురుక్షేత్రయుద్ధానికి పంపింది కూడా. ఆతడు యుద్ధంలో మరణించాడు. చిత్రాంగద తండ్రిచాటు బిడ్డ. తండ్రి యిష్టప్రకారం వివాహమాడింది. మగబిడ్డను కన్నది. పుట్టినింటే ఉన్నది. యుద్ధానంతరం అశ్వమేధ అశ్వాన్ని ఆమె కుమారుడు బభ్రువాహనుడు బంధించి ఎదిరించాడు కూడా.

సత్యభామ : శ్రీకృష్ణుడి అష్టభార్యలందు రుక్మిణి తర్వాత స్థానం సత్యభామది. ఆమె సత్రాజిత్తు కుమార్తె. ఆతడు శమంతకమణి గలవాడు. సూర్యభగవానుడు ఆ మణిశ్రేష్ఠాన్ని సత్రాజిత్తుకిచ్చాడు. ఆ మణి ప్రతిదినం అధికంగా బంగారాన్ని ప్రసాదిస్తుంది. దాని కారణంగానే శ్రీకృష్ణుడు సత్యభామను సతిగా స్వీకరించాడు. ఈ విషయం వినాయక చతుర్థిసందర్భంలో ప్రస్ఫుటం. సత్యాదేవి ధనాఢ్యే కాక అతిలోక సౌందర్యరాశి. దాంతో శ్రీకృష్ణుణ్ణి తానొక్కతే సొంతం చేసుకోవాలనే కాంక్ష కలిగి ఉంటుంది. అక్క రుక్మిణిని మించాలని చూస్తుంది. మహాభారతంలో శ్రీకృష్ణుడి భార్యలు వ్యక్తిగతంగా అంతగా కన్పించరు. సుభద్రవివాహసందర్భంలో రుక్మిణీసత్యల ప్రస్తావన వచ్చింది. అట్లే ఉత్తరాభిమన్యుల పెండ్లి సందర్భంలోనూ. కాని పాండవులు అరణ్యవాసం చేస్తున్నప్పుడు ఒకసారి శ్రీకృష్ణుడితో కలిసి సత్యాదేవి పాండవుల్ని చూడడానికి వెళ్లింది. ఐదుగురు భర్తలు ద్రౌపదికి వశవర్తులై ఆమె కనుసన్నల్లో మెలగడం చూసి ఆశ్చర్యం పొందింది. ఆమె భర్తృవాల్లభ్యానికి ఈర్ష్యకూడా చెందింది. ఏకాంతంలో ద్రౌపదిని అదే విషయం అడిగింది. ఇందుకు మందు, మంత్రాలేమైనా ఉన్నాయా? ఉంటే చెప్పు. నేనూ మీ అన్న కృష్ణుణ్ణి వశవర్తిని చేసుకుని సంతోషిస్తానన్నది.

వ్రతము పెంపొ, మంత్రౌషధ వైభవం బొ
సరసనైపథ్యకర్మ కౌశలమొ, చతుర
విభ్రమోల్లాస రేఖయొ వెలది! నీవి


శేష సౌభాగ్య హేతువు నెపుమ నాకు సత్య అడిగిన వానిలో మంత్రమా, ఔషధమా? వాటి ప్రభావమా అనే మాటలే పెద్ద అభ్యంతరాలు. వ్యక్తిత్వ పతన సూచికలు. అందుకే ద్రౌపదికి కినుక కలిగింది. అయితే ప్రకటించలేదు. చిన్నగా నవ్వుతూనే మందలించింది.

నను నిట్లు దుష్టవనితా
జనమునటుల గా దలంప జనునే నీకున్
మనసొప్పదు పురుషోత్తము

వనితవు గాదగవు నీవు వనరుహ నయనా! పురుషోత్తముడైన మా అన్నకు నీవు తగిన దానవు కాదని నవ్వుతూనే అన్నా అది గట్టిమందలింపే. మంత్రతంత్రౌషధాలు బూటకం. అనారోగ్యకారకాలు. ఆ విషయం తెలిస్తే భర్త మరీ దూరమవుతాడు. భర్త భావమెరిగి మెలగుటే, అనువర్తిని అగుటే పరమ మంత్రౌషధం. అన్ని వేళల తాను అన్నీ అయి నడవాలి. తల్లిగా, దాసిగా, మంత్రిగా, రంభగా ఎప్పుడు ఏది అవసరమో అది అవ్వాలి. గృహభారం తానే మోయాలి. అత్తమామల్ని మిక్కిలి సేవించాలి. ఈ పనులన్నీ సంతోషంగా నిర్వహించి పాండవుల మనసుల్ని చూరగొన్నాను. అంతేగాని వేరే మందు మ్రాకులతో కాదుసుమా!


దాంతో సత్యాదేవి సుగ్గుచెంది, నేను తెలియక అన్నాను. నా తప్పు క్షమించు. నా మాటలు నవ్వులాటగ తీసుకో. నీ చారిత్రం మాననీయం అన్నది. దాంతో ద్రౌపది చిన్నగా నవ్వింది. అంతటితో ఆగక పతివ్రతాధర్మాలు ఉటంకించింది కూడా. దాంతో సత్యాదేవి నీవు ధర్మజ్ఞవు. నీభర్తలు మహనీయులు. ధైర్యతేజోబలశౌర్యసంపన్నులు.

ఇట్టి మీకు కౌరవులు ఎన్నో అపకృతులు చేశారు. వారికి వినాశనం తప్పదు. వారి దుఃఖాన్ని చూసి నీవు సంతోషించేరోజు త్వరలోనే వస్తుంది. నీ బిడ్డలు అత్యంత నిర్మలులు. బలసంపన్నులు. వారిప్పుడు ద్వారకలో ఉన్నారు. రుక్మిణీ సుభద్రతలు వారిని తమ బిడ్డలకన్నా మిన్నగా చూస్తున్నారు. వాళ్లకై నీవు చింతచెందవద్దని చెప్పి ఆలింగనం చేసి కృష్ణుడితో కలిసి ద్వారకకు వెళ్లింది. ఎంతటి స్త్రీకైనా ఎదుటి వార్ని చూసి అసూయపడడం సహజం. పతుల అనురాగాన్ని అడిగి బేరీజు వేసుకోవడం సాధారణం. అట్లే ప్రవర్తించి సత్యభామ ఒకింత సిగ్గుపడవలసి వచ్చింది.



కళారత్న, (హంస)
డా. సిహెచ్. బాబావలిరావు
హైదరాబాద్, 9989792247

రైతు ఇతివృత్తంతో కామెడీ చిత్రం



తోటపల్లి సాయినాథ్, 9394449777

రైతే రాజు.. రైతు దేశానికి వెన్నెముక. రైతు బాగున్నప్పుడే ఆ రాష్ట్రం. దేశం బాగుంటాయి. కాని రైతులు మోసానికి గురవుతున్నారు.. తరాలు మారిన వారి రాతలు మారడం లేదు. కొందరు స్వార్థపరులు, వ్యాపారులు, రాజకీయ నాయకుల చేతిలో వారు మోసపోతున్నారు. ఇదే అంశాన్ని ఓ వైపు సెంటిమెంటు మరోవైపు కామెడీ ట్రాక్ మిక్స్ చేసి తెరకెక్కించిన చిత్రం.. ఏడుకొండల వాడా.. వెంకటరమణ.. అందరూ బాగుండాలి...

ఈ చిత్రానికి నేను స్క్రిప్టు రాయడానికి కారణం.. నేను యాక్షన్ నంబరు వన్ చిత్రానికి పనిచేస్తున్నప్పుడు ఆ చిత్రానికి కొర్రపాటి వెంకటరమణ ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేశారు. ఆ తర్వాత ఆయన మరి కొందరితో కలిసి ఒక రోజు మా ఇంటికి వచ్చి నన్ను కలిశాడు. తాను కొంతమంది నిర్మాతలతో కలిసి ఓ సినిమా చేస్తున్నట్లు చెప్పాడు. ఈ చిత్రంలో సెంటిమెంటు, కామెడీలతో పాటు హీరోయిజమ్ కూడా ఉంది అని ఆయన వివరించారు. దీనికి మీరు స్క్రిప్టు రాసి ఇవ్వాలి అని కోరాడు. వాళ్లు ఈ చిత్రానికి వింజమూరి సూర్య అనే ఓ కొత్త డైరెక్టరును పరిచయం చేస్తున్నారు. సూర్య తాను తయారు చేసిన కథను నాకు చెప్పాడు. ఈ సినిమా ఓ ఛాలెంజ్‌లాంటిది. ఎందుకంటే హిలేరియస్ కామెడీ సీన్లు ఉన్నాయి.. అద్భుతమైన సెంటిమెంటుతో కూడిన ఫ్లాష్ బ్యాక్ ఉంది.. అలాగే యాక్షన్ హీరోలకు ఆపోజిట్‌లో సాధారణంగా ఉండే విలనిజం ఉంది.. దానికి కౌంటర్ ఎటాక్ కూడా ఉంది. ఓ రకంగా చెప్పాలంటే ఇది మూడు గుర్రాల స్వారీ వంటిది. అయినా నేను వారి ఆసక్తిని చూసి సరే అన్నాను.

చిత్రం విషయానికి వస్తే ప్రధాన పాత్రలో సునీల్ నటించాడు. కొత్త హీరో సురేంద్ర, కొత్త హీరోయిన్ హర్షికను పరిచయం చేశారు. నవనీత్‌కౌర్ ఓ ముఖ్యమైన పాత్రలో టీవీ ఛానల్ రిపోర్టరుగా నటించింది. సునీల్‌కు ఫ్రెండ్సుగా శివారెడ్డి, సునీల్‌శెట్టి నటించారు. ధర్మవరపు సుబ్రమణ్యం, ఎం.ఎస్.నారాయణ కామెడీ ట్రాక్‌లను పండించారు. ఈ చిత్రంలో పృథ్వి ఓ చక్కటి పోలీసు ఆఫీసర్ పాత్ర చేశాడు. తన ఫ్లేవర్, తన సత్తా ఈ చిత్రంలో చూపించాడు. యాంకర్ ఝాన్సీ హీరోయిన్‌కు ధీటుగా సునీల్‌కు తోడుగా నటించింది. ఓ వైపు కామెడీ మరోవైపు రొమాన్స్ సీన్‌లలో నటించడమే కాకుండా చివరిలో తనకు ట్రాన్స్‌ఫర్ అయినప్పుడు అద్భుతమైన సెంటిమెంటును పండించింది. ఈ సినిమాలో మరో ముఖ్యమైన పాత్రలో నా పాత మిత్రుడు పిళ్ళా ప్రసాద్ నటించాడు. ఆయన విజయవాడలో నాటకాలలో నటించేటప్పటి నుంచి నాకు మిత్రుడు. మంచినటుడు ఆయన ఈ చిత్రంలో మెయిన్ విలన్‌గా.. ఎంపీ గంగరాజు పాత్రలో చాలా చక్కగా నటించాడు. ఇలా అందరు ఆర్టిస్టులు ఎంతో అంకిత భావంతో కలిసి కష్టపడి పనిచేసిన సినిమా ఏడుకొండల వాడా... గంటాడి కృష్ణ ఈ చిత్రానికి సంగీతం అందించారు. ఆయన మంచి మ్యూజిక్ డైరెక్టర్ మాత్రమే కాదు.. మంచి లిరిక్ రైటర్ కూడా. దేవుడు వరమందిస్తే నే నిన్నే కోరుకుంటాలే పాటను ఆయన తాను సొంతంగా రాసి, ట్యూన్ చేసి రికార్డింగు చేశాడు. ఆ పాట ఎంతో హిట్టయింది. ఇకరామ్ పినిశెట్టి.. ఆయన రవిరాజా పినిశెట్టి సోదరుడు. ఈ సినిమాకు ఫొటోగ్రఫీ డైరెక్టరుగా అద్భుతంగా పనిచేశాడు. ఈ చిత్రం కోసం వెంకటరమణ చాలా కష్టపడి పనిచేశాడు.



చిత్రం కథ విషయానికి వస్తే.. సురేంద్ర, సునీల్, శివారెడ్డి కలిసి ఓ హోటల్ ప్రారంభించి తామే అందులో పనిచేస్తుంటారు. హోటల్‌లో వారు చేసే పనులు కామెడీగా ఉంటాయి. బయటినుంచి కావాల్సిన సామాన్లు సురేంద్ర తెస్తుంటాడు. వంటవాడిలా సునీల్.. సప్లయర్‌గా శివారెడ్డి తన హావభావాలతో కస్టమర్లను నవ్విస్తుంటారు. ఎవరికీ అనుమానం రాకుండా పగలు హోటల్ నడిపే ఈ ముగ్గురు రాత్రి కాగానే తమ ఆశయం కోసం పనిచేస్తుంటారు. నకిలీ విత్తనాలు, మందులు తయారుచేసే ఎంపీ గంగరాజును టార్గెట్ చేసి.. ఆయన దాచుకున్న డబ్బును దోచుకు వచ్చి పేదలకు పంచుతుంటారు. ఈ వరుస దోపిడీలు రాష్ట్రంలోనే సంచలనం కల్గిస్తుంటాయి. బీహార్ నుంచి వచ్చిన దోపిడీ దొంగల ముఠా ఈ దోపిడీలు చేస్తోందని ఈ ముగ్గురు పగటిపూట అందరినీ నమ్మిస్తుంటారు. దొంగల కోసం పోలీసుల టీంలు గాలిస్తుంటాయి. ఈ ముగ్గురు దోపిడీలు చేస్తున్న విషయం ఇంటర్వెల్‌కు ముందే చెప్పేస్తాము... వీరు ముగ్గురు ఓ వైపు కామెడీ.. మరోవైపు యాక్షన్ రెండింటినీ అద్భుతంగా పండించారు. టీవీ ఛానల్ రిపోర్టరుగా నవనీత్‌కౌర్ చాలా బాగా నటించింది. మరోవైపు మిగిలిన ఆర్టిస్టులు, టెక్నీషియన్లు అన్ని లొకేషన్లలో బాగా పనిచేశారు. ఈ సినిమాకు పనిచేస్తున్న సమయంలో నాకు ధర్మవరంతో స్నేహం పెరిగింది. ఆయనకు ఒక మ్యానిరిజం పెట్టాము. ఆయన ఈ సినిమాలో జ్యోతిష, వాస్తు శాస్త్రజ్ఞుడుగా గొప్ప కామెడీ పండించాడు. మేషం - మేక, వృషభం, ఎద్దు, మిథునం - దంపతులు, కర్కాటకం - ఎండ్రకాయ.. అనే ఒక డైలాగు ఆయన మ్యానిరిజంతో చెపితే వినాలి. చదివితే మామూలు డైలాగ్ అనిపిస్తుంది. కాని ఆయన పలికిన తీరుతో అది హిట్టు అయింది. ఈ డైలాగ్‌కు తగ్గట్టు ఆయనకు కప్లింగ్ శాస్త్రి అని పేరు పెట్టాము. ఈ ముగ్గురు యువకులు పగలు హోటల్ నడుపుతూ రాత్రి దోపిడీలు ఎందుకు చేస్తున్నారో ఇంటర్వెల్ తర్వాత ఫ్లాష్‌బ్యాక్‌లో వివరించాము..

సాధారణంగా యాక్షన్ సినిమాలలో ప్రజలు పెద్ద హీరోలను ఇష్టపడతారు. కామెడీ ఆర్టిస్టులు యాక్షన్ సినిమాలలో నటిస్తే చూడరని కాదు. వీరు రాబిన్‌హుడ్ స్థాయిలో కౌబాయ్‌లుగా యాక్షన్ చేస్తే చూడడానకి బాగానే ఉంటుంది కాని కమర్షియల్‌గా పెద్ద స్థాయిలో హిట్టు కాదేమో అన్న అనుమానం.. స్క్రిప్టు కోసం జరుగుతున్న సమయంలో చాలాసార్లు చర్చకు వచ్చింది. కాని నాకు ఓ ఆలోచన వచ్చింది. కొత్త దర్శకులు కమర్షియల్ చట్రానికి భిన్నంగా ఆలోచిస్తున్నారు. వారి ఆసక్తి, ఇష్టాలను కమర్షియల్ పేరుతో అడ్డుకోవడం మంచిది కాదేమో అన్న భావం నాలో కలిగింది. అప్పుడే ఓ కొత్త ఆవిష్కరణ జరుగుతుందని అప్పుడు నమ్మాను.. ఇప్పటికీ నమ్ముతున్నాను. మీమందరం కోరుకునే కోరిక మాత్రమే కాదు. యువ కళానిలయం కోసం నేను రాసిన సినిమా పేరు ఏడుకొండల వాడా.. వెంకటరమణ.. అందరూ బాగుండాలి...

అమరావతికి ప్రగతి వారధి



- 12 రహదారులకు అనుసంధానం
- ప్రాజెక్టు వ్యయం రూ.1400 కోట్లు
- భూ సమీకరణకు ఓకే అంటే కృష్ణా రూపురేఖలు మారిపోతాయ్
- కూచిపూడి ఐకానిక్ బ్రిడ్జికి ఏపీ సీఎం చంద్రబాబు శంకుస్థాపన

అమరావతి, ఆంధ్రప్రభ: అమరావతి రైతులను స్ఫూర్తిగా తీసుకుని ఇబ్రహీంపట్నం రైతులు సహకరిస్తే ల్యాండ్ పూలింగ్ చేసి విజయవాడను ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దుతామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. అభివృద్ధి అంతా గుంటూరు వైపే జరుగుతుందని, కృష్ణాజిల్లా వైపు కూడా చూడాలని కొందరు తన దృష్టికి తీసుకువచ్చారని, అంతా సహకరిస్తే పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తామన్నారు. రాజధాని ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలన్న సంకల్పం, పట్టుదలతో పనిచేస్తున్నామని స్పష్టం చేశారు. శనివారం ఏపీ సీఎం చంద్రబాబునాయుడు కృష్ణా జిల్లా ఇబ్రహీంపట్నం సమీపంలోని పవిత్ర సంగమం వద్ద రూ. 1400 కోట్లతో నిర్మించనున్న ఐకానిక్ బ్రిడ్జికి, వెంకటపాలెం గ్రామంలో రూ. 750 కోట్లతో చేపట్టిన నీటి శుద్ధి కేంద్రానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చంద్రబాబు మాట్లాడుతూ అమరావతితో పాటు 12 రహదారులను అనుసంధానం చేసే ఈ ఐకానిక్ వంతెనకు కూచిపూడి ఐకానిక్ బ్రిడ్జిగా నామకరణం చేస్తున్నట్లు ప్రకటించారు.

ఈ బ్రిడ్జి నిర్మాణంతో హైదరాబాద్, మరికొన్ని మార్గాల నుంచి వచ్చే వారికి 40కి.మీ దూరం తగ్గడంతో పాటు సమయం, డబ్బు ఆదా అవుతుందన్నారు. ఇబ్రహీంపట్నం నుండి విజయవాడ వరకు పలు ప్రాంతాల్లో రైతులు సహకరిస్తే ల్యాండ్ పూలింగ్ విధానాన్ని తీసుకువచ్చి రైతులకు ప్రయోజనం చేకూరుస్తామన్నారు. తాజ్‌మహల్ వంటి కట్టడాలను ప్రజలు ఏ విధంగా సందర్శిస్తున్నారో అమరావతిలో నిర్మిస్తున్న అసెంబ్లీ, సచివాలయాన్ని సందర్శించే రోజులు దగ్గరలోనే ఉన్నాయని చెప్పారు. కూచిపూడి ఐకానిక్ బ్రిడ్జిని రెండేళ్ళలోగా పూర్తిచేయాలని, అదే విధంగా వెంకటపాలెం గ్రామంలో నీటి శుద్ధి కేంద్రాన్ని 12నెలల్లో పూర్తిచేసేలా చర్యలు చేపట్టాలని కాంట్రాక్ట్ సంస్థలకు ముఖ్యమంత్రి సూచించారు. నవ్యాంధ్ర రాజధాని అమరావతి ఉత్తర, దక్షిణ భారత రాష్ట్రాలకు కేంద్రంగా ఉంటుందని, దీంతో మరింత అభివృద్ధి జరిగే అవకాశాలు ఉన్నాయన్నారు. రాజధానిలో మొత్తం 12రోడ్లు వస్తున్నాయని, అన్ని వైపుల నుంచి రహదారులను అనుసంధానం చేస్తున్నామని చెప్పారు. పవిత్ర సంగమం వద్ద నిర్మించనున్న కూచిపూడి ఐకానిక్ బ్రిడ్జి దేశంలోనే ఒకప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందన్న ఆకాంక్షను ముఖ్యమంత్రి వ్యక్తం చేశారు.

భారతీయ సంస్కృతికి ప్రతిబింబం వివేకానందుడు



హైదరాబాద్, ఆంధ్రప్రభ: స్వామి వివేకానందుడు భారతీయ సంస్కృతికి ప్రతి రూపమని, యువత దృఢ సంకల్పానికి ప్రతిబింబమని ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు అన్నారు. జాతీయ యువదినోత్సవం సందర్భంగా శంషాబాద్ మండలం ముచ్చింతల్‌లోని స్వర్ణభారత్ ట్రస్ట్‌లో శనివారం యువతను ఉద్దేశించి ప్రసంగించారు. వివేకానందుని బోధనలు అసాధారణమైనవని, కాలదోషం పట్టనివని, అవి అన్ని కాలాలకు వర్తించే నిరంతర గంగా ప్రవాహమని పేర్కొన్నారు. భారతీయ సంస్కృతిలో తాత్వికమైన, సార్వత్రికమైన లక్షణాలున్నాయని, ప్రపంచం ఎదుర్కొనే అనేకసమస్యలకు పరిష్కారాలు ఇందులో ఉన్నాయన్నారు. వైవిధ్యమైన మతాలను,సాంస్కృతిక నమ్మకాలను, వివిధ అభిప్రాయాలను ఒకే వేదిక మీదకు తీసుకొచ్చి, వివిధ అభిప్రాయాల మధ్య చక్కని వారధి నిర్మించిన ఘనత వివేకానందుని సొంతమని, వారి బోధనలను జీవితంలో ఆచరించడం ద్వారా ప్రజా జీవితాల్లో సానుకూలమైన మార్పులు సాధ్యమని వెంకయ్య అభిప్రాయపడ్డారు.

విద్యార్థులతోనే దేశం స్వయం సమృద్ధి



హైదరాబాద్, ఆంధ్రప్రభ: గ్రామీణాభివృద్ధి లక్ష్యాలను చేరుకుంటేనే దేశం స్వయం సమృద్ధి సాధిస్తుందని నేషనల్ రూరల్ డెవలప్‌మెంట్ అకాడమీ (ఎన్ఐఆర్‌డీ) డైరెక్టర్ జనరల్ డబ్ల్యుఆర్ రెడ్డి అన్నారు. ఈ రంగంపై విద్యార్థులు, యువత ఆసక్తి పెరగాలని అభిప్రాయపడ్డారు. ప్రాధాన్యత, ఆవశ్యకతను గుర్తించి సామాజిక బాధ్యతతో గ్రామీణాభివృద్ధి పట్టభద్రులు ముందడుగు వేయాలని విజ్ఞప్తి చేశారు. శనివారం రాజేంద్రనగర్‌లోని ఎన్ఐఆర్‌డీ క్యాంపస్‌లో స్నాతకోత్సవం నిర్వహించారు. 700 మంది పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులకు పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డబ్ల్యుఆర్ రెడ్డి మాట్లాడుతూ, దేశంలో మానవ వనరుల అభివృద్ధికి మాత్రం కొదవ లేదన్నారు. నిబద్ధత, చిత్తశుద్ధి ఉంటేనే స్వయం సమృద్ధి సాధించగలమని అభిప్రాయపడ్డారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉపాధి హామీ పథకం గ్రామీణ ప్రాంతాల్లో పేద వర్గాల జీవన ప్రమాణాలను కొంతమేరకు మెరుగుపరిచిందన్నారు. అలాంటి సామాజికాభివృద్ధి గల పథకాలు మరిన్ని రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని అభిప్రాయపడ్డారు. ఈ రంగంలో పట్టభద్రులైన విద్యార్థులు తమవంతు బాధ్యతగా గ్రామీణ ప్రాంతాల ప్రజలకు సేవలందించాలని డాక్టర్ రెడ్డి ఈ సందర్భంగా సూచించారు.

ఎయిర్‌పోర్టులో బుల్లెట్ల కలకలం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: శంషాబాద్ ఎయిర్‌పోర్టులో బుల్లెట్ల కలకలం చోటు చేసుకుంది. సీఐఎస్ఎఫ్ అధికారుల తనిఖీల్లో ఈ విషయం వెలుగుచూసింది. ఎయిర్‌పోర్టు నుండి ఇండిగో విమానం(6ఈ 7201)లో విజయవాడ వెళుతున్న సత్యదుర్గ అనే ప్రయాణీకుడి వద్ద నుంచి 9 ఎమ్ఎమ్ బుల్లెట్లను సీఐఎస్ఎఫ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. తదుపరి విచారణ నిమిత్తం అతడ్ని శంషాబాద్ ఎయిర్‌పోర్టు పోలీసులకు అప్పగించారు.

24 కేజీల బంగారం స్వాధీనం

చెన్నై విమానాశ్రయంలో కస్టమ్స్ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో రూ.8 కోట్ల విలువైన బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఎయిర్ పోర్టు ఇంటెలిజెన్స్ విభాగానికి చెందిన కస్టమ్స్ అధికారులు ఈ తనిఖీలను నిర్వహించారు. అక్రమంగా తరలిస్తున్న 24 కిలోల బంగారాన్ని ఇద్దరు ప్రయాణీకుల నుంచి స్వాధీనం చేసుకున్నారు. ఆ ఇద్దరు దక్షిణ కొరియాకు చెందిన వారుగా అధికారులు గుర్తించారు. కాగా, బంగారాన్ని ఎక్కడి నుంచి తెచ్చారు? ఏ ప్రాంతానికి తరలిస్తున్నారన్న దానిపై ఆ ఇద్దరిని అదుపులోకి తీసుకుని అధికారులు విచారణ జరుపుతున్నారు.

చంద్రబాబు జీవితమంతా హత్యారాజకీయాలే



హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జీవితమంతా హత్యారాజకీయాలే అని వైఎస్ఆర్‌కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత బొత్స సత్యనారాయణ అన్నారు. శనివారం పార్టీ కేంద్రకార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బొత్స మాట్లాడుతూ ప్రతిపక్షనేత వైఎస్ జగన్‌పై జరిగిన హత్యాయత్నం కేసును కేంద్ర దర్యాప్తు సంస్థకు బదిలీ చేయడంతో చంద్రబాబుకు భయం పట్టుకుందన్నారు. కేసును ఎన్ఐఏకు అప్పగించడాన్ని వ్యతిరేకిస్తూ చంద్రబాబు కేంద్రానికి లేఖ రాయడాన్ని తప్పుపట్టారు. జగన్‌పై హత్యాయత్నం జరిగిందని ఏపీ పోలీసు నివేదికలో కూడా స్పష్టంగా ఉందన్నారు. కేసును ఎన్ఐఏ విచారణ చేయాలని కోర్టే తీర్పు ఇచ్చిందని బొత్స సత్యనారాయణ పేర్కొన్నారు.

జగన్ కేసు ఎన్ఐఏకు ఎలా ఇస్తారు?

- ఇది ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధం
- ప్రధానికి ఏపీ సీఎం చంద్రబాబు లేఖ

అమరావతి, ఆంధ్రప్రభ: ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై విశాఖ విమానాశ్రయంలో జరిగిన దాడికేసు విచారణను ఎన్ఐఏకు అప్పగిస్తూ కేంద్ర హోంశాఖ తీసుకున్న నిర్ణయాన్ని ఏపీ సీఎం చంద్రబాబు తీవ్రంగా తప్పు పడుతూ ప్రధాని మోడీకి లేఖ రాశారు. రాష్ట్రప్రభుత్వాన్ని సంప్రదించకుండా ఈ కేసును ఏ విధంగా ఎన్ఐఏకు అప్పగిస్తారని ఆయన ప్రశ్నించారు. 2008 చట్టం ప్రకారం అంతర్ రాష్ట్ర అంతర్జాతీయ సరిహద్దు సమస్యలు, టెర్రరిస్టు కేసులు మాత్రమే ఎన్ఐఏకు అప్పగించాల్సి ఉండగా ఇలాంటి సాధారణమైన ఒక కేసును ఎలా అప్పగిస్తారంటూ అభ్యంతరం వ్యక్తం చేశారు. 2009లో గుజరాత్ ముఖ్యమంత్రిగా నరేంద్రమోడీ పని చేసిన కాలంలో ఎన్ఐఏపై ఆయన చేసిన వ్యాఖ్యలను ఈ లేఖలో ముఖ్యమంత్రి ప్రస్తావించారు. ఆనాడు రాష్ట్రాల హక్కులను కేంద్రం హరిస్తుందని మోడీ చేసిన వ్యాఖ్యలను చంద్రబాబు ఈ సందర్భంగా గుర్తుచేశారు. 2011లో లక్నోలో జరిగిన బీజేపీ కార్యవర్గ సమావేశం లో ఎన్ఐఏను వ్యతిరేకిస్తూ చేసిన ఏకగ్రీవ తీర్మానం సైతం ఈ లేఖలో ఉటంకించారు. 1982 పౌర విమానయాన చట్టం ప్రకా రం ఈ కేసు ఎన్ఐఏ పరిధి లోకి రాదని స్పష్టం చేశారు.

నేటి నుండి కైట్, స్వీట్ ఫెస్టివల్

ఆంధ్రప్రభ, హైదరాబాద్: ఇంటర్నే షనల్ కైట్ ఫెస్టివల్, స్వీట్‌ఫెస్టివల్ నిర్వహ ణకు తెలంగాణ ప్రభుత్వ పర్యాటక, సాం స్కృతిక శాఖ విస్తృత ఏర్పాట్లు చేసింది. ఆదివారం ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు నాల్గవ అంతర్జాతీయ కైట్ ఫెస్టి వల్, రెండవ అంతర్జాతీయ స్వీట్ ఫెస్టివల్‌ను ప్రారంభించనున్నారు. 20దేశాల నుండి 42మంది అంతర్జాతీయ స్థాయి కైట్ ప్లేయర్లు, 60దేశవాళీ కైట్ క్లబ్ సభ్యులు పాల్గొంటున్నారు. స్వీట్ ఫెస్టివల్‌లో 22దేశాల మహిళా హోంమేకర్స్, 25రాష్ట్రాల కు చెందిన 2500మంది హోమ్ మేకర్స్ తయారుచేసిన 1200రకాల స్వీట్స్ 1200స్టాల్స్‌లో డిస్‌ప్లే చేయడంతో పాటు విక్రయించనున్నారు. సికింద్రాబాద్ పరేడ్‌మైదానంలో ఈ ఉత్సవాల సందర్భంగా నిరంతర సాంస్కృతిక కార్యక్రమా లు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వ కార్యదర్శి బుర్రా వెంకటేశం తెలిపారు.ఫెస్టివల్‌ను దృష్టిలో పెట్టుకుని పరేడ్ మైదానంలో హ్యాండిక్రాఫ్ట్ స్టాల్స్‌ను ఏర్పాటుచేస్తున్నారు.

గురుకుల ఉపాధ్యాయులపై ఒత్తిడి తగ్గించాలి

హైదరాబాద్, ఆంధ్రప్రభ: గురుకుల పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులపై ఒత్తిడిని తగ్గించేలా చర్యలు తీసుకోవాలని టీఎస్ యూటీఎఫ్ డిమాండ్ చేసింది. వివిధ యాజమాన్యాలలో నిర్వహిస్తున్న గురుకులాల్లో పనిచేస్తున్న గురుకుల ఉపాధ్యాయుల సదస్సు శనివారం టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో సంఘం అధ్యక్షులు సీహెచ్ రాములు అధ్యక్షతన జరిగింది. సమావేశంలో టీఎస్ యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి చావ రవితోపాటు గురుకుల ఉపాధ్యాయులు మార్గరెట్, విజయలక్ష్మి, గణేష్ గౌడ్, దామోదర్, ఎల్లయ్య, సృజన, సుమిత్ర, నరేందర్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు. కొత్త గురుకులాలకు సొంత భవనాలను నిర్మించాలని, ఉపాధ్యాయులకు పాఠశాల ప్రాంగణంలోనే వసతి సౌకర్యం కల్పించాలని, నైట్ డ్యూటీల నుంచి ఉపాధ్యాయులను మినహాయించి కేర్ టేకర్లను నియమించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులకు విద్యా హక్కు చట్టం నిర్దేశించిన పని గంటలను అమలు చేయాలన్నారు. ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుంచి తప్పించాలన్నారు. గురుకులాలన్నింటినీ విద్యాశాఖ పరిధిలోకి తీసుకొచ్చి కామన్ డైరక్టరేట్‌ను ఏర్పాటు చేయాలన్నారు.

యువత ఆర్థికాభివృద్ధికి కామన్‌వెల్త్ కృషి



హైదరాబాద్, ఆంధ్రప్రభ: యువత ఆర్థికాభివృద్ధి కోసం కామన్ వెల్త్ కృషి చేస్తోందని కామన్‌వెల్త్‌లో యూకే ప్రభుత్వ ప్రతినిధి ఫిలప్ పార్హమ్ స్పష్టం చేశారు. కామన్ వెల్త్‌లో 53 దేశాలున్నాయని వాటిలో 60 శాతం యువత ఉందని అన్నారు. అందుకే యువత ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తున్నట్టు తెలిపారు. రూబరు సంస్థ జాతీయ యువ దినోత్సవం సందర్భంగా శనివారం మదీనా స్కూల్‌లో కామన్ వెల్త్ విజన్ ఆఫ్ యూత్ ఇన్ లీడింగ్ సోషల్ ఛేంజ్ అనే అంశంపై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆండ్రూ ఫ్లెమింగ్, కెఎమ్ అరీఫుద్దీన్, హేమ ఖాత్రి తదితరులు పాల్గొన్నారు. ప్రతి ఒక్కరికీ నాణ్యమైన విద్యను అందించడం వారు రుజుమార్గంలో పయనించేలా చేయడం కామన్‌వెల్త్ ఉద్దేశమన్నారు. యువత ఉగ్రవాదం వైపు ఆకర్షితులు కాకుండా ఆడపిల్లలపై హింసను అరికడుతూ ఆడపిల్లల చదువుకు ప్రాధాన్యం ఇస్తున్నట్టు తెలిపారు.

'క్యూనెట్' డొంక కదులుతోంది...

బాలీవుడ్ సెలబ్రిటీస్‌పైనా చర్యలకు బాధితుల అసోసియేషన్ డిమాండ్



హైదరాబాద్, ఆంధ్రప్రభ: క్యూనెట్ కేసు దర్యాప్తులో సైబరాబాద్ పోలీసులు వేగం పెంచారు. కేసుతో సంబంధం ఉన్నవాళ్లందరినీ విచారించేందుకు సిద్ధమవుతున్నారు. హాంకాంగ్ కేంద్రంగా కార్యకలాపాలు కొనసాగించిన క్యూనెట్ భారతదేశంలోని ప్రధాన పట్టణాల్లో విస్తరించి భారీ మోసాలకు పాల్పడిన సంగతి తెలిసిందే. సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల తోపాటు నిరుద్యోగ యువతను, గృహిణులను నమ్మించి నట్టేట ముంచింది. ఆర్థిక నేరాల బాధితుల సంఘం పేరుతో కొందరు సైబరాబాద్ కమిషనర్‌ను కలిసి తమ గోడు వెల్లబోసుకున్నారు. శనివారం క్యూనెట్ బాధితులు అనూజా, గురుప్రీత్ సింగ్, విశాల్ ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడారు. తాము ఏవిధంగా మోసపోయిందీ వివరించారు. క్యూనెట్ తరపున ప్రచారం చేసిన బాలీవుడ్ సెలబ్రిటీలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు. అనిల్ కపూర్, షారూక్ ఖాన్, అమీర్ ఖాన్, బొమన్ ఇరానీ, వివేక్ ఓబెరాయ్, జాకీ షరాఫ్, యువరాజ్ సింగ్, పూజా హెగ్డె తదితరులపై సత్వరమే చర్యలు తీసుకో వాలని కోరారు. క్యూనెట్ సంస్థ మొత్తంగా 20 లక్షల మంది నుంచి 20 వేల కోట్లు లూటీ చేసింన్నారు. కాగా, ఇప్పటి వరకు 60 మంది నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ప్రధాన నిందితుడు విజయ ఈశ్వరన్ చిక్కితే క్యూనెట్ కేసులో పూర్తి స్థాయిలో డొంక కదలడం ఖాయంగా కనిపిస్తోంది.

విద్యుదాఘాతంతో రైతు మృతి



గూడూరు, ప్రభన్యూస్: తన మొక్కజొన్న చేనును వణ్యప్రాణుల భారీ నుంచి కాపాడేందుకు ఉచ్చు వేయగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంకు గురై నీలబోగి క్రిష్ణ (33) మృతిచెందారని గ్రామస్థులు, కుటుంబ సభ్యులుతెలిపారు. వారు తెలిపిన వివరాలు ఇలా న్నాయి. మహబూబాబాద్ జిల్లా, గూడూరు మండల పరిధిలోని సీతానగర్ గ్రామానికి చెందిన నీలబోగి కృష్ణ తన మొక్కజొన్న చేను అడవి పందులు పాడు చేస్తుండగా వాటి నుంచి రక్షించేందుకు గ్రామసమీపంలోని మేదరలొద్ది ప్రాంతంలోని తన మొక్కజొన్న చేను వద్ద ఉచ్చువేస్తుండగా విద్యుత్ తీగలు తగిలి షాక్‌కు గురై మృతిచెందాడు. కుటుంబసభ్యులు చేనువద్దకు పోయి చూడగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెంది ఉన్నాడని రోదిస్తూ తెలిపారు.. దీనిని గమనించిన గ్రామస్థులకు బోరున విలపించారు. మృతుడికి భార్య సరిత, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

ఆర్టీసీ బస్సు కలకలం.. ఒకరి మృతి



హైదరాబాద్, ఆంధ్రప్రభ: సికింద్రాబాద్‌లో ఆర్టీసీ బస్సు బీభత్సం సృష్టించింది. ప్యాటీ కూడలి నుంచి సికింద్రాబాద్ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు గడియారం కూడలి వద్దకు రాగానే అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొంది. ఎదురుగా వస్తున్న ఆటో, ద్విచక్రవాహనాలపైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే దుర్మరణం చెందగా, ఆలేరు ప్రాంతానికి చెందిన దానమ్మ, బోయినపల్లికి చెందిన శ్రీనివాస్, మేడ్చల్‌కు చెందిన శ్రీనులకు గాయాలయ్యాయి. మృతుడి వివరాలు తెలియాల్సి ఉంది. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. బస్సు బ్రేకులు ఫెయిల్ కావడం వల్లే ఈ ఘటన జరిగిందని బస్సులోని ప్రయాణీకులు చెబుతున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత బస్సు 500 మీటర్ల మేర అలాగే దూసుకెళ్లి మెట్రో పిల్లర్‌ని ఢీకొని ఆగింది. ఆ సమయంలో బస్సులో 60 మంది ప్రయాణీకులు ఉన్నారు. ప్రమాదం జరగడంతో సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ప్రాంతంలో భారీగా ట్రాఫిక్ జాం అయింది. కాగా, గాయపడ్డ వారి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

వీధికుక్క దాడిలో చిన్నారి మృతి



చింతలమానేపల్లి, ప్రభన్యూస్: ఆసిఫాబాద్ జిల్లా, చింతలమానేపల్లి మండలంలోని బాబాసాగర్ గ్రామంలో వీధికుక్కల దాడిలో చిన్నారి బలైంది. గ్రామానికి చెందిన శ్యామ్‌రావుకు చెందిన గేదెపై దాడిచేసి అనంతరం బక్రె మల్లేష్ కుమార్తెపై దాడిచేసింది. అక్కడి నుంచి శుక్రవారం మధ్యాహ్నం సమయంలో జాడి తిరుపతి స్వప్నల కూతురైన జాడి సింధు(18నెలలు) ఇంటి ముందు ఆడుకుంటుండగా ఆ ప్రాంతానికి వచ్చిన వీధి కుక్క ఒక్కసారిగా బాలికపై కన్నతల్లి చూస్తుండగానే గాయపర్చింది. హుటాహుటిన బాలికలను సమీపంలోని కౌటాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్స నిర్వహించి వైద్యులు మెరుగైన చికిత్స కోసం కాగజ్‌నగర్‌కు తరలించారు. అప్పటికే బాలిక పరిస్థితి విషమించడంతో మృతి చెందింది.

అమెరికా అధ్యక్ష ఎన్నికల బరిలో హిందూ మహిళ తులసి గబార్డ్



వాషింగ్టన్: అమెరికా కాంగ్రెస్‌కు ఎన్నికైన తొలి హిందూ నేత తులసి గబార్డ్ 2020లో జరిగే అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేయాలని నిర్ణయం తీసుకొనట్లు ప్రకటించారు. వచ్చే వారం దీనిపై అధికారిక ప్రకటన చేయనున్నట్లు ఆమె తెలిపారు. హవాయి నుంచి అమెరికా ప్రతినిధుల సభకు ప్రాతినిధ్యం వహిస్తున్న తులసి గబార్డ్ శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ఈ మేరకు తెలిపారు. 1981 ఏప్రిల్ 12న అమెరికాలోని లిలోలాలోలో జన్మించిన తులసి గబార్డ్(37) డెమోక్రటిక్ పార్టీ నుంచి పోటీకి దిగితున్న రెండో మహిళగా నిలవనున్నారు. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేస్తున్న తొలి హిందువు కూడా తులసి కావడం విశేషం. చిన్నతనంలోనే తులసి హిందూ మతంలోకి మారారు. ఒకవేళ ఆమె అధ్యక్ష ఎన్నికల్లో గలిస్తే..అమెరికా అధ్యక్షపదవిని చేపట్టే తొలి మహిళగా మాత్రమే కాకుండా అత్యంత పిన్న వయస్సులో అమెరికా అధ్యక్ష పదవిని చేపట్టినవారిగా నిలువనున్నారు. అంతేకాకుండా తొలి క్రిస్టియనేతర, తొలి హిందూ అధ్యక్షు పదవిని చేపట్టిన వ్యక్తిగా కూడా నిలువనున్నారు. మనం కలిసికట్టుగా నిలబడినప్పుడు ప్రతి ఒక్కరికి, దేశం కోసం మన ప్రేమను ఏకం చేసింది. మనం అధిగమించలేని సవాల్ అంటూ ఏది లేదు. మీరు నాతో చేరుతారా? అంటూ తులసి ట్వీట్ చేసింది. అమెరికా సైన్యం తరపున ఇరాక్ యుద్ధంలో కూడా తులసి పనిచేశారు. అయితే ఇప్పుడున్న పరిస్థితుల నేపథ్యంలో తులసి అధ్యక్ష పదవి చేపట్టే అవకాశం చాలా తక్కువగా ఉంటుందని అక్కడి రాజకీయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఎందుకంటే అమెరికా జనాభాలో హిందువులు ఒక శాతం కంటే తక్కువగా ఉండటం, వారు కూడా భారత్ నుంచి అక్కడికి వెళ్లినవారు కావడం కారనంగా తులసికి అవకాశం ఉండబోదని వారు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

మోడీ పాలనపై ప్రజల్లో అసహనం, ఆగ్రహం

- దుబాయ్‌లో ప్రవాస భారతీయులనుద్దేశించి మాట్లాడిన రాహుల్
- బీజేపీ ముక్త్ భారత్ నినాదం ఇవ్వడం లేదని వ్యాఖ్య
- ఒకే సిద్ధాంతం, ఒకే ఆలోచన సరైందికాదని వెల్లడి

దుబాయ్: ప్రధాని నరేంద్రమోడీ నాలుగున్నరేండ్ల పాలనలో దేశంలో అసహనం రాజ్యమేలుతున్నదని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ఆరోపించారు. రెండురోజుల దుబాయ్ పర్యటనలో ఉన్న రాహుల్ గాంధీ శుక్రవారం సాయంత్రం దుబాయ్ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో అక్కడి ప్రవాస భారతీయులను ఉద్దేశించి మాట్లాడారు. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ కు 2019 సహనపూరిత సంవత్సరం కాగా భారత్ లో నాలుగున్నరేళ్ల నుంచి ప్రజల్లో అసహం నెలకొందని ఆయన అన్నారు. ఒకే ఆలోచన, ఒకే సిద్ధాంతం సరైనది అనే భావన తప్పు అని రాహుల్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే అందరి ఆలోచనలకు పెద్ద పీట వేస్తామని తెలిపారు. పెద్ద నోట్ల రద్దు, జీఎస్టీ వంటి ప్రభుత్వ తప్పుడు ఆలోచనల కారణంగా భారత ఆర్థికవ్యవస్థ తీవ్రంగా దెబ్బతిందని తెలిపారు. భారతదేశం ముందు రెండు ప్రధాన సవాళ్లు ఉన్నాయని అన్నారు. అందులో ఒకటి నిరుద్యోగాన్ని రూపుమాపడం, రెండవది రైతులను ఆదుకోవడం అని అన్నారు. నిరుద్యోగాన్ని ఎదుర్కోవాలంటే భారీగా ఉద్యోగాలను సృష్టించాలని, తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్న రైతులను ఆదుకోవడానికి రెండో హరిత విప్లవం రావాల్సిన అవసరముందని రాహుల్ పేర్కొన్నారు. బీజేపీ కాంగ్రెస్ ముక్త్ భారత్ కోరుకొంటున్నదని..కానీ తాము బీజేపీ ముక్త్ భారత్ అనటం లేదని ఆయన తెలిపారు.దుబాయ్ నిర్మాణంలో భారతీయుల కృషి మరువలేనిదని చెప్పారు. తాను దుబాయ్ వచ్చింది మన్ కీ బాత్ గురించి చెప్పడానికి కాదని, మన్ కీ బాత్ వినడానికి అని రాహుల్ అన్నారు. భారత్ ఆశయాలను హృదయాల్లో దాచుకొని మీరు ఇక్కడికి వచ్చారు. నేను మరణించే వరకు నా చెవులు, గుండె, నా ఇంటి తలుపులు ఎల్లప్పుడూ మీ కోసం తెరిచే ఉంచాయి అని రాహుల్ ప్రవాస భారతీయులతో అన్నారు. ఈ రోజు భారత్ కులాలు, మతాలు, ప్రాంతాల వారీగా విడిపోయిందని, దీనికి ప్రధాన కారణం రాజకీయ కుట్రేనని తెలిపారు. వర్గాల వారీగా విడిపోయిన క్రికెట్ టీం మ్యాచ్ ను గెలుస్తుందా? అలాగే మతాలు, కులాల వారీగా విడిపోయిన దేశం విజయం సాధిస్తుందా? మళ్లీ భారత్ ను ఏకం చేయడానికి అందరం కలిసి ముందుకుసాగుదాం అని రాహుల్ చెప్పారు.



పూర్తి బలంతో పోటీ చేస్తాం

ఎస్పీ-బీఎస్పీ పొత్తు ప్రకటనపై కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ స్పందించారు. పూర్తి బలంతో కాంగ్రెస్ పార్టీ ఉత్తరప్రదేశ్‌లో పోటీ చేస్తుందని ఆయన స్పష్టం చేశారు. బీఎస్పీ చీఫ్ మాయావతి, ఎస్పీ చీఫ్ అఖిలేష్ యాదవ్‌పై తనకు అమితమైన గౌరవం ఉందన్నారు. బీఎస్పీ-ఎస్పీ రాజకీయ నిర్ణయం తీసుకున్నాయని, ఏం చేయాలనుకున్నా చేసే హక్కు వారికి ఉందని వ్యాఖ్యానించారు. ఉత్తరప్రదేశ్ ప్రజలకు ఇచ్చేందుకు తమవద్ద చాలా ఉందని రాహుల్ విశ్వాసం వ్యక్తం చేశారు.

బండెనక బండి... ఢీ!

- పొగమంచులో కనపడని రహదారి
- ఒకదాని వెనుక ఒకటిగా ఢీ
- రెండు మూడు చోట్ల ప్రమాదాలు.. 13 వాహనాలు ధ్వంసం
- ముగ్గురికి తీవ్రగాయాలు
- ఎన్‌హెచ్ 44పై ప్రమాదం



నందిగామ, ప్రభన్యూస్: పొగమంచు దుప్పటి కమ్మేసింది.. ముంచుకువస్తున్న మంచు తెరతో రోడ్లన్నీ కనిపించకుండా పోయాయి.. ఈ నేపథ్యంలో మంచు ముసుగులో శనివారం ఉదయం జాతీయ రహదారిపై ఒకదాని వెంట ఒకటి 13 వాహనాలు రోడ్డు ప్రమాదానికై గురయ్యాయి.. ఈ సంఘటనలో పలు వాహనాలు దెబ్బతినడంతో పాటు ముగ్గురికి తీవ్ర గాయాలు కాగా పలువురు గాయపడ్డారు. రంగారెడ్డిజిల్లా, షాద్‌నగర్ నియోజకవర్గంలోని నందిగామ మండలం బైపాస్ రోడ్డుపై ఈ ప్రమాదం చోటుచేసుకుంది.. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఇలా ఉన్నాయి..తెలంగాణ రాష్ట్రంలో దట్టంగా పొగమంచు కమ్ముకోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులను ఎదురుకుంటున్నారు. సంక్రాంతి పండగను పురస్కరించుకుని హైదరాబాద్ నుంచి వాహనదారులు తమ తమ గ్రామాలకు వెళ్ళేందుకు బయలుదేరగా ఉదయం బెంగళూరు ఎన్‌హెచ్ 44 జాతీయ రహదారి నందిగామ మండల పరిధిలోకి రాగానే రహదారి పూర్తిగా పొగమంచుతో కమ్ముకుని ఉండడంతో వాహనదారులకు దారి కనిపించక వేర్వేరు చోట్ల సుమారు 13 వాహనాలు ఢీకొన్నాయి. ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి.

Andhraprabha business 2018
బిజినెస్
BUSINESS

మార్కెట్లను మెప్పించని ఫలితాలు

● ఫలితాలు మెరుగ్గా ఉన్నా షేర్లలో కదలికలేదు ● చైనా-అమెరికా చర్చల వివరాల కోసం ఎదురుచూపులు ● క్యూ3 ఫలితాలు అంతంతేనా?

(ఆంధ్రప్రభ బిజినెస్‌డెస్క్): డిసెంబర్ 31, 2018 తర్వాత నుంచి అంటే జనవరి 1, 2019 నుంచి ఈ ఆర్థిక సంవత్సరం నాలుగవ త్రైమాసికంలోకి అడుగుపెట్టాం. దేశంలోని అతి పెద్ద కార్పొరేట్లు డిసెంబర్ త్రైమాసికం ఫలితాలను గత వారం నుంచి ప్రకటించడం మొదలుపెట్టాయి. అతి పెద్ద కంపెనీలు ఉదాహరణకు టీసీఎస్, ఇన్ఫోసిస్, ఇండస్‌ఇండ్ బ్యాంకు, బంధన్ బ్యాంకు, డెల్టా కార్పొరేషన్, టాటా ఎలెక్సీలాంటి పెద్ద కంపెనీలు క్యూ3 ఫలితాలు ప్రకటించేశాయి. ఈ కంపెనీలు మంచి ఫలితాలు ప్రకటించినా.. దానికి తగ్గట్లు స్టాక్‌మార్కెట్లో వీటి షేర్లలో కదలికలేదు. ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందనా ఇన్వెస్టర్లకు లాభాలు పంచిపెట్టలేకపోయింది.

ఉదాహరణకు టీసీఎస్ షేరునే తీసుకుందాం. గురువారం నాడు మార్కెట్లు ముగిసిన తర్వాత ఫలితాలు ప్రకటించింది. మూడవ త్రైమాసికంలో రికార్డుస్థాయిలో ఫలితాలు నమోదు చేసింది. రెవెన్యూ విషయానికి వస్తే గత 14 త్రైమాసికాల్లో ఎన్నడూలేని విధంగా రికార్డుబద్దలు కొట్టింది. అయినా శుక్రవారం స్టాక్‌మార్కెట్లో దీని షేరు 2.44 శాతం క్షీణించి రూ.1842 వద్ద ముగిసింది. శుక్రవారం మరో ఐటి దిగ్గజం ఇన్ఫోసిస్ ఫలితాలు వెల్లడించింది. క్యూ3లో 30 శాతం క్షీణించింది. అయితే బైబ్యాక్, డివిడెండ్ లాంటి ప్రకటించడం వల్ల సోమవారం నాడు దీని షేరు మార్కెట్లో ఎలా స్పందిస్తుందో వేచి చూడాల్సిందే. ప్రస్తుతం టీసీఎస్, ఇన్ఫోసిస్ ఫలితాలను బట్టి చూస్తే ఈ ఏడాది ఐటి రంగం నెగెటివ్‌గా ఉంటుందా అనే అనుమానం కలుగుతోంది. ఎందుకంటే అమెరికా ఆర్థిక వ్యవస్థ మందగమనంలో కొట్టుమిట్టాడంతో దాని ప్రభావం ఐటి రంగంపై పడిందని చెబుతున్నారు. భారత్ నుంచి జరిగే ఐటి ఎగుమతులకు కీలకమైన మార్కెట్ అమెరికానే. అయితే ఐటి రంగానికి మంచి రోజులు ప్రస్తుతం లేవని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి.

ఐటి రంగాన్ని పక్కన పెడితే బ్యాంకింగ్ రంగానికి వద్దాం. ప్రైవేట్ బ్యాంకు ఇండస్‌ఇండ్ బ్యాంకు ఏడాది ప్రాతిపదికన చూస్తే డిసెంబర్ త్రైమాసికం నికరలాభంలో 5 శాతం వృద్ధిని సాధించింది. బ్యాంకు మరింత లాభాలను దక్కించుకోవడంలో విఫలమైంది. ఎందుకంటే ఇండస్‌ఇండ్ బ్యాంకు ఐఎల్‌అండ్‌ఎఫ్‌సీ డిఫాల్ట్ తర్వాత ఏర్పడిన పరిస్థితులను తమకు అనుకూలంగా మలుచుకోవడంతో విఫలం అయ్యింది. ఫలితాల తర్వాత కూడా దీని షేరు ఒత్తిడికి గురైంది. బంధన్ బ్యాంకు విషయానికి వస్తే ఐఎల్‌అండ్‌ఎఫ్‌ఎస్ ప్రభావం దీనిపై కూడా ఉంది. ఐఎల్‌అండ్‌ఎఫ్‌ఎస్‌కు ఇచ్చిన రుణాలను ఎన్‌పీఏ కింద పరిగణించినా.. బ్యాంకు మాత్రం నికరలాభంలో 10 శాతం వృద్ధిని సాధించింది.

ఐటి దిగ్గజాలు టీసీఎస్ ఏడాది ప్రాతిపదికన చూస్తే 24.1 శాతం వృద్ధిని సాధిస్తే.. టాటా ఎలెక్సీ కేవలం 5.14 శాతం మాత్రమే నికరలాభాన్ని ప్రకటించింది. మార్జిన్‌లపై ఒత్తిడి కనిపించింది.

గ్లోబల్ మార్కెట్ల పరిణామాలే కారణం

ప్రస్తుతం గ్లోబల్ మార్కెట్లో జరిగే పరిణామాలు అంతా సవ్యంగా లేవు. ఉదాహరణకు అమెరికా - చైనాల మధ్య వాణిజ్య చర్చలు ఈ వారంలో ముగిశాయి. చర్చలు వరుసగా మూడో రోజు పొడిగించారు. దీన్ని బట్టి చూస్తే పరిస్థితులు అనుకూలంగా లేవని తెలుస్తోంది. సమావేశం వివరాలు బహిర్గతం చేయలేదు. వివరాలు ఆలస్యం కావడం వల్ల పరిస్థితులు అనుకూలంగా లేవని తెలుస్తోంది. ఇరు దేశాల మధ్య క్లోజ్డ్ డోర్ సమావేశాలు జరిగాయి. ఒక వేళ చర్చలు సఫలం అయితే తక్షణమే బహిర్గతం అయ్యేవి. వివరాలు ఇప్పటికే ప్రపంచం మొత్తం తెలిసేవి. చర్చల వివరాలు ఇప్పటికిప్పుడు తెలిసే అవకాశాలు కనిపించడం లేదు. చర్చలు విఫలం అయితే మాత్రం మార్కెట్లు భారీగా పడిపోతాయి. మొత్తానికి మార్కెట్ విశ్లేషకులు మాత్రం 'ఆల్ ఈజ్ నాట్ వెల్' అంటున్నారు.

TATA CONSULTANCY SERVICES
tcs 50 Experience energy ASIA PACIFIC

గత వారం జరిగిన కీలక ఘట్టాలు

గత వారం మరో కీలక అంశానికి తెరలేసింది. ఎన్‌బీఎఫ్‌సీని బంధన్ బ్యాంకు టేకోవర్ చేసింది. గృహ ఫైనాన్స్‌ను మొత్తం వాటాల ద్వారా బంధన్ బ్యాంకు ఒప్పందం చేసుకుంది. టేకోవర్‌కు ప్రధాన కారణం బ్యాంకు ప్రమోటర్ తమ వాటాలను తగ్గించుకోవడానికి, అలాగే హౌసింగ్ ఫైనాన్స్ పోర్టుఫోలియోను విస్తరించడానికి ఈ నిర్ణయం తీసుకుంది. తాజా నిర్ణయంతో బ్యాంకులో ప్రమోటర్ల వాటా 60 శాతం నుంచి 40 శాతానికి దిగివస్తుంది. అయినా ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం చూస్తే ప్రమోటర్ల వాటా పరిమితికంటే ఎక్కువగానే ఉంది. మరో బ్యాంకు ఐడీఎఫ్‌సీ బ్యాంకు, క్యాపిటల్ ఫస్ట్ విలీనం గత నెలలో పూర్తయింది. శనివారం నుంచి పేరు కూడా మారింది. ఐడీఎఫ్‌సీ క్యాపిటల్ ఫస్ట్ పేరుతో కొత్త కంపెనీగా అవతరించింది. బ్యాంకులతో ఎన్‌బీఎఫ్‌సీ కంపెనీలు విలీనం అయితే కొత్తగా ఏర్పడే కంపెనీ చేతిలో మూలధనం ఎక్కువగా ఉంటుంది. తగినంత నిధులు ఉంటే మార్కెట్లో పోటీ కంపెనీలకు గట్టి పోటీ ఇవ్వడానికి ఆస్కారం ఉంటుంది. మరిన్ని విలీనాలకు ఆస్కారం : ఇదిలా ఉండగా ప్రస్తుతం బ్యాంకింగ్ రంగం సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నాయి. ఎన్‌బీఎఫ్‌సీల వద్ద ద్రవ్యకొరత ఏర్పడింది. దీంతో లాభాల మార్జిన్ తగ్గింది. కాబట్టి రాబోయే రోజుల్లో మరిన్ని విలీనాలు ఆస్కారం ఉంటుందని చెబుతున్నారు. విలీ నం అయ్యే కంపెనీలతో ప్రైవేట్ బ్యాంకులు గట్టిపోటీని ఎదు ర్కొవాల్సి వస్తుందని మార్కెట్ నిపుణులు అభిప్రాయపడు తున్నారు. ప్రస్తుతం స్టాక్ మార్కెట్ల ట్రేడింగ్ గురించి నిపుణులు ప్రస్తావిస్తూ.. ఇన్వెస్టర్లు ఆచితూచి వ్యవహరిం చాలని.. సూచి కిందికి దిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నా యని.. షేర్లు పెరిగినప్పుడు వీలైనంత వరకు తక్కువ నష్టంతో బయటపడ్డమే ఉత్తమమని చెబుతున్నారు. రాబోయే వారాల్లో మార్కెట్లు ఒడిదుడుకులకు గురయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా అమెరికా - చైనాల వాణిజ్య చర్చల గురించి గ్లోబల్ ఇన్వెస్టర్లు ఆసక్తితో ఎదురుచూస్తున్నారు. ఈ చర్చల వివరాలు గ్లోబల్ మార్కెట్లపై ప్రభావం చూపుతాయని చెబుతున్నారు. షేర్లు అందుబాటు ధరల్లోకి వస్తే కొనుగోలు చేయడం మంచి పనే. ప్రస్తుతం కిర్పొరేట్ ఫలితాల సీజన్ మొద లైంది. ఫలితాలు కూడా పెద్ద ప్రోత్సహకరంగా ఉండే అవకా శాల్లేవని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ వారంలో అతి పెద్ద కంపెనీల ఫలితాలు వెలువడనున్నాయి. వాటిలో విప్రో, ఎస్‌బీఐ లైఫ్ ఇన్స్యూరెన్స్, జీ ఎంటర్‌టెయిన్‌మెంట్, ఐసీఐసీఐ లొంబార్డ్, ఎల్‌అండ్‌టి ఇన్ఫోటెక్, ఏయు స్మాల్‌ఫైనాన్స్ బ్యాంకు, మైండ్‌ట్రీ, ఐసీఐసీఐ సెక్యూరిటీస్‌లు క్యూ3 ఫలితాలు ప్రకటించబోతున్నాయి. దాని ప్రభావం మార్కెట్లపై కనిపించబోతోంది.

టీటా గ్లోబల్ అధ్యక్షుడిగా సందీప్ కుమార్ మక్తాలా



హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అసోసియేషన్ (టీటా) గ్లోబల్, తెలంగాణ వర్కింగ్ కమిటీలకు నూతన కార్యవర్గాన్ని ప్రకటించింది. టీటా గ్లోబల్ అధ్యక్షుడిగా సందీప్‌కుమార్ మక్తాలా, ఉపాధ్యక్షుడిగా రాణా ప్రతాప్, ప్రధాన కార్యదర్శులుగా అశ్విన్ సీవీ, నవీన్ చింతల, కోశాధికారిగా రవి లెల్లా, కార్యదర్శిగా శ్రీలత చింతల ఎన్నికయ్యారు. టీటా ఎన్నికలకు సి.విఠల్ రిటర్నింగ్ అధికారిగా వ్యవహరించారు. రాష్ట్ర కార్యదర్శిగా జ్ఞానాకర్‌రెడ్డి, గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శిగా నాగరాజు మరియాలలు ఎన్నికయ్యారు. ఈ కమిటీలకు మరో 30 మంది వివిధ విభాగాలకు సభ్యులుగా, కన్వీనర్లు ఎంపికయ్యారు. గ్లోబల్, తెలంగాణ వర్కింగ్ కమిటీల నియామక ఏర్పాట్లు పూర్తైనందున ప్రపంచవ్యాప్తంగా తమ కార్యకలాపాలను వేగవంతం చేస్తామని సందీప్‌కుమార్ మక్తాల చెప్పారు. 2019-22 కాలానికి ఈ కమిటీలు పనిచేస్తాయని, ఇప్పటికే టీటా వివిధ దేశాలు, రాష్ట్రాలకు, తెలంగాణలోని జిల్లాలకు అధ్యక్ష, కార్యదర్శులను ప్రకటించామని ఆయన తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా నిర్ణయాలు తీసుకునే బాధ్యతను గ్లోబల్ వర్కింగ్ కమిటీ కలిగి ఉంటుందని రిటర్నింగ్ అధికారి అశ్విన్‌చంద్ర శనివారం విలేకరుల సమావేశంలో చెప్పారు. విదేశాలలోని వీసాల సమస్యలను టీటా సభ్యులు పరిష్కరించేందుకు ప్రయత్నిస్తారని ఆయన చెప్పారు. తెలంగాణలో డిజిటల్ లిటరసీ, ఇన్నోవేషన్, ఇంక్యుబేషన్‌లలో టీటా గ్లోబల్ కమిటీ మార్గదర్శకం వహిస్తుందని అశ్విన్‌చంద్ర తెలిపారు.

ఐడీఎఫ్‌సీ బ్యాంకు ఇక ఐడీఎఫ్‌సీ ఫస్ట్

IDFC
IDFC BANK CAPITAL FIRST

న్యూఢిల్లీ : ప్రైవేట్ రంగానికి చెందిన ఐడీఎఫ్‌సీ బ్యాంకు పేరు మారింది. శనివారం నుంచి అంటే జనవరి 12వ తేదీనుంచి దీని పేరు ఇక నుంచి ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంకు లిమిటెడ్‌గా అమల్లోకి వస్తుంది. రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్, చెన్నై సర్టిఫికేట్ కూడా ఇచ్చినట్లు బ్యాంకు బీఎస్‌ఈకి సమాచారం అందించింది. ఇదిలా ఉండగా ఐడీఎఫ్‌సీ బ్యాంకు విషయానికి వస్తే నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీ.. క్యాపిటల్ ఫస్ట్ రెండు సంస్థలు డిసెంబర్ 18వ తేదీన విలీనం అయ్యాయి. రెండు కంపెనీలు విలీనం తర్వాత కొత్తగా ఏర్పాటైన కంపెనీ ఆస్తుల విలువ రూ.1.03 లక్షల కోట్లకు చేరుతుంది. విలీనం తర్వాత ఐడీఎఫ్‌సీ బోర్డు క్యాపిటల్ ఫస్ట్ లిమిటెడ్ వ్యవస్థాపకుడు, చైర్మన్ వి వైద్యానాధన్‌ను కొత్తగా ఏర్పడిన కంపెనీకి మేనేజింగ్ డైరెక్టర్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ నియమిస్తూ ఆదేశాలు జారీ చేసింది. కాగా ఈ విలీనం తర్వాత కొత్తగా ఏర్పడిన కంపెనీ చేతిలో సుమారు 7.2 మిలియన్ కస్టమర్లున్నారు. దేశవ్యాప్తంగా 203 బ్యాంకు బ్రాంచీలు, 129 ఎటీఎంలు, 454 గ్రామీణ బిజినెస్ కరస్పాండెట్లు ఉంటారు.

అవెన్యూ సూపర్‌మార్ట్ లాభం 257 కోట్లు

న్యూఢిల్లీ : అవెన్యూ సూపర్‌మార్ట్స్ .. ప్రస్తుతం దేశవ్యాప్తంగా డి-మార్ట్ సూపర్‌మార్కెట్ చెయిన్ వ్యాపారాన్ని నిర్వహిస్తోంది. డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో నికరలాభంలో 2.1శాతం వృద్ధితో రూ.257 కోట్లు ప్రకటించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.252 కోట్లు ఆర్జించినట్లు శనివారం నాడు తెలిపింది. సమాచారాన్ని బీఎస్‌ఈకి అందజేసింది. ఇక రెవెన్యూ విషయానికి వస్తే రూ.5,451 కోట్లకు ఎగబాకగా... ఏడాది క్రితం ఇదే త్రైమాసికంలో రూ.4,094 కోట్లుగా నమోదైంది. రెవెన్యూలో 33.2 శాతం వృద్ధి కనిపించింది. ఎర్నింగ్‌ఫర్ షేర్ విషయానికి వస్తే క్యూ3లో రూ.4.12కు ఎగబాకగా.. ఏడాది క్రితం రూ.4.03 గా నమోదైంది. డిసెంబర్ త్రైమాసికంలో కంపెనీ మొత్తం నాలుగు స్టోర్‌లను ఏర్పాటు చేసింది. ఫలితాలపై కంపెనీ సీఈవో, మేనేజింగ్‌డైరెక్టర్ నేవైల్లీ నోరోహా మాట్లాడుతూ.. కంపెనీ లాభాలు జోరుగా ఉన్నాయని,, అయితే పన్ను చెల్లించిన తర్వాత లాభాలు ఏడాది ప్రాతిపదికన చూస్తే ఫ్లాట్‌గా కనిపించిందన్నారు. దీనికి ప్రధాన కారణం కొన్ని వస్తువుల ధరలను తగ్గించడంతో లాభాల మార్జిన్ కాస్తా తగ్గిందని ఆయన వివరించారు. నిర్వహణా వ్యయం కాస్తా పెరిగిందని.. ముఖ్యంగా భవనాలు తదితర మౌలికరంగంతో పాటు సిబ్బందిపై కొంత వ్యయం జరిగిందని ఆయన వివరించారు. డిసెంబర్ 2018 నాటికి కంపెనీకి మొత్తం 164 స్టోర్లున్నాయి. రిటైల్ వ్యాపారం మొత్తం 4.3 మిలియన్ చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్వహిస్తోంది. కంపెనీకి మహారాష్ట్ర, గుజరాత్, దమన్, ఆంధ్రప్రదేశ్‌తో పాటు ఇతర రాష్ట్రాల్లో స్టర్‌లను నిర్వహిస్తోంది.

మళ్లీ బైక్‌లదే హవా!

ద్విచక్ర వాహనాలు నడిపే వారి అభిరుచుల్లో మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. దశాబ్దకాలం పాటు స్కూటర్లపై ఉన్న మోజు క్రమంగా తగ్గిపోతోంది. దశాబ్దంపైనే ద్విచక్ర వాహనాల మార్కెట్లో స్కూటర్లదే హవా. ప్రస్తుతం సీన్ రివర్స్ అయ్యింది. మళ్లీ మోటార్‌సైకిళ్ల హవా నడుస్తోంది. గతేడాది గణాంకాలన గమనిస్తే.. ఇది పక్కాగా తెలిసిపోతోంది. గ్రామీణ ప్రాంతాల్లో బైక్‌లకు ఉన్న డిమాండ్ అంతా ఇంతాకాదు.

మోటార్ సైకిళ్ల అమ్మకాలు చూస్తే గతేడాది ఏకంగా 15 శాతం పెరిగి 13.78 మిలియన్ యూనిట్లకు చేరాయి. అదే స్కూటర్ల విషయానికి వస్తే 9 శాతం పెరిగి 6.95 మిలియన్ యూనిట్లకు మాత్రమే పరిమితమయ్యాయని ఆటో పరిశ్రమ తాజా గణాంకాలను బట్టి తెలుస్తోంది. మొత్తానికి చూస్తే ద్విచక్ర వాహనాల గత ఏడాది మొట్టమొదటిసారి 20 మిలియన్ మార్కును దాటిపోయింది. గతేడాది 13 శాతం వృద్ధితో 21.6 మిలియన్ యూనిట్ల ద్విచక్ర వాహనాలు అమ్ముడుపోయాయి.



స్కూటర్లపై వ్యయం ఎక్కువ

ఆటో రంగానికి చెందిన నిపుణుల అంచనా ప్రకారం పట్టణ ప్రాంతాల్లో నివసించే వారు స్కూటర్లు కొనుగోళ్లను వాయిదా వేసుకుంటున్నారని, దీనికి ప్రధాన కారణం స్కూటర్ల మెయింటెనెన్స్ ఎక్కువ అని చెబుతున్నారు. మోటార్ సైకిళ్ల విషయానికి వస్తే రోజువారి అవసరాలకు చిరు వ్యాపారులు, రైతులు, గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారు కొనుగోలు చేస్తున్నారు. అదే స్కూటర్ అయితే కుటుంబం ఉన్న వారు కొనుగోలు చేస్తున్నారని, ఫెడరేషన్ ఆఫ్ ఆటోమొబైల్ డీలర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అశిష్‌కాలే వివరించారు. ఇక స్కూటర్ల విషయానికి వస్తే మెజారిటి ప్రజలు పట్టణ ప్రాంతాల్లో నివసించే వారు మహిళలు ఎక్కువగా వినియోగిస్తారు. గత ఏడాది నుంచి పెట్రోల్ ధరలు పెరగడంతో పాటు బీమా ఖర్చులు పెరిగిపోవడంతో స్కూటర్ల కొనుగోలును చాలా మంది వాయిదా వేసుకుంటున్నారు. దీంతో స్కూటర్ల అమ్మకాలు తగ్గాయని కాలే వివరించారు.


డబుల్ డిజిల్‌కు చేరిన బైక్‌లు

ఇక బైక్ విషయానికి వస్తే అమ్మకాలు డబుల్ డిజిల్ చేరాయి. ఇప్పటి వరకు దేశీయ మార్కెట్లో స్కూటర్ల హవా నడిస్తే.. దాని స్థానంలో మోటార్‌సైకిళ్లు ఆక్రమిం చాయి. గతేడాది మోటార్‌సైకిళ్ల అమ్మకాలు జోరందుకోవడంతో బైక్‌ల వాటా 63.8 శాతానికి ఎగబాకింది. గత మూడేళ్లలో ఇదే అత్యధికం. ఇక స్కూటర్ల వాటా విషయానికి వస్తే 2017లో 33.4 శాతం నుంచి 2018 నాటికి 32 శాతానికి దిగివచ్చిం ది. ఇక కస్టమర్ల అభిరుచి మోటా ర్‌సైకిళ్ల వైపు నకు మళ్లింది.

గ్రామీణ ప్రాంతాల్లో డిమాం డ్ పెరిగింది. ప్రభుత్వం రైతులకు పెద్దమొ త్తం లో మద్దతు ప్రకటిం చడం ఒక కారణ మైతే.. ప్రస్తుతం మార్కె ట్లో ఆకర్షణీ యమైన మోడల్స్ కొనుగోలు దార్ల ను ఊరిస్తున్నాయమని హీరోమోటోకార్ప్ అధికార ప్రతినిధి చెప్పారు. స్కూటర్ల విషయానికి వస్తే.. 100 సీసీ 110 సీసీ మోడల్స్ స్కూటర్లు అమ్మ కాలు క్రమంగా తగ్గుముఖం పడుతున్నాయని చెప్పారు. అయి తే ఇతర స్కూటర్ల కంపెనీలు మాత్రం దీనిపై ఇంకా స్పందించలేదు.

రూ.1,500 కోట్లు వసూలు చేస్తాం

● సిండికేట్ బ్యాంకు ధీమా



హైదరాబాద్: ప్రభుత్వరంగానికి చెందిన సిండికేట్ బ్యాంకు సెప్టెంబర్ 2018 చివరి నాటికి గరిష్ఠ ఎన్‌పీఏ 12.9 శాతం, నికర ఎన్‌పీఏ 6.8 శాతంగా నమోదయ్యాయి. వచ్చే మూడు నెలల నుంచి ఆరు నెలల కాలంలో రూ.1,500 కోట్ల మొండిబకాయిలు వసూలుచేస్తామని బ్యాంకు మేనేజింగ్ డైరెక్టర్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈవో) మృత్యుంజయ మహాపాత్ర ధీమా వ్యక్తం చేశారు. శనివారం నాడు ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. వివిధ రకాల పద్ధతులను వినియోగించి మొండిబకాయిలను వసూలు చేస్తామని చెప్పారు. మొండిబకాయిలు వసూలు చేయడానికి ప్రత్యేకంగా 1,500 మంది సిబ్బందిని ఎంపిక చేశామని, దీనికి తోడుగా ప్రత్యేకంగా ఎనిమిది బ్రాంచీలను ఏర్పాటు చేశామని.. వీరిని ఎప్పటికప్పుడు సమాచారాన్ని కార్పొరేట్‌కార్యాలయానికి అందించాల్సి ఉంటుంద న్నారు. ఈ బకాయిలన్నీ ఎన్‌సీఎల్‌టి, నాన్ ఎన్‌సీఎల్‌టి సెగ్మెంట్‌ల ద్వారా వసూలు చేస్తామని ఆయన వివరించారు.

సెప్టెంబర్ 2018 చివరి నాటికి బ్యాంకు గరిష్ట ఎన్‌పీఏ 12.9 శాతం, కనిష్ఠ ఎన్‌పీఏ 6.8 శాతంగా తేలాయి. ఎన్‌పీఏల్లో ఎక్కువగా వ్యవసాయ రుణాలున్నాయని, రుణమాఫీల వల్ల వ్యవసాయరంగానికి ఇచ్చిన మొండిబకాయిలు 14 శాతానికి ఎగబాకే అవకాశాలున్నాయన్నారు. మొండిబకాయిలు వసూలు చేస్తూనే.. అదే సమయంలో కొత్తగా రిటైల్, సూక్ష్మ, చిన్న మధ్య తరహా వ్యాపారులకు పెద్దమొత్తంలో రుణాలు ఇవ్వడంపై ఫోకస్ పెడుతున్నామని, దీంతో వచ్చే జూన్ నాటికి బ్యాంకు లాభాలబాట పడుతుందన్నారు. తన అంచనా ప్రకారం మార్చి చివరి నాటికి బ్రేక్ ఈవెన్ అవుతుందని, అటు తర్వాత జూన్ నాటికి బ్యాంకు లాభాల బాటపడుతుందన్నారు. నికరవడ్డీ మార్జిన్ (ఎన్‌ఐఎం) వచ్చే రెండుత్రైమాసికాల్లో 2.25 శాతం నుంచి 2.5 శాతానికి ఎగబాకుతుందన్నారు. ఇదిలా ఉండగా సెప్టెంబర్‌తో ముగిసిన ప్రథమార్థంలో బ్యాంకు నికరనష్టం రూ.2,285 కోట్లకు చేరింది. అంతకు ముందు ఏడాది ఇదేకాలంలో రూ.158 కోట్ల నష్టం చవిచూసింది.

మూలధనం : ఇదిలా ఉండగా సిబ్బందికి షేర్లను జారీ చేసి రూ.500 కోట్లు (ఎంప్లాయీస్ స్టాక్ పర్చేజ్ (ఈఎస్‌పీపీ)స్కీం సేకరిస్తుంది. మూలధనం సేకరించడానికి ఉద్యోగులకు సుమారు 300 మిలియన్ షేర్లను జారీ చేస్తుంది. ఈ తంతు జనవరి - ఫిబ్రవరి నాటికి పూర్తి చేస్తామని మహాపాత్ర వివరించారు. ఇదిలా ఉంగా అక్టోబర్ నుంచి డిసెంబర్ 2018 నాటికి ప్రభుత్వం రూ.2,360 కోట్ల మూలధనం సమకూర్చింది.

ఎస్‌బ్యాంక్ నాన్ ఎగ్జిక్యూటివ్ తాత్కాలిక చైర్మన్‌గా బ్రహ్మదత్


న్యూఢిల్లీ: ప్రైవేట్ బ్యాంకు ఎస్ బ్యాంకు నాన్ ఎగ్జిక్యూటివ్ పార్ట్‌టైం చైర్మన్‌గా బ్రహ్మదత్‌ను శనివారం నియమించినట్లు ఒక ప్రకటనలో పేర్కొంది. జనవరి 11, 2019వ తేదీన రిజర్వుబ్యాంకు ఆఫ్ ఇండియా ఒక లేఖలో బ్యాంకింగ్ నియంత్రణా చట్టం 1949 ప్రకారం దత్ నియామకాన్ని ఆమోదిస్తున్నట్లు లేఖలో పేర్కొంది. ఆయన బోర్డులో జులై 4, 2020 వరకు లేదా 70 ఏళ్ల వయస వరకు ఆయన పదవిలో కొనసాగుతారు. ఇదిలా ఉండగా దత్ ఎస్ బ్యాంకు బోర్డులో 2013 నుంచి ఇండిపెండెంట్ డైరెక్టర్‌గా కొనసాగుతున్నారు. గత ఐదున్నర సంవత్సరాల నుంచి ఆయన బోర్డుకు సంబంధించి అన్నీ సబ్‌కమిటీల్లో కీలకపాత్ర పోషించారు. ప్రస్తుతం ఆయన నామినేషన్ అండ్ రెమ్యూనరేషన్ కమిటిచీఫ్‌గా పనిచేస్తున్నారు. ఐఎఎస్ అధికారిగా గత 37 సంవత్సరాల నుంచి పలు ఉన్నత



పదవులు చేపట్టారు. వాటిలో కర్నాటక ప్రభుత్వంతో పాటు కేంద్రప్రభుత్వంలో కూడా పలు కీలకపదవుల్లో పనిచేశారు. రిటైర్మెంట్ కంటే ముందు ఆయన కేబినెట్ సెక్రటేరియట్‌లో రోడ్డు రవాణా ...జాతీయ రహదారుల మంత్రిత్వశాఖలో సెక్రెటరీగా మూడున్నర సంవత్సరాల పాటుపనిచేసిన అనుభవం ఉంది. ఎస్ బ్యాంకు బోర్డు విషయానికి వస్తే ముఖేష్ సబర్వాల్, సుభాష్ కాలియా, అజయ్ కుమార్, ప్రతీమాషేరోయే, ఉత్తమ ప్రకాశ్ అగర్వాల్, టీఎస్ విజయన్, రాణాకపూర్ (మేనేజింగ్ డైరెక్టర్ సీఈవో)గా ఉన్నారు. ఇదిలా ఉండగా రాణాకపూర్ వారసుడి కోసం రజత్ మోంగా పోటీపడుతున్నట్లు తెలిసింది. ప్రస్తుతం విదేశీ బ్యాంకు సీఈవోగా పనిచేస్తున్నారు.

మాల్యా వాటాల విక్రయం?

● ఈడీ జప్తు చేసిన ఆస్తుల విలువ రూ. 11వేలకోట్లు
● భారత్‌కు రప్పించడానికి ముందే విక్రయం ● ఈడీ కసరత్తు



ముంబై : లిక్కర్‌కింగ్ విజయ్‌మాల్యాకు చెందిన షేర్లను వేలం వేయాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. మాల్యా ఆస్తులను ఈడీ జప్తు చేసుకున్న విషయం తెలిసిందే. అయితే ప్రత్యేక ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ చట్టం (పీఎంఎల్‌ఏ) కోర్టు జప్తు చేసిన ఆస్తులను వేలం వేయాలని ఆదేశిస్తే తక్షణమే మాల్యా వాటాలను విక్రయించాలని ఈడీ ఆలోచిస్తోంది. పీఎంఎల్‌ఏ కోర్టు ఫిబ్రవరి రెండవ వారంలో ఆర్డరులో జారీ చేసే అవకాశాలున్నా యని.. ఈ కేసును దగ్గరి నుంచి గమనిస్తున్న వారు చెప్పారు. కాగా మాల్యాను భారత్‌కు రప్పించే వరకు ఆగకుండా మాల్యాకు చెందిన వాటాలను వీలైనంత ఎక్కువ మొత్తానికి ఈడీ విక్రయించాలనుకుం టోందని వారు చెబుతున్నారు. ఒకవేళ మాల్యాను భారత్‌కు తరలిస్తే.. షేర్ల విలువ తగ్గే అవకాశాలుం టాయని, మాల్యా షేర్ల విలువ ప్రస్తుతం మార్కెట్ ధర ప్రకారం చూస్తే రూ.11,000 కోట్ల వరకు ఉంటుందని, వీలైనంత త్వరగా మాల్యా షేర్లను వేలానికి పెట్టి సొమ్ము చేసుకోవాలని ఆలోచన ఉందని ఆ వర్గాలు తెలిపాయి.

ఇదిలా ఉండగా మాల్యా ఆస్తులపై ఇప్పటికే వివిధ పార్టీలు తమకే హక్కులున్నాయంటూ ముందుకొస్తున్నాయని, దీంతో వేలం ప్రక్రియ జాప్యం జరిగే అవకాశాలున్నాయని ఆ వర్గాలు వివరించారు. పీఎంఎల్‌ఏ కోర్టు మాత్రమే ఈ వాటాలకు అసలు వారసుడు ఎవరనేది నిర్ధారిస్తుందని, వచ్చే నెలలో పీఎంఎల్‌ఏ కోర్టు ఆస్తుల విక్రయంపై తుది నిర్ణయం ప్రకటిస్తుందని చెబుతున్నారు.

మాల్యా ఆస్తులపై కనీసం మూడు పార్టీలు తమవనిక్లెయిమ్ చేస్తున్నాయి. వారిలో మాల్యాసవతి తల్లి, కర్నాటక ప్రభుత్వం ముందున్నా యి. దీనిపై పీఎంఎల్‌ఏ కోర్టు వచ్చేనెల తుది నిర్ణయం ప్రకటిస్తుంది. ఒకవేళ పీఎంఎల్‌ఏ కోర్టు ముగ్గురిలో ఎవరో ఒకరు ఈ ఆస్తికి హక్కుదారు అని ప్రకటిస్తే.. అప్పుడు ప్రత్యేక కమిటి ఏర్పాటు చేసి మొత్తం ఆస్తిలో వారికి ఎంత వాటాఇవ్వాలో ఇచ్చేసి మిగిలిన ఆస్తిని విక్రయిస్తారని అధికారులు తెలియజేశారు. ఇక మాల్యా లండన్ కోర్టు కేసు విషయానికి వస్తే.. లండన్‌లోని వెస్ట్‌మినిస్టర్ మేజిస్ట్రేట్ కోర్టు డిసెంబర్ 10వ తేదీ ఆర్డర్‌లో మాల్యాను భారత్‌కు అప్పగించాల్సిందేనని కోర్టు తీర్పుఇచ్చింది. దీనిపై ఆయన హైకోర్టుకు అప్పీలు చేసుకోవచ్చు.. ఒక వేళ మాల్యా హైకోర్టుకు అప్పీలుకు వెళితే దాన్ని వ్యతిరేకిస్తామని ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు తెలిసిన ఈడీ అధికారి తెలిపారు. ఆయన తన పేరు వెల్లడించడానికి నిరాకరించారు.

ఎయిర్ ఇండియా ప్యాసింజర్ రెవెన్యూ 20శాతం వృద్ధి

● క్యూ3 లో రూ. 5,538 కోట్లు

న్యూఢిల్లీ : ప్రభుత్వరంగానికి చెందిన ఎయిర్‌ఇండియాకు డిసెంబర్ త్రైమాసికంలో ప్రయాణికుల సంఖ్య కేవలం నాలుగు శాతం మాత్రమే పెరిగింది. అయితే ప్రయాణికుల ద్వారా వచ్చే రెవెన్యూ మాత్రం ఏకంగా 20 శాతం పెరిగిందని ఎయిర్‌లైన్ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. ఉన్న విమానాలను చక్కగా వినియోగించుకోవడంతో డిసెంబర్ త్రైమాసికంలో రెవెన్యూ రూ.5,538 కోట్లకు ఎగబాకగా.. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.4,615 కోట్లని ఆయన వివరించారు. ఇక ప్రయాణికుల సంఖ్య విషయానికి వస్తే డిసెంబర్ త్రైమాసికంలో 55.27 లక్షలకు చేరగా.. ఏడాది క్రితం 53.28 లక్షలని తెలిపారు. దీన్ని బట్టి చూస్తే ప్రయాణికుల సంఖ్య నాలుగు శాతం పెరిగిందన్నారు. అయితే ఏఎస్‌కెఎం (అవెయిలబుల్ సీట్ కిలోమీటర్స్) మాత్రం శరవేగంగా అభివృద్ధి చెందిందని ఆయన తెలిపారు. ఏఎస్‌కెఎం ... విషయానికి వస్తే ..ఒక విమానంలో ఫలానా గమ్యస్థానానికి ఎన్ని సీట్లు పూర్తిగా నిండాయో .. గడిచిన త్రైమాసికంలో ఈ విమానం ఎన్ని కిలోమీటర్లు తిరిగింది లెక్కగట్టడాన్ని ఏఎస్‌కెఎం అంటారు. ఇక డిసెంబర్ విషయానికి వస్తే ప్రయాణికుల సంఖ్య నాలుగు శాతం పెరిగింది. అదే సమయంలో రెవెన్యూ మాత్రం 23 శాతం పెరిగిందని అధికారి తెలియజేశారు. క్యూ3లో కంపెనీ కొత్తగా 15 విమానాలను నడిపింది. ఎయిర్ ఇండియాకష్టాలను గురించి పౌరవిమానయాన మంత్రి సరేశ్‌ప్రభు శుక్రవారం ఏకరవు పెట్టారు. భవిష్యత్తులో వచ్చే రెవెన్యూ ద్వారా భారీగా పెరిగిపోయిన ఎయిర్‌లైన్ అప్పులు తీరవు. అప్పులు తరతరాలు వస్తున్నాయని.. ప్రస్తుతం విపరీతంగా పెరిగిపోయాయన్నారు. వీటిని తగ్గించుకోవడానికి ఎయిర్‌లైన్‌ను వివిధ విభాగాలు విడగొట్టాల్సిందేనని ప్రభు వివరించారు. ఎయిర్ ఇండియాకువచ్చే రెవెన్యూలో 65 శాతం అంతర్జాతీయ రూట్ల నుంచి వస్తోందని, మిగిలిన మొత్తం దేశీయ రూట్ల నుంచి వస్తోందన్నారు. అలాగే వచ్చే రెవెన్యూ నుంచే వడ్డీలు చెల్లించుకుంటూపోతే ఎయిర్ లైన్ ఎన్నటికి లాభాలను చవిచూడలేదని ఆయన అన్నారు. కాబట్టి అప్పుల భారా న్ని తగ్గించుకోవడానికి ఆర్థిక మంత్రిత్వశాఖలో చర్చలు జరిపిదీనిపై ఒక నిర్ణయానికి రావాల్సి ఉందని ప్రభు పేర్కొన్నారు. 2007లో ఎయిర్ ఇండియా... ఇండియన్ ఎయిర్‌లైన్స్‌ను విలీనం చేసుకున్న తర్వాత నుంచి నష్టాలు విపరీతంగా పెరిగిపోయాయని ఆయన వివరించారు.

ప్రస్తుతం ఎఈ చేతిలోమొత్తం 122 విమానాలు న్నాయన్నారు. ఎయిర్‌లైన్‌ను గాడిలో పెట్టడానికి కొత్తగా ఒక ప్రణాళికను రూపుదిద్దామని.. పూర్తిస్థాయిలో నిపుణులను తీసుకొని.. యాజమాన్యం మొత్తం ప్రక్షాళన చేస్తామని.. పైన సీఈవో నుంచి కింది స్థాయి వరకు ఈ మార్పులు ఉంటాయన్నారు. దీంతో ఎయిర్ ఇండియా సరికొత్త శిఖరాలకు చేరుతుందని ఆయన భరోసాను వ్యక్తం చేశారు.



అనుబంధాల వైపు పరుగులు!

పండుగలు పబ్బాలలో బంధువర్గాలను కలిసేందుకు ఉత్సుకత

చిన్న కుటుంబాలను వేధిస్తున్న ఒంటరితనం

ఉమ్మడి వేడుకలకు ప్రాధాన్యమిస్తున్న నవతరం

అందుకే పల్లెబాట.. అందరి నోట అమ్మానాన్నల పాట



అభివృద్ధి కోసం వేరుపడి ఏర్పడిన చిన్న కుటుంబాలకు ఇప్పుడు ఆనందం కోసం పాత దారిపడుతోంది. ప్రైవేసీ... స్వేచ్ఛ కోరుకున్న ఆ పరిమిత కుటుంబాలు.. ఇప్పుడు మానసిక ఆనందం కోసం దారులు వెతుక్కుంటున్నాయి. డబ్బు, హోదా ఉన్నా అప్యాయంగా పలకరించేవారు లేక.. మనసుకు దెబ్బతగిలితే... ధైర్యం చెప్పేవారు లేక విలవిలలాడుతున్నవారు. పాతరోజులనాటి ఉమ్మడి కుటుంబాల్లో లేని సమస్య ఇప్పుడు చిన్న కుటుంబాలను వేధిస్తోంది. ఆధునిక ప్రపంచంలో ఉమ్మడి కుటుంబాలుగా ఒకేచోట ఉండలేకపోయినా... కనీసం ఉమ్మడిగా ఆనందాన్నయినా పొందాలని భావిస్తున్నాయి. పండుగలు, పబ్బాలు, వేడుకల్లో అయినవారంతా కలసి మమతానురాగాలను పంచుకుంటున్నారు. పిల్లలకూ సంబంధ బాంధవ్యాలను వివరిస్తున్నారు. పెద్దలు వారిని ఓదార్చి ధైర్యం చెబితే... చిన్నవారు చీకూచింతా తీరినట్లు సంబరపడిపోతున్నారు. ఆధునిక జీవితాల్లో వచ్చిన కొత్త సమస్యలకు అలనాటి ఉమ్మడి కుటుంబ వ్యవస్థ చెప్పిన చిట్కాలతో జవాబు వెతుక్కుంటున్నారు... నవతరం వెతుకుతున్న ఉమ్మడి ఆనంద పరిమళాలపై ఈ వారం ప్రత్యేక కథనం...

మారుతున్న నవతరం

భారతీయ సంస్కృతీ,సంప్రదాయాలకు, నాగరికత, అభివృద్ధికి ఉమ్మడి కుటుంబ వ్యవస్థే మూలం.ఆధునిక కాలం వరకు ఈ వ్యవస్థ మూడు పువ్వులు ఆరుకాయల్లా వర్ధిల్లింది. బామ్మలు,తాతలు, తల్లిదండ్రులు, అత్తామామలు,అక్కాచెల్లెళ్లు, అన్నాదమ్ముళ్లు,బావా మరదళ్లు, బంధుమిత్రులు...ఇలా కుటుంబాలు నిత్యం కళకళలాడేవి. సమష్టి భోజనాలు, సంపాదన వల్ల నాది, నేను అనే భావన కన్నా.. మనది, మేము అనే భావన ఏర్పడేది. అదే సమాజ ఐక్యతకు పునాదిరాయిగా ఉండేది. కానీ ఆధునిక కాలంలో ఉమ్మడి కుటుంబ వ్యవస్థ చిన్నాభిన్నం అయింది. నేను... నా చిన్నకుటుంబం అనేభావన పెరిగిపోయింది. బామ్మలు, తాతల మాట దేవుడెరుగు,అమ్మానాన్నలనే వృద్ధాప్యంలో ఆశ్రమాలలో చేర్చే సంస్కృతి పెరిగిపోయింది. పెళ్లయిన మరునాడే వేరు కాపురాలు పెట్టి జంటగా ఒంటరై పోతున్నారు. దీంతో సమస్యలు తలెత్తినప్పుడు సలహాలు ఇచ్చే అనుభవజ్ఞులైన పెద్దలు లేకపోవడం... బాధలను పంచుకునే ఆత్మీయులు కరువైంది. ఆ పరిణామాలను తట్టుకోలేని కుర్రకారు ఇప్పుడు ఉమ్మడి ఆనందం కోసం తపిస్తోంది.

చిన్న కుటుంబాల ఆవిర్భావం ఇలా

వర్తమాన భారతంలో స్త్రీలు పురుషులతో సమానంగా చదుకుంటున్నారు. పురుషులతో సమానంగా రాణిస్తున్నారు. కానీ .. మా రోజుల్లో మేం బజారు ముఖం చూసి ఎరుగం.... ఇంటికోడలు ఉద్యోగానికి వెళ్లిన దగ్గర నుంచి అత్తగారు దండకం ప్రారంభిస్తారు. దీంతో ఉమ్మడి కుటుంబాల్లో అయితే వారి ప్రతిభ వంటింటికే పరిమితం అయ్యేది. అందుకే ఆధునిక స్త్రీలు ఉమ్మడి కుటుంబం కంటే విడిగా ఉండేందుకే ఎక్కువ ప్రాముఖ్యత ఇస్తారు. వ్యవసాయం లాభసాటి కాకపోవడం, వృత్తులు దెబ్బతినడంతో బతుకుతెరువుకోసం ఇతర ప్రాంతాలకు వెళ్లిపోవడం కూడా ఉమ్మడి కుటుంబం వ్యవస్థ చెరిగిపోయి, చిన్నకుటుంబాలకు ప్రాధాన్యత పెరిగిందని చెప్పాలి. ఉమ్మడి కుటుంబంలో కుటుంబ పెద్ద ఆధ్వర్యంలో అంతా నడవాలి. దానికి అనుకూలంగా ఇతర కుటుంబ సభ్యులు సర్దుకు పోవాలి. ఆధునిక యుగంలో వ్యక్తిగత విషయాలకు ప్రాధాన్యత పెరిగింది. ఇక ఉమ్మడి కుటుంబాల్లో భార్యాభర్తలకు ఏకాంతం లోపిస్తుంది. భాగస్వామి కోసం అధిక సమయం కేటాయించ లేరు. దీంతో విడిగా ఉంటే మంచిదనే అభిప్రాయం బలపడింది. ఈ కారణాలన్నీ ఉమ్మడి వ్యవస్థను దెబ్బతీశాయి.

చింతలు మొదలయ్యేదిక్కడే...

గతంలో మాదిరిగా సంప్రదాయ వృత్తులు,వ్యవసాయం లేదు. దీంతో ఉద్యోగాల వేటలో కుటుంబ సభ్యులు..పెద్దలను వదిలి దూరప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి. దీనికి తోడు సన్నగిల్లిన సర్దుకుపోయే ధోరణి.. ప్రైవసీ కోరుకోవడంతో ఉమ్మడి నుంచి విడిపోతున్నారు. చిన్నకుటుంబం కొత్తలో బాగానే ఉన్నా.. పిల్లలు పుట్టిన తర్వాత పెద్దల అవసరం ఏర్పడుతుంది. ఆయాల చేతిలో.. క్రెష్లలో పిల్లలను ఉంచి భార్యాభర్తలు ఇద్దరు ఉద్యోగాలు చేయడంతో పిల్లల ఆలనాపాలనా విషయంలో అసంతృప్తి మొదలవుతుంది. సమస్యలు వచ్చినప్పుడు పరిష్కరించేందుకు, సలహాలిచ్చేందుకు ఆప్తులు కనిపించరు. సంపాదన పెరిగినా... లగ్జరీగా బతికే వీలున్నా..ఏదో వెలితి వేధించడం ప్రారంభం అవుతుంది. ఎంత సంపాదన ఉన్నా..ఎందరు స్నేహితులు ఉన్నా...కష్టాలు వచ్చినప్పుడు, బాధలు కల్గినప్పుడు రక్తసం బంధం.. బంధుత్వాలకు సాటి రావన్న నిజం అనుభ వంలోకి వస్తుంది. అలాగని ఉద్యోగాన్ని వదిలేసి.. ఊర్లోకెళ్లి అమ్మానాన్నలతో కలిసి బతకడం అయ్యేపని కాదు.. దీంతో పండుగల రోజైనా అందరితో కలిసి హాయిగా గడిపేందుకు నేటితరం ఉవ్విళ్లూరుతోంది.

పల్లెబాట పడుతున్న పట్టణాలు

కాంక్రీట్ జంగిల్‌లో.. అపార్ట్‌మెంట్ కల్చర్‌లో కుటుంబంతో కలిసి ఉంటున్నా ఒంటరి ఫీలింగ్... భార్య,భర్త,పిల్లలు.. లేదంటే వీకెండ్‌లో దోస్తులు..ఇదేనా జీవితం? అమ్మానాన్నలు, అన్నలు,అక్కా చెల్లెల్లు.. బామ్మలు, తాతలు, బాబాయి, పిన్ని..అందరితో పంచుకున్న ఆప్యాయతలు గుర్తుకు వస్తాయి. మైక్రో కుటుంబమైనా....ఉమ్మడి కుటుంబమైనా...రెంటిలోనూ లాభనష్టాలు ఉంటాయి.. పరిస్థితులకు అనుకూలంగా మసలుకోవడమే జీవితం అన్న సత్యం తెలిసి వస్తుంది. అందుకే పండుగలు వస్తే చాలు..పల్లెలకు పరుగులు తీస్తున్నారు. ఆ ఒక్కరోజైనా అందరితో కలిసి హాయిగా ఉండాలని కోరుకుంటున్నారు..దాని పర్యవసానమే....దసరా,సంక్రాంతి వచ్చిందంటే నగరాలు ఖాళీ అవుతున్నాయి.. పల్లెలు.. కుటుంబాలు కళకళలాడుతున్నాయి.

-చొల్లేటి వేంకటేశ్వరా చారి,పీచర్స్ డెస్క్

ఉమ్మడి ఫీలింగ్ అందరిలో ఉంది

ఉమ్మడి కుటుంబాలు ఉంటే బాగుంటుందనే ఫీలింగ్ అందరిలో ఉంది. గతంలో సాంప్రదాయబద్ధమైన వ్యవసాయాలు,కులవృత్తుల మీద ఆధారపడి బతికేవారు. రాను రాను ఆ పరిస్థితి మారింది. జ్ఞానం, నైపుణ్యం ఆధారంగా బతకాల్సిన పరిస్థితి ఏర్పడింది. అవి అవసరం ఉన్న చోటికి ఉద్యోగాల కోసం వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. అందుకే తప్పని సరి పరిస్థితుల్లో దూరంగా ఉంటున్నారు. కలిసి బతకాలని అందరూ కోరుకుంటారు. ఆ ఆకాంక్ష లేకపోతే సోషల్ మీడియా ఇంత పాపులర్ అయ్యేది కాదు. ఇతరులతో కమ్యూనికేట్ కావాలని, తమ ఫీలింగ్స్ షేర్ చేసుకోవాలని కోరుకోవడమే సోషల్ మీడియా సక్సెస్‌కు ప్రధాన కారణం. ఇది ప్రతి మనిషి మానవసంబంధాలు బాగుండాలని కోరుకుంటున్నారనడానికి నిదర్శనం. కుటుంబ సభ్యులు దగ్గర లేకపోవడం వల్లే.. సోషల్ మీడియా ద్వారా ప్రపంచమే తన కుటుంబంగా మార్చుకుంటున్నాడు. గతంలో పెళ్లి చూపులంటే.. అన్న, అక్క, బాబాయి,మామ,అత్త, పిన్నమ్మ, బామ్మ,తాత ..ఇలా బంధుగణం అంతా వెళ్లేవారు. ఇప్పటికీ అలాగే రావాలనే ఫీలింగ్ ఉంటుంది. కానీ ఉద్యోగరీత్యా సెలవులు దొరకక పోవడం వల్లే కలువలేకపోతున్నారు. అందుకే సంక్రాంతి, దసరా లాంటి పండుగలప్పుడు ఎక్కడెక్కడో ఉన్నవారంతా సొంతూర్లకు వచ్చి కలిసి పండుగ చేసుకుంటున్నారు. ఏదైనా ఈవెంట్ వస్తే చాలు దూరతీరాల్లో ఉన్న వారంతా అక్కడకు చేరుకుని మానసికమైన విశ్రాంతి పొందుతున్నారు.

-హిప్నో కమలాకర్, హైదరాబాద్

ఉమ్మడి కుటుంబాల వల్లే ఉపయోగాలు ఎక్కువ

ఉమ్మడి కుటుంబాల వల్లే ఉపయోగాలు ఎక్కువ. నేను ఇప్పటికీ ఉమ్మడి మధురిమలు అనుభవిస్తున్నా. కలిసి ఉంటే కలతలు వస్తాయనేది చాలామంది ఫీలింగ్. కానీ కలిసి ఉంటే కేర్‌టేకింగ్, మనసులో ఉన్నది పరస్పరం చెప్పుకునే వీలుంటుంది. ఇంట్లో పెద్దలు ఉంటే వారి అనుభవం మనకు మార్గదర్శకం అవుతుంది. మానాన్నకు ఆర్గురు సంతానం. ముగ్గురు ఆడ, ముగ్గురు మగ. అందరం ఒకే కాంపౌండ్‌లో ఉంటున్నాము. ఎవరి ఫ్యామిలీ వారిదే. కష్టాలు,సమస్యలు వచ్చినప్పుడు మాత్రం షేర్ చేసుకుంటాం. ఇక పండుగలు పబ్బాలు వచ్చినప్పుడు అందరం కలిసి చేసుకుంటాం. ఉమ్మడి కుటుంబాల వల్ల నాది, నేను అనే భావన పోయి మనది,మన అనే భావన ఏర్పడుతుంది.సంప్రదాయం,సంస్కృతిని కాపాడుకోగల్గుతాం. మైక్రో ఫ్యామిలీస్ వల్ల మన టెన్షన్‌లను షేర్ చేసుకోలేం. అపార్ట్‌మెంట్ జీవితాల్లో ఫీలింగ్స్ చెప్పుకోవడానికి ఎవరూ ఉండరు. అందుకే పండుగలప్పుడైనా అన్నదమ్ములు, అక్కాచెల్లెళ్లు కలవాలనే భావన పెరిగిపోతోంది. ఇది మంచి పరిణామం. మన సంస్కృతి,సంప్రదాయాలకు ఉమ్మడి కుటుంబమే శ్రీరామ రక్ష!

-బీఎల్ నారాయణ, పిఅండ్ టీ కాలనీ, హైదరాబాద్





నిండా కమ్ముకున్న మంచులో లైట్ల సహాయంతో వెళ్తున్న వాహనాలు

ట్రాఫిక్ జాంఝాటం

పంతంగి టోల్‌గేట్ వద్ద బారులు తీసిన వాహనాలు.. కి.మీ.మేర నిలిచిన ట్రాఫిక్

చౌటుప్పల్, ప్రభన్యూస్ : సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ముందుగానే సెలవులు ప్రకటించడంతో తెలంగాణ ఆంధ్రాలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు హైదరాబాద్ నుంచి స్వస్థలాలకు వాహనాలలో ఒకేసారి తరలివెళ్లడంతో యాదాద్రి భువనగిరి జిల్లా, చౌటుప్పల్ మండలంలోని జాతీయ రహదారి 65పై ట్రాఫిక్ విపరీతంగా పెరిగిపోయింది. పంతంగి టోల్‌గేట్ వద్ద కిలో మీటర్ మేరకు వాహనాలు నిలిచిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ట్రాఫిక్ నియంత్రణ కోసం పోలీసులు ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నపట్టికి పరిస్థితి అదుపులోకి రాలేదు. దీనితో విషయం తెలుసుకున్న భువనగిరి డీసీపీ రాంచంద్రారెడ్డి హుటాహుటిన మండలంలోని టోల్‌గేట్‌వద్దకు చేరుకొని పెద్దఎత్తున వివిధ ప్రాంతాల నుంచి పోలీసు అధికారులను రప్పించి ట్రాఫిక్ నియంత్రణ కోసం అవసరమైన జాగ్రత్తలు తీసుకున్నారు.

టోల్‌గేట్ వద్ద ట్రాఫిక్‌ను ఎప్పటికప్పుడు క్లీయర్ చేసేందుకు విజయవాడ వైపు వెళ్లేందుకు గేట్లను ఎక్కువ సంఖ్యలో తెరిపించి ట్రాఫిక్‌ను కొంత మేరకు నియంత్రించగలిగారు. హైదరాబాద్ నుంచి వచ్చే వాహనాల సంఖ్య భారీగా ఉండటంతో జాతీయ రహదారి పూర్తిగా వాహనాలతో నిండిపోయింది. ప్రయాణికులు గ్రామాల వద్ద రోడ్డు దాటడానికి కూడా వీలు లేకుండా పోయింది. స్థానికులు రోడ్డు దాటాలంటే ఎంతో కష్టపడాల్సి వచ్చింది. జాతీయ రహదారిపైనే హైదరాబాద్ నుంచి వచ్చే వాహనాలు అన్ని జాతీయ రహదారిపై పట్టని పరిస్థితి ఉండగా టోల్‌గేట్ వల్ల వాహనాలు నిలిచిపోయి గంటలు తరబడి వాహనాలు నిలిచిపోవాల్సి వచ్చింది. ట్రాఫిక్ నియంత్రణ కోసం డీసీపీ రాంచంద్రారెడ్డి ఆధ్వర్యంలో భువనగిరి ఏసీపీ జితేందర్‌రెడ్డి, చౌటుప్పల్ సీఐ వెంకటేశ్వర్లుతో పాటు ట్రాఫిక్ అధికారులు సివిల్ పోలీసులు, తగిన చర్యలు తీసుకున్నారు.



ట్రాఫిక్‌ను నియంత్రిస్తున్న పోలీస్ అధికారులు

కస్సుబుస్సులు!

- చేతులెత్తేసిన ఆర్టీసీ
- సంక్రాంతి రద్దీతో బస్టాండ్లు కిటకిట
- తగినన్ని బస్సులు లేక అవస్థలు
- ప్రయాణికుల ఆగ్రహం



హైదరాబాద్, ఆంధ్రప్రభ : సంక్రాంతి పండుగకు ఊరెళ్ళే ప్రయాణికుల అవస్థలు మరింత రెట్టింపు అయ్యాయి. ప్రయాణికులకు అవసరమైన రూట్లలో సర్వీసులను నడిపేందుకు సరిపోయినన్ని బస్సులు లేకపోవడంతో ఆర్టీసీ అధికారులు చేతులెత్తేశారు. బస్సు వస్తే ఎక్కండి లేకపోతే ఏం చేయలేమని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. హైదరాబాద్‌లోని రెండు ప్రధాన ప్రయాణ ప్రాంగణాలైన ఇమ్లిబన్, జూబ్లి బస్‌స్టేషన్‌లు ఊళ్ళకు వెళ్ళే ప్రయాణికులతో కిక్కిరిసిపోయాయి.రద్దీకి అనుకూలంగా సర్వీసులను నడుపుతామని ప్రకటించినప్పటికీ సరిపోయినన్ని బస్సులు అందుబాటులో లేకపోవడంతో పొరుగు జిల్లాలలోని బస్సులను రప్పించేందుకు ప్రయత్నాలను ముమ్మరం చేశారు. జిల్లాలలోని డిపోల మేనేజర్లు అధికారుల ఆదేశాల మేరకు బస్సులను పంపేందుకు ఏర్పాట్లు చేస్తున్నప్పటికీ సరైన సమయంలో చేరుకోకపోవడంతో అధికారులు వేచి చూస్తున్నారు. కొన్ని మార్గాలలో సర్వీసులను నడిపించలేమని అధికారులు చెబుతున్నారు. దూర ప్రాంత సర్వీసుల ను మాత్రమే ఎలాగోలా నడిపిస్తామని, దగ్గరి దగ్గరి పట్టణాలకు అదనపు బస్సులను నడిపించడం సాధ్యం కాకపోవచ్చని అధికారులు అంటున్నారు. విజయవాడ, గుంటూరు, కర్నూలు తదితర ప్రాంతాలకు చాలా వరకు హైదరాబాద్ సిటీ సర్వీసులను మళ్ళించారు. బస్సులలో అరకొర సౌకర్యాలున్నప్పటికీ విధి లేని పరిస్థితుల్లో ప్రయాణికులు అందులో వెళ్ళేందుకు కూడా సిద్ధమవుతున్నారు.

బుకింగ్ కౌంటర్ల వద్ద పడిగాపులు

ప్రయాణికులు బుకింగ్ కౌంటర్ల వద్ద గంటల కొద్ది పడిగాపులు కాస్తున్నారు. బస్సులు ప్లాట్‌ఫాంలపైకి వచ్చిన తర్వాత రిజర్వేషన్ కౌంటర్‌కు సమాచారం అందిస్తే తప్ప టికెట్లను జారీ చేయడం లేదు. దీంతో గంటల కొద్దీ ప్రయాణికులు కౌంటర్ల వద్ద వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. టికెట్ల జారీ కోసం ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసినప్పటికీ ఇబ్బందులు తప్పడం లేదు.

దండుకుంటున్న ప్రైవేట్ ఆపరేటర్లు

ఆర్టీసీలో టికెట్ల ఇబ్బందులను ఎదుర్కోలేని ప్రయాణికులు చాలా మంది ప్రైవేట్ బస్సు ఆపరేటర్లను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదనుగా ఆపరేటర్లు అందినంత దండుకుంటున్నారు. సాధారణం గాబీహెచ్ఇఎల్, కేపీహెచ్‌బీ, అమీర్‌పేట, లక్డికాపూల్, కంట్రోల్‌రూం, అఫ్జల్‌గంజ్, దిల్‌సుఖ్‌నగర్, ఇసిఐఎల్, ఎల్‌బీ నగర్, ఉప్పల్, తార్నాక తదితర ప్రాంతాలలో ప్రయాణికులను ఎక్కించుకుని గమ్య స్థానాలకు చేర్చే ప్రైవేట్ ఆపరేటర్లు డిమాండ్ నేపథ్యం లో శివార్లలోని ఆటో నగర్‌కు వెళ్ళి బస్సు ఎక్కాలని విజయవాడ వైపు వెళ్లే ప్రయాణికులను ఆదేశిస్తున్నారు. కర్నూలుకు వెళ్ళే వారు ఆరంఘర్ చౌరస్తాకు వెళ్ళాలని సూచిస్తున్నారు. దీంతో చేసేది లేక శివారు ప్రాంతాలకు తరలి వెళ్ళి గమ్యస్థానాలకు వెళ్తున్నారు. సాధారణ రోజులలో వసూలు చేసే టికెట్ ధరకు మూడింతలు, నాలుగింతలు డబ్బులు వసూలు చేస్తున్నారు. అయినప్పటికీ ప్రయాణికులు సీటు దొరికిందే మహాభాగ్యమన్నట్లుగా వెళ్తున్నారు.

అభివృద్ధికి చిరునామా తెలంగాణ

- క్రీడలకు సీఎం ప్రాధాన్యం
- అంతర్జాతీయ పోటీల్లో ప్రతిభ చూపాలి
- మాజీ మంత్రి హరీష్‌రావు



సిద్దిపేట, ప్రభ న్యూస్ : దేశంలోనే వేగంగా అభివృద్ధి చెందుతున్న యంగెస్ట్ స్టేట్ తెలంగాణ రాష్ట్రమని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు అన్నారు. శనివారం సిద్దిపేట డిగ్రీ కళాశాల మైదానంలో జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ చాంపియన్ షిప్ పోటీలను ఆయన ఎమ్మెల్సీ ఫారుఖ్‌హుస్సేన్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ సిద్దిపేట జాతీయ స్థాయి క్రీడలకు వేదిక కావడం, సిద్దిపేటలో హ్యాండ్‌బాల్ పోటీలు జరుగడం ఆనందంగా ఉందన్నారు. తెలంగాణలో ముఖ్యమంత్రి కేసీఆర్ క్రీడా రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. కేసీఆర్ 14ఏళ్లు కొట్లాడి తెలంగాణ సాధించారన్నారు. దేశంలో 24గంటల కరెంట్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ రాష్ట్రమన్నారు. కళ్యాణలక్ష్మి, రైతుబీమా, రైతులకు ఏటా ఎకరానికి రూ.10వేల పెట్టుబడిలాంటి ఎన్నోసంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. రైతులకు సాగునీటి వసతి కల్పించారన్నారు. ఎన్నో రాష్ట్రాల నుంచి ప్రజా ప్రతినిధులు, అధికారులు తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని పరిశీలించారన్నారు. సిద్దిపేట అభివృద్ధిలో ఆదర్శమని, సిద్దిపేట కోమటి చెరువు అందాలను వీక్షించి బోట్‌లో షికారు చేస్తూ రిలీఫ్ అవ్వండని క్రీడాకారులకు సూచించారు. మీ మీ ప్రాంతాల ఫుడ్‌తో పాటు సిద్దిపేట లోకల్ ఫుడ్ టెస్ట్ చేయాలని ఇతర రాష్ట్రాల క్రీడాకారులకు హరీష్‌రావు సూచించారు. వచ్చే ఐదు రోజుల పాటు మీలోని క్రీడా ప్రతిభను ప్రదర్శించి విజేతలుగా నిలవాలన్నారు. ఈ క్రీడల్లో క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబర్చి ఆసియన్ గేమ్స్, ఒలంపిక్స్ గేమ్స్‌లో భారత్ తరుపున ప్రాతినిధ్యం వహించి భారత కీర్తిని ఎగురవేయాలని క్రీడాకారులను ఉత్తేజపరిచారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకుని క్రీడలను వీక్షించారు. ఈ సందర్భంగా సిద్దిపేట జీడీఆర్ విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు అందరిని ఆకర్షించాయి.

నేటి నుంచి 16 వరకు టోల్ ఫీజు రద్దు

తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : సంక్రాంతి పండుగ సందర్భంగా జాతీయ రహదారులపై టోల్‌గేట్ల వద్ద వసూలు చేస్తున్న బిల్లులను రద్దు చేస్తున్నట్లు తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సీఎం చంద్రశేఖర్‌రావు ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. టోల్‌గేట్ ఫీజు వసూలు రద్దు ఈ నెల 13 నుంచి 16 వరకు అమలులో ఉంటుందని ఆయన తెలిపారు.



22న హైదరాబాద్‌కు అమిత్‌షా

హైదరాబాద్, ఆంధ్రప్రభ : బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా ఈ నెల 22న హైదరాబాద్ రానున్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాజయం పాలైన నేపథ్యంలో రాష్ట్ర నాయకత్వం పూర్తి నిరాశ, నిస్పృహలలో ఉంది. నీరుగారి, నీరసించిన పార్టీని తిరిగి పునరుజ్జీవింప చేయడంతో పాటు రానున్న లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ ఉరకలెత్తే విధంగా అనుసరించాల్సిన వ్యూహంపై అమిత్‌షా ప్రధానంగా దృష్టి కేంద్రీకరించనున్నారు. హైదరాబాద్ పర్యటనలో భాగంగా ప్రధానంగా పార్టీ పార్లమెంటరీ ఇంచార్జీలతో పాటు ముఖ్య నేతలతో అమిత్‌షా భేటీ కానున్నారు. ఈ సందర్భంగానే లోక్‌సభ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై సమాలోచనలను జరుపనున్నారు. రాష్ట్రంలోని 17 లోక్‌సభ స్థానాలకు జాతీయ పార్టీకి చెందిన నేతలకు బాధ్యతలను కట్టబెట్టింది. ఇప్పటికే పలు పర్యాయాలు నియోజకవర్గాల వారిగా సమీక్షలను కూడా నిర్వహించారు. నియోజకవర్గాల బాధ్యులతో భేటీ సందర్భంగా అమిత్‌షా పార్టీ పరిస్థితిని బేరీజు వేసి భవిష్యత్ కార్యాచరణను సూచించనున్నారు.

చేనేత రామన్న



సిరిసిల్లలో కేటీఆర్ చిత్రాన్ని రంగవల్లిగా ఆవిష్కరించిన దృశ్యం

ప్రపంచ బ్యాంక్ చీఫ్ రేసులో ఇవాంక?



వాషింగ్టన్: ప్రపంచ బ్యాంక్ తదుపరి చీఫ్‌గా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గారాలపట్టి ఇవాంక ట్రంప్ పేరు ప్రధానంగా వినిపిస్తోంది. ప్రస్తుత సభ్యుల్లో మెజార్టీ మంది ఆమెకు మద్దతు తెలుపుతున్నట్లు సమాచారం. ప్రస్తుత అధ్యక్షుడు జిమ్ యాంగ్ కిమ్ వచ్చేవారం బాధ్యతల నుంచి తప్పుకోనున్నారు. కిమ్‌ను 2011లో బరాక్ ఒబామా ఈ పదవికి ఎంపిక చేశారు. తిరిగి 2016లో ఎన్నికైన కిమ్, పదవీకాలం ముగియక ముందే వైదొలగాలని నిర్ణయించారు. ఈయన స్థానంలో కొత్త చీఫ్‌ను ట్రంప్ ఎంపిక చేయనున్నారు. ఐఎంఎఫ్ చీఫ్ రేసులో ఇవాంక తోపాటు ట్రెజరీ అధికారి డేవిడ్ మల్‌పాస్, ఐరాసలో అమెరికా మాజీ ప్రతినిధి నిక్కీహేలీ, అమెరికా అంతర్జాతీయ అభివృద్ధి సంస్థ చీఫ్ మార్క్‌గ్రీన్ పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. ఐఎంఎఫ్ అధిపతి ఎంపిక నిర్ణయంలో ప్రధాన వాటాదారులైన అమెరికా, యూరప్ దేశాలు కీలకం కానున్నాయి. అయితే, ప్రపంచబ్యాంకుపై అమెరికా పెత్తనంపై విమర్శల స్వరం క్రమంగా పెరుగుతూ వస్తోంది. ఈ జాబితాలో చైనా ముందుంది. 2011లో బోర్డు తీసుకొచ్చిన బహిరంగ, మెజార్టీ ఆధారిత, పారదర్శక ప్రక్రియను డ్రాగన్ ఆక్షేపించింది. ముగ్గురికంటే ఎక్కువ మంది బరిలో ఉంటే, ఓటింగ్ పద్ధతిలో పోటీదారుల సంఖ్యను కుదించడం, మిగతా వారికి ఇంటర్వ్యూ నిర్వహించడం ద్వారా బోర్డు కొత్త చీఫ్‌ను ఎంపిక చేస్తుంది. ప్రపంచ దేశాల పునర్నిర్మాణం, అభివృద్ధి బ్యాంకుగా పిలువబడే ప్రపంచ బ్యాంకు 1944లో ఏర్పాటైంది. రెండవ ప్రపంచ యుద్ధంలో దెబ్బతిన్న దేశాల పునర్నిర్మాణం లక్ష్యంగా దీన్ని స్థాపించారు. ప్రస్తుతం వరల్డ్ బ్యాంకులో 180 దేశాలు సభ్యత్వం కలిగివున్నాయి. అభివృద్ధి చెందుతున్న దేశాలకు ఆర్థిక, సాంకేతిక సహాయం అందించడంలో ఇది ప్రధాన పాత్ర పోషిస్తోంది.

సిక్కింలో ఇంటికో ఉద్యోగం..

గ్యాంగ్‌టక్: ఉద్యోగ అవకాశాలు లేక, ఉపాధికోసం వెంపర్లాడుతున్న ఈరోజుల్లో, ఏకంగా ప్రభుత్వ కొలువే ఇస్తామంటే.. అంతకంటే కావాల్సిందేముంటుంది. అనుకున్నదే తడవుగా నియామక పత్రాలు జారీచేస్తే ఆ ఆనందానికి హద్దేముంటుంది.. సిక్కిం రాష్ట్రంలోని యువతకు ఈ అదృష్టం వరించింది. ముఖ్యమంత్రి పవన్ చామ్లింగ్ ఉద్యోగమేళా పథకం ద్వారా ప్రతి ఇంటిలో ఒకరు ప్రభుత్వోద్యోగి కాబోతున్నారు. ఈశాన్య రాష్ట్రమైన సిక్కిం సంచలన నిర్ణయం తీసుకుంది. ప్రతి ఇంటిలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని తీర్మానించింది. స్వాతంత్ర్య భారతంలో సుదీర్ఘ కాలం సీఎంగా ఉన్న చామ్లింగ్ ఈ పథకాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టారు. శనివారం రాజధాని నగరంలోని పల్జోర్ మైదానంలో ఉద్యోగమేళా - 2019 పథకాన్ని చామ్లింగ్ ఘనంగా ప్రారంభించారు. లబ్ధిదారులకు స్వయంగా నియామక (తాత్కాలిక) పత్రాలు ప్రదానం చేశారు. ప్రస్తుతం తాత్కాలికం ప్రాతిపదికన నియామకం చేస్తున్నాం. ఐదేళ్లలో వీరందరిని పర్మినెంట్ చేస్తామని చెప్పారు. దాంతో ప్రతిఒక్కరు ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణింపబడతారు అని చామ్లింగ్ తెలిపారు. ఈ పథకం ద్వారా తక్షణమే 20 వేల మంది యువతకు ఉద్యోగాలిస్తామని చామ్లింగ్ నేతృత్వంలోని సిక్కిం డెమొక్రటిక్ ఫ్రంట్ ప్రభుత్వం స్పష్టంచేసింది. 12 రకాల ప్రభుత్వ శాఖల్లో నియామకాలు జరుపుతామన్నారు. రాష్ట్రయువతకు ఇదొక గొప్ప అవకాశం. ఇంటికో ఉద్యోగం ఇస్తున్నందుకు మాకు గర్వంగానూ, సంతోషంగానూ ఉందంటూ రెండు గంటల సుదీర్ఘ ఉపన్యాసానికి చామ్లింగ్ ముక్తాయింపునిచ్చారు.

పేదల బిల్లుకు ప్రెసిడెంట్ ముద్ర

(మొదటిపేజీ తరువాయి)

తక్కువ విస్తీర్ణం గల ఇల్లు కలిగిన వారు.

- నోటిఫైడ్ మున్సిపాలిటీ పరిధిలో 100 గజాల ఇళ్లు.. నాన్ నోటిఫైడ్ మున్సిపాలిటీ పరిధిలో 200 గజాల కంటే తక్కువ విస్తీర్ణంలో ఇల్లు గలవారు.
- 10 శాతం రిజర్వేషన్లు ప్రస్తుతం రిజర్వేషన్లు పొందలేకపోతున్న కులాల్లోని ఆర్థికంగా వెనకబడిన వారికి ఉద్దేశించినవి.
- బ్రాహ్మణ, వైశ్య, కమ్మ, కాపు, రెడ్డి, క్షత్రియ, రాజ్‌పూట్, జాట్, మరాఠా, భూమిహార్ కులాల్లోని ఆర్థికంగా వెనకబడిన వారు రిజర్వేషన్లకు అర్హులు.



ఎవర్నీ వదలా..!

అవినీతిని కడిగేస్తా..

- మరకలు అంటని ప్రభుత్వం మాదే..
- మహాకూటమి విఫల ప్రయోగం
- ఈబీసీ రిజర్వేషన్లతో ఇతరులకు నష్టం లేదు
- బీజేపీ జాతీయ మండలి సమావేశాల్లో ప్రధాని మోడీ..

న్యూఢిల్లీ: ప్రధాని మోడీ మరోసారి గర్జించారు. బీజేపీ జాతీయ మండలి సమావేశాల్లో ప్రతిపక్షాలపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. అవినీతికి పాల్పడే వారెవరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదని మరోసారి హెచ్చరించారు.పదేళ్ల యూపీఏ పాలన అవినీతి మయంగా మారిందని విమర్శించిన మోడీ.. వారి హయాంలో అవినీతి,బంధుప్రీతిని పెంచిపోషించారని మండిపడ్డారు. దేశ చరిత్రలో తొలిసారి అవినీతి మరక అంటని ప్రభుత్వం తమదేనని స్పష్టం చేశారు. ప్రజా శ్రేయస్సే లక్ష్యంగా.. అభివృద్ధి నినాదంతో ముందుకు సాగుతున్నామన్నారు. బీజేపీని ఎదుర్కొనేందుకు ప్రతిపక్షాలు ఏర్పాటు చేసిన మహాకూటమి విఫల ప్రయోగమని మండిపడ్డారు.

మీ వైఖరేంటో ప్రజలకు తెలియదా..?

పదేళ్ల పాటు కేంద్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం ఎన్నడూ అయోధ్య రామాలయ వివాదాన్ని పట్టించుకున్న పాపాన పోలేదని మోడీ విమర్శించారు. రామాలయ వివాదంపై న్యాయ ప్రక్రియను అడ్డుకునేందుకు కూడా విపక్షాలు వెనకాడటం లేదని మండిపడ్డారు. అయోధ్యపై ప్రతిపక్షాలు గతంలో వ్యవహరించిన తీరును ప్రజలు నేటికీ మరచిపోలేరు. అయోధ్య వివాదం కేసుపై లోక్‌సభ ఎన్నికల తర్వాత విచారణ జరపాలని కాంగ్రెస్ నాయకుడు కపిల్ సిబల్ కోర్టులో వాదించడం వెనకున్న పరమార్థమేంటని ప్రశ్నించారు.పశ్చిమబెంగాల్, ఆంధ్రప్రదేశ్, చత్తీస్‌గఢ్ ప్రభుత్వాలు తమ రాష్ట్రాల్లో సీబీఐపై నిషేధం విధించి యథేచ్ఛగా అవకతవకలకు పాల్పడుతున్నాయని ఆరోపించారు.

దేశంలోని మరోసారి బలహీన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలన్న కాంక్షతో ప్రతిపక్ష పార్టీలన్నీ ఏకమయ్యాయన్న మోడీ.. ప్రజలు మరోసారి బలమైన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే బీజేపీకే పట్టం కడతారని ధీమా వ్యక్తం చేశారు. బలమైన జాతీయవాదం, అవినీతిరహిత భారత్ లక్ష్యంగా తమ ప్రభుత్వం అహర్నిశలు శ్రమిస్తోందన్న మోడీ.. అధికారంలో ఉన్న 10 ఏళ్ల పాటు కాంగ్రెస్ పార్టీ అయోధ్య రామాలయం గురించి ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. యూపీఏ ప్రభుత్వం ఏనాడైనా అయోధ్య వివాదానికి పరిష్కార మార్గం చూపాలని ఆలోచించిందా.. అని విమర్శలు సంధించారు. ఎన్నికల వేళ బీజేపీ అయోధ్య అంశాన్ని తెరపైకి తెస్తున్నాయన్న ప్రతిపక్షాల విమర్శలకు మోడీ ఈ విధంగా కౌంటర్ ఇచ్చారు. దేశంలో బలమైన ప్రభుత్వం ఉన్నప్పుడు అవినీతిని కూకటి వేళ్లతో పెకిలించవచ్చన్న మోడీ.. బీజేపీ ప్రభుత్వ చర్యలు నచ్చకే ప్రతిపక్షాలు బలహీన ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు ఏకమయ్యాయని విమర్శించారు. మహాకూటమిగా ఏర్పాటైన వారి విఫల ప్రయోగం సిద్ధించదని మోడీ మండిపడ్డారు. వాళ్లు బలహీన ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారు.. బలహీన ప్రభుత్వంతో అవినీతి రాజ్యమేలుతుంది. మేం బలమైన ప్రభుత్వాన్ని కోరుకుంటున్నాం. అవినీతిని అంతమొందించడమే బీజేపీ లక్ష్యం. బలహీన ప్రభుత్వ వస్తే బంధువులకు లబ్ది చేకూర్చవచ్చన్నది ప్రతిపక్షాల ఆలోచన. మేం బలమైన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి ప్రతీ ఒక్కరికీ అభివృద్ధి ఫలాలు అందిస్తున్నాం. అని మోడీ చెప్పుకొచ్చారు.

ఆర్థికంగా వెనకబడిన వర్గాలకు 10 రిజర్వేషన్లు కల్పించడం ద్వారా యువతను నవభారత నిర్మాణం దిశగా నడిపిస్తాం. విద్యా, ఉద్యోగ అవకాశాల్లో ఈబీసీలకు రిజర్వేషన్లు కల్పించి ఆయా వర్గాలకు భరోసా ఇస్తున్నాం. అవినీతి రహిత పాలనను అందించగలదని బీజేపీ మరోసారి రుచువుచేసింది. అని మోడీ పేర్కొన్నారు.

నవ భారత నిర్మాణానికి పేదల దన్ను

అగ్రవర్ణాల్లోని పేదలకు విద్య, ఉద్యోగ అవకాశాల్లో 10 శాతం రిజర్వేషన్లు కల్పించే ఉద్దేశంతో ప్రభుత్వం తెచ్చిన ఈబీసీ బిల్లు చారిత్రాత్మకమైందని మోడీ కొనియాడారు. ఆర్థికంగా వెనకబడిన పేదలకు రిజర్వేషన్లు కల్పించడం ద్వారా నవ భారత నిర్మాణానికి వారు వెన్నుదన్నుగా నిలుస్తారని మోడీ చెప్పుకొచ్చారు. కులాల మధ్య కుంపటి రాజేస్తున్న ప్రతిపక్ష పార్టీల కుట్రలను తిప్పికొట్టేందుకు బీజేపీ శ్రేణులు సిద్ధమవ్వాలని మోడీ పిలుపునిచ్చారు. అగ్రవర్ణాల వారికి కల్పించే రిజర్వేషన్ల వల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీల రిజర్వేషన్లు దెబ్బతింటాయని ప్రతిపక్షాలు చేస్తున్న విష ప్రచారాన్ని నమ్మవద్దన్నారు. రిజర్వేషన్లకు అనుగుణంగా విద్యాసంస్థల్లో 10 శాతం సీట్లను పెంచుతామని హామీ ఇచ్చారు.

2020 నాటికి రైతుల ఆదాయం రెట్టింపు

అన్నంపెట్టే రైతన్న కడుపు నింపుతామని ప్రధాని మోడీ పునరుద్ఘాటించారు. రైతుల ఆదాయం రెట్టింపు చేసి వారి ముఖాల్లో చిరునవ్వులను చిందింపజేస్తామన్నారు. 2020 నాటికి రైతుల ఆదాయం రెట్టింపవుతుందని ఆశాభావం వ్యక్తం చేసిన మోడీ.. గత పాలకుల వల్ల దశాబ్దాల కాలంగా దేశంలో రైతులు కుదేలయ్యారని విమర్శించారు. రైతులను ప్రతిపక్షాలు ఓటు బ్యాంక్‌గానే భావిస్తున్నాయన్న మోడీ.. తాము అధికారంలోకి వచ్చిన నాటికి నుంచి రైతును అన్నంపెట్టే అన్నదాతగా భావించి వారి సంక్షేమానికి పెద్దపీట వేశామని చెప్పారు. గత నాలుగున్నరేళ్లలో తమ ప్రభుత్వం 95 మెట్రిక్ టన్నుల తృణధాన్యాల ఉత్పత్తికి కృషి చేసిందన్నారు.

పంచాయతీ నుంచి పార్లమెంట్ దాకా మనమే..



రాజస్థాన్, మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలతో నిరాశ చెందాల్సిన అవసరంలేదని బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా నేతలతో ఉద్బోధించారు. ప్రతికూల ఫలితాలతో అధైర్యపడోదన్న షా.. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ బలాన్ని చూపించేందుకు ప్రతీ కార్యకర్తనూ ప్రోత్సహించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ కులతత్వం, బంధుప్రీతి,బుజ్జగింపులు అనే మూడు వ్రణాలను కలిగి ఉందని.. ఆ పుండ్లు ఎన్నటికీ మానవని చురకలంటించారు.

వచ్చే ఎన్నికల్లో బీజేపీ విజయ ఢంకాను మోగిస్తే పంచాయతీ నుంచి పార్లమెంట్ దాకా మన పాలనే సాగుతుందని హితబోధ చేశారు. బీజేపీ ప్రతిష్టాత్మక 13 కార్యక్రమాలపై నేతలు ప్రత్యేక దృష్టిపెట్టాలన్న షా.. నరేంద్ర మోడీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో 22 కోట్ల మంది లబ్ధిపొందుతున్నారని గుర్తు చేశారు.

మాకు మోడీ.. మీకెవరు?

కూటమికి అజెండా లేదు - నాయకత్వం లేదు : లక్ష్మణ్

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : ప్రతి పోలింగ్ కేంద్రంలోనూ గెలవాలని ఢిల్లీలో రెండు రోజుల పాటు జరిగిన బీజేపీ మండలి సమావేశాల్లో కార్యకర్తలకు ప్రధాని మోడీ దిశానిర్దేశం చేశారు. తనకు వ్యతిరేకంగా జట్టు కట్టిన విపక్షాల మీద ఆయన విరుచుకుపడ్డారు. సమావేశం అనంతరం తెలుగు రాష్ట్రాల నుంచి వచ్చిన నాయకులు మీడియాతో మాట్లాడారు.పార్టీ అధ్యక్షుడు అమిత్ షా, ప్రధాన మంత్రి నరేంద్ర మోడీలు స్ఫూర్తిదాయక ప్రసంగాలతో మార్గదర్శకం చేశారు. 2019 సార్వత్రిక ఎన్నికలకు సంసిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కూటమి పేరు మీద ఒక్కటవుతున్న మీకు నాయకుడు ఎవరు? మోడీకి సరితూగే నాయకుడు మీ కూటమిలో ఎవరైనా ఉన్నారా? కూటమికి ఎజెండా లేదు. నాయకత్వం అసలే లేదు. ఎన్డీయే ప్రభుత్వ అవినీతి రహిత పాలన ప్రజల్లోకి తీసుకెళ్తాం. ఈ ఐదేళ్లలో జరిగిన అభివృద్ధి - స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత జరిగిన అభివృద్ధిని పోల్చి చూడమని కోరుతున్నాం. పేద ప్రజలకు ఇళ్లు, గ్యాస్.. ఇలా ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేశాం. మరో సారి మోడీ.. మరోసారి బీజేపీ నినాదంతో ఈ క్షణం నుంచే కార్యకర్తలను సిద్ధం చేస్తున్నాం. మేరా బూత్ మజ్బూత్‌లి నినాదంతో ప్రతి బూత్ స్థాయిలో పార్టీని గెలిపించాలని సంకల్పం తీసుకున్నాం. బూత్ స్థాయిలో పార్టీని గెలిపిస్తే బీజేపీని, మోడీని గెలిపించినట్టే. వ్యవసాయం, సంక్షేమం ఈబీసీ రిజర్వేషన్లు - రామమందిర నిర్మాణం ఇలా ఎన్నో విప్లవాత్మక నిర్ణయాలు, అభివృద్ధి జరిగింది.

అభివృద్ధి బీజేపీతోనే సాధ్యం : బాల సుబ్రహ్మణ్యం

2019 సార్వత్రిక ఎన్నికల కోసం పార్టీ శ్రేణులను సంసిద్ధం చేయడం కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశం ఇది. రెట్టించిన ఉత్సాహంతో గతం కంటే మరిన్ని ఎక్కువ సీట్లు సాధించుకోడానికి వ్యూహాలు, ప్రణాళిక గురించి చర్చించుకున్నాం. ప్రజలు బీజేపీని మరోసారి ఎందుకు ఎన్నుకోవాలన్న విషయంపై ప్రజల దగ్గరకు ఎలా వెళ్లాలన్నదే మా ప్రధాన ఎజెండా. అభివృద్ధి వేగంగా సాగాలంటే బీజేపీతో మాత్రమే సాధ్యమని ప్రజలకు అర్థమయ్యేలా చెబుతాం. ప్రజాస్వామ్యంలో వ్యవస్థలను నాశనం చేస్తుందని బీజేపీపై చేస్తున్న ప్రతిపక్షాలను ప్రధాని మోడీ తన ప్రసంగంతో తిప్పికొట్టారు. ప్రజాస్వామ్య వ్యవస్థలను బీజేపీ నేతలెవరూ తూలనాడలేదు, తక్కువ చేయలేదు. అనేక కేసుల్లో బెయిల్ మీద ఉన్నవాళ్లు మాపై ఆరోపణలు చేయడం హాస్యాస్పదం. వ్యవస్థలను బీజేపీ ఎంతగా గౌరవించారు, కాంగ్రెస్ నేతలు ఎంతగా హేళన చేశారన్నది మోడీ ప్రసంగంలో వివరించారు.

పార్టీ ఆదేశిస్తే పోటీకి సిద్ధం : కృష్ణం రాజు

ప్రధాని ప్రసంగం వింటే మాకు మరోసారి గెలిచినంత సంతోషంగా ఉంది. సేవకుడు అంటే సేవకుడిలా ఉండాలి. ప్రధానసేవకుడిగా ఉన్న తనను ప్రజలు మళ్లీ దీవిస్తారని మోడీ ప్రగాఢ విశ్వాసంతో ఉన్నారు. 10 శాతం రిజర్వేషన్ పై అన్ని వర్గాల నుంచి, అన్ని వైపుల నుంచి ప్రశంసలే వస్తున్నాయి. ఏపీకి ఏమీ చేయలేదు అంటూ అబద్ధాలు ప్రచారం చేస్తున్నారు. పోలవరం ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా తీసుకుని పూర్తి చేయబోతున్నారు. పార్టీ ఆదేశిస్తే పోటీ చేసేందుకు తాను సిద్ధంగా ఉన్నాను.

మాయా – అఖిలేష్ కొత్త పొత్తు

యూపీ వేదికగా మొదలైన రాజకీయాలు

- ఎస్పీ, బీఎస్పీ పొత్తు ప్రకటన
- చెరో 38 స్థానాల్లో పోటీ
- అరాచకం కోసమే పొత్తు: బీజేపీ
- స్పందించని కాంగ్రెస్
- స్వాగతించిన మమత

లక్నో: సార్వత్రిక ఎన్నికలు 2019కి సమయం దగ్గరపడుతున్న కొద్దీ దేశ రాజకీయాలు రసవత్తరంగా మారుతున్నాయి. వేసవి కాలం రాకముందే దేశాన్ని ఎన్నికల వేడి రాజుకుంటోంది. అధికార బీజేపీ ప్రధాన లక్ష్యంగా దేశంలోని పలు రాజకీయ పార్టీలు, సీనియర్ నాయకులు వ్యూహ ప్రతివ్యూహాలు రచిస్తున్నారు. నాయకులు తమ అస్త్రాలకు పదునుపెడుతున్నారు. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కాంగ్రెస్ పార్టీతో కలిసి మహాకూటమి ఏర్పాటు యోచనలో ఉండగా తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటులో ఉన్న సంగతి తెలిసిందే. అయితే అత్యధిక లోక్‌సభ స్థానాలున్న ఉత్తరప్రదేశ్‌లో రాజకీయం మరింత రంజుగా మారింది. ఎస్పీ, బీఎస్పీల కలయిక ప్రత్యర్థులను ఆందోళనకు గురిచేయడం ఖాయమని విశ్లేషకులు చెబుతున్నారు. ముఖ్యంగా 2014 సార్వత్రిక ఎన్నికల్లో అంచనాలను మించి ఉత్తరప్రదేశ్‌లోని 80 స్థానాలలో 71 సీట్లు గెలుచుకున్న బీజేపీకి ఇబ్బందులు తప్పవని పలు సర్వేలు అంచనా వేస్తున్న తరుణంలో ఎస్పీ, బీఎస్పీ కలయిక దేశంలో రాజకీయ వేడిని పెంచింది. అత్యధిక సీట్లు గెలిచి ప్రధాన మంత్రిని నిర్ణయించడం, కుదిరితే ప్రధానమంత్రి పదవిని దక్కించుకోవడమే లక్ష్యంగా బీఎస్పీ చీఫ్ మాయావతి, ఎస్పీ చీఫ్ అఖిలేష్ యాదవ్ పావులు కదుపుతున్నారు.

అవినీతి కోసమే మహాకూటమి

ఎస్పీ, బీఎస్పీ కలయికలో ఏర్పాటైన కూటమిపై ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆధిత్యానాథ్ విమర్శలు గుప్పించారు. బీజేపీకి వ్యతిరేకంగా ప్రతిపక్షాలు ఏర్పాటు చేస్తున్న కూటములు అరాచకాలు, అవినీతి, రాజకీయ అస్థిరత కోసమేనని ఆయన ఆరోపించారు. ప్రజల విశ్వాసానికి అనుగుణంగా సమాజంలోని అన్నీవర్గాల అభివృద్ధి కోసమే బీజేపీ పని చేస్తోందని ఆధిత్యానాథ్ పునరుద్ఘాటించారు. 50 ఏళ్లపాటు కుటుంబ రాజకీయాలు, కులవ్యవస్థ, ప్రాంతీయవాదాలతో దేశాన్ని పాతాళంలోకి నెట్టివేశారని కాంగ్రెస్ పార్టీని విమర్శించారు. 2014 సార్వత్రిక ఎన్నికల కంటే మెరుగైన ఫలితాలు సాధిస్తామని, అత్యధిక స్థానాలు గెలుపొందుతామని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. దేశంలోని ఒక గ్రామీణ మహిళ, ఒక సైనికుడు, రైతు లేదా యువతను ఎవరికి ఓటు వేస్తావని అడిగితే మోదీకి వేస్తామని చెబుతున్నారని, మోదీ నాయకత్వంలో దేశం ఆత్మవిశ్వాసంగా ఉందని ఆదిత్యానాథ్ అన్నారు.

ఒంటరిగా బరిలోకి కాంగ్రెస్

ఉత్తరప్రదేశ్‌లో ఎస్పీ, బీఎస్పీ కూటమి ఏర్పాటుపై వ్యూహాత్మక నిశబ్ధాన్ని పాటిస్తున్న కాంగ్రెస్ పార్టీ బరిలో ఒంటరిగా పోరాడాలని భావిస్తోంది. ఎస్పీ, బీఎస్పీ కూటమిపై ప్రశ్నించగా ఉత్తరప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ ఇంచార్జ్ గులాం నబీ ఆజాద్ స్పందించలేదు. పూర్తి వివరాలతో తమ విధానాలపై ఆదివారం స్పందిస్తామని ఆయన అన్నారు. యూపీ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజ్ బబ్బర్, సీఎల్పీ నాయకుడు, రాజ్యసభ సభ్యుడు సంజయ్ సింగ్, మాజీ ఎంపీ ప్రమోద్ తివారీతో తన నివాసంలో ఆజాద్ భేటీ అయ్యారు. ఎస్పీ, బీఎస్పీ కూటమి కాంగ్రెస్‌కు ఎదురుదెబ్బ అని ప్రశ్నించగా ఆయన స్పందించలేదు. ఇదిలావుండగా బీజేపీకి



వ్యతిరేకంగా కూటమిని ఏర్పరచాలనే విషయంలో ఎస్పీ, బీఎస్పీ కలయిక ఎదురుదెబ్బేనని, ఉత్తరప్రదేశ్‌లో ఒంటరిగా బరిలో దిగడం మినహాయించి మరో దారిలేదని, గణనీయ స్థానాలు సాధిస్తామని పలువురు కాంగ్రెస్ నాయకులు అభిప్రాయపడుతున్నారు.

మోడీని ఓడించలేరని వారికి తెలుసు

ఎస్పీ, బీఎస్పీ కూటమి మోడీని ఓడించలేరని కేంద్రమంత్రి రవిశం కర్ ప్రసాద్ వ్యాఖ్యానించారు. దేశం, రాష్ట్రం కోసం ఈ రెండు పార్టీలు జతకట్టలేదని వారి ఉనికి చాటుకునేందుకే కూటమని ఆయన ఎద్దేవా చేశారు.

స్వాగతించిన దీదీ

తృణముల్ కాంగ్రెస్ అధినేత్రి, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమత బెనర్జీ ఎస్పీ, బీఎస్పీ కూటమిని స్వాగతించారు. రెండు పార్టీలు జతకలిసి మతతత్వ శక్తులను ఓడించాలని, ప్రజల హక్కులను రక్షించాలని ఆమె వ్యాఖ్యానించారు. బీజేపీని నిలువరించేందుకు ఉత్తరప్రదేశ్‌లో ఎస్పీ, బీఎస్పీలు ఒక్కటవ్వాలని గతంలోనే చెప్పిన మమత.. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కూటమిని స్వాగతించారు.

చెరో 38

అమేథీ, రాయ్‌బరేలీలో పోటీకి దూరం

ఎస్పీ, బీఎస్పీ చెరో 38 స్థానాల్లో పోటీ చేయనున్నాయి. కూటమిలో లేకపోయినప్పటికీ అమేథీ, రాయ్‌బరేలీ స్థానాలను కాంగ్రెస్ పార్టీకి వదిలేశాయి. మిగిలిన రెండు స్థానాలను మిత్రుల కోసం ఉంచారు. కూటమిలో కాంగ్రెస్ పార్టీ ఉంటే కూటమి ప్రభావితమవుతుందని, ఓట్ల బదిలీ జరగదని మాయవతి స్పష్టం చేశారు. కాంగ్రెస్, బీజేపీల విధానాలు ఒకేటా ఉంటాయని ఆమె విమర్శించారు. రెండు పార్టీలు రక్షణ ఒప్పందాలలో అవినీతి పాల్పడ్డాయని, కాంగ్రెస్ పార్టీ ఎమర్జెన్సీని ప్రకటిస్తే బీజేపీ అప్రకటిత ఎమర్జెన్సీని కొనసాగిస్తోందన్నారు. ఎస్పీ, బీఎస్పీల కూటమి మోదీ, అమిత్ షాలకు నిద్రలే కుండా చేస్తోందన్నారు. ఎస్పీ, బీఎస్పీలు 25 ఏళ్ల తర్వాత జతకట్టాయని మాయవతి వెల్లడించారు.

ఫెడరల్ ఫ్రంట్‌కు ఊపు



న్యూఢిల్లీ: జాతీయ స్థాయిలో బీజేపీ, కాంగ్రెస్‌లకు ప్రత్యామ్నాయంగా ఫెడరల్ ఫ్రంట్‌కు తెలంగాణ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు చేస్తున్న కృషి ఫలిస్తోంది. బీజేపీ, కాంగ్రెస్ రెండూ ఒకే తాను ముక్కలే, వాటికి ప్రత్యామ్నాయంగా తృతీయ కూటమి రావల్సిన అవసరం ఉందని శనివారంనాడు బీఎస్పీ అధినేత్రి మాయా వతి వ్యాఖ్యానించారు. బీజేపీ, కాంగ్రెస్‌లకు సమాన దూరం పాటిస్తామని ప్రకటించారు. ఎస్పీ అధ్యక్షు డు, యూపీ మాజీ సీఎం అఖిలేష్ యాదవ్‌తో కలిసి మాయావతి సంయుక్త మీడియా సమావేశం నిర్వహించారు. ఉత్తర్‌ప్రదేశ్‌లో ఎస్పీ-బీఎస్పీ కూటమిగా లోక్‌సభ ఎన్నికల్లో బరిలోకి దిగుతున్న ప్రకటించారు. ఈ సందర్భంగా మాయావతి, అఖిలేష్ కీలక వ్యాఖ్యలు చేశారు. బీజేపీ, కాంగ్రెస్‌లకు ప్రత్యామ్నాయం రావల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ దిశగా తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ చేస్తున్న కృషిని పరోక్షంగా ప్రస్తావించారు. 19న కోల్‌కతాలో మమతాబెనర్జీ నేతృత్వంలో తలపెట్టిన మహాఘట్‌బంధన్ సభకు హాజరుకావడం లేదని బీఎస్పీ అధినేత్రి మాయావతి ప్రకటించారు. కాంగ్రెస్, బీజేపీలకు సమానదూరం పాటించాలన్నదే మా లక్ష్యమన్నారు. ఎస్పీ అధ్యక్షుడు అఖిలేష్ ఆచితూచి స్పందించారు. కోల్‌కతా సభకు వెళ్లేది లేదని కచ్చితంగా వెల్లడించలేదు కానీ, త్వరలో తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్‌తో సమావేశమవుతానని తెలిపారు. దీంతో కేసీఆర్ ఫెడరల్ ఫ్రంట్‌కు మాయావతి, అఖిలేష్‌ల నుంచి మద్దతు లభించినట్లేనని రాజకీయ పరిశీలకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ అటు కాంగ్రెస్, ఇటు బీజేపీతో కలిసే ప్రసక్తే లేదని స్పష్టం చేసిన విషయం తెలిసిందే. జనవరి 26 నుంచి ఒడిశాలో రైతు బంధు పథకాన్ని అమలు చేయబోతున్నారు. ఎకరాకు రూ.5 వేలు చొప్పున ఖరీఫ్, రబీ పంటలకు రెండు విడతలుగా అందజేయనున్నారు. అటు కాంగ్రెస్, ఇటు బీజేపీలకు వ్యతిరేకంగా పలు ప్రాంతీయ పార్టీలు పోరాడుతున్నాయి. ఎన్డీఏ, యూపీఏ కూటమిల్లోకి చేరకుండా తమ స్వయం ప్రతిపత్తిని కాపాడుకుంటున్నాయి. ఇందులో కమ్యూనిస్టు పార్టీలు కూడా కాంగ్రెస్‌తో కలవడానికి సంకోచిస్తున్నాయి.

ఫెడరల్ సమాఖ్య స్ఫూర్తి, రాష్ట్రాల ప్రయోజనాలే లక్ష్యంగా దేశ రాజకీయాల్లో సమూల మార్పులకు ముఖ్యమంత్రి కేసీఆర్ ఫెడరల్ ఫ్రంట్‌కు రూపకల్పన చేశారు. కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న ఆర్థిక విధానాలు, వ్యవసాయ, పారిశ్రామిక, సాగునీటి రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకురావాలన్నదే ఫెడరల్ సమాఖ్య లక్ష్యంగా అడుగులేస్తున్నారు. ఫెడరల్ ఫ్రంట్‌కు మద్దతు సమీకరణలో భాగంగా ఒడిశా ముఖ్యమంత్రి, బిజూ జనతాదల్ అధ్యక్షుడు నవీన్‌పట్నాయక్, సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు, యూపీ మాజీ సీఎం అఖిలేష్ యాదవ్, పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతాబెనర్జీ, జేడీఎస్ అధ్యక్షుడు, మాజీ ప్రధాని దేవెగౌడ, కర్ణాటక ముఖ్యమంత్రి కుమారస్వామి, డీఎంకే అధ్యక్షుడు స్టాలిన్ తదితరులతో కేసీఆర్ సమావేశమై ఫెడరల్ ఫ్రంట్ ప్రాముఖ్యతపై చర్చించారు. అందరి నుంచి సానుకూల సంకేతాలు వచ్చాయి.

తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన రైతుబంధు, రైతుబీమా, మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు తదితర పథకాలు జాతీయ స్థాయిలో పేరుగాంచాయి. అటు కేంద్ర ప్రభుత్వంతో పాటు పలు రాష్ట్రాలు కేసీఆర్ పథకాలు అమలుచేయడానికి మొగ్గుచూపాయి. పశ్చిమబెంగాల్, జార్ఖండ్, ఒడిశా రాష్ట్రాల్లో రైతుబంధు, రైతుబీమా పథకాలు అమలుకు శ్రీకారం చుట్టాయి.

ఇది ఓ రకంగా కేసీఆర్ ప్రభుత్వానికి పేరు ప్రఖ్యాతలు రావడమే కాకుండా, ఫెడరల్ ఫ్రంట్‌కు నైతిక మద్దతు లభించినట్లేనని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.



మాఊరు-మారాజ్యం

కారు జోరు!

ఏకగ్రీవాల్లో తెరాస మద్దతుదార్ల హవా



కరీంనగర్, ప్రభన్యూస్ బ్యూరో, : పంచాయతీ ఎన్నికల్లో గులాబీ హవా కొనసాగే సూచనలు కనిపిస్తున్నాయి. నాలుగు జిల్లాల్లో నామినేన్ల పరిశీలన అనంతరం సర్పంచ్ స్థానానికి సింగిల్ నామినేషన్ దాఖలైన పంచాయతీల్లో ఎక్కువ పంచాయతీల్లో టీఆర్ఎస్ కు చెందిన వారు ఉన్నారు. మొదటి విడత ఎన్నికల నామినేషన్ల ఉపసంహరణ గడువు నేటితో ముగియనుంది. కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలో మొదటి విడత ఎన్నికలు 414 గ్రామపంచాయతీల్లో జరగనున్నాయి. నామినేషన్ల పరిశీలన అనంతరం 18 గ్రామ పంచాయతీలు ఏకగ్రీవమైనాయి. ఆదివారం సాయంత్రం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉండటంతో 50 నుంచి 70 పంచాయతీలు ఏకగ్రీవమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. ఏకగ్రీవం కానున్న పంచాయతీల్లో ఎక్కువ టీఆర్ఎస్ పార్టీ కి చెందిన వారే గెలిచే అవకాశాలు కనిపిస్తున్నాయి. కాంగ్రెస్ విషయానికి వస్తే మంథనిలో ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, జగిత్యాలలో జీవన్ రెడ్డి లు మినహా ఎవరూ పెద్దగా దృష్టిసారించడంలేదు. జిల్లా కేంద్రాలకు పరిమితమై అక్కడి వచ్చేవారితో మాట్లాడి పంపిస్తున్నారు తప్ప ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంలేదు. అసెంబ్లీ ఎన్నికల్లో పరాజయంతో ఉన్న నేతలు సర్పంచ్ ఎన్నికల పంచాయతీ మనకెందుకని ఎవరికి వారుగా దూరంగా ఉంటుండటంతో గ్రామాల్లో సర్పంచ్ బరిలో నిలవాలనుకుంటున్న కాంగ్రెస్ నేతలు సందిగ్ధంలో పడిపోతున్నారు.

ఇప్పటికే టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఆయా గ్రామాల్లో పోటీలో ఉండాలనుకుంటున్న కాంగ్రెస్, బీజేపీ నేతలను పిలిపించి బుజ్జగించే పనిలో పడటంతోపాటు పార్టీలో చేర్చుకునేందుకు సిద్ధమవుతుండటంతో పంచాయతీ ఎన్నికల అనంతరం ప్రతిపక్షాల పట్టు గ్రామాల్లో సన్నగిల్లే అవకాశాలు కనిపిస్తున్నాయి. మొదటి విడతలో సింగిల్ నామినేష్లు దాఖలైన పంచాయతీలను పరిశీలిస్తే ప్రతిపక్షాలకు గడ్డు కాలమని చెప్పకతప్పదు. మొదటి విడత పంచాయతీలకు ఈనెల 21న జరిగే ఎన్నికల్లో గులాబీ జోరు కొనసాగే అవకాశాలు కనిప్తున్నాయి. నామినేషన్ల పరిశీలన అనంతరం కరీంనగర్ జిల్లా, చొప్పదండి మండలం మంగలపల్లి, రామడుగు మండలం పందికుంటపల్లి, గోలిరామయ్యపల్లి, జగిత్యాల జిల్లాలోని సారంగాపూర్ మండలం ఒడ్డెర కాలనీ, భీంరెడ్డిగూడెం, భీర్‌పూర్ మండలం కందనకుంట, ధర్మపురి మండలం బూర్గుపల్లి, అక్షేయపల్లి, రాయికల్ మండలం కైరిగూడ, రాజన్న సిరిసిల్ల జిల్లాలోవని రుద్రంగి మండలం దేగవత్‌తండా, రుప్లానాయక్ తండా, బడి తండా, వీరుని తండా, అడ్డాపూర్ తండా, చందుర్తి మండలంలోని కట్టలింగంపేట తండా, దేవుని తండా, కొత్తపేట, వేములవాడ మండలం దుర్కానినగర్ పంచాయతీలకు సింగిల్ నామినేషన్ దాఖలైంది, రామ డుగు మండలం గొలిరామయ్యపల్లిలో నామినేషన్ దాఖలు చేసిన ఉప్పు రాధమ్మ ఏకగ్రీవం కాను న్నారు, రెండో నామినేషన్ తిరస్కరణకు గురైంది, రాధమ్మ కాంగ్రెస్ పార్టీకి చెందిన వారు, ఒక్కరు మినహా మిగితా చోట సింగిల్ నామినేషన్ దాఖలు చేసినవారంతా టీఆర్ఎస్‌కు చెందినవారే. నామినేషన్ల ఆదివారం సాయంత్రం మూడు గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంది.

మొదటి విడత నామినేషన్ల ఉపసంహరణ 13 వరకు ఉండటంతో బుజ్జగింపులు ప్రారంభమైనాయి. సింగిల్ నామినేషన్లు దాఖలైన పంచాయతీలు పోను చిన్న పంచాయతీలు, పోటీ ఎక్కువగా లేని చోట ఏకగ్రీవం కోసం ఆయా నియోజర్గాల ఎమ్మెల్యేలు ప్రయత్నాలు చేస్తున్నారు. మెజారిటీ స్థానాలు టీఆర్ఎస్ కు చెందిన వారే గెలువాలని చూస్తున్నారు. పోటీ అనివార్యమైన పంచాయతీల్లో టీఆర్ఎస్ కు చెందిన వారిని ఒక్కరినే బరిలో ఉంచి మద్దతు ఇవ్వాలని నిర్ణయించుకుంటున్నారు. ఇప్పటికే సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌లు ప్రభుత్వం ఏకగ్రీవ పంచాయతీలకు ఇచ్చే 10 లక్షల నజరానాతోపాటు వీరు మరో 15లక్షలు ప్రకటించారు.

సర్పంచ్ పదవిపై ఆసక్తి చూపిస్తున్న నేతలు పోటీ దారులను డబ్బులతో కొనేందుకు భేరసారాలు ప్రారంభించారు. మధ్యవర్తుల ద్వారా, క్యాంపుల ద్వారా, దావతుల ద్వారా ఈ ప్రయత్నాలు ముమ్మరమైనాయి. నాలుగు జిల్లాల్లో దాఖలైన సింగిల్ నామినేషన్లతో కలసి వంద పంచాయతీలైన ఏకగ్రీవమైతే ఎమ్మెల్యేల పాత్ర కీలకమైందని చెప్పవచ్చు. కరీంనగర్, చొప్పదండి, జగిత్యాల, ధర్మపురి, మంథని, వేములవాడ, రామగుండం ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, సుంకె రవిశంకర్, డాక్టర్ సంజయ్, కొప్పుల ఈశ్వర్, శ్రీధర్‌బాబు, కోరుకంటి చందర్ లకు ఈ ఎన్నికలు అగ్ని పరీక్ష అని చెప్పవచ్చు. ఇందులో శ్రీధర్‌బాబు ఒక్కరే కాంగ్రెస్ పార్టీకి చెందినవారు మిగితావారంతా అధికార టీఆర్ఎస్‌కు చెందిన వారే. గతంలో ఉమ్మడి జిల్లాలో 59 పంచాయతీలు మాత్రమే ఏకగ్రీవమైనాయి, ఈసారి మొదటి విడతలోనే రికార్డును బ్రేక్ చేయాలని ఎమ్మెల్యేలు చూస్తున్నారు.

తమ్మీ.. తప్పుకోరాదే?

పంచాయతీల్లో జోరుగా బుజ్జగింపుల పర్వం

- నేడు నామినేషన్ల ఉపసంహరణ
- గుర్తులతో అభ్యర్థుల తుది జాబితాలు
- 11 పంచాయతీల్లో త్వరలో రీ నోటిఫికేషన్



హైదరాబాద్,ఆంధ్రప్రభ : బాబ్బాబు ఈ ఒక్కసారికి పోటీనుంచి తప్పుకో.. వచ్చే ఎంపిటీసీ ఎన్నికల్లో నామద్దతు నీకే.. కాదంటే సహకార సంఘం అధ్యక్ష పదవి తీసుకో.. నీ మనసులో కోరికేమిటో చెప్పు తీరుస్తా.. ఇదీ పంచాయతీల్లో అభ్యర్థుల వేడుకోళ్లు. పోటీలో నిలిచిన మిగతా అభ్యర్థులను పోటీలోంచి తప్పుకోవాలని కోరుతూ బతిమాలుకుంటున్న దృశ్యాలు ఎక్కడికక్కడ కనిపిస్తున్నాయి. రాష్ట్రంలోని మారుమూల గ్రామాల్లో సైతం వినిపిస్తున్న మాటలివి. గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో క్షేత్రస్థాయి నేతల మధ్య జోరుగా మంతనాలు, బుజ్జగింపుల పర్వాలు సాగుతున్నాయి. క్షేత్రస్థాయిలో పంచాయతీ ఎన్నికలపై దృష్టి సారించిన ప్రధాన రాజకీయ పార్టీలు తమ తమ పార్టీల గ్రామ స్థాయి నేతలను, పార్టీ సానుభూతి పరులనే ఎన్నికల్లో పోటీ చేయించటం ద్వారా గ్రామ స్థాయిలో పార్టీ పట్టు నిలుపుకునేందుకు కృషి చేస్తున్నాయి. గ్రామాల్లో బలమైన వర్గాలు ఉన్న చోట పోటీ తీవ్రంగానే ఉంది. రిజర్వేషన్ పంచాయతీలకంటే ఓపెన్ కేటగిరి పంచాయతీల్లోనే పోటీ అధికంగా ఉన్నట్టు సమాచారం. ఎన్నికల్లో ఏదో విధంగా తమ అనుచరులను గెలిపించుకునేందుకు మండల, నియోజక వర్గ స్థాయి నేతలు తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నారు. ఒకే వర్గం వారిమధ్య పోటీ ఉన్న గ్రామాల్లో పెద్దమనుషుల పంచాయతీలు నడుస్తున్నాయి. పోటీలో ఉన్న వారి మధ్యన రాజీలు కుదిర్చి మిగిలిన వారి నామినేషన్లు విత్‌డ్రా చేయించే కార్యక్రమాలు జోరుగా సాగుతున్నాయి. కొన్ని నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు, నియోజకవర్గ నేతలు కూడా పంచాయతీ ఎన్నికల్లో పెద్దరికం పాత్రం పోషిస్తూ రాజీలతో పంచాయతీ ఎన్నికలు ఏకగ్రీవం చేసేందుకు శ్రమిస్తున్నారు. బలమైన వర్గ నేతలు కొందరు తమ అనుచరులతో నామి నేషన్లు వేయించి నామినేషన్ల విత్‌డ్రా కార్యక్రమం ముగిసే దాక గ్రామంలో వారు కనిపించకుండా టూర్లకు పంపారు. మరికొందరిని రిసార్ట్‌లలో దాచి ఉంచినట్టు సమాచారం.

నేటితో నామినేషన్ల పర్వం పూర్తి


రాష్ట్రంలో తొలివిడత గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ల పర్వం ఆదివారం నాటితో ముగిసిపోనుంది. గ్రామ పంచా యతీ సర్పంచ్ స్థానాలకు, వార్డు స్థానాలకు నామినేషన్లు దాఖలు చేసిన వారు పోటీ నుంచి తప్పుకునేందుకు ఆదివారం గడువిచ్చారు. ఉదయం నుంచి ప్రారంభమయ్యే నామినేషన్ల ఉపసంహరణ ఘట్టం మధ్యాహ్నం మూ డు గంటలతో ముగిసిపోనుంది. ఆ వెనువెంటనే రంగంలో మిగి లిన అభ్యర్థులతో ఎన్నికల తుది జాబీతాలు విడుదల చేయ ను న్నారు. అంతే కాకుండా ఎన్ని కల్లో పోటిచేస్తున్న అభ్య ర్థులకు కూడా అక్షర మాల క్రమం లో ఎన్నికల గుర్తులు కేటాయించనున్నారు.

అప్పీళ్ల పరిశీలన

వివిధ కారణాలవల్ల తిరస్కరణకు గురైన నామినేషన్లపై అభ్యర్థులు దాఖలు చేసిన అప్పీళ్లను కూడా శనివారం రెవెన్యూ డివిజన్ కేంద్రాల్లో ఆర్డీఓలు పరిస్కరించారు. పంచాయతీల్లో రిటర్నింగ్ అధికారులు ఆదివారం నామినేషన్ల ఉప సంహరణపై దృష్టిసారించారు రా ష్ట్ర ంలో అత్యధిక పంచాయతీల్లో సర్పంచ్, వార్డు సభ్యుల పదవులను ఏకగ్రీవం చేసేందుకు జోరుగా ప్రయత్నాలు సాగుతున్నాయి. పంచాయతీ ఎన్నికలు రాజకీయ పార్టీలకు అతీతంగా జరుగున్నట్టు రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించింది.

ఈ నెల 21న పోలింగ్ జరగనున్న తొలివిడుత పంచాయతీల్లో ఏకగ్రీవాలు ఎన్ని, పోటీ ఎన్ని అన్నది సాయంత్రానికి తేలిపోనుంది.

అక్కడ నామినేషన్లు నిల్



రాష్ట్రంలో తొలి విడత కింద మొత్తం 197 మండలాల పరిధిలోని 4480 గ్రామ పంచాయతీల్లో సర్పంచ్ పదవులకు, వాటి పరిధిలోని 39832 వార్డు స్థానాలకు ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేశారు. అయితే నామినేషన్ల దాఖలు కార్యక్రమం ముగిసే సరికి 11 గ్రామ పంచాయతీల్లో సర్పంచ్ పదవులకు ఎవరూ నామినేషన్ వేయలేదు. అంతేకాకుండా వీటి పరిధిలో 206 వార్డు స్థానాలకు కూడా ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు. నామినేషన్లు దాఖలు చేయని గ్రామ పంచాయతీలు నాగర్ కర్నూల్ జిల్లాలో 5, భద్రాద్రి కొత్తగూడెం, కరీంనగర్ మంచిర్యాల, జిల్లాల్లో రెండేసి గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఈ గ్రామ పంచాయతీల్లో ఎన్నికల ప్రక్రియ ఇంతటితో నిలిచిపోయింది. ఈ గ్రామ పంచాయతీల్లో పరిస్థితులు అధ్యయనం చేశాక తిరిగి ఎన్నికలు ఎప్పుడు నిర్వహించేది నిర్ణయించనున్నారు. వీటికి ఎన్నికలు నిర్వహించే తేదీలను రీ నోటిషికేషన్ ద్వారా ప్రకటించనున్నట్టు రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారులు వెల్లడించారు. ఇక మిగిలిన పంచాయతీలకు నామినేషన్ల స్క్రూటినీ కార్యక్రమాన్ని కూడా ముగించారు. రాష్ట్రంలో ఎన్నికలు జరిగే 4468 గ్రామ పంచాయతీల్లో సర్పంచ్ స్థానాలకు మొత్తం 23, 229 నామినేషన్లు చెల్లుబాటు అయినట్టు అధికారులు వెల్లడించారు. అదే విధంగా 39,822 వార్డు స్థానాలకు మొత్తం 93,501 నామినేషన్లు ఆమోదం పొందాయి.

స్థానికంగానే సర్దుకుపోండి

పార్టీ శ్రేణులకు టీ టీడీపీ అధ్యక్షుడు రమణ సూచన



హైదరాబాద్, ఆంధ్రప్రభ : గ్రామ పంచాయతీ ఎన్నికల్లో స్థానిక పరిస్థితులకు అనుగుణంగా సర్దుబాట్లు చేసుకుని ముందుకు సాగాలని తెలుగుదేశం పార్టీ తెలంగాణ అధ్యక్షుడు ఎల్. రమణ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. లోక్‌సభ ఎన్ని కలను దృష్టిలో ఉంచుకుని పంచాయతీ ఎన్నికల్లో కూడా సమన్వయంతో కలిసి పని చేయాలని ఆయన సూచించారు. పార్టీ నాయకులు, శ్రేణులతో శనివారం ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రంలో అన్ని ప్రాంతాల్లో పార్టీ తరపున సర్పంచ్‌లు, వార్డు సభ్యులు గాని విజయం సాధించేలా సమన్వయంతో ముందుకెళ్లాలని రమణ సూచించారు.

గత నాలుగున్నరేళ్లలో తెరాసా పాలనలో పంచాయతీ వ్యవస్థ నిర్వీర్యమైందని రమణ ఆరోపించారు. గ్రామ పంచాయతీలకు నిధులు, అధికారాలు ఇవ్వకుండా అభివృద్ధికి దూరం చేశారనమి ఆయన దుయ్యబట్టారు. వృద్ధాప్య పెన్షన్ రూ. వెయ్యి నుంచి రూ. 2016కు పెంచుతామని ఇటీవల జరిగిన ఎన్నికల్లో టీఆర్ఎస్ తన మేనిఫెస్టోలో చేర్చినప్పటికి ఇంతవరకు అమలు దిశగా ఒక అడుగు వేయలేదని ఆయన ఆరోపించారు. ఏపీ సీఎం చంద్రబాబునాయుడు అన్ని రకాల పెన్షన్లను వంద శాతం పెంచారని, జనవరి 1 నుంచే వాటిని అమలు చేశారని స్పష్టమైన హామీ ఇచ్చారని రమణ గుర్తు చేశారు.

నేడు సూర్యాపేటలో ఎస్ఈసీ సమీక్ష

హైదరాబాద్,ఆంధ్రప్రభ: రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ నాగిరెడ్డి ఆదివారం సూర్యాపేట జిల్లాలో పర్యటించనున్నారు. సూర్యాపేట కేంద్రంలో గ్రామ పంచాయతీ ఎన్నికల ఏర్పాట్లను అధికారులతో సమీక్షించనున్నారు. కలెక్టర్, ఎస్పీతోపాటు ఇతర ఎన్నికల అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నట్టు ఎన్నికల సంఘం అధికారులు తెలిపారు.

22 కేసులు.. రూ.1.17 కోట్లు సీజ్

హైదరాబాద్,ఆంధ్రప్రభ : గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణలో బాగంగా అధికారులు రాష్ట్రంలో ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన 22మందిపై కేసులు నమోదు చేశారు. శనివారం వివిధ జిల్లాల్లో జరిపిన సోదాల్లో రూ.1.17కోట్ల నగదును సీజ్ చేశారు. ఎన్నికలను ప్రభావితం చేసే రూ.4.82లక్షల విలువైన సామాగ్రిని కూడా సీజ్ చేసినట్టు అధికారులు వెల్లడించారు.

పంజాబ్‌లో సర్పంచ్‌లే మత్తు నిరోధకులు



పంచాయతీ కథలు 10

సాధారణంగా ఏ పంచాయతీకైనా తాగునీరు, సాగునీరు, పరిశుభ్రత, మరుగుదొడ్లు వంటి సమస్య లుంటాయి. పొలాల గొడవలు, కరెంటు తగదాలు పంచా యతీలకు తలనెప్పులుగా ఉంటాయి. ఇప్పుడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలను అమలు చేసే బాధ్యత కూడా పంచాయతీలదే. ఇవి కాకుండా సాంఘిక సమస్యలు ఎలానూ ఉండనే ఉంటాయి. ఒకప్పుడు గ్రామాల్లో సారాపై ఆందో ళనలు జరిగేవి. మహిళలు సారాను నిషేధిం చాలని ఉద్యమిం చేవారు. ఇప్పుడు బెల్టు షాపుల బెడద గ్రామాలను పట్టిపీడిస్తోంది. బెల్టు షాపులను అరికట్టడం పంచాయతీల వల్ల కావడం లేదు. కొన్ని గ్రామాల్లో మహిళలు రోడ్లపైకి వచ్చి ఆందోళనలు చేస్తున్న ఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. మన తెలుగు ప్రాంతాల్లో గ్రామాల్లో ఉండే ప్రధాన సమస్యలు. కానీ ఉత్తరాదిన ఒక రాష్ట్రం ఉంది. ఆ రాష్ట్రంలోని గ్రామాల్లో సమస్యల తీరే వేరు. సాధారణంగా అలాంటి సమస్యలు నగర ప్రాంతాల్లో ఉంటాయి. గతంలో హైదరాబాద్‌లో ఆ సమస్యపై తెలుగు సినీ పరిశ్రమలోని కొంతమంది పోలీసుల ముందు వివరణ ఇచ్చుకోవడానికి క్యూ కట్టాల్సి వచ్చింది.

గ్రామాల్లో మద్యపానం, బీడీ, చుట్ట వంటి వ్యసనాలుంటాయి. ఇప్పుడంటే మందుబాబులు సైతం భారీగానే ఉన్నారు. పైన చెప్పుకున్న ఒక ఉత్తరాది రాష్ట్రంలోని గ్రామాల్లో మరో వ్యసనం రాజ్యమేలుతోంది. ఆ రాష్ట్రంలోని గ్రామాల్లో మద్యపానం కూడా కిక్కు ఇవ్వడం లేదు. వారు ఏకంగా మాదక ద్రవ్యాలకు అలవాటు పడుతున్నారు. దీనికి సాక్ష్యంగా ఏకంగా ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సర్పంచులకు బహిరంగంగా విజ్ఞప్తి చేశారు. ఆ రాష్ట్రం పేరు పంజాబ్.. మాదక ద్రవ్యాలను నిరోధించాలని సర్పంచులను కోరిన ముఖ్యమంత్రి అమరీందర్ సింగ్. ఈ మధ్యే ముగిసిన స్థానిక ఎన్నికల్లో గెలిచిన సర్పంచులతో సీఎం అమరీందర్ సింగ్ మూకుమ్మడిగా ప్రమాణస్వీకార కార్యక్రమం నిర్వహించారు. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమంలోనే పంజాబ్ గ్రామ సర్పంచులను మాదక ద్రవ్య నిరోధక అధికారులుగా కూడా నియమిస్తున్నట్లు ప్రకటించారు. సర్పంచులకు ఈ కొత్త బాధ్య తలు ఇవ్వడంతోనే.. పంజాబ్ గ్రామాల్లో మాద క ద్రవ్య వినియోగం ఏ స్థాయిలో ఉందో బాహ్య ప్రపంచానికి తెలిసి పోయింది.

మాదక ద్రవ్య నిరోధమే తొలి బాధ్యత!

సర్పంచులుగా మాదక ద్రవ్యా వినియోగాన్ని నిరోధిం చడమే తొలి బాధ్యతగా పంజాబ్‌సీఎం అమరీందర్‌సింగ్ ప్రకటించడం మరో విశేషం. పంజాబ్‌లోకి మాదక ద్రవ్యాల సరఫరాను అరికట్టడంలో గట్టి చర్యలు తీసుకున్నామని, డ్రగ్ మాఫియా అంతు చూశామని, అయితే చాప కింద నీరులాగా గ్రామాల్లోకి వచ్చి పడుతున్న మాదక ద్రవ్యాలను అరికట్టడంలో సర్పంచులు కీలక పాత్ర పోషించాలని సీఎం అమరీందర్ సింగ్ విజ్ఞప్తి చేయాల్సి వచ్చింది. దీంతో పంజాబ్ గ్రామ సర్పంచుల నెత్తిన కొత్త బాధ్యతలు వచ్చి పడ్డాయి. పంజాబ్ గ్రామాలకు ఇప్పుడు మంచినీరు రాకున్నా పర్లేదు.. మాదక ద్రవ్యాలు రాకపోతే చాలనే పరిస్థితులు ఏర్పడ్డాయి.

దేశంలో మాదక ద్రవ్యాల వినియోగంలో పంజాబ్ అగ్ర స్థానంలో ఉండడంతో.. దీని ప్రభావం గ్రామాల స్థాయి వరకు వెళ్లింది. దేశంలో మాదక ద్రవ్యాల వినియోగం అధికంగా నగరాలు, పట్టణాలకే ఎక్కువ పరిమితమైతే పంజాబ్‌లో గ్రామ స్థాయికి వ్యాపించడం విషాదం. ఆ రాష్ట్రంలోని గ్రామాలు మాదక ద్రవ్యాల బారిన పడి విలవిలలాడుతున్నాయి. అందుకనే ప్రమాణ స్వీకారం రోజునే పంజాబ్ సర్పంచులకు మాదక ద్రవ్యాలను నిరోధించే బాధ్యత కూడా మీద పడింది.

బట్టలు మార్చినంత ఈజీగా ఫిరాయింపులు

- పంచాయతీల ఏకగ్రీవం సరికాదు
- టీజేఎస్ అధ్యక్షుడు కోదండరామ్



హైదరాబాద్, ఆంధ్రప్రభ : 'నమ్మిన సిద్ధాంతం కోసం గతంలో పార్టీలో ఉండే వారు. ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదు. బట్టలు మార్చుకున్నంత సులభంగా.. రాజకీ య నాయకులు పార్టీలు మారుస్తున్నారు' అని తెలంగాణ జన సమితి అధ్యక్షుడు కోదండ రామ్ దుయ్యబట్టారు. దేశంలో స్పీకర్ వ్యవస్థ కూడా ఇంకా పట్టిం కావాల్సిన అవసరం ఉందని ఆయన వ్యాఖ్యానించారు. గత అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకుని వ్యవస్థను మరింత బలోపేతం చేయడంపైన దృష్టిపెట్టాలని ఆయన సూచించారు. శనివారం ఆయన టీజేఎస్ కార్యాయలయంలో మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. పంచాయతీ ఎన్నికల్లో రాజకీయ పెత్తనంతో ఏకగ్రీవవడం చేయడం మంచిది కాదని, రాజకీయ స్వేచ్ఛకు గొడ్డలి పెట్టు అని ఆయన అన్నారు. ఎన్నికల్లో పోటి చేసే స్వేచ్ఛను ప్రజలకు కల్పించాలని ఆయన సూచించారు. ఏకగ్రీవాలపై ఎన్నికల కమిషన్ దృష్టి సారించాలన్నారు. పంచాయతీ ఎన్నికల్లో టీజేఎస్ మద్దతుతో పోటి చేస్తున్నారని, చాలా చోట్ల నామినేషన్లు వేశారని ఆయన వివరించారు. పంచాయతీ ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్లు తగ్గించడం సరికాదన్నారు. బీసీ రిజర్వేషన్లపై గట్టి ఉద్యమాన్నే నిర్మిస్తామని ఆయన చెప్పారు. కేంద్ర ప్రభుత్వం అగ్రకుల పేదలకు 10 శాతం ఇచ్చి రిజర్వేషన్లు పెంచుకోవచ్చనే సంకేతాలు ఇచ్చిందన్నారు. ఈబీసీకి ఇచ్చిన 10 శాతం రిజర్వేషన్లతో 60 శాతానికి పెరిగిందని, బీసీలకు కూడా 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీలకు నిధులు, విధులు కేటాయించి బలోపేతం చేయాలన్నారు. సర్పంచ్‌లకు విధులు పట్ల శిక్షణ ఇవ్వ డం మంచి కార్యక్రమం అన్నారు. ప్రైవేట్ రంగంలో స్థాని కులకే అవకాశాలు కల్పించాలని కోదండరామ్ డిమాండ్ చేశారు.

కాంగ్రెస్‌లో విలీనమయ్యే ముచ్చటే లేదు..

కాంగ్రెస్ పార్టీలో తెలంగాణ జన సమిత విలీనం అవుతుందని వస్తున్న వార్తల్లో వాస్తవం లేదని, అవన్ని తప్పుడు ప్రచారాలని కోదండరామ్ కొట్టిపారేశారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో పోటి చేసే అంశంపై పార్టీలో చర్చలు జరుగుతున్నట్లు ఆయన చెప్పారు. రానున్న ఎన్నికలపై తమ పార్టీకంటూ అంతర్గతంగా ఒక ఆలోచన ఉందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిపై తాం ఉ నిరాశ చెందలేదని, వచ్చే ఎన్నికలకు సిద్ధంగా ఉన్నట్లు ఆయన వివరించారు. పార్టీ స్థాపించిన కొన్ని మాసాల్లోనే ఎన్నికలు రావడం ఓటమి చెందినట్లు భావిస్తున్నామన్నారు. అసెంబ్లీ ఎన్నికల నిర్వహణపై తమకు అనేక అనుమానాలు ఉన్నాయని కోదండరామ్ తెలిపారు. ఏపీలో జరిగే ఎన్నికల్లో ప్రచారం చేయడానికి తమకు తీరిక లేదని మీడియా అడిగిన ప్రశ్నకు సమాధానమిచ్చారు. తెలంగాణతో పాటు ఏపీకి అభివృద్ధి చెందాలని తాను కోరుకుంటున్నట్లు కోదండరామ్ అభిప్రాయపడ్డారు. గతంలో ఏపీ అభివృద్ధి కోసం అనేక ఉద్యమాలు చేశామని ఆయన గుర్తు చేశారు. తెలంగాణ కోసం చేయాల్సి చాలా ఉందని అని అన్నారు.

రాష్ట్ర ఎన్నికల అధికారిపై సీబీసీఐడీ విచారణ జరిపించాలి..

ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అనేక అవకతవలు జరిగాయని, వీటన్నింటికి బాధ్యులుగా రాష్ట్ర ఎన్నికల కమిషన్ అధికారే కారణమని కోదండరామ్ ఆరోపించారు. రాష్ట్ర ఎన్నికల అధికారి రజత్‌కుమార్‌పై రాష్ట్రపతి, కేంద్ర ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. రాష్ట్ర ఎన్నికల అధికారిపై సీబీసీఐడి విచారణకు కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించాలని, అప్పుడు అన్ని విషయాలు బయటకు వస్తాయని ఆయన హెచ్చరించారు.


Printed & Published by MOOTHA GOUTAM on behalf of Andhra Prabha Publications Ltd., and printed at Andhra Prabha Publications Ltd., 13-6-445/a/b1, Konejeti Enclave, Mehdhipatnam, Hyderabad-500028. Published from Andhra Prabha Publications Ltd., 8-2-293/82/A/75, Plot No.75, Road No.9, Jubilee Hills, Hyderabad-500033. Phones: 23559940/41/42/45, Fax No.23558812. Editor: Y S R Sarma, Responsible for News selection under PRB ACT. RNI Regd.No.32178/1977.



ఈ బంధం విడదీయలేనిది!
ఓ కుటుంబ అనుబంధంలా..!
సిరి బంధం
11 నెలల 'నగలు కొనుగోలు పథకం'!
తొలి వాయిదా
ఉచితం!
మీకోసం తొలి వాయిదాను మీ పేరిట నేనే చెల్లిస్తా.
+
V.A.
50% ఉచితం!
ఏ బంగారు నగ అయినా V.A.లో సగం V.A.
చెల్లించడం కూడా నా బాధ్యతగా తీసుకుంటా!
ఈ సువర్ణ అవకాశం అన్ని బంగారు నగలకు వర్తిస్తుంది!
ప్రతినెల నగల కొనుగోల పథకంలో చెల్లిస్తున్నది డబ్బు కాదు..
అది మీ శ్రమ! అందుకు తగ్గ ఫలితాన్ని అందించాలన్నదే నా ఉద్దేశం!
కస్టమర్ GST చెల్లించాల్సి ఉంటుంది.
రూ.1000 / రూ.1500 / రూ.2000 / రూ.2500 చిన్న వాయిదాలు, రెండింతల ప్రయోజనం!
ప్రతినెల మీరు చెల్లించే నగదు, ఆరోజునాటి విలువ ప్రకారం 22 క్యారెట్ బంగారంగా ఆదా చేయబడుతుంది.
100% V.A. లేకుండా
నగలను కొనడం సాధ్యమా?
పరిచయం చేస్తున్నాం!
గోల్డెన్ టుమారో
నగల బుకింగ్
పథకం!
5 నెలల నుంచే ఫలితం!
11 నెలల తర్వాత నగను కొనేటప్పుడు, 14% లేదా 16% వరకు V.A. ఉన్న నగ అయినప్పటికీ..
1% V.A. కూడా చెల్లించనక్కర్లేదు.
ఏ నగకూ
100% V.A. లేదు
మొత్తం నగదును ఒకసారి చెల్లించి, తర్వాత..
V.A. లేకుండా నగలు కొనుగోలు చేసుకోండి.
One Time Payment !
• మీరు చెల్లించే నగదును మీ అభిప్రాయం మేరకు నగదు రూపంగానూ లేదా బంగారం రూపంగానూ ఆదా చేసుకోవచ్చు.
• మీ పాత నగలను ఇచ్చి కూడా ఈ పథకంలో చేరొచ్చు.
కేవలం అరశాతం (0.5%) మీ పాత బంగారు నగలను మెల్టింగ్, ప్యూరిఫికేషన్ చేసేందుకు పట్టుకుంటాం.
కస్టమర్ GST చెల్లించాల్సి ఉంటుంది.
100% నాణ్యత - BIS 916 హాల్‌మార్క్
క్యారెట్ రూ.46,000 కన్నా అధికంగా ఇస్తున్నారంటే..
మీరు తెలిసే మోసపోతున్నట్టు!
భారతదేశంలోనే తక్కువ ధరకు వజ్రాభరణాలు!
క్యారెట్ రూ. 46000 నుంచి!
V.A. గ్రాముకు రూ.975 మాత్రమే
అన్ని వజ్రాభరణాలకు అంతర్జాతీయ స్థాయి సర్టిఫికెట్ అందజేస్తాం.
100% Quality. E-F Colour Grade & VVS Clarity.
మా దగ్గర కొన్న వజ్రాభరణాలకు 100% ఎక్స్ఛేంజ్ చేసుకునే సౌకర్యం మరియు 85% క్యాష్‌బాక్ సౌకర్యం.
కనువిందు చేసే సంప్రదాయ మరియు
వినూత్నమైన వెండిసామగ్రి.
మార్కెట్‌లోనే అతి తక్కువ ధరకు
అందిస్తున్నాం!
Lalithaa
లలితా జ్యూవెల్లరి మార్ట్ ప్రై. లిమిటెడ్
లక్షలాది డిజైన్లు!
www.lalithaajewellery.com
వైజాగ్ : 29-1-75/1, ఆర్‌టీసీ బస్టాండ్, ద్వారకా నగర్. ఫోన్: 0891-6600001.
తిరుపతి : 481/482, రెడ్డి అండ్ రెడ్డి కాలనీ, మాస్కరోడ్, (V.V. మహల్‌రోడ్) ఫోన్: 0877-666 0505 / 0606 / 7888.
హైదరాబాద్ : 6-3-883, SBR సౌక్, రాజీవ్‌గాంధి విగ్రహం ఎదురుగా, సోమాజిగూడ సర్కిల్. ఫోన్: 040 - 6748 6677.
చెన్నై • తిరువళ్ళూరు • మదురై • తిరుచ్చి • పుదుచ్చేరి • కుంభకోణం • బెంగళూరు • రామనాథపురం • కోయంబత్తూరు • సేలం • నాగర్‌కోవిల్ • ఈరోడ్

Lively **I**nteraction **F**or **E**ver
ఆంధ్రప్రభ
lifepage2012@gmail.com
లైఫ్ I
ఆదివారం 13 జనవరి 2019


* రంగవల్లిక *




15 నుండి 3 వరకు మధ్య చుక్క



గోకవరపు సుహాసిని
మచిలీపట్నం



19 నుండి 1 వరకు చుక్కలు అవసరమైనట్టుగా పెట్టుకోవాలి



17 చుక్కలు
3 వరుసలు
3వరకు సరిచుక్క



ఎమ్ ధనలక్ష్మి
కెహెచ్‌బి కాలనీ
నెల్లూరు

మీరూ ముగ్గులు పంపొచ్చు

ముగ్గుని ఎ4 సైజున్న మందపాటి పేపరుమీద వేయాలి. ఔట్ లైన్‌ని, చుక్కలను బ్లాక్ స్కెచ్ పెన్నుతో వేసి లోపల రంగులు నింపాలి. ఎన్ని చుక్కలు ఎన్ని వరుసలు అనే వివరాలను స్పష్టంగా రాయాలి.

అడ్రసు: లైఫ్ c/o ఆంధ్రప్రభ, 8-2-293/82/ఎ/75, ఫ్లాట్ నెం:75, రోడ్ నెం:9, జూబ్లీహిల్స్, హైదరాబాద్-28
lifepage2012@gmail.com

మాస్‌కి... వినయ విధేయుడు!

- బోయపాటి శ్రీను

మాస్..క్లాస్..చిత్ర పరిశ్రమలో వినిపించే సాధారణ పదాలు. మిగతా రంగాల్లో వీటి అర్థాల సంగతి వేరు కానీ....ఇక్కడ మాస్‌దే ఆధిక్యత. ఈ తరహా చిత్రాలు చేసిన కథానాయకులు, దర్శకులే విస్తృతంగా ఎదిగారు. ఈతరంలో అలాంటి మాస్ దర్శకుడు బోయపాటి శ్రీను. ఆయన దర్శకత్వం వహించిన తొలి చిత్రం నుంచీ ఎంచుకున్న దారి మార్చకుండా సాగుతున్నారు. జయాపజయాలకు అతీతంగా బోయపాటిపై పరిశ్రమలో, ప్రేక్షకుల్లో ఓ నమ్మకం ఏర్పడింది. భద్ర, సింహా, సరైనోడు లాంటి చిత్రాలు బోయపాటి దర్శకత్వ సత్తాకు నిదర్శనంగా నిలుస్తాయి. ఈ పేరును నిలబెట్టుకునే క్రమంలో తాను చేస్తున్న కృషిని ఆయన ఆంధ్రప్రభ లైఫ్‌తో పంచుకున్నారు...



నేను పుట్టి పెరిగింది గుంటూరు జిల్లా పెదకాకాని. మాకో ఫొటో స్టూడియో ఉండేది. అక్కడ ఫొటోలు తీయడం గమనించేవాడిని. అలా ఫొటోగ్రఫీపై ఆసక్తి పెరిగింది. గుంటూరులో ఓ చిన్న పరిశ్రమ పెట్టాలనే ఆలోచన కూడా ఉండేది. అప్పటికే మా బంధువు పోసాని కృష్ణ మురళి సినిమాల్లో రచయితగా పనిచేస్తున్నారు. నేనూ చిత్ర పరిశ్రమకు వస్తానని ఆయనను అడిగేవాడిని. కొన్నాళ్లు పోసాని గారు దర్శకుడు ముత్యాల సుబ్బయ్య గారి దగ్గర సహాయకుడిగా చేర్చారు. అలా నా సినిమా ప్రయాణం ప్రారంభమైంది..

మరే దర్శకుడి దగ్గరా పనిచేయలేదు..

నేను ముత్యాల సుబ్బయ్య గారి దగ్గర మాత్రమే సహాయకుడిగా పనిచేశాను. మధ్యలో మిగతా దర్శకుల నుంచి అవకాశం వచ్చింది కానీ నేను వెళ్లలేదు. మొత్తం ఆరు చిత్రాలకు సహాయ దర్శకుడిగా ఉన్నాను. నేను దర్శకుడిని అయ్యేంతవరకు ముత్యాల సుబ్బయ్య గారి దగ్గరే ఉండిపోయాను. ఆయనతో పనిచేయడం వల్ల కుటుంబ కథల్లో ఉండే భావోద్వేగాలను తెరపైకి తీసుకురావడం ఎలాగో తెలుసుకున్నాను.

తొలి కథ అల్లు అర్జున్ కోసం..

సహాయ దర్శకుడిగా కొనసాగుతూనే నాకు తోచిన కథలు... బాగున్నాయి అనిపించినవి రాసుకుంటూ ఉండేవాడిని. అలా భద్ర కథ పూర్తి చేసి నిర్మాత అల్లు అరవింద్‌కు చెప్పాను. 'అన్నయ్య' సినిమాకు పనిచేస్తున్నప్పటి నుంచి అరవింద్ గారు బాగా తెలుసు. అల్లు అర్జున్‌కు భద్ర కథ బాగుంటుందని అనిపించింది. అరవింద్ గారు విని బన్నీ... ఆర్య సినిమా చేస్తున్నాడు. అయినా ఒకసారి చెప్పు అన్నారు. అల్లు అర్జున్‌కు కథ నచ్చి, నేను ఈ సినిమాకు డేట్స్ ఇవ్వలేను, దిల్ రాజు గారికి చెబుదాం అంటూ నన్ను తీసుకెళ్లి కథ వినిపించారు. ఆయన కథ విని వెంటనే అడ్వాన్స్ చేతిలో పెట్టారు. అలా భద్ర కథ అల్లు అర్జున్, ప్రభాస్‌లను దాటుకుని రవితేజ చేతికి వచ్చింది.

తులసి, సింహా నేపథ్యం...

భద్ర ఘన విజయం సాధించింది. నాకు బాగా పేరు తీసుకొచ్చింది. ఆ తర్వాత ఏడాదిన్నర వేచి చూశాను. విక్టరీ వెంకటేష్ గారి పిలుపుతో తులసి సినిమా పట్టాలెక్కింది. ఆ తర్వాత కొంత విరామం తీసుకుని బాలకృష్ణ గారితో సింహా సినిమా చేశాను. ఈ సినిమా నా కెరీర్‌కు మంచి మలుపునిచ్చింది. నాపై మాస్ సినిమాల దర్శకుడిగా ముద్ర వేసింది. సింహా కోసం నేను తీసుకున్న జాగ్రత్తలన్నీ సినిమా విజయంలో కీలకంగా మారాయి.

భావోద్వేగాలు పండాలంతే...

మనకు భావోద్వేగాలు ఎక్కువ. కుటుంబానికి విలువనిస్తాం. ఈ సెంటిమెంట్‌ను కథలో పండించగలిగితే సినిమా విజయం సాధించినట్లే. కాలం మారింది అనుకోవడానికి లేదు. ఎప్పుడైనా బంధాలు, అనుబంధాలు మారవు. నా ప్రతి చిత్రంలో మంచి కుటుంబ నేపథ్యం ఉంటుంది. మాదీ పెద్ద కుటుంబమే. ఆ అనుబంధాలు, ఆత్మీయతా తెలుసు. ఒక్కసారి ప్రేక్షకులకు కథలోని ఉద్వేగం అందిస్తే ఇక వాళ్ల దృష్టి సినిమా నుంచి మరలదు.

మాస్ అంశాలు అభిమానుల కోసమే...

సినిమా చప్పగా ఉండకూడదు అనేది నా దృక్పథం. సృజనాత్మకతలో స్వేచ్ఛ తీసుకోవాల్సిందే. అప్పుడే ప్రేక్షకులకు నచ్చుతుంది. సహజంగా చేద్దామంటే సినిమా స్థాయి పెరగదు. అందుకే నా చిత్రాల్లో కుటుంబాలు కూడా ఆర్థికంగా బలమైనవే అయి ఉంటాయి. ఆ పాత్రలన్నీ కళకళలాడుతూ కనిపిస్తాయి. ముతక చీరలు కట్టిన పాత్రలతో సినిమాలు చేస్తే జనాలకు నచ్చదు.

చిన్న సినిమాలు చేయలేను...

నేను చేస్తే పెద్ద చిత్రాలే చేస్తాను. భారీ బడ్జెట్ చిత్రాలకే నా ప్రాధాన్యత. ఇప్పుడు దారి



మార్చి చిన్న చిత్రాలు చేయలేను. నా సినిమా విరామ సన్నివేశానికే... ఆరేడు కోట్ల రూపాయలు ఖర్చవుతుంది. అలాగని నిర్మాతపై ఎప్పుడూ భారం వేయలేదు. సినిమా కథను పక్కాగా అనుకున్నాకే షూటింగ్‌కు వెళ్తాం. షెడ్యూల్ అనుకున్న రోజుకు పూర్తి చేస్తాను. అనవసరంగా ఒక్క షాట్ తీయను. ఎందుకంటే ఒక్కో రోజు షూటింగ్‌కు 20 లక్షలకు పైగా ఖర్చవుతుంటుంది. అందుకే చాలా జాగ్రత్తగా క్రమశిక్షణతో పనిచేస్తుంటాను. సినిమా కోసం చావు అంచుల దాకా వెళ్లి వచ్చిన రోజులున్నాయి. సినిమా విడుదల ముందు ఆరేడు రోజులు నిద్రే పోను. ప్రతి పనీ దగ్గరుండి చూసుకుంటాను.

అన్ని అంశాలుంటాయి..

నా చిత్రాల్లో రౌద్రం ఎక్కువగా ఉంటుందనే పేరొచ్చింది. అయితే నా సినిమాల్లో ప్రేమ, కుటుంబం, పోరాటాలు అన్నీ ఉంటాయి. అయితే మాస్‌కు కావాల్సింది ఫైట్స్ కాబట్టి రౌద్రం ఎక్కువగా ఉంటుందనే పేరొచ్చింది. ప్రతి సినిమాకు... మరింత ఉన్నత స్థాయి సినిమా చేయాలనే అనుకుంటాను. దీని తర్వాత ఏంటి అంటే ఇంకా ఉంది అనే ఆత్మవిశ్వాసం తోడుగా ఉంటుంది. నా గురువు ముత్యాల సుబ్బయ్య గారు ఒకటే చెప్పారు..'నువ్వు నిద్రపోయినా కాళ్లు ఉపుతూనే ఉండు... లేకపోతే నువ్వు లేవని ప్రచారం చేస్తారు' అని. అలాంటి పరిశ్రమ మనది. నీకు అర్థమైంది అనుకుంటా... అన్నారాయన. నాకు అర్థమైంది...అందుకే ఆయన నాకిచ్చిన సలహాను ఎప్పుడూ పాటిస్తుంటా.



సంక్రాంతి సందడి...

నాకు సంక్రాంతి పండగతో చాలా అనుబంధముంది. మా ఊరు పెదకాకానిలో భారీగా పండగను నిర్వహిస్తాం. మూడు రోజుల పాటు వేడుకలు జరుపుకుంటాం. చాలా శాస్త్రోక్తంగా పండగ నిర్వహిస్తాం. ఏటా నేను మా ఊరు వెళ్తుంటాను. ఈ ఏడాది హైదరాబాద్‌లో కొత్త ఇల్లు కొన్నాను. ఈసారి ఇక్కడికే కుటుంబ సభ్యులంతా వస్తున్నారు.

ఒక్కడు చాలు..

ఉమ్మడి కుటుంబాన్ని నిలబెట్టేందుకు ఒక్కడు గట్టిగా నిలబడితే చాలు అనుకుంటాను. నేను పరిశ్రమకు వచ్చేందుకు అన్న, అక్క బాగా ప్రోత్సహించారు.



నాకు పేరొచ్చి, గర్వకారణంగా ఉన్నా..వాళ్ల కళ్లలో అలాంటి భావం కనిపించనివ్వరు. నేను లేనప్పుడు మాత్రం నా గురించి చెప్పుకుంటారు. సినిమా బృందం లాగే కుటుంబ సభ్యుల మంచి చెడ్డలూ చూస్తుంటాను. అందరినీ ఒక్క తాటిపై ఉంచాలనే ప్రయత్నంలో కొంత కటువుగానూ ఉండాల్సి వస్తోంది.

తదుపరి చిత్రాలు..

వినయ విధేయ రామ... తర్వాత బాలకృష్ణతో సినిమా చేస్తున్నాను. ఆ తర్వాత రామ్ చరణ్, అల్లు అర్జున్‌లలో ఒకరితో సినిమా ఉంటుంది. చిరంజీవి గారికి కూడా ఒక కథ చెప్పాను. నేను పరిశ్రమలో అందరు హీరోలతో పనిచేయాలనుకుంటున్నాను. నేను ఏ హీరో సినిమా చేస్తే ఆ హీరోకి అభిమానిగా నన్ను నేను భావించుకుని దర్శకత్వం వహిస్తుంటా.

- రమేష్ గోపిశెట్టి



అత్యంత ఎత్తైన తొండవరం వాకలగరువు ప్రభలు

కోనసీమ ప్రభ!

♦ ఏకాదశ రుద్రుల సంగమంగా ప్రభల ఉత్సవం ♦ మూడు రోజుల పండుగ సంక్రాంతి

సంక్రాంతి వేడుకల్లో కోనసీమలో జరిగే ప్రభల ఉత్సవానికి ఒక ప్రత్యేకమైన పేరు ఉంది. కోనసీమలో సుమారు 80 గ్రామాల్లో ఈ ప్రభల ఉత్సవం జరుగుతున్నప్పటికీ సంక్రాంతి మరుసటిరోజున కనుమనాడు జగ్గన్నతోటలో జరిగే ఏకాదశ రుద్రుల దర్శనం చేసుకునేందుకు ప్రజలు అధిక సంఖ్యలో తరలిస్తారు. ఒకేసారి 11 ఈశ్వర రూపాలు ఒకేచోట కొలువు తీరే ఈ ఉత్సవాన్ని...దేశంలోనే ఎంతో అరుదైన వేడుకగా భావిస్తారు. సంక్రాంతి వేడుకలకు ఆధ్యాత్మిక భావాలను అద్దుతున్న... కోనసీమ ప్రభల ఉత్సవం విశేషాలు మీకోసం-

ప్రభల పుట్టుక-తయారీ

ప్రభల పుట్టుక విషయం తెలుసుకోవాలంటే పురాణాల్లోకి లోతుగా వెళ్ళాల్సిందే. దక్షప్రజాపతి యజ్ఞం చేసే సమయంలో పార్వతిదేవికి జరిగిన అవమానంతో ఉగ్రరూపం దాల్చిన పరమేశ్వరుడు తన జటాఝూటాన్ని నేలకేసి కొట్టడంతో కోటి సూర్యల ప్రభతో వెలుగొందే వీరభద్రుడు యజ్ఞవాటికను ధ్వంసం చేసి దక్షుడి శిరస్సు ఖండించినట్లు పురాణగాథ. ఆ కోటి సూర్యల ప్రభలనే భక్తులు ప్రత్యేకంగా తయారు చేసి వాటిపై ఈశ్వర రూపాలను ఉంచి తమ భుజాలపై మోసి తరిస్తారు. ఈ ప్రభలను ప్రకృతి నుంచి లభించిన తాటి, వెదురు, పోక తదితర చెట్లనుండి సేకరించిన వస్తువులతో రూపొందిస్తారు. తాటి శూలానికి చిల్లులు చేసి, వెదురుబద్దలను అర్థచంద్రాకారంలో వంచి నూతన వస్త్రాలను తయారుచేస్తారు. అలాగే వివిధ రంగుల్లో ఉన్న కంకర్లతో ప్రభలను ముస్తాబు చేస్తారు. ఈ ప్రభలను ప్రత్యేకంగా తయారు చేసిన బలమైన బళ్ళపై ఉంచి పగ్గాల సాయంతో దండీలు బిగించి మోసేందుకు సిద్ధం చేస్తారు. ఈ ప్రభలపై ధాన్యపు కుచ్చులు, గుమ్మడి కాయలు, నెమలి పించాలను అలంకరిస్తారు.

స్థల పురాణం

ప్రభల ఉత్సవం జరిగే జగ్గన్నతోటకు ఒక స్థల పురాణం ఉంది. ఆధ్యాత్మికతతో పాటు చారిత్రాత్మకంగా పరిశీలిస్తే 17వ శతాబ్దం నుండి ప్రభల తీర్థం జరుగుతున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ప్రభల ఉత్సవం జరిగే ప్రదేశం గతంలో పెద్దాపురం సంస్థానాదీశుల ఆధీనంలో ఉండేది. ఈ సంస్థానం హైదరాబాద్‌లో ఉన్న నైజామ్ నవాబుల ఆధీనంలో ఉండేది. ఈ ప్రాంతంలో పరమ శివభక్తుడు, ఏకసంథాగ్రాహి అయిన విఠలా జగన్నాధుడు(జగ్గన్న) అనే పండితుడు ఉండేవాడట. ఇక్కడ ఉన్న అప్పర కౌశిక డ్రైయిన్ గట్టుపై ఉండే పెద్ద మర్రి చెట్టు క్రింద ప్రతి రోజు శివధ్యానం చేసుకునేవాడు. ఈ పూజలపై సంస్థానాధీశులు అభ్యంతరం తెలపడంతో జగ్గన్న నేరుగా హైదరాబాద్‌లో ఉండే నవాబుని కలిసి వారి మెప్పు పొందాడు. నవాబు జగ్గన్నకు 8పుట్లు(64 ఎకరాలు) భూమిని దానంగా ఇచ్చి అక్కడే శివపూజ చేసుకునేందుకు అనుమతి కూడా ఇచ్చాడట. కాల క్రమేణా ఆ ప్రాంతం జగ్గన్నతోటగా పిలవబడింది. అంతేకాకుండా జగ్గన్న కోరిక మేరకు ఏకాదశ రుద్రులు(11 గ్రామాల ఈశ్వర రూపాలు) సంవత్సరానికి ఒకసారి కొలువు తీరుతారని ప్రతీక. అదే సమయంలో పెద్దాపురం సంస్థానాధీశుడైన రాజా వత్సవాయి జగన్నాథ మహారాజు పరమేశ్వరుడు స్వప్నంలో సాక్షాత్కరించి ప్రభల తీర్థం నిర్వహించమని కోరడంతో ఈ ప్రాంతానికి జగ్గన్నతోట తీర్థంగా పేరు వచ్చిందని మరోగాథ కూడా ఉంది.



అప్పరకౌశిక దాటుతున్న ప్రభలు

ఏకాదశ రుద్రులు ఎవరెవరు...

అంబాజీపేట మండలం మొసలపల్లి శివారు జగ్గన్నతోటలో జరిగే ప్రభల తీర్థానికి ప్రధానంగా 11 గ్రామాల నుండి వచ్చే ప్రభలను ఏకాదశ రుద్రులు అంటారు. వీటితో పాటు అనుబంధ ప్రభలు కలిసి తీర్థంలో కొలువుదీరుతాయి. ఏకాదశ రుద్రుల వివరాలు గ్రామాల వారీగా పరిశీలిస్తే గంగలకుర్రు చెన్నమల్లేశ్వర స్వామి, గంగలకుర్రు అగ్రహారం వీరేశ్వర స్వామి, వ్యాఘ్రేశ్వరం వ్యాఘ్రేశ్వర స్వామి, మొసలపల్లి మధుమాసాంత భోగేశ్వర స్వామి, పెదపూడి మేనకేశ్వర స్వామి, ఇరుసుమండ ఆనంద రామేశ్వర స్వామి, పల్లేటికుర్రు అభినవ వ్యాఘ్రేశ్వర స్వామి, ముక్కామల రాఘవేశ్వర స్వామి, వక్కలంక, కాశివిశ్వేశ్వర స్వామి, పాలగుమ్మి, నేదునూరుల నుండి చెన్నమల్లేశ్వర స్వామివార్లు కొలువు దీరుతారు. ఈ 11 ప్రభల్లో 9 ప్రభలు అంబాజీపేట మండలానివి కాగా అమలాపురం రూరల్ మండలం పాలగుమ్మి నుండి ఒకటి, అయినవిల్లి మండలం నేదునూరు నుండి మరొక ప్రభ కొలువు తీరుతాయి. ముఖ్యంగా 9 ప్రభలు రోడ్డు మార్గం ద్వారా జగ్గన్నతోటకు చేరుకుంటే ప్రత్యేకంగా గంగలకుర్రు, గంగలకుర్రు అగ్రహారం ప్రభలు మాత్రం వరిచేలు తొక్కుకుంటూ, పంట కాల్వలు దాటుకుంటూ అప్పర కౌశిక డ్రైయిన్‌ను దాటుకుని జగ్గన్నతోట తీర్థానికి చేరుకుంటాయి. ఈ రెండు ప్రభలు తీర్థానికి వచ్చే, తిరిగి వెళ్ళే దృశ్యాలను వీక్షించేందుకు యావత్ తీర్థప్రజలు తహతహలాడతారు. రాజకీయాల్లో పాటించే ప్రొటోకాల్ కూడా దేవుళ్ళకు ఉంది. నిబంధనల ప్రకారం తీర్థానికి అందరికంటే ముందు మొసలపల్లికి చెందిన మధుమాసాంత భోగేశ్వర స్వామి చేరుకుని మిగిలిన ప్రభలకు స్వాగతం పలుకుతారని ప్రతీతి. ఈ 11 ఈశ్వర రూపాల్లో అత్యంత శక్తివంతమైన వ్యాఘ్రేశ్వర స్వామి అధ్యక్షత వహించి లోక కళ్యాణం కోసం సమీక్షిస్తారని వేద పండితులు చెబుతారు. తీర్థం ముగిసిన తరువాత ప్రొటోకాల్‌ను అనుసరించి ప్రభలు తిరిగి ఆయా గ్రామాలకు వెళ్ళిపోతాయి. ఇలా ఒకేసారి 11 ఈశ్వర రూపాలు ఒకేచోట కొలువు తీరడం బహుశ దేశంలోనే ఎంతో అరుదైన విషయమని గంగలకుర్రు చెన్నమల్లేశ్వర స్వామి ఆలయ అర్చకులు పూజ్యం విశ్వనాథం తెలిపారు. ఇదిలా ఉండగా ఇదేరోజున అంబాజీపేట మండలం వాకలగరువు, తొండవరం గ్రామాలకు చెందిన అత్యంత ఎత్తైన ప్రభలు (42 అడుగులు) ఆయా గ్రామాల్లో కొలువు తీరుతాయి.

-సి.ఎన్.మూర్తి, ప్రభ న్యూస్, అంబాజీపేట



గోదా

అంటే వాక్కును, వస్త్రములను, అద్దమును, విసనకర్రను, ధనమును, జ్ఞానమును, సేవను ఇచ్చునది అని సంగ్రహంగా ఏడు అర్థాలు. మన వాక్కును, మనస్సును, శరీరాన్ని, బుద్ధిని, చిత్తాన్ని, ఒక్క మాటలో మన మొత్తాన్ని పరమాత్మకిచ్చు జీవాత్మే గోదా. దొరికిన రెండు పువ్వులు వేసి వచ్చిన నామాలు చెప్పి పరమాత్మకు మనల్ని మనం అర్పించుకోవాలి అనే మూడు ముక్కలను ముప్పై పాశురాలలో చెప్పి మూడు లోకాలను ముక్తి మార్గంలో నడిపించి మురిపించిన తల్లి గోదా. జీవాత్మ పరమాత్మను చేరుటయే గోదా కళ్యాణం.

గోదా భోగమే భోగి



భోగి పండగ సందడి తెలుగు లోగిళ్లలో ప్రవేశించింది. ఈ పండుగకు భోగి అనే పేరు ఎందుకు వచ్చిందనే సందేహం రావచ్చు. దీనికి రకరకాల కారణాలను తెలుపుతారు. వ్యవసాయదారులు పంటలను ఇళ్లకు చేర్చుకుని విశ్రాంతితో భోగం అనుభవిస్తారు కనుక దీనికి భోగి అనే పేరు వచ్చిందని కొందరు చెబుతారు. అయితే విజ్ఞులు దీనికి మరో కారణాన్ని, అంత రార్థాన్ని, ప్రాశస్త్యాన్ని వివరిస్తున్నారు.

భోగి పండగ, భోగి మంట, గోదా కళ్యాణం అంతరార్థం గురించి శ్రీమాన్ డాక్టర్ కందాడై రామానుజాచార్యుల వారి వివరణ...

గోదాదేవి నెల రోజులు వ్రతం చేసి రంగనాథుడిని వివాహమాడి ఆ స్వామి చెంతకు చేరి భోగము అనుభవించిన రోజు భోగి అంటారు. నూటికి తొంభై మంది భోగి మంటలు చలి తీవ్రత తగ్గించుకునేవి అనుకుంటారు. ఆ మంటలలో ఇంట్లోని పాత వస్తువులను ముఖ్యంగా కలపను వేయడం ఆచారం. అందులోని అంతర్యాన్ని నిశితంగా పరిశీలిస్తే అగ్ని అంటే జ్ఞానానికి దహనమును నిర్వచనం. కలప అంటే అజ్ఞానం. అనగా జ్ఞానంలో అజ్ఞానాన్ని తగులబెట్టడం భోగి మంట. అజ్ఞానం, ఆరాటం, ఆశ, తుచ్ఛ అనుభవం, విపరీత ప్రవృత్తి, భ్రమ, అవిమనలో ఉన్న కలపలు. వీటన్నింటిని జ్ఞానరూపమైన భగవంతునిలో దహింప చేయడమే భోగిమంట చెప్పే సందేశం.

ప్రస్తుతం ఉన్న అజ్ఞానం తరువాత కలుగబోయే అజ్ఞానపు ఆలోచనలు అన్నీ కూడా దహింప చేయవలసినవే. ఇందులోని పరమార్థం స్వార్థాన్ని దహింప చేయడమే. ఇతరుల ఇళ్లల్లోని కలపను కూడా భోగి మంటల్లో వేసే ఆచారం ఉంది. అనగా వారికి ఇష్టం ఉన్నా లేకున్నా వారి అజ్ఞానాన్ని కూడా పోగొట్టే ప్రయత్నం చేయాలి. అప్పుడు స్వార్థానికి తావుండదు.

భోగి పండుగ రోజు ఐదు సంవత్సరాలలోపు పిల్లలకు రేగి పళ్లు, చెరుకు గడలు, కొత్త పంటగా వచ్చిన బియ్యం, నాణేలు, బెల్లం కలిపి భోగి పళ్లగా వారి శిరస్సున పోసే ఆచారం ఉంది. మన సంపదను పది మందికి పంచిపెట్టే దాతృత్వ బుద్ధి పిల్లలకు అలవర్చాలని, ఉన్నది, తిన్నది మనది కాదని పది మందికి పంచిపెడితేనే మనదనే ఉపనిషత్తు వాక్యసారం ఈ ఆచారంలో ఇమిడి ఉంది.

ఇక గోదా కళ్యాణంలోను అంతరార్థాలు దాగి ఉన్నాయి.

ఇక గోదాదేవి విషయానికి వస్తే...

శ్రీమన్నారాయణుడు సంసారంలో జీవులను తరింప చేసే విధానాన్ని ఆలోచిస్తుండగా అమ్మ అతని అనుమతితో విష్ణుచిత్త పుత్రికగా పుట్టి యుక్త వయస్సు రాగానే పరమాత్మను మాత్రమే భర్తగా పొందగోరింది. ద్వాపర యుగంలో గోపికలు చేసిన మాస వ్రతాన్ని తాను ఆచరించి, పరమాత్మను ప్రసన్నుడిని చేసుకుని వివాహమాడింది. గోదా అంటే వాక్కును, వస్త్ర ములను, అద్దమును, విసనకర్రను, ధనమును, జ్ఞానమును, సేవను ఇచ్చునది అని సంగ్రహంగా ఏడు అర్థాలు. మన వాక్కు ను, మనస్సును, శరీరాన్ని, బుద్ధిని, చిత్తాన్ని, ఒక్క మాటలో మన మొత్తాన్ని పర మాత్మకిచ్చు జీవాత్మే గోదా. దొరికిన రెండు పువ్వులు వేసి వచ్చిన నామాలు చెప్పి పరమాత్మకు మనల్ని మనం అర్పిం చుకోవాలి అనే మూడు ముక్కలను ముప్పై పాశురాలలో చెప్పి మూడు లోకాలను ముక్తి మార్గంలో నడిపించి మురిపించిన తల్లి గోదా. జీవాత్మ పరమాత్మను చేరుటయే గోదా కళ్యాణం.

తాను ఆచరించిన వ్రతం, తాను పొందిన ఫలితం తనలోనే దాచుకొనక పది మందికి వ్రత విధానాన్ని బోధించడానికి తిరుప్పావై అను ముప్పై పాశురాల ప్రబంధాన్ని మృదుమధురంగా లోకానికి అందించింది గోదాదేవి. ఆర్తి ఉన్నవారు అందరూ భగవంతుని పొందడానికి అర్హులే. కులం,మతం,జాతి వంటి భేదాలు భగవంతుని పొందే విషయంలో లేవని విశ్వ మానవ కళ్యాణాన్ని వేనోళ్లచాటిన దయామయురాలు గోదమ్మ. తాను ఒక్కతే కాక పది మంది గోపికలను లేపి వారితో కలిసి పరమాత్మ దగ్గరకు వెళ్లడం ద్వారా రుచి కరమైన పదార్థాన్ని ఒక్కరే భుజించక పది మందికి పంచాలనే ఉపదేశాన్ని తెలియ జేస్తుంది. భగవంతుని చేరాలంటే ఆహార నియ మం, వ్యవహార నియమం తప్పక పాటించాలి. మనం కోరుకునే అన్ని అలంకారాలు భగవంతుని కోసమే అని చెప్పడమే ఈ వ్రతోద్దేశ్యం. ఏ వ్రతమైనా నియమాలను ఆచరించడం తప్పనిసరి. శరీరాన్ని శోషింప చేస్తే మనసు పోషింపబడుతుంది, మనసు పోషించ బడితే స్వార్థం సమూ లంగా నశిస్తుంది, పరార్థం, పరమార్థం వికసిస్తాయి అనే ఉపదేశం గోదా కళ్యాణంలో ఇమిడి ఉంది.

ఆర్తితో పిలిస్తే చాలు



మానవుడు కర్మ ఫలంగా జన్మలు ఎత్తుతూ ఉంటాడు. అందులో మానవ జన్మ అత్యంత ఉత్కృష్టమైనది. ఈ జన్మలో భక్తి మార్గాన్ని అవలంబించిన వ్యక్తి పూర్వ జన్మ పరిపాకము చేత సంసార నిమగ్ను డైనా తామరాకు మీద నీటి బొట్టు మాదిరి వ్యవహరిస్తూ, మానసిక వృత్తిని పరమేశ్వర కీర్తనమునందే లగ్నం చేస్తూ తన భక్తితో భగవంతుని ప్రసన్నం చేసుకునే ప్రయత్నం చేయాలి. భక్తి అనేది ఒక విచిత్రమైన మానసిక సంబంధమైన పరిపాకం వంటిది. అది మోక్ష సాధనకు దారి తీసేదని పెద్దలు చెబుతారు. నిర్గుణమైన పరబ్ర హ్మాన్ని జ్ఞానం వలన పట్టు కోవచ్చునన్నారు. అయితే ఇది సామాన్యులకు సాధ్యపడేది కాదు. అంద రికీ అందుబాటులో ఉండేది, సాధ్యమైనది భక్తి మార్గం మాత్రమే. భక్తి మార్గంలో ఒక్కొక్కరూ ఒక్కొక్క రీతిగ భగవంతుని చేరుకోవడానికి ప్రయత్నించారు. మానవునిలోని భక్తి భావం పెరిగి పెద్దదై పరాకాష్ఠకు చేరుకున్నపుడు వాని ఆత్మ పరమాత్మలో లీనమైపోవాలని ఆరాట పడడం సహజం. ఆ సమయంలో ఆత్మ అఖండచిన్మయానందంకోసం పరితపిస్తుంది. శరీరం గగుర్పాటు చెంది మనస్సు ఎక్కడో విహరిం చాలని, తాదాత్మ్యం చెందాలని ఉవ్విళ్ళూరుతుంది. అదొక నిరంతరా న్వేషణగా సాగుతుంది. ఆర్తితో అంతరాత్మ పరంజ్యోతి పరిష్వం గంలో లీనమైపోవడం కోసం పారవశ్యంతో పలుక రిస్తుంది. ఇదొక చిత్త ప రి పా క ం. దీన్నే భక్తి అంటారు. భక్తి కలిగిన వారికి ఆర్తి ఉంటుంది. భక్తి మార్గంలో పయనించే వానికి ఆ భగవంతుని దర్శనం సాధ్యపడలేదనే తపన వలన దుఃఖపడటం సహజమవుతుంది. ఆ స్వామిని దర్శిం చలేదే అన్న బాధ ఆవహిస్తుంది. ఆ విధమైన దుఃఖాన్ని మనం ఆర్తి అందామా? ఆ విధమైన ఆర్తితో భక్తిపూర్వకంగా జీవుడు ఆ పరమాత్మను చేరుకునే ప్రయత్నం గావించాలట. ఆ దేవుడు కరుణించి దర్శనమిచ్చినా, ఆ సమయంలో శరీరం మైమరచిపోయి, హృదయం నిండా ఆ స్వామి రూపమే నిండిపోయి మాటలు రావు. శరీరం వ ణుకుతూ హృదయం ద్రవించిపోతుంది. శరీరం వశంలో ఉండదు. సరికదా కాలం స్తంభించిపోతుంది. ఈ లోకంలోని కోటానుకోట్ల జీవులు, నిరంతరం భక్తి భావంతో దారి వెతుక్కంటూ, నిర్మలమైన మనస్సును కలిగి ఉండాలనే తాపత్రయ పడుతున్నారు. ఇదొక రకమైన పెనుగులాట. మాయతో కప్పబడిన ఈ జీవులు దాని నుంచి వెలుగు వైపునకు పయనిస్తూ, చివరకు ఆ పరంజ్యోతిని దర్శించి తరిస్తారు. మరికొందరు నిశ్చయాత్మకులై భక్తి విశ్వాసాలతో పూర్వజన్మ సంస్కారంతో, సర్వం విష్ణుమయం అనుకుంటూ, పరమేశ్వర నామామృతపానంచే పరవశులై ప్రపం చాన్నే మరచిపోయేవారు. సర్వకాల సర్వావస్థలయందు హరినామస్మరణే జీవనా ధారంగా సాగిపోయారు. భక్తులను రక్షించడానికి ఆ పరమేశ్వరుడే స్వయంగా అవతరించి తరింపజేయగలడని నమ్మారు. ఆ విధంగానే భగవానుడు ఆపత్సమ యాల్లో తానుగా ఏతెంచి తన భక్తులను ఆదుకున్నాడు. కొన్ని సందర్భాల్లో తానే స్వయంగా భక్తుల బాధలను అనుభవించాడు. అంతేగాక భక్తులు తిట్టినా కొట్టినా ఆనందంగా అనుభవించాడు. ఆర్తితో పిలిస్తే భక్త రక్షణ కళా పారీణుడై పరుగు పరుగున వైకుంఠాన్ని వదలి మరీ వచ్చేసాడు.

సిరికింజెప్పడు శంఖ చక్ర యుగముంజేదోయి సంధింపడే
పరివారంబునుం జీరడభ్రగపతింబన్నింపడాకర్ణికాం
తర ధమ్మిల్లముజక్కనొత్తడువివాద ప్రోత్థితశ్రీకుచో
పరిచేలాంచలమైన వీడడుగజప్రాణావనోత్సాహియై

అంటూ గజేంద్రమోక్షంలో శ్రీమహావిష్ణువు తొందర పాటుతో లక్ష్మీ దేవి పైట కొంగును కూడ గమనించకుండా బయలుదేరాడని మనం విని ఉన్నాము. ఆర్తితో భక్తులు పిలిస్తే స్వామి మరేమీ ఆలోచించేది లేదు. వెంటనే వచ్చి ఆదుకోవడమే పని.



- డాక్టర్ పులివర్తి కృష్ణమూర్తి

ఓర్పులో భాగం

శ్రీ రమణాశ్రమ లేఖలు, స్మృతులు


(గత సంచిక తరువాయి భాగం)

ఆయుర్వేద వైద్యులనడిగితే కాన్సరుకు మా వద్ద మందులేదన్నారు. ఇక ఇక్కడ వుంచితే ఉపచారానికి చాలా కష్టమనీ, విమానంలో బెంగళూరు తీసుకువెళ్లాలనీ, అంతా ఆలోచించి అక్కడా ఇక్కడా ఏర్పాట్లన్నీ చేశారు. ఈలోపల రమణాశ్రమం ప్రెసిడెంటు టి.యన్. వెంకట్రా మన్ దంపతులు బొంబాయిలో వున్న తమ కుమారుని ఇంటికి వచ్చి వుండుట వల్ల నన్ను చూచే నిమిత్తం మే 14 మధ్యాహ్నం 3-4 గంటల మధ్యన బ్యాంకు హౌసుకు వచ్చారు. వారితో కంట్రోలర్ ఆఫ్ డిఫెన్స్ అకౌంట్స్ ఆఫీసులో పెద్ద ఆఫీసరుగా పనిచేస్తూ వున్న ఆర్.వెంకటరామన్ దంపతులున్నూ వచ్చారు. నా బాధంతా చూచీ, వినీ, ప్రెసిడెంటు దంపతు లిద్దరూ చాలా విచారించారు. అప్పుడే భగవాన్ ప్రార్థనా పద్యాలు వ్రాసిన కాగితం ప్రెసిడెంటు కిచ్చాను. ఆర్. వెంకట్రామన్ ఇదంతా చూచి చల్లగా మా అల్లుడు యస్. ఆర్.అవధానితో, ''హోమియో మందు యిచ్చి చూస్తాను. వాడ తారేమో అడగండి'' అన్నారు. అదివరకే హోమియో మందు వాడితే బాగుండును. వ్యాధి కుదరకున్నా, బాధ తగ్గితే చాలని యోచిస్తున్న మాకు ఇదొక భగవత్సహా యంగా తోచింది. నా ప్రార్థననాలించి సాక్షాత్తు రమణ భగవానుడే తన భక్తుని పంపించినట్లనిపించింది. 'సరే' నన్నాము. అంతా లేచి వెళ్లారు. మేమున్న ఇంటికి ఆర్.వెంకట్రామన్ వున్న ఇల్లు చాలా దగ్గరవటం వల్ల ఆ రాత్రికే మందు తయారు చేసి మర్నాటి ఉదయమే తెచ్చి యిచ్చారు. అంటే మే 15, ఆదివారంనాడన్నమాట.

నాటి నుంచీ నిత్యం ఒకటి, రెండుసార్లు వచ్చి అనేక రకాలుగా మందు మార్చి ఇవ్వగా, ముందు బాగా ఎక్కువ చేసి, గడ్డ పగిలి నీరు కారుట కారంభించింది. అయినా ఆయన మందే వాడాను. భగవాన్ దయవలన మే నెలా ఖరుకు ఒక మందుకు పట్టు చిక్కి బాధ తగ్గుట ఆరంభించింది. ఆ తగ్గుదల ఆరంభమయ్యీ కాకముందే ఒక పార్సీ రమణ భక్తుడు చూచేందుకు వచ్చి ''తన భార్య కాన్సరు వచ్చే పోయిందని చెప్పి పోక పూర్వం టిబెట్టు వైద్యులొక రున్నారు. ఆ మందు వాడుట మంచిదని ఒకరన్నారు గాని, అప్పటికామె వ్యాధి ముదురుట వల్ల వాడలేదు. ఆ తాలూకు మనిషి ఒకరిక్కడున్నారు. తీసుకుని వస్తా''నని చెప్పి రెండు రోజులు తరువాత సోమసుందరం, కెనడా నుండి వచ్చిన అరుణాచల ఆశ్రమ భక్త భాగవత్, మరివొక అమెరికను భక్తుడు కలిసి వచ్చినప్పుడే టిబెట్టు తాలూకు మనిషిని తీసికుని వచ్చాడు.

ఆ వైద్యుడు చూచి, తమ నాయకుడు టిబెట్టులో వున్నాడనీ, మీరక్కడకు వెళ్లినా సరే వారి నిక్కడకు రప్పించినా సరే, మనిషిని చూస్తేగాని మందీయడని అన్నాడు. ''అబ్బో టిబెట్టుకా?'' అసలు కైలాసయాత్రకే సిద్ధంగా వున్నాను.ఆ ఈశ్వరుడు ఎప్పుడు రమ్మంటాడోనని ఆయన ఆజ్ఞకు ఎదురు చూస్తున్నాను. ఈ వ్యయ ప్రయాసలన్నీ అనవసరం. భక్తితో చేసే ఈ హోమియో మందే చాలును'' అన్నాను. అంతా చకితులయ్యారు.

ఆ వెనుక రెండు, మూడు రోజులలో కెనడా నుంచి వచ్చిన భక్తులూ, సోమసుందరం మరికొందరు భక్తులతో వచ్చి ఆ బాధలోనే నన్నేదో చదవమని టేపురికార్డు చేసుకుని వెళ్లారు. జూన్ పది, పన్నెండు కల్లా కొంత బాధ తగ్గి బయటకు వెళ్లి కొద్ది దూరం నడవగలిగాను. అప్పుడు



ఆర్. వెంకట్రామన్‌తో ''త్వరలో కైలాసయాత్ర చేద్దామనుకున్నానే ఇదేమి?'' అంటే ''కాదు, కాదు. భగవాన్ దయ వల్ల మందు పట్టిచ్చింది. కనుక అరుణాచల యాత్రకే పంపగలనన్న ధైర్యం వచ్చింది. తప్పక అరుణాచలం వెళతా'' రన్నాడు భగవాన్ కరుణా విలాసమో? ఆయన భక్తి యొక్క మహిమాతి శయమో? ఏదైతేనేమి క్రమంగా ఆ బాధంతా తగ్గి గడ్డంతా కరిగి మామూ లుగా తిరుగుట ఆరం భించాను. బొంబాయిలోని రమణ భక్తులూ, తదితరులూ ఇది అంతా భగవాను మహిమయే గాని మరొకటి కాదని అభినందించారు. వైద్యంతో ఏమీ లాభం లేదన్న పెద్ద డాక్టర్లంతా విభ్రాంతి చెందారు.

సెప్టెంబరు 17 వరకూ బొంబాయిలో వుండి 17న బంధు సహాయంతో బయలుదేరి 18న విజయవాడ చేరుకున్నాను. అక్కడ రెండు నెలలుండి ''రమణ సదనం'' ఖాళీ చేసి నవంబరు 14న మద్రాసు చేరుకుని అచ్చటకు బదిలీ చేయబడిన ఆర్.వెంకట రామన్ వద్ద మందులు తీసుకొని మా అన్న డి.యస్.శాస్త్రిగారికి 'భగవాన్ స్మృతులు' చూపి నవంబరు 27 రాత్రికి అరుణాచలం చేరుకొని 28 ఉదయాన ఆశ్రమంలో వున్న శ్రీరమణ భగవానుని సమాధి సందర్శనం చేసుకున్నాను. కైలాసం చేరవలసిన ఈ జీవి బొందితో సహా భగవాన్ సమాధి సన్నిధిని మోకరించి ప్రణమిల్లి కొంతకాలం ఇక్కడ నివసింపగల మహాభాగ్యం లభించింది. వ్యాధితో పీడింపబడుతూ, వున్నప్పటికీ భగవాన్ దయా విశేషం వల్ల జ్ఞప్తికి వచ్చి వ్రాసిన 'శ్రీరమణ భగవాన్ స్మృతులు' క్రమంగా చక్కదిద్ది సాఫీ వ్రాయించి మకర సంక్రమణ మహాపుణ్య కాలంలో సమాధిపై నున్న లింగమందు సమావిష్టులై వున్న శ్రీరమణ భగవానుని పాదపద్మములకు పూజాకుసుమముగా సమర్పణ చేస్తున్నాను. లోపాలోపములను భగవానుడే చక్క చేయునుగాక.

జయము దురిత దూర సజ్జన మందార
జయము మౌన నిరత జన్మ రహిత।
జయము రమణమూర్తి సాధు హృద్వశవర్తి
జయము జయము యోగి చక్రవర్తి॥
మంగళము యోగి హృదయాబ్జ మందిరునకు
మంగళము సచ్చిదానందమయునకెపుడు॥
మంగళము చిత్కళాపూర్ణ మహితకాంతి
మండనునకు సదా జయ మంగళంబు॥
శ్రీరమణార్పణమస్తు.

- సూరినాగమ్మ

శ్రీ రమణాశ్రమము, తిరువణ్ణామలై వారి సౌజన్యంతో

Facebook page https://www.facebook.com/ Sri Ramana Telugu
website http://www.sriramanamaharshi.org/ tel/


చింతన

తిరుప్పావై

పాశురం 29

శిత్తుమ్ శిఱుకాలే వన్దున్నైచ్చేవిత్తు, ఉన్
పొత్తామరై యడియే పోత్తుమ్ పొరుళ్ కేళాయ్,
పెత్తమ్మేయ్‌త్తుణ్ణుఙ్గులత్తిల్ పిఱన్దనీ
కుత్తేవ లెఙ్గళైక్కొళ్ళామల్ పోకాదు;
ఇత్తైప్పఱైకొళ్వా నన్ఱుకాణ్; గోవిన్దా!
ఎత్తైక్కుం ఏళేళుపిఱవిక్కుమ్, ఉన్దన్నో
డుత్తోమే యావోమ్ మునక్కే నామాళ్ శెయ్‌వోమ్,
మత్తై నఙ్గామఙ్గళ్ మాత్తే లోరెమ్బావాయ్

తాత్పర్యం




తెలతెలవారక మునుపే నీవున్న చోటికి మేమే స్వయంగవచ్చి, నిన్ను సేవించి ఆపై బంగారు తామరల వలె స్పృహణీయములైన నీ శ్రీపాదములను కీర్తించుచున్నాము. ఇందువలన మేము కోరు ప్రయోజనమును తెలిపెదము, వినుము. ఓ స్వామీ! పశువులను మేపి అవి తినిన పిదప భుజించు మా గో కులమున పుట్టిన నీవు, మేము నీకై చేయదలంచిన అంతరంగకైంకర్యములను స్వీకరింప కుండ వీలులేదు. (మాలో పుట్టావు గనుక స్వీకరించి తీరవలసినదియే). గోవిందుడా! యిప్పటి వరకు మేము చెప్పినట్లు నీవనుకొనెడి కేవలము పఱై అను వాయిద్యమును (ఢంకా) పుచ్చుకొనుటకు కాదయ్యా! మేమీ వ్రతాచరణకు దిగినది. మరి మేము కోరు పఱై వేరు. అది ఏమిటనగ ఆత్మ ఉన్నంతవరకు, ఏడేడు జన్మలకున్నూ నీతోనే సకలవిధ బంధుత్వము కలవారలముగమేము కావాలి. మేము నీకోసమయ్యే సకల సేవలను చేయువారలము కావలెను. యిందులకాటంకములైన యితర కోరికలన్నింటిని మా నుంచి వెంటనే నశింపజేయు స్వామీ! ఇదే మేము కోరు పరమ ప్రయోజనము.

పాశురం 30

వఙ్గక్కడల్ కడైన్ద మాదవనై క్కేశవనై
త్తిఙ్గళ్ తిరుముగత్తు చ్చేయిళైయార్ శెన్ఱిఱైఞ్జి
అఙ్గప్పఱైకొణ్డవాత్తై, యణిపుదువై
పెఙ్గమలత్తణ్డెరియల్ పట్టర్‌పిరాన్ కోదైశొన్న
శఙ్గత్తమిళ్ మాలై ముప్పదుమ్ తప్పామే
ఇఙ్గిప్పరిశురైప్పా రీరిరణ్డు మాల్వరైత్తోళ్
శెఙ్గణ్ తిరుముగత్తు చ్చెల్వ త్తిమాలాల్
ఎఙ్గుమ్ తిరువళుమ్ పెత్తిన్బుఱువ రెమ్బావాయ్

తాత్పర్యం

క్షీరసాగరమును మథించుటచే లభించిన లక్ష్మిని ధరించుటచే మాధవుడై, సుందర శిరోజములతో బ్రహ్మ రుద్రాదులనుగూడ ధరించుటచే కేశవుడైనట్టి స్వామిని, చంద్రబింబము వలె ఆనందముతో ప్రకాశించు ముఖమండలములు, దివ్యాభరణములు ధరించిన గోపికలు చేరి, ప్రార్థనాపూర్వకముగ స్తుతించి నందవ్రజమున ఆనాడు ద్వాపర యుగమున తమ ప్రయోజనమైన శ్రీకృష్ణుని లోకుల కోసం వర్షమును లభించిరి. ఆ చరిత్రను భూమికాభరణమనదగిన శ్రీవిల్లిపుత్తూరునందు నివసించు చల్లని తామర పూసల మాలికలను ధరించు బ్రాహ్మణోత్తములగు శ్రీ విష్ణుచిత్తుల ముద్దులపట్టియైన, గోదాదేవి సుందరమైన ద్రవిడ పాశురముల మాలికగ గూర్చి శ్రియఃపతికర్పించినది. సంఘముగ కూర్చబడిన ఈ ద్రవిడ పాశురముల మాలిక యందలి ముప్పదింటిని క్రమము తప్పక ఈ లోకములో తనవలె నెవరు అనుసంధింతురో అట్టివారు పర్వత శిఖరముల వలె పెరిగి యుండు నాలుగు భుజములను ధరించి యున్న వాత్సల్యము నిండిన నేత్రములు కల్గినట్టియు, ఐశ్వర్యమునిచ్చు దివ్య ముఖమండలం కల్గినట్టియు లక్ష్మీనాధునిచే ఎల్లప్పుడూ అన్ని విషయాలలో దివ్య కటాక్షాన్ని పొంది ఆనందింపబడతారు. ఈ పాశురములే శ్రియఃపతి కటాక్షమును, తమననుసంధించువారలకొసగును.



- జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ సౌజన్యంతో

దిన ఫలాలు

మేష రాశి: కోర్టు సంబంధిత వ్యవహారాల్లో సానుకూలత ఉంటుంది. పనులలో శ్రమ అధికంగా ఉంటుంది. ఆరోగ్యంలో మంచి మార్పులు చేకూరుతాయి. శుభవార్తలు వింటారు. ఆదాయంలో మెరుగైన వాతావరణం ప్రారంభ మవుతుంది.

వృషభ రాశి: అసహన పరిస్థితులు ఆర్థికంగా కొనసాగుతాయి. ప్రయాణాల విషయంలో జాగ్రత్తలు పాటించాలి. ఆరోగ్య సమస్యలకు పరిష్కారాలు పొందుతారు. కుటుంబ వ్యవహారాల్లో చిరుసమ స్యలు ఎదురవుతాయి. ఆదాయ మార్గాలు అన్వేషించ గలుగుతారు.

మిథున రాశి: వాహన నిర్ణయాలు లాభిస్తాయి. గృహకార్యాలు, కార్యక్రమాలు కలసి వస్తాయి. మానసిక ధైర్యం పెరుగుతుంది. ఆర్థిక అవమాన పరిస్థితులు కొనసాగుతాయి. ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు పాటించాలి. గతంలోని ఒప్పులు ఇప్పుడు తప్పులుగా మారతాయి. అధిక ప్రయత్నా లతో ఆదాయ పరంగా అనుకూల పరిస్థితులు ఉంటాయి.

కర్కాటక రాశి: దూరప్రయాణాలు కలసి వస్తాయి. అభివృద్ధి కుటుంబరీత్యా ఆనందాన్ని కలిగిస్తుంది. పిల్లల విషయంలో శ్రద్ధ తప్పనిసరి. ఆరోగ్య ప్రతి కూలత తగ్గుతుంది. ఆలోచనదోషాల ద్వారా సమస్యలు, అవమానాలు ఉంటాయి. కాబట్టి జాగ్రత్తలు పాటించాలి. ఆదాయ మార్గాలు అనుకూలం.

సింహ రాశి: ఆర్థిక ప్రయత్నాలు ఊరట కలిగిస్తాయి. వినోదాల్లో పాల్గొంటారు. ఆరోగ్యం పర్వాలేదు. ఆర్థిక విషయాల్లో సులువుగా అవకాశాలు లభిస్తాయి. ఆదాయంలో ఆశాజనకమైన వాతావరణం ఉంటుంది.

కన్యా రాశి: ఉద్యోగ ప్రయత్నాలు అనుకూలం. ఆహ్లాద పరిస్థితులు గృహ రీత్యా ఉంటాయి. సంబంధ, బాంధవ్యాల విషయంలో మనస్పర్థలు చోటు చేసుకుంటాయి. కాబట్టి జాగ్రత్తలు పాటించాలి. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. స్థిరాస్తి విషయాల్లో చిరాకులు కొనసాగు తాయి. ఆదాయ మార్గాలు సులభతరమవుతాయి

తులారాశి: విదేశీ లావాదేవీలు లాభిస్తాయి. కళా రంగంలో ప్రతిభ గుర్తించబడుతుంది. ముఖ్యమైన పనులలో జాప్యాలు కొనసాగుతాయి. ఆరోగ్యంలో అనుకూలత ఉంటుంది. ఆదాయంలో ప్రోత్సాహ పరిస్థితులు ఆనందాన్ని కలిగిస్తాయి.

వృశ్చిక రాశి: వ్యాపార ఒప్పందాలు అనుకూలం. ఉద్యోగ వ్యవహారాల్లో ఆశించిన ఫలితాలు లభిస్తాయి. మానసిక చిరాకులు కొనసాగుతాయి. ఆరోగ్యంలో ఖర్చులు పెరుగుతాయి. చేపట్టే కార్యాలలో వేగం తగ్గుతుంది. ఆదాయంలో అనుకూల/ప్రతికూలతలు ఉంటాయి.

ధనూ రాశి: ఉద్యోగ ప్రయత్నాలు లభిస్తాయి. ఆదాయంలో అనుకూల పరిస్థితులు ప్రారంభం. వేగంగా నిర్ణయాలు తీసుకోలేక పోతారు. ఆరోగ్యంలో ఖర్చులు తగ్గుతాయి. గతంలోని పొరపాట్లు సరిదిద్దుకోగలుగుతారు. ఆదాయంలో మెరుగైన అవకాశాలు దగ్గరవుతాయి.


మకర రాశి: ఆరోగ్య పరీక్షలు మేలును కలిగిస్తాయి. విదేశీ లావాదేవీలు ఊరట కలిగిస్తాయి. ఆరోగ్య రక్షణ తప్పనిసరి. ఆరోగ్య ఖర్చులు పెరుగుతాయి. మంచికి పోయి చెడు కోరి తెచ్చుకొంటారు. ఆర్థిక వ్యవహారాలు గట్టి ప్రయ త్నాలతో మాత్రమే సాధ్యం.

కుంభరాశి: నూతన స్నేహాల ద్వారా లబ్ది చేకూరుతుంది. గృహకార్యాలు, కార్యక్రమాలు ఉపకరిస్తాయి. శుభ వార్తలు వింటారు. ఆరోగ్య క్రమశిక్షణ ఏర్పడుతుంది. ఆరోగ్యంలో ప్రతికూలత తగ్గుతుంది. వ్యాపార అనుకూలత ఉంటుంది. ఆదాయంలో ప్రోత్సాహ పరిస్థితులు ఆనందాన్ని కలిగిస్తాయి.

మీనరాశి: విద్యా ప్రయత్నాలు అను కూలం. నూతన స్నేహాలు అనుకూలిస్తాయి. ఆరోగ్యంలో ఆకస్మిక ప్రతికూలత ఉంటుంది. ఆరోగ్య ఖర్చులు పెరుగుతాయి. కోర్టు వ్యవహారాల్లో ప్రతికూల ప్రభావం ఉంటుంది. ఆదాయంలో అనుకూల మార్పులు గోచరిస్తాయి.



శ్రీ నూకల సూర్యనారాయణ
nookalasuryanarayana@gmail.com





ఆధునికత కూడలిలో సంక్రాంతి!

సంక్రాంతికి ముందు,తర్వాతా ప్రాధాన్యం ఉన్న పండుగలే. ముందు వచ్చేది భోగి. చలి నుంచి రక్షణ కోసం రోడ్ల కూడళ్ళలో భోగి మంటలు వేసుకోవడం ఆనవాయితీ. ఆడపిల్లలు ధనుర్మాసం నెల్లాళ్ళూ ముంగిట్లలో పెట్టే గొబ్బెమ్మలను పిడకలగా ఎండబెట్టి భోగి మంటల్లో వేస్తుంటారు. మనిషిలో ఉండే కామ,క్రోధ,మద,మోహ,లోభ, మాత్సర్యాలనే అరిషడ్వర్గాలను భోగిమంటల్లో వేసి మనిషి సత్వ గుణాన్ని పెంపొందించుకోవడానికే భోగి మంటల సంప్రదాయాన్ని పెద్దలు ప్రవేశపెట్టారు. సూర్యుడు మకరరాశిలో ప్రవేశించడాన్ని మకర సంక్రమణం అంటారు.సంక్రాంతిప్రధానంగా రైతుల పండుగ. ఆరుగాలం శ్రమించే రైతు చేతికి పంట అందివచ్చే సందర్భాన్ని పురస్కరించుకుని ఇంటికి చేరిన ధాన్యపు రాశులను చూసి ఆనందించే పర్వదినం సంక్రాంతి. సంక్రాంతి వాతావరణం ఎక్కువగా గ్రామాల్లో కనిపిస్తుంది. ప్రతి లోగిలిలో కళ్ళాపు చల్లి ముత్యాల ముగ్గులతో అలంకరింపబడి,గొబ్బెమ్మలు, బంతి పూల సువాసనలు స్వాగతం పలుకుతాయి. యువతులు, బాలికలు ముంగిళ్ళను అలంకరించే సమయంలోనే రావమ్మా మహలక్ష్మి గీతాలతో హరిదాసులు సంప్రదాయ రీతుల్లో నృత్యాలు చేస్తూ చిన్నా,పెద్ద అందరినీ అలరింపజేస్తారు. అలాగే, గంగిరెద్దులను ఆడించే వారు ఇంటింటా ఆగి గంగిరెద్దుల చేత సాష్టాంగ ప్రమాణాలు చేయిస్తారు. పల్లెల్లో సంక్రాంతి వాతావరణం అన్నివర్గాల ప్రజల మనసులను ఆకట్టుకుంటుంది.అందుకే,పట్టణాలు, నగరాల్లో ఉద్యోగాలు చేసేవారంతా సంక్రాంతి సెలవులకు స్వస్థలాలకు మూడు రోజుల ముందే బయలుదేరుతుంటారు.సంక్రాంతి సెలవులకు రైల్వే శాఖ ప్రత్యేక రైళ్ళనూ, రోడ్డురవాణా సంస్థ ప్రత్యేక బస్సులనునడుపుతూ ఉంటాయి.

ప్రత్యక్షదైవమైన సూర్యభగవానుడు మకర రాశిలో ప్రవేశించే పర్వదినం కావడం వల్ల సంక్రాంతికి మకర సంక్రాంతి అనే పేరు స్థిరపడింది.ఆరోజున సూర్యుణ్ణి ఆరాధించడం తరతరాలుగా వస్తున్న ఆచారం. సూర్యారాధన అనేది భారతీయుల జీవన విధానంలో ప్రధానమైనది. కుల,మతాలు, వర్గాలతో నిమిత్తం లేకుండా సూర్యుణ్ణి ఆరాధిస్తారు. ఒక్కొక్కరిది ఒక్కొక్క సంప్రదాయం. మకర సంక్రాంతిరోజున పెద్దలకు తర్పణం వదలడం కూడా సంప్రదాయంలో భాగమే.అలాగే, కనుమ రోజున వ్యవసాయానికి తోడ్పడే ఎడ్లనూ, నాగళ్ళు, ఎడ్లబండ్లను అలంకరించి పూజలు నిర్వహిస్తారు. దీనినే బల్లకట్టు పండుగగా కొన్ని ప్రాంతాలలో పిలుస్తారు. సూర్యుని గమనాన్ని బట్టి నిర్వహించే ఈ పండుగకు తమిళనాడులో పొంగల్ అని పిలుస్తారు. తమిళులు కూడా సూర్యారాధన,పెద్దలకు తర్పణాలు వదలడం వంటి సంప్రదాయాలను పాటిస్తారు.సూర్యుడు ఆరోగ్య ప్రదాత. ఆరోగ్యం అందరికీ అవసరమే కనుక,అందరూ సూర్యుణ్ణి ఆరాధిస్తారు. సూర్యకిరణాలు దూసుకుని వచ్చే ఇళ్ళల్లో నివసించాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటారు.

సంక్రాంతి ప్రభావం గ్రామాల్లో ఎక్కువగా కనిపిస్తుంది. గ్రామాల్లో కులవృత్తుల వారు తాము ఉత్పత్తి చేసే ఉపకరణాలను సంక్రాంతి నాడు ప్రదర్శనలుగా ఏర్పాటు చేస్తారు. గుమ్మాలకు మామిడి తోరణాలు, గడపలకు పసుపు,కుంకుమలను అద్ది ప్రతి ఇల్లూ నిండు లోగిలిగా అలరిస్తూ సంక్రాంతి శోభ కనువిందు చేస్తుంది. ప్రతి ఇల్లు కొత్త అల్లుళ్ళతో,బంధుమిత్రులతో కళకళలాడుతుంది.సంక్రాంతికి యువతులు, బాలికలు బొమ్మల కొలువులు ఏర్పాటు చేసి పొరుగువారినీ, బంధుమిత్రులను ఆహ్వానించి పూజలు నిర్వహిస్తారు.సంక్రాంతి పండుగనాడు కొత్త బియ్యంతో పాలు పొంగించడం ఓ సంప్రదాయం. ఆరుబయలు పెరడుల్లో పిడకలను పేర్చి పాలు పొంగించడం, పొంగలిని సూర్యునికి నైవేద్యంగా సమర్పించడం సంక్రాంతి వేడుకకు ఆధ్యాత్మిక శోభ జోడింపు అవుతుంది. పల్లెల్లో భూస్వాములు తమ భూముల్లో పని చేసే శ్రామికులకు కొత్త బట్టలు పెట్టడం ఓ సంప్రదాయం. అలాగే,గంగిరెద్దులను ఆడించే వారికి పాత బట్టలను కానుకగా ఇవ్వడం కూడా ఓ సంప్రదాయం. అయ్యవారికి దణ్ణం పెట్టు అని గంగిరెద్దును ఆడించే వ్యక్తులు అనగానే సర్వాలంకృతమైన ఎద్దులు మోకాళ్ళపై ఒరిగి దణ్ణం పెట్టే రీతి కూడా సంక్రాంతి వేడుకల్లో భాగమే. దేవాలయాల్లో ధనుర్మాసం ముగింపు వచ్చే సందర్భంగా నెల రోజుల పాటు గోదాదేవి ఆరాధన చేసిన అనంతరం చివరి రోజున గోదా కల్యాణాన్ని నిర్వహిస్తారు. మార్గశిర,పుష్య మాసాల్లో శివకేశవుల అభేదం లేకుండా ఇద్దరినీ పూజించడం, అర్చనలు చేయడం మన సంప్రదాయం. సంక్రాంతి పండుగ మూడు రోజులు గ్రామాల్లో కోడి పందాలు, ఎడ్ల పందాలు ఓ వేడుక. ఈ వేడుకను తిలకించడానికి పట్టణాలు, నగరాల నుంచి వచ్చిన బంధు మిత్రులతో గ్రామాల్లో అందరి ఇళ్లూ కళకళలాడుతూ ఉంటాయి.సంక్రాంతి పండుగ జనపదుల పండుగ కావడంతో జానపద గీతాలను ఆలాపించే వారు మనకు తారసపడుతుంటారు. జానపద గీతాలకు అత్యంత ప్రాశస్త్యం ఉంది. ఒక్కొక్క ప్రాంతంలో ఒక్కో రీతిలో జానపద గీతాలను ఆలాపిస్తారు.


క్రాంతి అంటే మార్పు...సంక్రాంతి అంటే మంచి మార్పు...తెలుగువారి పండుగలన్నింటిలో పెద్ద పండుగ. పిల్లలూ, పెద్దలూ అనే తేడా లేకుండా అన్ని వయసులవారూ,అన్ని వర్గాల వారూ ఉల్లాసంగా,ఉత్సాహంగా గడుపుకునే పండుగ. పూరిగుడిసెల్లో నివసించే పేదవాడైనా, భవంతుల్లో నివసించే కోటీశ్వరుడైనా సంక్రాంతి పండుగను తన శక్తి మేరకు పిల్లాపాపలతో,బంధుమిత్రులతో చేసుకుంటాడు. తెలుగువారి పండుగల్లో సంక్రాంతికి ఉన్న ప్రాధాన్యం ఇంతా అంతా కాదు.

చిన్న,పెద్దా తేడా లేకుండా జానపద గీతాలను ఆలపిస్తూ సంప్రదాయ నృత్యాలను చేస్తారు. యక్షగానాలూ, బుర్రకథలూ, హరికథలూ సంక్రాంతి శోభకు వన్నె తెస్తాయి. ఈ సంప్రదాయాలను ఒక పరంపరగా పాటించేవారు ఇప్పటికీ ఉన్నారు. అయితే, పండుగలపైనే కాకుండా, మనిషి జీవన విధానంపై ఆధునిక పోకడలు,ఆర్థిక పరిస్థితి కనిపిస్తోంది.ఉదాహరణకు ముంగిట్లో వేసుకునే ముగ్గుల నుంచి ఇళ్ళల్లో బంధుమిత్రులతో ఆరగించే పిండి వంటల వరకూ అన్నీ ఇప్పుడు బయటి నుంచే వచ్చేస్తున్నాయి. డబ్బు ఖర్చుచేస్తే చాలు. ముగ్గుల్లో వేసే రంగులు,గాలిపటాలు, పిండివంటలు అన్నీ మార్కెట్ లోనే లభిస్తున్నాయి. డబ్బుంటే చాలు దేనికీ వెతుక్కోనవసరం లేదు. ఎవరినీ సాయం అడగాల్సిన అవసరం లేదు.అన్నట్టు గతంలో పండగలకు ప్రతి ఇంటి వద్ద గాడిపొయ్యిలపై పిండివంటలు చేసేవారు. ఇప్పుడు గ్యాస్ పొయ్యిలపై తయారైన ఆహార పదార్థాలను, పిండివంటలను కేటరింగ్ వారు సరఫరా చేస్తారు. ఆనాడు ప్రతి ఇంట్లో పిల్లల నుంచి పెద్దల వరకూ పని విభజనచేసుకుని పండుగలకు అవసరమైన ఏర్పాట్లలో భాగస్వాములయ్యేవారు. ఇప్పుడు పండుగ వచ్చిందంటే అన్నింటికీ ఆర్డర్ ఇచ్చేసి టెలివిజన్ సెట్లకు అతుక్కుని పోతారు. గొబ్బెమ్మల గీతాల నుంచి గంగిరెద్దుల మేళాల నుంచి,పతంగులు ఎగురవేయడం వరకూ అన్నీ టెలివిజన్ ఛానల్స్ లో చూసి ఆనందించడమే. వీటికి తోడు ఛానల్స్‌లో ప్రసారమయ్యే కార్యక్రమాలను చూసి ఆనందిస్తూ ఉంటారు.దాంతో పండుగ గడిచి పోతుంది. ఆన్ లైన్ పండుగలు,డిజిటల్ పండుగల సంస్కృతి నగరాల్లో వెల్లివిరుస్తోంది.

సంస్కృతి

పిల్లలు గ్రామాల్లో కబాడీ, కుస్తీ పోటీలలో పాల్గొనేవారు.ఇప్పుడు క్రికెట్ ఆటలతో రోజంతా గడిపేస్తున్నారు. పండుగ పరమార్థం తెలియకుండానే పండుగలు జరుపుకోవడం ఆధునిక నాగరికత. ప్రతిపండుగకూ పరమార్థం ఉంది. శరీరానికి అవసరమైన వ్యాయామాన్ని ఇచ్చే రీతిలో పండుగల్లో కార్యక్రమాలు ఉండేవి. ఇప్పుడు కుర్చీలో కూలబడి టెలివిజన్ ఛానల్స్ కార్యక్రమాలను ఆస్వాదించడమే పండుగ పరమార్థంగా భావిస్తున్నారు. పాత కాలపు ఆటపాటలను టెలివిజన్ ఛానల్స్ ద్వారా ప్రదర్శించేందుకు జనం ఉత్సాహాన్ని చూపుతున్నారు. గ్రామాల్లో కానీ, నగరాలు, పట్టణాల్లో కానీ,ఆ వేడుకలు ప్రదర్శిస్తే చూసేందుకు ఎవరూ రాకపోవడంతో ఛానల్స్ సంఖ్య పెరగడంతో అందరూ ఛానల్స్‌లో ప్రదర్శనలు ఇచ్చేందుకే ఆసక్తి చూపుతున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే ఇప్పుడు మనం చేసుకుంటున్నవన్నీ కార్పొరేట్ పండుగలే. అంటే డబ్బున్న వారు నిర్వహించే కార్యక్రమాలే. అందుకే, టీవీ కార్యక్రమాలతో సంతృప్తి చెందుతున్నాం. అనివార్యంగా వచ్చే మార్పులతో ఎవరైనా సర్దుకుపోక తప్పదు. అయినప్పటికీ గ్రామసీమల్లో హరిదాసుల సంకీర్తనలు, గంగిరెద్దుల విన్యాసాలు, కోళ్లపందేలు, కొత్త అల్లుళ్ల ఆనందాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఆనందంగా సంక్రాంతి సంబురాలను జరుపుకోవటంలో మానసిక ఉల్లాసం, సంతృప్తి దక్కుతుందనేది, ఎవరూ కాదనలేని సత్యం. నగరాల్లో నీవారు వారి గ్రామాలకు పండుగకు ముందే ప్రయాణమవడం కనిపిస్తూనే ఉన్నది. ఏది ఏమైనా మన సంస్కృతిలో భాగమైన ఇలాంటి పండుగలను అందరూ ఆనందంగా జరుపుకోవాలని ఆశిద్దాం.

- చల్లా అనంతపద్మనాభస్వామి



'ఆర్ట్ ఇన్‌స్టాలేషన్' పై పట్టున్న శిల్పి రమణారెడ్డి

తెలంగాణ చిత్రకళా వైభవం-29

సిద్ధిపేట సమీపంలోని లకుడారం గ్రామం నుంచి జర్మనీలోని మెమింగెన్ పట్టణం చేరుకుని అక్కడి ఉలుమ్ ఊరి రైల్వేస్టేషన్‌లో ''ఆర్ట్ ఇన్‌స్టలేషన్' చేసి అందరిచేత శభాష్ అనిపించుకున్న ఆధునిక శిల్పి-చిత్రకారుడు రమణారెడ్డి. కొత్తతరం ఆలోచనలకు కేంద్ర బిందువుగా నిలిచి ఆర్ట్ ఇన్‌స్టలేషన్ మాధ్యమాన్ని తెలుగు నేలకు పరిచయం చేసిన చిత్రకారుడాయన. స్టీలు ఇతర ధాతువులతో కళాకృతులను రూపొందించి, కళాత్మకత, సృజనాత్మకతను ప్రజల ముందు పెట్టే విద్యలో చేయి తిరిగిన శిల్పి ఆయన. హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం వద్ద, హోటల్ పార్క్ హయత్ వద్ద ఆయన తనదైన పద్ధతిలో కళాకృతులను ''ఇన్‌స్టాల్'' చేసి అపురూపమైన కళాకారుడిగా ప్రముఖుల మన్ననలు అందుకున్నారు.

ఈ గుర్తింపు, ప్రశంస, పొగడ్త, అభినందనల వెనుక ఆయన శ్రమ ఎంతో ఉంది. సముద్రమంత తపన కనిపిస్తోంది. గీతలు..రంగుల..రేఖలు...రంగుల మేళవింపుతో ఆడుకునే చిత్రకారుడి స్థాయి నుంచి ఆయన ఎంతో దూరం ప్రయాణం చేసి నూతన పద్ధతులను స్వాగతం పలికి తన కాలపు ఆలోచనలకు ఆకృతినివ్వడం ఆరంభించి అందర్ని ఆశ్చర్యపరిచారు.


సంప్రదాయంగా శిల్పకళకున్న హద్దులు చెరిపి, వినూత్న ఆలోచనలకు ఆకృతి కల్పించే దిశగా ఆయన ప్రయాణం అంత సజావుగా, పూలబాటలో సాగలేదు. బాల్యంలో లకుడారం గ్రామ చెరువు వద్ద మట్టితో చొప్ప బెండ్లతో ''బండి''ని తయారుచేసిన క్షణాలు, అక్కడి ఇసుకలో మిగతా పిల్లల కన్నా భిన్నంగా 'భవనం' కట్టడంతో ప్రారంభమైన తపన-ఆలోచన-ఉత్సుకత, ఉత్సాహం, సాధించాలన్న పట్టుదల, మనసు, ఏమి చెబితే దాన్ని చేసే ధైర్యం-సాహసంతో ఆయన ప్రయాణం ప్రారంభమైంది. చిత్రకళ-శిల్పం గూర్చిన సృజనాత్మక భాష తనతో పాటే పెరగసాగింది. ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాల్లో ప్రాథమిక విద్య కొనసాగినా తరగతి గదుల్లో బొమ్మలు వేయడం ఆగలేదు. రంగుల పెన్సిళ్లతో తనలోని భావాలకు రంగులద్దడం మానలేదు. అలా తనలోని నిగూఢమైన 'ప్రజ్ఞ' పరిణతవైపు కదలసాగింది. ఈ సమయంలోనే సిద్ధిపేటలో ప్రముఖ చిత్రకారుడు కాపు రాజయ్య డ్రాయింగ్ టీచర్‌గా పరిచయం కావడంతో చిత్రకళలోని ప్రాథమిక-శాస్త్రీయ విధానం తెలిసొచ్చింది. అప్పటివరకు తనలో తాను రమిస్తూ వేసిన బొమ్మలకు, ఆకృతుల కన్నా మెరుగైన రీతిలో డిజైన్లు, ప్యాట్రన్స్ పరిచయమయ్యాయి. దాని తరువాత రమణారెడ్డి వెనక్కి తిరిగి చూసుకోలేదు.

చిత్రకళపై వ్యామోహంతో అందులో తాదాత్మ్యం చెంది కాలం గడపడం ఇష్టం లేని తండ్రి మందలించడంతో, గొప్ప చదువులు చదివేందుకు ప్రయత్నించమని ఒత్తిడి పెంచడంతో ఆ ఘర్షణను తట్టుకోలేక తన మనసు చెప్పేవిధంగా చిత్రకళ-శిల్పకళపై 'పిచ్చిప్రేమ'తో 1982లో ఇల్లు వదిలాడు.

యువరక్తం, ఆవేశం, ఏదో సాధించాలన్న ఆతృత, తాను విశ్వసించిన కళకు దగ్గరవ్వాలన్న పరితాపంతో సికిందరాబాద్ చేరుకున్నాక కొత్త ప్రపంచంలోకి అడుగు పెట్టానన్న భావన..తెలిసిన వారెవరూ లేరు. అయినా ధైర్యం కోల్పోకుండా చిన్న చిన్న పనులు చేస్తూ నగరంలో అక్కడక్కడ కనిపించే సైన్‌బోర్డులు, హోర్డింగ్‌లు, సినిమా కట్-అవుట్లను చూసి అవి ఎక్కడ తయారుచేస్తారో తెలుసుకుని అక్కడికి చేరుకున్నాడు. వ్యాపార ప్రకటనల కోసం ఏర్పాటు చేసే హోర్డింగ్‌లపై బొమ్మలు వేసే పనిలో తానొకడిగా చేరాడు. ఫిగరేటివ్ బొమ్మలు వేయడం అలా ప్రారంభించిన ఆయనకు అనతికాలంలోనే గుర్తింపు లభించింది. దాంతో దూర దూర ప్రాంతాలకు వెళ్లి హోర్డింగ్‌లపై బొమ్మలు వేసే పని లభించింది. మహారాష్ట్ర, గుంటూరు-విజయవాడ తదితర ప్రాంతాలు తిరిగాడు. అలా పనిచేయగా వచ్చిన డబ్బుతో తన కెరీర్‌ను మరింత పెంచుకోవాలనుకుని 1983 సంవత్సరంలో హైదరాబాద్‌లోని ఫైన్ ఆర్ట్స్ కాలేజీలో ప్రవేశపరీక్షరాసి ఉత్తీర్ణత సాధించి పెయింటింగ్ విభాగంలో చేరాడు. అలా ఆరుమాసాలు 'బేసిక్స్' నేర్చుకున్నాక శాస్త్రీయ బోధన అవగాహనకొస్తున్న సమయంలో చేతిలో డబ్బు నిండుకుంది. ఇంటి నుంచి పంపేవాళ్లు ఎవరూ లేరు. దాంతో తిరిగి బ్యానర్లు రాయడం, వాల్‌రైటింగ్ చేయడం, నెంబర్ ప్లేట్లు రాయడంతో కొన్ని నెలలకే కొంత డబ్బు జేబులోకి వచ్చింది.

అలా 1985 సంవత్సరంలో తిరిగి ఫైన్ ఆర్ట్స్ కాలేజీ మెట్లు ఎక్కాడు. ఈసారి పెయింటింగ్ డిపార్ట్‌మెంట్‌లోగాక స్కల్ప్చర్ (శిల్పం) విభాగంలో సీటొచ్చింది. చిన్ననాడు చెరువు వద్ద మట్టితో బండి తయారుచేసిన జ్ఞాపకమొచ్చింది. తాను ఊహించిన పెయింటింగ్‌లో సీటు రాకపోవడంతో మనసులో కొంత గందరగోళపరిస్థితి ఏర్పడినా తనను తాను సంభాళించుకుని శిల్పం డిపార్ట్‌మెంట్‌లో క్రియాశీలకంగా పనిచేయడం ప్రారంభించాడు.







చలికాలం ఓ రోజు రోడ్డుమీద నడుస్తుండగా ఓ పేపర్ ముక్క కనిపించింది. తీసి చూస్తే ఏసుక్రీస్తు బొమ్మ..కారుణ్యం ఉట్టిపడుతున్న ఆ చిత్రం చూసి దాన్నే శిల్పంగా ''డివైన్ లుక్'' పేర తీర్చిదిద్దడం...అది తోటి విద్యార్థులకు నచ్చడం, అనంతరం అది 'ఆంధ్రజ్యోతి' పత్రికలో ప్రముఖంగా ప్రచురితం కావడంతో శిల్పిగా నిలదొక్కుగోలనన్న భరోసా గుండెల నిండా కలిగింది. కళాశాల కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనడంతో విద్యార్థి సంఘం ఉపాధ్యక్షునిగా ఎన్నికయ్యారు. ఆ ఊపులో చిత్రకళ-శిల్పంకు సంబంధించిన అనేక క్యాంపులు, ప్రదర్శనలు నిర్వహించారు. ప్రచార మాధ్యమాల్లోని మిత్రుల సహకారం ఎక్కువగా లభించడంతో సమాజంలో ఎంతో కొంత గుర్తింపు పెరగసాగింది. రెట్టించిన ఉత్సాహంతో జాతీయ స్థాయిలోనూ ఆర్ట్ క్యాంపులు నిర్వహించి బంగారు పతకాన్ని సొంతం చేసుకున్నారు. తనలోని సృజనాత్మకత కొత్త పుంతలు తొక్కుతోంది. కొత్తదారులు వెతుకుతోంది. దాంతో 1991 సంవత్సరంలో బరోడాలోని ప్రముఖ ఫైన్ ఆర్ట్స్ కాలేజీలో ఎం.ఎఫ్.ఏ చేసేందుకు చేరాడు. కొత్త ప్రాంతం, కొత్త పరిచయాలు తానేమితో తాను తెలుసుకోవడానికి మరింత అవకాశం లభించింది. అక్కడా తరగతులకు హాజరవుతూనే అనేక ఆర్ట్ క్యాంపులు, గోష్ఠులను నిర్వహించడం ద్వారా ''ఆర్ట్ సర్కిల్''లో సంచలనమయ్యాడు. ఈ దశలో ఇండియన్ కౌన్సిల్ ఫర్ కల్చరల్ రిలేషన్స్ వారు కళాకారుల-చిత్రకారుల 'ఫెలోషిప్' కోసం వెతుకుతుండగా వారికంట రమణారెడ్డి పడ్డారు. దాంతో జర్మనీ వెళ్లేందుకు నిశ్చయమైంది. అలా బరోడా చదువు అర్థాంతరంగా ఆగిపోయి జర్మనీలోని మెమింగెన్ కార్యక్షేత్రమైంది. కొత్త కళా ప్రపంచం కళ్లముందు పరచుకుంది. అభివృద్ధి చెందిన జర్మనీ దేశ చిత్రకారుల శిల్పుల శైలి, పనివిధానం తెలుసుకోవడానికి ఆస్కారమేర్పడింది. అలాగే భారతదేశ చిత్రకళా వైభవాన్ని అక్కడి వారికి పరిచయం చేసే అవకాశం దక్కింది.

జర్మన్ భాష నేర్చుకుని, ఏడుగురితో ''ఆర్టిస్ట్స్ గ్రూపు''ను ఏర్పాటు చేసి ప్రయోగాత్మకంగా ఎన్నో ఆకృతులకు జీవం పోశారు. స్టీల్..సిమెంట్..సిల్క్‌క్లాత్ ఇలా ప్రతీది సృజనాత్మకతకు మాధ్యమంగా నిలుస్తుందని తెలుసుకుని ఉలుమ్ అనే ఊరిలోని రైల్వే స్టేషన్‌లో ''ఆర్ట్ ఇన్‌స్టాలేషన్''చేసి అక్కడి వారిని అబ్బురపరిచాడు.

అలా స్టీల్..సిమెంట్‌తో అద్భుతాలు సృష్టించేనైపుణ్యాన్ని ఒడిసి పట్టుకున్నాడు. యూరప్‌లోని అనేక దేశాల్లో దేశ దిమ్మరిలా తిరిగి వందలాది ఆర్ట్ మ్యూజియాలను సందర్శించి, అధ్యయనం చేసి చిత్రకళకు-శిల్పానికి కొత్త భాష్యం చెప్పేందుకు నిశ్చయించుకుని మనిషి పరిణామ క్రమాన్ని తనదైన ప్రత్యేక శైలిలో 'స్టీల్'లో రూపొందించారు. పురాతన లిపి ఆసరాగా ఆకృతులను ఆలోచనాత్మకంగా తయారుచేశారు. ఈ అపార అనుభవాన్నంతా రంగరించి ప్రస్తుతం హైదరాబాద్‌లోని లుంబినీ పార్క్‌లో తెలంగాణ అమరవీరులు స్ఫూర్తివనాన్ని (చిహ్నం) రూపొందిస్తున్నారు. ఇది ప్రపంచంలోనే అతి పెద్ద అపురూప స్మారక చిహ్నంగా నిలవబోతోంది. ఇదంతా స్టీల్‌లో ఉండటం దీని విశిష్టత. ఇప్పుడు చిత్రకారుడికి వాటర్ కలర్స్, ఆయిల్ కలర్స్ తెలియడమే కాదు రసాయనాల పరిజ్ఞానం ఉండాలని రమణారెడ్డి అంటున్నారు. లోహాల-ధాతువుల జ్ఞానం సైతం ఎంతో అవసరమని సంకేత నామాల శాస్త్రంపై అవగాహన కావాలంటున్నారు. ఇలా కొత్త వ్యాకరణంలో చిత్రకళకు, శిల్పకళకు రమణారెడ్డి కొత్త సొబగులద్దుతున్నారు. ఈ నేలకు 'ఇన్‌స్టాలేషన్ ఆర్ట్'ను పరిచయం చేసి ఎందరికో ఉత్ప్రేరకంగా నిలిచారు. మరిన్ని ఎత్తులకు ఆయన ఎదుగుతారనడంలో ఎలాంటి సందేహము లేదు.

- ఉప్పల నరసింహం
9985781799

సంభాషణలో తెలుగు జాతీయాలు

గుడ్లగూబ

మన ప్రాంతములో రాత్రివేళ యందు ఈ పక్షి పేరు వింటేనే జంకుతారు. పాతకాలం వారు దీనిని పెద్ద పక్షియని పిలిచేవారు.ఈ పక్షి రెప్పవాల్చ కుండ పెద్ద పెద్ద కళ్లతో చూస్తుంది. ఈ కండ్లు భయంకరంగా ఉంటాయి. మిడిగ్రుడ్లు మిటకరించి చూచేవాళ్లను గుడ్లగూబలనేవారు. పాశ్చాత్య దేశాలలో ఇది విజ్ఞానానికి చిహ్నం అని పెంచుకునేవాళ్లున్నారు. ఇది వాళ్లకు విజ్ఞానానికి ఒక గుర్తు. గుడ్ల గూబలకు సులోచనాలను తగిలించి బొమ్మలు వేసి విజ్ఞాన గ్రంథాలు ప్రచురిస్తారు. మన దగ్గర మాత్రము గుడ్లగూబ అపశకున పక్షి, అశుభ సూచకపు పిట్ట. కొన్ని గ్రామాల్లో దీనిని పెద్ద పిట్ట అంటారు. పంచతంత్ర కథలల్లో ''కాకోలూకీయం''అను కథ ఒకటుంది. దీనివల్ల తెలియునదేమంటే? కాకికి గుడ్లగూబలకు బద్ధ శత్రుత్వమున్నది. రాత్రి సమయాల్లో లూబకంబంటే గుడ్లగూబ కాకము అంటే కాకి గూళ్లమీద మండే కొర్రాయిలను విసురుతాయట. పగటిపూట గూబ కనిపిస్తే చాలు కాకులు దాన్ని పొడిచి పొడిచి చంపుతాయి. ఏది ఎట్లయిన మనవారికిది అశుభ పక్షి-పాశ్చాత్యులకిది పూజనీయం.

గువ్వ కుత్తుక



అడవి పావురాన్ని గువ్వ అంటారు. కుత్తుక అంటే గొంతుక- ఏ భాషకైనా గొంతుకలో స్వరపేటిక ఉంటుంది. గువ్వ బలంగా ఉంటుంది. అడవిలో గింజలు తిని తెగబలుస్తుంది. కువకువ శబ్దం చేస్తుంది. దాని గొంతు అంతగా గట్టిగా ధ్వనించదు. అది ఎంత బలంగా ఉంటుందో దాని గొంతు అంత బలహీనంగా ఉంటుంది. పదిరోజులు తిండిలేని వాని గొంతుక వినిపించినట్లు ఉంటుంది. బావిలో పడ్డవారు కేకలు పెట్టినట్లుంటుంది. అంటే హీనస్వరంగా ఉంటుంది. అది సహజమైన కంఠధ్వనియే కాని బలహీనతకు నిదర్శనం. కొందరు భీముని వలె బలంగా ఉంటారు. వారు తమ మీసాల మీద నిమ్మకాయలు నిలుపగలరు. కాని వాళ్ల గొంతు మాత్రం పేలవంగా, సన్నగా, హీనంగా, దీనంగా ఉంటుంది. శరీరానికి తగ్గట్టుగా ఉండదు. ఒక్కోసారి గంభీర స్వరమున్నా దుఃఖం వల్లనో, బాధవల్లనో సన్నగా హీనస్వరంలో మాట్లాడితే ఆయనకు గువ్వ కుత్తుక సంక్రమించిదంటారు. కొన్ని సందర్భాలలో ఈ కుత్తుకల ధ్వని గలవాళ్లను చూడవలసి వస్తుంది. సమాజంలో ఇట్టి గొంతుకలు కలవారు కొద్దిమందే ఉన్నా వాళ్లు తమ తమ పనుల్లో సమర్థులుగా ఉంటారు.

- యం.వి.నర్సింహారెడ్డి,
9849110922


కరీనా కపూర్

అందాల తారలంటే వయసుకూ ఇష్టమే. అందుకే పెరగనంటూ అక్కడే ఆగిపోయి ఆనందిస్తుంటుంది. వాళ్ల విషయంలో అలసట లేకుండా సరదాగా గడుపుతుంటుంది. ఆ వయసు పెరిగినా బయటకు కనిపించకుండా మాయ చేస్తుంటారీ నాయికలు. ఐదు పదులంటే ఓపిక తగ్గే వయసే...కానీ కొందరు బాలీవుడ్ తారలు, ఇప్పుడే పాతిక దాటాయా అన్నట్లు కనిపిస్తుంటారు. ఇందుకు వాళ్లెంతో శ్రమిస్తున్నారు. క్రమశిక్షణ గల జీవితాన్ని క్రమం తప్పకుండా కొనసాగిస్తున్నారు. వాళ్లెవరో చూస్తే...

వయసుకు గాలమేసి... అందాన్ని ఒడిసిపట్టి

డ్రీమ్ గర్ల్ హేమామాలినికి ఒక తరమంతా అభిమానులే. ఆమెను చూసేందుకే సినిమాలకు వెళ్లే వాళ్లట. ఆమెకు దేశమంతా అభిమానులున్నారు. ఈ కలల యువతి మధ్య వయస్సు దాటి చాలా ఏళ్లవుతోంది. అయినా చెక్కు చెదరని అందంతో గత కాలాన్నే గుర్తు చేస్తోంది. సినిమాలు, నాట్య ప్రదర్శనలతో పాటు వివిధ రకాల వ్యాపార ప్రకటనలకూ ప్రచారకర్తగా కొనసాగుతోంది. అభిమానుల ముందే కదలాడుతోంది.

పాతికేళ్ల నట జీవితంలో వయసు ఒక భావన మాత్రమే అన్నది కాజోల్ మాట. కాజల్‌కు ప్రస్తుతం 42 ఏళ్లు. ఇప్పటికీ సినిమాలు చేస్తోంది. కాజల్ మాట్లాడుతూ...కొందరు 14 , 19 వయసులో ఉంటారు కానీ అరవై ఏళ్లలా ప్రవర్తిస్తుంటారు. మరికొందరు అరవై ఏళ్ల వయసున్న వాళ్లు ఉత్సాహంగా పరుగులు పెడుతుంటారు. వయసు అనేది మీ మానసిక భావన మాత్రమే. మనం ఎంత అనుకుంటే మన వయసు అంతే. అని చెప్పింది.

ప్రతిభే ప్రధానం..వయసుది ఏముంది అంటోంది బాలీవుడ్ అందాల తార మాధురీ దీక్షిత్. నిన్నటి తరాన్ని తన నృత్యాలతో ఊపేసిన ఈ సుందరి...ఇప్పుడు ఆచితూచి సినిమాలు చేస్తోంది. నాయిక ప్రధాన చిత్రాలు బాక్సాఫీస్‌ను ఏలుతున్న సమయంలో...అలాంటి కథలకు ప్రాధాన్యత ఇస్తోంది. వయసు గురించి బెంగలేదన్న మాధురీ...నటించకుండా వయసు తనను ఆపలేదని చెబుతోంది. మాధురీ మాట్లాడుతూ...వయసు ఒక సంఖ్య మాత్రమే. అది నన్ను భయపెట్టదు. ప్రతిభకు సమయమంటూ ఉండదు అనే విషయాన్ని నమ్ముతా. అని చెప్పింది. ఆమె కిప్పుడు యాభై ఏళ్లు.

40 ఏళ్ల వయసున్న రాణీ ముఖర్జీ తడబాటు లేకుండా సినిమాలు చేస్తోంది. తను సినిమాల కథల గురించి తప్ప వయసు గురించి ఆలోచించను అంటోంది. రాణీ ముఖర్జీ మాట్లాడుతూ...ప్రతి చిత్రానికీ విభిన్నంగా కనిపించాలని కోరుకుంటాను. నేను చేసిన గత పాత్రలతో చూస్తే ఇప్పుడు చేస్తున్నవి కొత్తవి. నేను కాకుండా ఆ పాత్రే ప్రేక్షకులకు కనిపించాలని అనుకుంటాను. నటిస్తున్నప్పుడు వయసు ఆలోచనే రాదు. అని చెప్పింది.

భర్త సైఫ్ అలీఖాన్ లాగే వయసును లెక్క చేయకుండా, దరి చేరనీయకుండా నట ప్రయాణం కొనసాగిస్తోంది కరీనా కపూర్. పెళ్లై పిల్లాడు పుట్టాక...మళ్లీ శ్రమించి మునుపటి శరీరాకృతి తెచ్చుకుంది. ఫొటో షూట్‌లు చేస్తూ అప్పటి కరీనాను తలపిస్తోంది. ప్రస్తుతం ఆమె గుడ్ న్యూస్ అనే చిత్రంలో నటిస్తోంది.


కాజోల్


హేమామాలిని

రాణీ ముఖర్జీ

మాధురీ దీక్షిత్

అసలేం జరిగింది? పోస్టర్ విడుదల



'అసలేం జరిగింది'? సినిమా పోస్టర్‌ను రాజ్య సభ సభ్యులు సంతోష్ కుమార్ ఆవిష్కరించారు. శ్రీమతి నీలిమా నిర్మిస్తున్న ఈ చిత్రంలో శ్రీరాం హీరోగా నటిస్తున్నాడు. ఎన్వీఆర్ దర్శకునిగా పరిచయం అవుతున్నారు. "తెలంగాణ రాష్ట్రంలో ఇంతవరకు ఎవరూ తీయని కొత్త లొకేషన్‌లో షూటింగ్ చేయాలనుకోవడం గొప్ప విషయమని" ఈ సందర్భంగా ఎంపి. సంతోష్‌కుమార్ అన్నారు. యూనిట్ సభ్యులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

భైరవగీత ఫేమ్ విజయ్ రామ్ ఈ చిత్రంలో విలన్‌గా నటిస్తున్నారు. మహావీర్ సంగీతం అందిస్తున్నారు. నెర్రపల్లి వాసు కథని అందించారు. ఫిబ్రవరి 11 నుండి షూటింగ్ ప్రారంభించి, రెండు షెడ్యూల్స్‌లో చిత్రీకరణ పూర్తిచేస్తామని నిర్మాత నీలిమ తెలిపారు.

కీలక సన్నివేశాల్లో మహర్షి

మహేష్‌బాబు కథానాయకుడిగా తెరకెక్కుతున్న మహర్షి చిత్రం చిత్రీకరణ శరవేగంగా జరుగుతోంది. వంశీ పైడిపల్లి దర్శకత్వంలో శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్, వైజయంతి మూవీస్, పీవీపీ సినిమా సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రం చిత్రీకరణ ఇప్పటికే చాలాభాగం పూర్తయింది. దుబాయ్ షెడ్యూల్‌ను పూర్తిచేసుకుని ఇటీవలే హైదరాబాద్‌కు చేరుకున్న చిత్రబృందం రామోజీ ఫిలింసిటీలో కొన్ని కీలక సన్నివేశాలను చిత్రీకరించినట్లు తెలిసింది. కథానుసారం కరువుకు సంబంధించిన వాతావరణాన్ని ప్రతిబింబిస్తూ ఎండిపోయిన బీడు భూముల సన్నివేశాలను ఇందులో భాగంగా తీసినట్లు తెలిసింది. వాస్తవానికి కథ వివరాలను చిత్రబృందం స్వయంగా వెల్లడించకపోయినప్పటికీ... వినిపిస్తున్న సమాచారం ప్రకారం చిత్రంలో కాలేజీ నేపథ్యంతో పాటు రైతు నేపథ్య అంశాలు అత్యంత కీలకంగా ఉంటాయని అంటున్నారు. దీని తర్వాత తమిళనాడులోని పొల్లాచి, కారైకుడి లొకేషన్లలో ఓ భారీ షెడ్యూల్‌ను జరిపేందుకు యూనిట్ బయలుదేరుతున్నట్లు సమాచారం. ఇప్పటికే విడుదలైన టీజర్‌లోనూ, ఇటీవల విడుదలచేసిన రెండో లుక్‌లోనూ మహేష్ చాలా స్టైలిష్‌గా కనిపిస్తున్నారు. రిషిగా విభిన్నమైన పాత్రలో ఆయన నటన ప్రేక్షకాభిమానులను ఎంతగానో ఆకట్టుకుంటుందని అంటున్నారు. ఏప్రిల్ 5న ప్రపంచ వ్యాప్తంగా చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. మహేష్‌బాబు సరసన పూజాహెగ్డే నాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో అల్లరి నరేష్ ఓ కీలక పాత్రను పోషిస్తున్నారు. ఈ చిత్రానికి ఛాయాగ్రహణాన్ని కె.యు. మోహనన్, సంగీతాన్ని దేవిశ్రీప్రసాద్ అందిస్తుండగా...హరి, సాల్మన్, సునీల్‌బాబు, కె.ఎల్. ప్రవీణ్, రాజు సుందరం, శ్రీమణి, రామ్, లక్ష్మణ్ ఇతర సాంకేతిక వర్గం.


మహేష్ బాబు

వైజాగ్‌లో టి.ఎస్.ఆర్. ఫిల్మ్ అవార్డుల వేడుక



టి.సుబ్బరామిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నేషనల్ ఫిల్మ్ అవార్డుల వేడుకను ఫిబ్రవరి 17న వైజాగ్‌లో నిర్వహించనున్నారు. 2010 నుండి ప్రతి రెండేళ్ళకు ఒకసారి ఆయన ఈ అవార్డులను జాతీయ స్థాయిలో అందిస్తున్నారు. 2017, 2018 ఫిల్మ్ అవార్డుల ప్రదానోత్సవాన్ని వైజాగ్, పోర్ట్ గ్రౌండ్‌లో నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని టి.సుబ్బరామిరెడ్డి శనివారం నాడు ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. అవార్డుల జ్యూరీ కమిటీకి చైర్మన్‌గా టి.సుబ్బరామిరెడ్డి వ్యవహరిస్తున్నారు. సభ్యులుగా డా.శోభనా కామినేని, పింకిరెడ్డి, నటి నగ్మా, నటి మీనా, రచయిత పరుచూరి గోపాలకృష్ణ, నటుడు నరేష్, నిర్మాత కె.ఎస్. రామారావు వ్యవహరిస్తున్నారు. వీరంతా మీడియా సమావేశంలో పాల్గొన్నారు.

జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం టి.సుబ్బరామిరెడ్డి మాట్లాడుతూ "ఈ ఏడాది దివంగత శ్రీదేవి మెమోరియల్ అవార్డును విద్యాబాలన్‌కు అందిస్తున్నాం. ఈ కార్యక్రమానికి రజనీకాంత్, సూర్య, విక్రమ్, చిరంజీవి, బాలకృష్ణ, నాగార్జున, వెంకటేష్ తదితరులు హాజరవుతున్నారని" చెప్పారు.

"నెల్లూరులో పుట్టిన సుబ్బరామిరెడ్డికి హైదరాబాద్, విశాఖపట్నంలతో విడదీయరాని అనుబంధం ఉందని, ఆయన ఆరాధించే శివుడి ఆజ్ఞతోనే ఈ కళాసేవ సాగుతోందని" రచయిత పరుచూరి గోపాలకృష్ణ చెప్పారు. "తమ జ్యూరీ గౌరవప్రదంగా అందరికీ ఆమోదయోగ్యమైన నటీనటులను అవార్డులకు ఎంపిక చేస్తుందని" నరేష్ పేర్కొన్నారు. "తెలుగు చిత్రపరిశ్రమకు చెందిన అనేక మందికి జాతీయ స్థాయి గుర్తింపు పొందడానికి టి.సుబ్బరామిరెడ్డి కారకులని" కె.ఎస్. రామారావు చెప్పారు. "తన తండ్రికి వేరెవ్వరూ సాటిరారని, త్వరలోనే ఆయన ఆటోబయోగ్రఫీని విడుదల చేస్తున్నామని" పింకీ రెడ్డి తెలిపింది.

ప్రేమతో ఉండిపోరాదే


లావణ్య

తరుణ్ తేజ్, లావణ్య జంటగా నటిస్తున్న చిత్రం 'ఉండిపోరాదే...' గోల్డ్ టైమ్ ఇన్ పిక్చర్స్ పతాకంపై డా.లింగేశ్వర్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి నవీన్ నాయని దర్శకత్వం వహిస్తున్నారు.

ఇప్పటికే రాజమండ్రీ, ఆత్రేయపురం పరిసర ప్రాంతాల్లో తొలి షెడ్యూల్ పూర్తిచేశారు. సంక్రాంతి సందర్భంగా ఈ చిత్రం టైటిల్‌ని మొదటిలుక్‌ని విడుదల చేశారు.

నిర్మాత మాట్లాడుతూ "చక్కని కథతో ఈ చిత్రం రూపొందిస్తున్నాం. మొదటి షెడ్యూల్ పూర్తిచేశాం. తదుపరి చిత్రీకరణ ఈ నెలాఖరు నుండి బెంగళూరు, మైసూర్, కరీంనగర్, హైదరాబాద్ పరిసరప్రాంతాల్లో జరుగుతుంది" అని చెప్పారు.

ఈ చిత్రానికి సంగీతం సాబు వర్గీస్, పాటలు సుద్దాల అశోక్ తేజ, చంద్రబోస్, రామాంజనేయులు, ఛాయాగ్రహణం శ్రీను విన్నకోట, మాటలు సుబ్బరాయుడు, సమర్పణ శ్రీమతి సత్య ప్రమీల కర్లపూడి.

అల్లుడుగారు వచ్చారు



కొత్త అల్లుడికి స్వాగతం పలికారు జగపతిబాబు. నిజానికి జగపతిబాబు కుమార్తె వివాహం చాలా సంవత్సరాల క్రితమే అయింది. మళ్లీ ఇప్పుడు కొత్త అల్లుడు అంటున్నాడేమిటీ అనే అను మానం రావచ్చు. ఆయన అన్న కుమార్తె పూజా వివాహం దర్శకుడు రాజమౌళి తనయుడు కార్తికేయతో ఇటీవలే జైపూర్‌లో ఘనంగా జరిగింది. ఆ ప్రకారం కార్తికేయ జగపతిబాబుకు కొత్త అల్లుడు అవుతాడు. అందుకే వెల్‌కమ్ అల్లుడుగారు అంటూ ట్వీట్ చేశారు. అల్లుడుగారి కుటుంబం మా జీవితాల్లోకి రావడంతో మా కుటుంబం పరిపూర్ణమైంది అంటూ కుటుంబంతో ఉన్న ఓ ఫోటోను పోస్ట్ చేశారు జగపతిబాబు.